

> ‘ఇది అభివృద్ధిని పెంచే బడ్జెట్. రైతులు, సామాన్యులు, వ్యాపారుల హితంగా ఉంది. గ్రామీణ అవసరాలపై దృష్టి పెట్టాం. ఈ బడ్జెట్ దేశాభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. - ప్రధాని మోదీ

> ‘రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. పంట దిగుబడులకు ఎక్కువ ధర దక్కాలనేది మా ఉద్దేశం. అందుకే కనీస మద్దతు ధరలు పెంచాలనే చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాం - ఆర్థిక మంత్రి జైట్లీ


# ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 2-2-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 . సంచిక 173 రూ. 5-00 పేజీలు 22+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi


# అన్నదాతా సుఖీభవ
# బడుగుజీవీ ఆయుష్మాన్‌భవ

వ్యవసాయం, వైద్యం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

10 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా

పంటలకు మరింత మద్దతు ధర


వయోధికుల సొమ్ముకు భరోసా


రక్షణ రంగానికి రూ. 2.95 లక్షల కోట్లు

**వేతన జీవికి ...**

పన్నుల ఊరట లేదు

ఆదాయపు పన్ను శ్లాబులు యథాతథం





**వరాల వెల్లువ లేదు. నిధుల పందేరం లేదు.**
**ఆకర్షణ మంత్రాలూ, తాయిలాల తంత్రాలూ అంతకంటే లేవు!**

ఎదురొస్తున్న ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలు.. ఆపై సమీపిస్తున్న సార్వత్రిక సంగ్రామాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక మోదీ సర్కారు ఓట్లకు గేలం వేస్తూ.. ఊరూరా నగదు బదిలీలూ, భారీ నిరుద్యోగ భృతులతో మూటల గారడీ మొదలెడుతుందన్న విస్తృత ప్రచారానికి తప్పున తెరపడింది!

విత్తమంత్రి తాత్కాలిక తమాషాల కన్నా.. అసలుసిసలు ఆపన్నులకు అండగా నిలబడేందుకు గట్టి కసరత్తు చేశారు. కష్టపడేది నష్టం కోసమేనన్నట్లు.. పెట్టింది కూడా దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతకు.. అండగా మేమున్నామంటూ పటిష్ఠమైన ‘మద్దతు ధర’ విధానాన్ని పైకితెచ్చారు. ఇక వైద్య ఖర్చులు విమానం మోతమోగిపోతూ ఆసుపత్రులన్నీ ఆకాశంలోనే ఉంటున్న ఈ రోజుల్లో రోగమొచ్చిందంటే చాలు, ఇళ్లూవాకిళ్లూ అమ్ముకుని దిక్కులేని కష్టం పడుతున్న జనం కోసం.. ప్రపంచంలోనే ఎక్కడా లేనంతటి భారీ ‘బీమా’ పథకాన్ని ప్రకటించారు. విస్తృత ప్రజానీకాన్ని ప్రభావితం చేసే ఈ రెండూ జైట్లీ బడ్జెట్‌కు రెండు మూలస్తంభాలు!

**ఇక మిగిలిందంతా ఆర్థిక క్రమశిక్షణే!**

మధ్యతరగతి మనసు దోచుకునే భారీ జల్లులుగానీ, కార్పొరేటుకు లాభాన్నిచ్చే కబుర్లుగానీ ఏమీ వినిపించలేదు. అయితే ఈ క్రమశిక్షణలో సమతౌల్యం తప్పి, తెలుగు రాష్ట్రాలు రెంటికీ కొత్తగా వీసమెత్తు కూడా విదల్చకపోవటం.. అసంతృప్తికీ, తీవ్ర విమర్శలకూ ఊతమిస్తున్న వాస్తవం!


**బడ్జెట్ సమగ్ర కథనాలు లోపలి పేజీల్లో**


**2018-19 కేంద్ర బడ్జెట్**

**పెరిగేవి**

- దిగుమతి చేసుకునే సెల్ ఫోన్లు, వాటి విడిభాగాలు, ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ, ఓఎల్ఈడీ టీవీ ప్యానెళ్లు
- సిగరెట్లు, లైటర్లు, కొవ్వొత్తులు
- శుద్ధిచేసినరత్నాలు, వజ్రాలు, గిల్టు నగలు
- పాదరక్షలు, పట్టు వస్త్రాలు, పండ్ల రసాలు, వేరుశనగ, ఆలివ్ వంటి నూనెలు
- పరిమళ ద్రవ్యాలు, దిగుమతి చేసుకునే సౌందర్య సామగ్రి, దంత సంరక్షణ వస్తువులు
- చేతి గడియారాలు, పాకెట్ వాచీలు, ఆకర్షణీయ(స్మార్ట్) గడియారాలు, చలువ కళ్లద్దాలు
- పూర్తిగా విదేశాల్లో తయారయ్యే మోటారు కార్లు, మోటారు సైకిళ్లు, లారీలు/బస్సుల రేడియల్ టైర్లు

**తగ్గేవి**

- జీడిపిక్కలు, సౌరబ్యాటరీలు, ఫలకాలు, వినికిడి పరికరాలు

## రైలు ప్రయాణికుల భద్రతకు పెద్దపీట!

- అన్ని స్టేషన్లు, రైళ్లలో సీసీటీవీలు, వై-ఫై సదుపాయం

## మదుపర్లకు ‘లాభం’ లేదు

మార్కెట్లో మదుపు చేసేవారికి వచ్చే లాభాలపైన ప్రభుత్వం పన్ను విధించింది. దాదాపు 14 ఏళ్ల తర్వాత ఈ పన్నును మళ్లీ తెచ్చింది.

- దీని ప్రకారం రూ.లక్షకు పైన వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలన్నిటిపైనా 10% పన్ను కట్టాలి.
- 2018 జనవరి 31 వరకు వచ్చిన లాభాలను పరిగణనలోకి తీసుకోబోమని చెప్పడం కొంత ఊరట.
- మ్యూచువల్ ఫండ్లపై వచ్చే ఆదాయాలపైనా 10% పన్ను.






## అన్యాయం చేశారు

- మంత్రులు, పార్టీ నేతల అత్యవసర సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి
- రాష్ట్రాన్ని పూర్తిగా విస్మరించారని ఆవేదన
- మిత్రధర్మాన్ని పాటిస్తున్నా రిక్తహస్తమే ఎదురైందని ఆగ్రహం
- పార్టీ ఎంపీలతో టెలికాన్ఫరెన్స్
- ఆదివారం పార్లమెంటరీ పార్టీ సమావేశం


2లో



## ఆశలన్నీ ఆవిరి

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యే
- కాళ్లరిగేలా తిరిగినా దక్కని ఫలితం
- ప్రధాన ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు
- రాజధానికి ఒక్క రూపాయీ ఇవ్వలేదు
- ప్రత్యేక రైల్వేజోను ప్రస్తావనే లేదు


2లో


**రాజస్థాన్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం**

- 2 లోక్‌సభ, ఒక అసెంబ్లీ స్థానాలు కైవసం
- పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేని తృణమూల్


5లో


**ఇదీ సంగతి!**



# గ్రామీణ భారతికి హారతి

'వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, ఉపాధి, సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు పెద్దపీట వేయడమే ఈ ఏడాది బడ్జెట్ దార్శనికత.'

ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో దేశం 7.2 నుంచి 7.5% వృద్ధిని సాధించనుంది. తయారీ రంగం మంచి పురోగమన పథంలో పరుగులు తీస్తోంది. కీలకమైన సేవల రంగం కూడా 8% మించిన వృద్ధి శాతంతో ఉరకలెత్తుతోంది. 17-18లో ఎగుమతులు 15% వృద్ధిని నమోదు చేయనున్నాయి.

**- అరుణ్ జైట్లీ**



గురువారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని చదువుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

దిల్లీ

గ్రామీణ భారతికి నరేంద్రమోదీ సర్కారు హారతి పట్టింది. ప్రపంచంలో అతిపెద్దదిగా నిలిచిపోయేలా... దేశంలో 50 కోట్ల మంది పేదలకు ఆరోగ్య రక్షా కవచాన్ని ప్రకటించింది. గ్రామీణ, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తూ మధ్య తరగతిపై మాత్రం అంతగా దృష్టి సారించలేదు. రూ.24.42 లక్షల కోట్ల అంచనాలతో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం లోక్‌సభలో 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్టును ప్రవేశపెట్టారు. తదుపరి సార్వత్రిక ఎన్నికల్లోగా వచ్చే పూర్తిస్థాయి చివరి బడ్జెట్ ఇదే. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చాక రూపొందించిన బడ్జెట్లో గ్రామీణ, నగర ప్రాంతాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీ కేటాయింపులను ఆయన ప్రతిపాదించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పన్నులను తగ్గించారు. ఐశ్వర్యవంతులపై సర్‌ఛార్జి కొనసాగుతుందని చెప్పారు. విద్యా సెస్సును పెంచుతున్నట్లు తెలిపారు. జైట్లీ ఆయా ప్రతిపాదనలను చదువుతున్నప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ సహా అధికార పక్ష సభ్యులంతా ఉత్సాహంగా బల్లలు చరిచారు. నవ భారతాన్ని సాకారం చేసే వాహకంగా ఈ బడ్జెట్ నిలిచిపోతుందని మోదీ ఆ తర్వాత వ్యాఖ్యానించారు.

### పేదల ఆసుపత్రి ఖర్చులకు భరోసా

కేంద్ర బడ్జెట్లో అత్యంత ప్రధానమైన అంశంగా 'జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం' నిలిచిపోనుంది. పేదలకు వైద్య ఖర్చుల్ని ప్రభుత్వమే భరిస్తుందని జైట్లీ ప్రకటించారు. ఈ సరి కొత్త పథకం అమలు వల్ల ద్రవ్యలోటు మాత్రం కొంత పెరగనుందని చెప్పారు. ఆరోగ్యం, విద్య, సామాజిక రక్షణ రంగాల్లో భారీగా ఖర్చు చేయనున్నట్లు ప్రతిపాదించారు. పార్టీ ఎన్నికల వాగ్దానానుసారం ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు రైతుల పెట్టుబడికి మించి కనీస మద్దతు ధర లభించేలా చూస్తామన్నారు. వ్యవసాయ రుణాలు ఇంకా పెంచడంతో పాటు కిసాన్ క్రెడిట్ కార్డుల్ని- వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందినవారికీ వర్తింపజేస్తామని చెప్పారు.

### వేతన జీవులకు ప్రామాణిక తగ్గింపు

ఆదాయపు పన్ను శాతాలు, శ్లాబులను మార్చడం లేదని ఆర్థిక మంత్రి చెప్పారు. ఉద్యోగులు, పింఛన్‌దారులకు ప్రస్తుతం కల్పిస్తున్న రవాణా, వైద్య ఖర్చుల మినహాయింపు బదులు ప్రామాణిక తగ్గింపు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. వయోధికులు బ్యాంకుల్లో దాచుకునే మొత్తాలపై వడ్డీకి పన్ను మినహాయింపును, ఆరోగ్య బీమా ప్రీమియం మొత్తాలపై పన్ను ఊరటను పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. దిగుమతి చేసుకునే మొబైల్ ఫోన్లు, సౌందర్య సాధనాలు సహా వివిధ వస్తువులపై సుంకాలను పెంచుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ నష్టాలను భర్తీ చేసుకునేందుకు వీలుగా షేర్ల అమ్మకం ద్వారా కలిగే లాభంపై పన్నును 14 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు.

### రక్షణ వ్యయం 7.81% పెంపు

దేశ రక్షణ రంగం బడ్జెట్టును 7.81% పెంచి రూ.2.95 లక్షల కోట్లు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. పొరుగుదేశాలు విసురుతున్న సవాళ్ల నేపథ్యంలో సైనిక బలగాల అంచనాలకు తగ్గట్టుగా కేటాయింపుల్ని పెంచారు. కార్పొరేట్ పన్నును నాలుగేళ్లలో 25 శాతానికి తగ్గిస్తామని 2015లో వాగ్దానం చేసిన మంత్రి... దానికి తగ్గట్టుగా 16-17 సంవత్సరంలో రూ.250 కోట్ల టర్నోవరును నమోదు చేసిన కంపెనీలకు పన్నును 25% చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 6.5% నుంచి 6.75 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ దిగుబడిదారులు నెలకొల్పే కంపెనీలకు పన్ను మినహాయింపు వర్తింపజేస్తామని చెప్పారు.

### ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే

మనదేశం ప్రపంచంలో పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అయిదో స్థానంలో నిలిచేందుకు స్థిరంగా అడుగులు వేస్తోందని జైట్లీ చెప్పారు. ప్రస్తుతం ఏడో స్థానంలో ఉన్నామని చెప్పారు. కొనుగోలుశక్తి పరంగా చూస్తే మనం ఇప్పటికే మూడో స్థానంలో ఉన్నామని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక గత మూడేళ్లలో సగటు వృద్ధి 7.5% ఉందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై-సెప్టెంబరు త్రైమాసిక గణాంకాలను పరిశీలిస్తే జీడీపీలో వృద్ధి 6.3% ఉందనీ, ఆర్థిక వ్యవస్థ మారుతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయనీ చెప్పారు. జైట్లీ ప్రసంగం ఆంగ్లం, హిందీ భాషల్లో 110 నిమిషాల పాటు కొనసాగింది. వ్యవసాయం, గ్రామీణ గృహ నిర్మాణం, సేంద్రియ వ్యవసాయం తదితర రంగాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మూడు సాధారణ బీమా సంస్థలను ఒకేసంస్థగా చేస్తామన్నారు.

## కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం



రూ.కోట్లలో

| | 2016-17 వాస్తవ గణాంకాలు | 2017-18 బడ్జెట్ అంచనాలు | 2017-18 సవరించిన అంచనాలు | 2018-19 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 13,74,203 | 15,15,771 | 15,05,428 | 17,25,738 |
| మూలధన వసూళ్లు | 6,00,991 | 6,30,964 | 7,12,322 | 7,16,475 |
| మొత్తం వసూళ్లు | 19,75,194 | 21,46,735 | 22,17,750 | 24,42,213 |
| మొత్తం వ్యయం | 19,75,194 | 21,46,735 | 22,17,750 | 24,42,213 |
| రెవెన్యూ లోటు | 3,16,381 | 3,21,163 | 4,38,877 | 4,16,034 |
| కోశ లోటు | 5,35,618 | 5,46,531 | 5,94,849 | 6,24,276 |
| ప్రాథమిక లోటు | 54,904 | 23,453 | 64,006 | 48,481 |

## బడ్జెట్ విశేషాలు....

- 'ఆయుష్మాన్ భారత్' పేరుతో జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం.
- రూ.1.69 లక్షల కోట్లకు చేరనున్న ఆహార రాయితీ.
- అన్ని రంగాల్లో కొత్త ఉద్యోగుల తరఫున ఉద్యోగ భవిష్య నిధికి వేతనంలో 12% మొత్తాన్ని చెల్లించనున్న ప్రభుత్వం.
- రైతులకు మరింత ఆదాయం వచ్చేలా చర్యలు.
- డిజిటల్ భారత్‌కు రూ.3073 కోట్లు.
- రూ.5.97 లక్షల కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి.
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80,000 కోట్లు.
- వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబులు, పన్ను రేట్లు యథాతథం.
- రవాణా భత్యం, వైద్య ఖర్చులకు బదులుగా రూ.40,000 ప్రామాణిక తగ్గింపు.
- విద్యా సెస్సు 4%.
- మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకం 20%.
- వ్యవసాయ రుణాల లక్ష్యం మరో రూ.లక్ష కోట్లు పెంపు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో ఆర్థిక వృద్ధి 7.2 - 7.5% ఉంటుందని అంచనా. గత మూడేళ్లలో సగటు వృద్ధి 7.5%.
- చేపల పెంపకం, పాడిపరిశ్రమ రైతులకూ కిసాన్ క్రెడిట్ కార్డులు.
- రక్షణరంగ బడ్జెట్ రూ.2.82 లక్షల కోట్లు.
- 600 ప్రధాన రైల్వే స్టేషన్ల పునరభివృద్ధి.
- పెట్టుబడి సాధనంగా బంగారాన్ని పరిగణించడానికి కొత్త విధానం.



బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు పార్లమెంటుకు వస్తున్న అరుణ్‌జైట్లీ

## వెబ్‌సైట్‌లో కొలీజియం సిఫార్సులు

**దిల్లీ:** సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవులకు, పది హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల పదవులకు సిఫార్సు చేసిన పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం గురువారం అధికారిక వెబ్‌సైట్‌లో బహిరంగపర్చింది. గత నెల 11న ఈ తీర్మానాలు చేసింది. సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రను, ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం సిఫార్సు చేసినట్లు ఇప్పటికే వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ పేర్లను కేంద్రం తిరస్కరించింది. ఇతర హైకోర్టుల న్యాయమూర్తులు, ప్రధానన్యాయమూర్తుల కన్నా జస్టిస్ కె.ఎం. జోసెఫే అన్ని విధాలా తగిన అభ్యర్థి అని వెబ్‌సైట్‌లో కొలీజియం పేర్కొంది. ఇందు మల్హోత్ర కూడా అత్యంత అర్హురాలైన అభ్యర్థి అని పేర్కొంది.




# ఆశలన్నీ ఆవిరి

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచెయ్యే

**ఈనాడు అమరావతి:** కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఆశలన్నీ అడియాసలే అయ్యాయి. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి, పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో రాష్ట్ర అవసరాలు, ఆకాంక్షలు, విజ్ఞప్తులకు సముచిత ప్రాధాన్యం దక్కుతుందని ప్రభుత్వం భావించింది. దీనికి భిన్నంగా ఈసారీ మొండిచెయ్యే ఎదురైంది. ఇటీవలే తెదేపా ఎంపీలు, అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీని కలిసి రాష్ట్రాన్ని ఆదుకోవాలని పదే పదే విన్నవించినా నిష్ఫలమే అయింది. 'నేను చూస్తానంటూ' ప్రధాని హామీనిచ్చినా.. బడ్జెట్‌లో మాత్రం ఊరట దక్కలేదు. రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన ప్రాజెక్టులు, డిమాండ్ల గురించిన ప్రస్తావన ఈ బడ్జెట్‌లో ఒక్కటంటే ఒక్కటీ లేదు. రాష్ట్ర దశ దిశలను నిర్దేశించే రాజధాని, రైల్వేజోను, దుగరాజపట్నం నౌకాశ్రయం వంటి కీలకమైన ప్రాజెక్టుల ప్రస్తావనే లేదు. ఏవో కొన్ని ప్రాజెక్టులకు మాత్రం అరకొర కేటాయింపులతో సరిపెట్టారు.

**రైల్వే జోన్ ఊసే లేదు:** విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుచేయాలని రాష్ట్రం దీర్ఘకాలంగా కోరుతోంది. జోన్ సాధన ఉద్యమం ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన అంశమైంది. దీనిపై మళ్లీ నిరాశే ఎదురైంది.

**కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్:** ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత ఉపాధి మండలి (కోస్టల్ ఎంప్లాయిమెంట్ జోన్) ఏర్పాటుచేస్తామని నీతిఆయోగ్ చేసిన ప్రకటనకూ దిక్కు లేదు. ఎగుమతుల ప్రోత్సాహం, భారీగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తూర్పు తీరంలో ఆంధ్రప్రదేశ్‌లో, పశ్చిమ తీరంలో గుజరాత్‌లో ఈ జోన్లు ఏర్పాటుచేస్తామని నీతి ఆయోగ్ ముసాయిదా కార్యాచరణ అజెండాలో పేర్కొంది.

**అమరావతికి రైల్వే లైను:** రాజధాని అమరావతికి రైల్వే అనుసంధానానికి రెండు ప్రాజెక్టు ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఒకటి నంబూరు నుంచి అమరావతి మీదుగా ఎర్రుపాలెం వరకు వెళ్లే లైను. రెండోది నరసరావుపేట నుంచి పెదకూరపాడు మీదుగా అమరావతిని అనుసంధానించే రైల్వే లైను. ఈ రెండు ప్రాజెక్టుల్లో 50 శాతం నిధులు రాష్ట్రం సమకూర్చాలని రైల్వేబోర్డు సూచించింది. తమకు సాధ్యం కాదని, కేంద్రమే మొత్తం నిధులు కేటాయించి రెండు రైల్వేలైన్ల పనులు వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. బడ్జెట్‌లో వీటి ప్రస్తావనే లేదు.

**రాజధానికి మొండిచెయ్యి:** ఆంధ్రప్రదేశ్‌కు దిల్లీలాంటి రాజధాని నగరాన్ని నిర్మించేందుకు సహకరిస్తామని ప్రధాని మోదీ స్వయంగా హామీనిచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీని కలిసి రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరినప్పుడు ఈ అంశాన్నీ ప్రస్తావించారు. రాజధాని పేరు చెప్పి కేంద్రం ఇంతవరకు రాష్ట్రానికి రూ.2,500 కోట్లు ఇచ్చింది. దీనిలో కూడా రూ.వెయ్యి కోట్లు గుంటూరులో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ, విజయవాడలో వరదనీటి పారుదల వ్యవస్థల ఏర్పాటుకు ఇచ్చారు. ఆ రూ.వెయ్యి కోట్లు కూడా రాజధానికి ఇచ్చినట్టే కేంద్రం చెబుతోంది. రాజధాని కోసం మరో రూ.వెయ్యి కోట్లు ఇస్తామని కేంద్రం హామీనిచ్చింది. అవి సరిపోవని, రాజధాని పరిపాలన నగరంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.11,600 కోట్లు ఖర్చవుతుందని.. ఈ నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి ఇటీవల కేంద్రానికి లేఖ రాశారు. రూ.11,600 కోట్లు మాట అటుంచి ఇస్తామన్న రూ.వెయ్యి కోట్ల ప్రస్తావన కూడా బడ్జెట్‌లో లేదు.

**రెవెన్యూ లోటు ప్రస్తావనే లేదు:** రాష్ట్ర విభజన వల్ల ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడే రెవెన్యూ లోటును బడ్జెట్ కేటాయింపుల ద్వారా భర్తీ చేస్తామని 2014 ఫిబ్రవరి 20న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో హామీనిచ్చారు. 2014-15 సంవత్సరానికి రెవెన్యూ లోటును రూ.16,078 కోట్లుగా అకౌంటెంట్ జనరల్ లెక్కించారు. ఇంత వరకు కేంద్రం రూ.3,970.50 కోట్లు మాత్రమే ఇచ్చింది. మిగతా మొత్తం విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పదేపదే విన్నవిస్తున్నా కేంద్రం నుంచి స్పందన లేదు.

**పెట్రోలియం కాంప్లెక్స్ లేనట్టే?:** గెయిల్-హెచ్‌పీసీఎల్ భాగస్వామ్యంతో కాకినాడ వద్ద రూ.32,900 కోట్ల అంచనా వ్యయంతో క్రాకర్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర విభజన చట్టంలో హామీనిచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ.5615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌గా సమకూర్చాలని గెయిల్-హెచ్‌పీసీఎల్ కన్సార్షియం కోరుతోంది. అది కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో పేర్కొన్న ప్రాజెక్టు కాబట్టి వయబిలిటీ గ్యాప్‌ఫండింగ్‌ను కేంద్రమే భరించాలని రాష్ట్రం కోరింది. బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు ప్రస్తావన లేదు.

**ఆ రెండు సంస్థల మాటేంటి?:** రాష్ట్రంలో 11 కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటుకు కేంద్రం హామీనిచ్చింది. వీటిలో కేంద్రీయ, గిరిజన వర్సిటీలను ఇంకా ఏర్పాటు చేయలేదు. వీటికి రాష్ట్రం స్థలం కూడా కేటాయించింది.

- దుగరాజపట్నంలో ప్రధాన నౌకాశ్రయం ఏర్పాటుకు విన్నవించినప్పటికీ ప్రస్తావించలేదు.
- రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్ర స్థాయి పోలీసు వ్యవస్థ, శిక్షణకు కేంద్రాల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కోసం నిధులు కేటాయించాలని రాష్ట్రం కోరింది. వీటిపైనా ప్రస్తావించలేదు.

**కేటాయింపులు కంటితుడుపే..** రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో కొన్ని అరకొర కేటాయింపులు చేశారు.

- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి ప్రాజెక్టుకు రూ.200 కోట్లు.
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ హైఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టం ప్రాజెక్టుకు- రూ.150 కోట్లు.
- ఆంధ్ర-తెలంగాణ రోడ్డు సెక్టార్ ప్రాజెక్టుకు- రూ.100 కోట్లు.
- ఆంధ్రప్రదేశ్‌లో 24 గంటల విద్యుత్ సరఫరా ప్రాజెక్టుకు- రూ.100 కోట్లు.
- ఏపీ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టుకు- రూ.300 కోట్లు.



కేంద్ర బడ్జెట్‌పై గురువారం సచివాలయంలో రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

# అన్యాయం చేశారు

**మంత్రులు, పార్టీ నేతల అత్యవసర సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు • బడ్జెట్‌పై తీవ్ర అసంతృప్తి**

**ఈనాడు అమరావతి:** కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారన్న భావన తెదేపా, రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కీలక మిత్రపక్షంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి ఏ అంశంలోనూ ప్రాధాన్యం దక్కలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ధనిక రాష్ట్రాలుగా పేరున్న మహారాష్ట్ర వంటి వాటికి ఇచ్చిన ప్రాధాన్యంలో పదో వంతు కూడా విభజనకు, వివక్షకు గురైన ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి, పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడం.. ఎన్నికలకు ఏడాదే గడువు ఉండటంతో రాష్ట్రానికి సంబంధించిన ప్రధాన డిమాండ్లకు పరిష్కారం చూపిస్తారని తెదేపా, ప్రభుత్వ వర్గాలు ఆశించాయి. అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రస్తావనే పెద్దగా లేకపోవడం, రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రాజెక్టులు, ప్రభుత్వ వినతులను ఏ మాత్రం ఖాతరు చేయకపోవడం నిరాశకు గురిచేసింది. రాష్ట్రానికి మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందన్న భావన ప్రభుత్వ, పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కేంద్రంలో భాగస్వామిగా ఉన్నందుకైనా స్వల్ప, దీర్ఘకాలాల్లో ప్రభావం చూపించే ప్రాజెక్టులను రాష్ట్రానికి ఇచ్చి ఉంటే మిగిలిన అంశాలు కాస్త మరుగున పడేందుకైనా అవకాశం ఉండేదని అంటున్నారు. రాష్ట్రానికి రిక్తహస్తం ఎదురైందని తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి దిల్లీలో ఉన్న పార్టీ ఎంపీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. భవిష్యత్తు కార్యాచరణ, పార్లమెంటులో వ్యవహరించాల్సిన తీరుపై చర్చించేందుకు ఆదివారం ఉదయం అమరావతిలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటుచేశారు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి దిల్లీలో విలేకరుల సమావేశంలోనూ బడ్జెట్‌పై తమ అసంతృప్తి తెలిపారు. తెదేపా ఎంపీలూ నిరసనగళం వినిపించారు. మరోపక్క చంద్రబాబు సచివాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు, పార్టీ నాయకులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని, ఎన్నిసార్లు దిల్లీ చుట్టూ తిరిగినా నిష్ప్రయోజనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగే పార్టీ రాష్ట్ర సమన్వయ సంఘ సమావేశంలో, మంత్రివర్గ సమావేశంలోనూ ఈ అంశంపై ప్రధానంగా చర్చించాలని నిర్ణయించారు. మన అసంతృప్తిని అన్ని మార్గాల్లో తెలియజేద్దామని, బడ్జెట్‌పై చర్చకు సమాధానం చెప్పేటప్పుడైనా దిద్దుబాటు చేపడతారేమో చూద్దామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అభిప్రాయపడ్డారు.

### ఒత్తిడి పెంచుదాం... తొందరపాటు వద్దు

'నాలుగేళ్లుగా ఎంతో సహనంతో వేచి చూశాం. అన్ని విధాలా సహకరించాం. మిత్రధర్మం పాటించాం. అయినా చిన్నచూపే ఎదురైంది' అని పార్టీ ఎంపీలతో మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయాన్ని సరిదిద్దేలా అన్ని మార్గాల్లోనూ ఒత్తిడి తేవాలని నిర్ణయించారు. 'రాష్ట్ర విభజన జరిగిన మొదటి సంవత్సరంలో ఉన్న సమస్యలే కొనసాగుతున్నాయి. అరకొర చర్యలు, కంటితుడుపు కేటాయింపుతో సమస్య పరిష్కారం కాదు. మనం కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన అంశాలను, విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఒక పక్క మహారాష్ట్ర, కర్ణాటకల్లో సబర్బన్ రైలు ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయిస్తూ, విశాఖ, విజయవాడ మెట్రోలను ప్రస్తావించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. భాజపాతో తెగదెంపులు చేసుకుందామని, ముఖ్యమంత్రి ఆదేశిస్తే రాజీనామాలు చేస్తామని కొందరు ఎంపీలు ప్రస్తావించగా చంద్రబాబు సముదాయించారు. తొందరపాటు నిర్ణయాలు వద్దని, కేంద్రంపై అన్ని విధాలా ఒత్తిడి తీసుకువచ్చి వారి స్పందననుబట్టి కార్యాచరణ నిర్ణయించుకుందామని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేటప్పుడు, బడ్జెట్ ప్రసంగంపై చర్చ సందర్భంగానూ సభలో తమ అసంతృప్తిని గట్టిగా వినిపిస్తామని తెదేపా ఎంపీ ఒకరు తెలిపారు. ఆదివారం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలను బట్టి భవిష్యత్తు కార్యాచరణ ఆధారపడి ఉంటుందని, ముఖ్యమంత్రి సూచిస్తే మరోసారి ప్రధానిని కలుస్తామని తెలిపారు.

### ఓపికగా ఎదురు చూశాం: సోమిరెడ్డి

మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశం అనంతరం వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'మిత్రపక్షంగా ఉన్నందున నాలుగేళ్లు ఓపికగా ఎదురుచూశాం. ఇదే ఆఖరి సార్వత్రిక బడ్జెట్ కావడంతో రాష్ట్రానికి రావలసిన నిధులు, సంస్థలపై ప్రకటన ఉంటుందని ఆశించాం. రాష్ట్రానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు' అని పేర్కొన్నారు. గిఫ్ట్‌సిటీ కింద అహ్మదాబాద్‌కు ఇచ్చిన ప్రోత్సాహకాలు అమరావతికీ ఇచ్చుంటే సంతోషపడేవారమని అన్నారు. విభజన తర్వాత ప్రత్యేకంగా చూడాల్సిన రాష్ట్రాన్ని కేంద్రం పట్టించుకోలేదన్న నిరాశ సమావేశంలో వ్యక్తమైనట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజల అభిప్రాయం కూడా ఇదేనని తెలిపారు. తమది మిత్రపక్షమైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం గళమెత్తుతామన్నారు. మంత్రి దేవినేని ఉమా తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## 'ఈడీ కేసులో ఆదిత్యనాథ్‌దాస్‌కు ఊరట'

**ఈనాడు, హైదరాబాద్:** జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) నమోదు చేసిన కేసులో నిందితుడిగా ఉన్న ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్‌దాస్‌కు గురువారం హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆదిత్యనాథ్‌దాస్‌కు ఈడీ ప్రత్యేక కోర్టులో హాజరుకు మినహాయింపుతో పాటు 4 వారాలపాటు అభియోగాల నమోదు ప్రక్రియ చేపట్టరాదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ అభియోగ పత్రం ఆధారంగా ఈడీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ ఐఏఎస్ అధికారి ఆదిత్యనాథ్‌దాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ షమీమ్ అక్తర్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

## గ్రహం అనుగ్రహం

**2-2-2018 శుక్రవారం**

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
విదియ: మ. 3-53 తదుపరి తదియ
మఖ నక్షత్రం: సా. 4-01 తదుపరి పుబ్బ
అమృత ఘడియలు: మ. 1-44 నుంచి 3-15 వరకు
వర్జ్యం: రా. 11-43 నుంచి 1-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-49 నుంచి 9-34 వరకు
తిరిగి మ. 12-35 నుంచి 1-20 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5-50

## చలి - పులి

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| తిరుపతి | 13.0 | 33.0 |
| అనంతపురం | 15.2 | 31.5 |
| విశాఖపట్నం | 15.8 | 32.3 |
| శ్రీకాకుళం | 16.0 | 35.0 |
| కర్నూలు | 16.0 | 35.5 |
| గుంటూరు | 17.0 | 33.0 |
| రాజమహేంద్రవరం | 17.0 | 36.0 |
| విజయవాడ | 17.2 | 34.6 |
| నెల్లూరు | 18.0 | 30.0 |

# సుప్రీంకోర్టులో రోస్టర్ విధానం: 5 నుంచి అమల్లోకి..

- 'పిల్'ల విచారణ తనవద్దే అట్టిపెట్టుకున్న సీజేఐ

**దిల్లీ:** సుప్రీంకోర్టులో న్యాయమూర్తులకు కేసుల కేటాయింపునకు సంబంధించిన రోస్టర్ విధానాన్ని అమల్లోకి తెస్తున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి గురువారం ప్రకటన చేశారు. ఈ రోస్టర్ విధానం కింద ప్రజాప్రయోజన వ్యాజ్యాల కేటాయింపులను మాత్రం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రానే చూస్తారు. ఈ విధానం ఫిబ్రవరి 5 నుంచి అమలులోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ కొనసాగుతుంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి తీసుకున్న నిర్ణయం తాలూకు ఉత్తర్వును సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో గురువారం పెట్టారు. 13 పేజీల ఈ నోటిఫికేషన్ తాజా కేసుల కేటాయింపులకు సంబంధించిన వివరాలను పేర్కొంది. అంటే ఏఏ కేసులను ఎవరికి కేటాయిస్తున్నారన్న వివరాలను తెలిపింది.

కేసుల కేటాయింపు విషయంలో ప్రధాన న్యాయమూర్తి వైఖరిపై గతనెలలో సుప్రీంకోర్టుకుచెందిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులు బహిరంగంగా విలేకరుల సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రధానన్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని ధర్మాసనం 'పిల్'లతో పాటూ లేఖల ప్రాతిపదికన దాఖలైన పిటిషన్లు, ఎన్నికల కేసులు, కోర్టు ధిక్కార వ్యాజ్యాలు... రాజ్యాంగ బద్ధపదవుల్లో ఉన్నవారికి సంబంధించిన అంశాలను కూడా చూస్తుంది. వివిధ న్యాయమూర్తుల సారథ్యంలోని ధర్మాసనాలకు కేటాయించిన కేసుల కేటగిరీలివీ...

**జస్టిస్. చలమేశ్వర్ :** కార్మిక, పరోక్షపన్నులు, భూసేకరణ, నష్టపరిహారం, క్రిమినల్ అంశాలు.

**జస్టిస్. రంజన్‌గొగాయ్:** కార్మిక, కంపెనీ చట్టాలు, ఎంఆర్‌టీపీ, ట్రాయ్, సెబీ, ఆర్బీఐ, పరోక్ష పన్నులు, కోర్టు ధిక్కార కేసులు, పర్సనల్ లా, మత, ఛారిటబుల్ ఎండోమెంట్స్, బ్యాంకింగ్‌తో సహా పలు వాణిజ్య లావాదేవీల కేసులు.

**జస్టిస్.ఎం.బి.లోకూర్:** సర్వీసులు, సామాజిక న్యాయం, పర్సనల్ లా, భూసేకరణ, వినియోగదారుల రక్షణకు సంబంధించిన కేసులు.

**జస్టిస్. కురియన్ జోసెఫ్:** కార్మిక, అద్దె చట్టం, ఫ్యామిలీ లా, పర్సనల్ లా తదితర కేసులు.

**జస్టిస్. అరుణ్ మిశ్రా:** వైద్యకళాశాలల్లో ప్రవేశాలు, బదిలీలకు సంబంధించిన కేసులు కార్మిక, భూ సేకరణ, సర్వీసు, క్రిమినల్, కుటుంబ చట్టాలు ఇతర కేసులు. ఓ వైద్య కళాశాల కుంభకోణం కేసు విషయంలోనే విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో జస్టిస్. అరుణ్ మిశ్రా ధర్మాసనానికి అదే తరహా కేసుల విచారణను కేటాయించడం గమనార్హం.

## తెలుగు రాష్ట్రాలకు

# అత్తెసరు కేటాయింపులే

**ఈనాడు, దిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీల కింద జాతీయ విద్యాసంస్థలకు అరకొర నిధులు కేటాయింపు తప్ప పెద్ద ప్రయోజనమేమీ కనిపించలేదు. పోలవరం ప్రాజెక్టుకు నాబార్డు ద్వారా నిధుల అనుసంధానం చేసినందున దానికేమీ ఇందులో కేటాయింపులు జరపలేదు. మిగిలిన వాటిలో పది విద్యా సంస్థలకు రూ.287 కోట్లు కేటాయించారు. విభజన చట్టం కింద ఆంధ్రప్రదేశ్‌లో 12 జాతీయ విద్యాసంస్థలు ఏర్పాటు కావాల్సి ఉంది. ఇందులో ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ఐటీ, కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాలు, పెట్రోలియం యూనివర్శిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్‌లకు నిధులు ప్రత్యేకంగా కేటాయించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎయిమ్స్‌లకు కలిపి రూ.3,018 కోట్లు కేటాయించారు. ఇందులో మంగళగిరి ఎయిమ్స్‌కు ఎంతన్నది ప్రత్యేకంగా చూపలేదు. ఈ 12 విద్యాసంస్థలు పూర్తి కావాలంటే రూ.7వేల కోట్లు కావాలన్నది రాష్ట్ర ప్రభుత్వం అంచనా. 2018-19 బడ్జెట్‌లో కేవలం 4.1% మొత్తం మాత్రమే కేటాయించారు. ఈ 12 విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.11,600 కోట్ల విలువైన 2,900 ఎకరాల భూమి కేటాయించి తన వంతు బాధ్యతను పూర్తిచేసింది. కేంద్రం మాత్రం కేటాయింపుల్లో మీనమేషాలు లెక్కిస్తోంది. తెలంగాణ ఎయిమ్స్‌కు నిధులు కేటాయించాలని ఏడాది కాలంగా ఆ రాష్ట్ర ఎంపీలు పదే పదే కేంద్ర మంత్రులను కోరుతూ వచ్చినా ఆ ఊసే లేకుండా పోయింది.

**విభజన చట్టం హామీల కింద (కోట్లలో)**

| సంస్థ | గత ఏడాది | ఈ ఏడాది |
|---|---|---|
| కేంద్ర విశ్వవిద్యాలయం-ఏపీ | 10.00 | 10.00 |
| గిరిజన విశ్వవిద్యాలయం | 10.00 | 10.00 |
| ఐఐటీ ఏపీ | 51.30 | 50.00 |
| ఐఐఎం ఏపీ | 41.00 | 42.00 |
| ఎన్ఐటీ ఏపీ | 53.77 | 54.00 |
| ఐఐఎస్ఈఆర్, ఏపీ | 50.00 | 49.00 |
| ట్రిపుల్ ఐటీ ఏపీ | 20.00 | 30.00 |
| ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ | 1.00 | 32.00 |
| ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్‌ట్రేడ్ | 11.50 | 5.00 |
| ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ | 6.00 | 5.00 |
| పారిశ్రామిక రాయితీలు | - | 50.00 |
| **మొత్తం** | **254.47** | **337.00** |
| **సాధారణ పద్దు కింద ఇచ్చింది(ఆంధ్రప్రదేశ్)** | | |
| వైజాగ్ స్టీల్ | 1,570.00 | 1,400.00 |
| హిందుస్థాన్ షిప్‌యార్డ్ | 4.84 | 4.84 |
| విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ | 225.54 | 108.00 |
| డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా | 25.00 | 19.62 |
| సమీర్ | 42.00 | 70.00 |
| **మొత్తం** | **1,867.38** | **1,602.46** |
| **తెలంగాణ జరిపిన కేటాయింపులు** | | |
| ఐఐటీ హైదరాబాద్ (ఈఏపీ) | 75.00 | 75.00 |
| గిరిజన విశ్వవిద్యాలయం | 10.00 | 10.00 |
| సింగరేణి బొగ్గు గనులు | 1,400.00 | 2,000.00 |
| ఆటమిక్ మినరల్‌డైరెక్టరేట్, హైదరాబాద్ | 313.30 | 310.22 |
| ఈసీఐఎల్ | 25.00 | 15.00 |
| నైపర్ | 151.66 | 135.00 |
| పారిశ్రామిక వడ్డీ రాయితీ | - | 50.00 |
| ఇన్‌కాయిస్ | 23.17 | 25.00 |
| ఎన్ఐటీ | 28.10 | 32.00 |
| **మొత్తం** | **2,026.23** | **2,652.22** |

- ఏపీ, తెలంగాణల్లోని కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాలకు గత ఏడాది కేటాయింపులు జరిపినా పైసా ఖర్చు చేయలేదు.
- వైజాగ్ స్టీల్‌కు గత బడ్జెట్‌లో రూ.1,891.65 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది రూ.1,570 కోట్లకు తగ్గిపోయింది. దాంతో ఈ ఏడాది కేటాయింపులు రూ.1,400 కోట్లకు పరిమితం చేశారు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీకి రూ.145.20 కోట్లు కేటాయించినా అంచనాల సవరణల్లో అది రూ.కోటికి తగ్గిపోయింది. దీంతో ఈ ఏడాది రూ.32 కోట్లకు కేటాయింపులు పరిమితం చేశారు.
- విశాఖపట్నం పోర్ట్‌ట్రస్ట్‌కు గత ఏడాది రూ.134.73 కోట్లు కేటాయించగా అంచనాల సవరణ నాటికి అది రూ.225.54 కోట్లకు పెరిగింది. ఈ ఏడాది దాన్ని రూ.108 కోట్లకు పరిమితం చేశారు.
- డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు గత బడ్జెట్‌లో రూ.325.59 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ నాటికి అది రూ.25 కోట్లకు తగ్గిపోయింది. ఈ ఏడాది కేవలం రూ.19.62 కోట్లు మాత్రమే కేటాయించారు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌కు బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినా అంచనాల సవరణ సమయానికి అది రూ.11.50 కోట్లకు తగ్గింది. ఈ ఏడాది రూ.5 కోట్లు కేటాయించారు.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ రూ.12 కోట్లు కేటాయించి సవరణ నాటికి దాన్ని రూ.6 కోట్లకు తగ్గించారు. ఇప్పుడు రూ.5 కోట్లు కేటాయించారు.
- సింగరేణి బొగ్గు గనులకు గతఏడాది రూ.1600 కోట్లు కేటాయించగా అంచనాల సవరణ నాటికి అది రూ.1,400 కోట్లకు తగ్గిపోయింది. ఇప్పుడు రూ.2వేల కోట్లు కేటాయించారు.
- హైదరాబాద్‌లోని ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ రీసెర్చి కేటాయింపులను గత ఏడాది రూ.266.89 కోట్ల నుంచి రూ.313.30 కోట్లకు పెంచారు. ఈసారి రూ.310.22 కోట్లు కేటాయించారు.

# పోలవరం.. ఎలా?

- **2019 జూన్‌లోపు ఇంకా రూ.44 వేల కోట్లు అవసరం**
- **కేంద్రం ఈ ఏడాది ఇచ్చింది రూ.979.36 కోట్లే**

**ఈనాడు, అమరావతి:** పోలవరం ప్రాజెక్టుకు నాబార్డు నిధి నుంచి కేటాయింపులు ఉంటాయని కేంద్రం ఈ ఏడాది కూడా బడ్జెట్‌లో పేర్కొంది. కిందటి సంవత్సరమూ ఇదే అంశాన్ని ప్రస్తావించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇచ్చింది కేవలం రూ.979.36 కోట్లు. దాదాపు మరో రూ.1,053 కోట్లు రావడానికి సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్టును 2019 జూన్ కల్లా పూర్తి చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఇచ్చిన నిధులు మినహాయిస్తే ఇంకా రూ.44 వేల కోట్లు అవసరమవుతుంది. ఏడాదిన్నరలో లేదా రెండేళ్లలో కేంద్రం ఇంత మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. నాబార్డు నిధితో కేంద్రం సమ్మిళితం చేసినందున నిధులకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు చెబుతున్నా... ఈ స్థాయి నిధులు రావడానికి కేంద్రం ఇంకా నాబార్డుతో పూర్తి స్థాయిలో అనుసంధానం చేయాల్సి ఉంది. కేవలం ఇంతవరకు రూ.5,700 కోట్లకు మాత్రమే కేంద్రం నాబార్డు రుణానికి అనుసంధానించింది. పోలవరం తాజా అంచనాలు కేంద్రం ఆమోదించి ఎంత మొత్తమో నిర్ణయించి ఆ నిధులు ఇవ్వాల్సి ఉంది. ప్రధాన మంత్రి చెబుతున్న స్థాయిలో కార్పస్ ఫండ్ ఏర్పాటు కాకపోవడమూ చర్చనీయాంశమే. 2017 ఆగస్టు 16న కేంద్ర మంత్రి మండలి సమావేశంలో నాబార్డు ద్వారా పోలవరం ప్రాజెక్టుకు రూ.23,814 కోట్లు మాత్రమే కేటాయించింది. 2020 వరకు ఈ నిధుల విడుదలకు ప్రణాళికలో చూపి ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో ఇంతవరకు వచ్చింది తక్కువ... రావాల్సింది చాలా ఎక్కువ. ఈ నిధులు కేంద్రం ఎలా ఎంత మేరకు సమకూరుస్తుందనేది స్పష్టంగా తేలాల్సి ఉంది.

| | |
|---|---|
| ★ పోలవరం ప్రాజెక్టుకు 2010-11 అంచనాల ప్రకారం నీటిపారుదల ఖర్చుల వాటా: | రూ.12,294.40 కోట్లు |
| ★ 2014 మార్చి 31(జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన) నాటికి ఇంకా రావాల్సింది: | రూ.7,158.53 కోట్లు |
| ★ 2014 మార్చి తర్వాత ఇంతవరకు కేంద్రం ఇచ్చిన నిధులు: | రూ.4,329.06 కోట్లు |
| ★ జలవనరుల వాటా కింద ఇంకా రావాల్సింది: | రూ.2,829.47 కోట్లు |

**ఇప్పటికే రూ.2,803.73 కోట్లకు బిల్లులు కేంద్రానికి సమర్పించారు.**



ఏపీ భవన్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కొణతాల రామకృష్ణ, నారాయణ, ఉత్తరాంధ్ర చర్చా వేదిక సభ్యులు

## కొవ్వొత్తులతో నిరసన

**ఈనాడు, దిల్లీ:** బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండి చేయి చూపించారని ఆరోపిస్తూ సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏపీభవన్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇంత అన్యాయం జరిగినా తెదేపా ఎంపీలు కేంద్రాన్ని నిలదీయలేకపోతున్నారన్నారు. మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ బృందం కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కలిసింది. ఏపీకి న్యాయం జరిగేలా పార్లమెంటు ఉభయసభల్లో ఒత్తిడి తేవాలని వారు కోరారు.

## రూ.200 కోట్ల సడక్ నిధులు

**ఈనాడు, అమరావతి:** గ్రామాల్లో రహదారులను మెరుగు పరిచేందుకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై)లో రాష్ట్రానికి రూ.200 కోట్లకుపైగా కేటాయించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. 2017-18లో కేంద్రం కేటాయించిన రూ.16,900 కోట్లలో రాష్ట్రానికి రూ.196.80 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో ఇప్పటివరకు రూ.110 కోట్లు ఖర్చు చేస్తే మిగతావి వచ్చే నెలాఖరులోగా వెచ్చించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

## ఉపాధి హామీలో రూ.౯ వేల కోట్లు!

**ఈనాడు, అమరావతి:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం రూ.9 వేల కోట్లకుపైగా ఉపయోగించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. కూలీలకు వేతనాల కింద రూ.6,500 కోట్లు, 'మెటీరియల్ కాంపోనెంట్'లో మరో రూ.2500 కోట్లు వినియోగించుకోవచ్చని భావిస్తున్నారు. 2017-18 బడ్జెట్‌లో మొత్తంగా కేంద్రం రూ.55 వేల కోట్లు కేటాయించింది. 2018-19 బడ్జెట్‌లోనూ ఇదే మొత్తాన్ని కేటాయించింది. క్రమంగా మళ్లీ రాష్ట్రాలనుంచి డిమాండు పెరిగే వీలున్నందున కేంద్రం నిధులు పెంచే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు. 2017-18లో ఇప్పటివరకు రాష్ట్రంలో 18 కోట్ల పని దినాలు ఉపయోగించుకొని ఉపాధి కూలీలకు రూ.4,560 కోట్లను వేతనాలుగా చెల్లించారు. ఇదే పనులపై మెటీరియల్ కాంపోనెంట్ కింద వచ్చిన మరో రూ.2,100 కోట్లతో గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

# తీవ్ర అన్యాయం

- **తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ధ్వజం**



దిల్లీలో తెదేపా ఎంపీలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి సుజనా చౌదరి

**ఈనాడు, దిల్లీ:** కేంద్ర బడ్జెట్ తమకు తీవ్ర నిరాశకు గురిచేసిందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత సుజనాచౌదరి అన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. పార్టీ అధ్యక్షుడితో చర్చించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చే అంశంలో తాము కార్యాచరణ అమలుచేస్తామన్నారు. బడ్జెట్ అనంతరం గురువారం సాయంత్రం తన నివాసంలో సహచర ఎంపీలు తోట నరసింహం, అవంతిశ్రీనివాస్, జేసీదివాకర్‌రెడ్డి, ఎన్.శివప్రసాద్, కొనకళ్లనారాయణ, మాగంటిబాబు, పి.రవీంద్రబాబు, శ్రీరాంమాల్యాద్రి, కె.రామ్మోహన్‌నాయుడులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. "విభజిత ఆంధ్రప్రదేశ్‌పై బడ్జెట్‌లో ఎలాంటి ప్రత్యేకత చూపలేదు. రైల్వేజోన్, రెవిన్యూలోటు భర్తీ, రాజధానికి నిధులు, అసెంబ్లీ సీట్ల పెంపులాంటి పెండింగ్ అంశాలేవీ పరిష్కరించలేదు. ఈ బడ్జెట్ పూర్తి నిరాశ కల్గించింది. జాతీయ విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించి, ప్రహరీగోడ కట్టించి ఇచ్చినా వాటి నిర్మాణాల్లో ఏమాత్రం ప్రగతి లేదు. పోలవరం నిధులను నాబార్డ్‌తో అనుసంధానం చేసినా వాటి విడుదల సున్నితంగా సాగడంలేదు. ఏపీకి ప్రకటించిన విజయవాడ, విశాఖ మెట్రోల గురించి చెప్పలేదు. ఆదివారం అమరావతిలో జరిగే పార్టీపార్లమెంటరీ పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి బడ్జెట్‌పై చర్చించి తగిన సూచనలు చేస్తారు. దానికి అనుగుణంగా మేం తదుపరి కార్యాచరణ చేపడతాం" అన్నారు. మీరు మిత్రపక్షంగా ప్రభుత్వంలో కొనసాగుతూ ఒత్తిడి తెస్తారా? లేదంటే బయటికొచ్చి ఒత్తిడి చేస్తారా? అన్న ప్రశ్నకు సుజనా బదులిస్తూ దానిపై మాట్లాడే స్థాయి తమకు లేదని, పార్టీ అధ్యక్షుడు ఆ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.





కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా విజయవాడలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పి.మధు, సిహెచ్.బాబూరావు తదితరులు



అనంతపురంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు

## రైల్వేజోన్ ఆశలు అడియాసలు

**ఈనాడు డిజిటల్, అమరావతి:** కేంద్ర బడ్జెట్‌తో విశాఖ రైల్వే జోన్ ఆశలు అడియాసలయ్యాయి. భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, గ్రామీణ రహదారుల అనుసంధానం, గృహ, మరుగుదొడ్ల నిర్మాణాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చారు. దేశ స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని ఆ బడ్జెట్‌ను రూపొందించారు. కేంద్రం ఏపీని ప్రత్యేకంగా చూస్తోంది సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల రంగానికి పెద్దపీట వేయడం శుభపరిణామం. ఎన్నికలు సమీపిస్తున్నందునే కర్ణాటకకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చి ఉండొచ్చు. బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో అధ్యయనం చేశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా.

–మంత్రి యనమల రామకృష్ణుడు

### హామీలేమాయె

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని చట్టబద్ధమైన ప్రధాన హామీలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. రాజధానికి నిధులు, రెవెన్యూలోటు భర్తీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధుల గురించి ఊసు లేదు. కడప ఉక్కు పరిశ్రమ, దుగరాజపట్నం పోర్టు ఏమయ్యాయి? విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్, విశాఖ రైల్వేజోన్లపై ప్రకటన ఉంటుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు మరోసారి నిరాశ ఎదురైంది. రాష్ట్రానికి భాజపా, తెదేపాలు ఉమ్మడిగా ద్రోహం చేశాయి.

– ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరా

### ఆంధ్రప్రదేశ్‌కు నష్టంలేదు

ఇది పేదల బడ్జెట్. వ్యవసాయానికి సహకారం అందించే బడ్జెట్. కేంద్ర బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి నష్టం లేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకు కేంద్రం కట్టుబడి ఉంది.

– కంభంపాటి హరిబాబు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

## ప్రీమియం రూ.1,100

### అమితాబ్ కాంత్ వెల్లడి

**వాషింగ్టన్:** ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన ఆరోగ్య సంరక్షణ పథకం కింద ఒక్కో కుటుంబానికి ప్రీమియం దాదాపు రూ.1,100 చొప్పున ఉంటుందని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ చెప్పారు. ఓ ఆంగ్ల వార్తాఛానెల్‌తో మాట్లాడుతూ గురువారం ఆయన ఈ మేరకు సూచనప్రాయంగా పేర్కొన్నారు. మరోవైపు, తాజా బడ్జెట్‌పై ప్రముఖ ఆర్థికవేత్త, నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ పనగడియా హర్షం వ్యక్తం చేశారు.

# సీపీఎం, సీపీఐ నిరసనగళం

**న్యూస్‌టుడే యంత్రాంగం:** కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని సీపీఎం, సీపీఐ పార్టీలు నిరసనలు చేపట్టాయి. విజయవాడ బీసెంట్ రోడ్డులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు. రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం తదితరాల ప్రస్తావనే రాలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలోనే కర్ణాటక రాష్ట్రానికి నిధులు కేటాయించారని విమర్శించారు. ఇప్పటికైనా తెదేపా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకులు రోడ్డుపై బైఠాయించారు. వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళన చేస్తున్న నాయకులు సిహెచ్.బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, డి.వి.కృష్ణ తదితరులను అరెస్టు చేశారు.

అనంతపురంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటివరకు కేంద్రం నాలుగుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ తెలుగు రాష్ట్రాలకు ఎలాంటి సహకారం ఇవ్వలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ ప్రధాని వద్ద మోకరిల్లారని, అందుకే రాష్ట్రాభివృద్ధిపై కేంద్రంతో మాట్లాడలేకపోతున్నారని ఆరోపించారు.

## ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు ఊరట!

**ఈనాడు, అమరావతి:** కేంద్రం ప్రకటించిన జాతీయ ఆరోగ్య భద్రత పథకంతో రాష్ట్రంపై ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.2.5 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్సలు అందుతున్నాయి. ప్రస్తుతం కేంద్రం ప్రకటించిన జాతీయ ఆరోగ్య భద్రత పథకం ద్వారా రాష్ట్రంలో 37 లక్షల కుటుంబాలు రూ.5 లక్షల వరకూ వైద్య సేవలు పొందేందుకు అర్హత లభిస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ 'ఈనాడు'కు వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పొందిన సేవలకు కేంద్రం నుంచి నిధులు వస్తాయన్నారు.

## కేంద్ర విద్యా సంస్థల్లో మౌలిక వసతులకు రుణాలు

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యా సంస్థలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తక్కువగా ఉన్నా.. ఉన్నత విద్య ఆర్థిక సంస్థ (హెచ్‌బీఎఫ్ఏ) ద్వారా కేంద్ర రుణ సహాయం అందనుంది. రాష్ట్రంలోని ఐఐటీ, ట్రిపుల్ఐటీ, నిట్, ఐఐఎంలకు ఈ సంస్థ ద్వారా రుణం ఇవ్వనున్నారు. ఈ సంస్థలు తమకు వచ్చే ఆదాయం నుంచి రుణాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కెనరా బ్యాంకు, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖల భాగస్వామ్యంతో హెచ్‌బీఎఫ్ఏను ఏర్పాటు చేయనున్నారు.

## సుప్రీం కోర్టులో నాటకీయ పరిణామం

**దిల్లీ:** కీలకమైన ఆధార్ కేసు విచారణ సందర్భంగా గురువారం సుప్రీం కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక న్యాయవాది తీవ్ర స్వరంతో మాట్లాడటంపై న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ గట్టిగా స్పందించారు. ఆధార్ చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆధార్ వల్ల సామాజిక ప్రయోజన పథకాల్లో తప్పుడు క్లెయిములను అడ్డుకోవడం ద్వారా అవినీతిపై ఉక్కుపాదం మోపినట్లయిందన్న కేంద్ర వాదనను.. పిటిషనర్ల తరఫు న్యాయవాది శ్యామ్ దివాన్ ప్రస్తావించారు. ఆ గణాంకాలన్నీ తప్పన్నారు. అయితే గత విచారణలో.. బోగస్ లబ్ధిదారులను ఏరివేసి, ప్రభుత్వ సొమ్మును ఆదా చేయడంలో ఆధార్ పోషించిన పాత్రను కొనియాడుతూ ప్రపంచ బ్యాంకు ఇచ్చిన నివేదికను జస్టిస్ చంద్రచూడ్ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో తాజా విచారణలో శ్యామ్ దివాన్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "ఆధార్ జడ్జీగా నాపై ముద్రవేసినా నేను పట్టించుకోను. నేను ఆధార్ జడ్జీనన్న భావనను మీరు పదేపదే కలగజేస్తున్నారు" అని పేర్కొన్నారు. దీనికి శ్యామ్ దివాన్ స్పందిస్తూ.. 'మిమ్మల్ని నేనెప్పుడూ ఆధార్ జడ్జీ అని పేర్కొనలేదు" అని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. "లేదు.. మీరు నన్ను అలా పిలిచారు" అని నిష్కర్షగా అన్నారు. దీంతో శ్యామ్ దివాన్ క్షమాపణ చెప్పారు.

ఈనాడు

## భద్ర భారతావనికి బాటలు

దార్శనికత కొరవడిన ప్రభుత్వాలు, తీవరించిన అవినీతి కారణంగా దశాబ్దాల తరబడి 'ఇండియా ధనిక దేశమే... భారతీయులే నిరుపేదలు' అన్న సూత్రీకరణలు పుట్టుకొచ్చాయని నిరుడు ఏప్రిల్‌లో భువనేశ్వర్ వేదికనుంచి ప్రధాని మోదీ విశ్లేషించారు. పేదల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నట్లు ఇటీవలి దావోస్ సదస్సులో ఆయనే ఘనంగా చాటారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వ ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పిస్తూ విత్తమంత్రి అరుణ్ జైట్లీ నిన్న ఆ బాణీనే పుణికి పుచ్చుకొన్నారు. సేద్యాన్ని గ్రామీణార్థికాన్ని పునరుత్తేజపరచి, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆరోగ్య రక్షణ చేకూర్చి, మౌలిక రంగాన్ని బలోపేతం చేయడమే ప్రాథమ్యాలంటూ రూ. 24.42 లక్షల కోట్ల మేర బడ్జెట్ ప్రతిపాదనల్ని జైట్లీ క్రోడీకరించారు. వాస్తవానికి రాష్ట్రాలకు బదలాయింపులు, అప్పులపై వడ్డీలు, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రాయోజిత పథకాలు, రాయితీలు, రక్షణ... ఈ పద్దులకిందే సింహభాగం నిధులు హరాయించుకుపోయే స్థితి ప్రభుత్వ పరిమితుల్ని కళ్లకు కట్టేదే. వాస్తవంలో జీఎస్‌టీ రూపేణా రాబడి కొంత తగ్గినా- ప్రత్యక్ష పన్నుల వసూళ్లు, పెట్టుబడుల ఉపసంహరణ అక్కరకొచ్చాయన్న ధీమా జైట్లీ ప్రసంగంలో ఉట్టిపడింది. రూ. 11 లక్షల కోట్ల మేర సేద్య రుణాల ప్రకటన చెవులకింపుగా ఉన్నా, క్షేత్ర స్థాయిలో పరపతి వసతిపై ఇది ధీమా ఏర్పరచలేదు. నిరుటిలాగే ఈసారీ గ్రామీణాభివృద్ధికి వెండిపళ్లెంలో వడ్డించిన ఆర్థికమంత్రి ఖరీఫ్ పంటలకు కొత్త మద్దతు- రైతులకు మేలు చేస్తుందంటున్నారు. రైతాంగంలో కేవలం ఆరు శాతానికే దక్కుతున్న కనీస మద్దతు మదింపు విధానంపై ఎన్నో విమర్శలున్నాయి. నికర ఉత్పాదక వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే నిర్ధారిస్తున్న మద్దతు ధరకు ఒకటిన్నర రెట్లు ముట్టజెబుతామనడం పట్ల అనేక శంకలు ముమ్మరిస్తున్నాయి. వాస్తవిక వ్యయానికి అదనంగా 50 శాతం జతచేసి గిట్టుబాటు కల్పించాలన్న స్వామినాథన్ సిఫార్సు అమలుకు నోచుకుంటే తప్ప శ్రమజీవులకు జీవన భద్రత సమకూరే అవకాశమే లేదు. ఉద్యాన పంటలు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, 'ఆపరేషన్ గ్రీన్' తదితరాలపై ప్రతిపాదనలు గతంతో పోలిస్తే కొంత మెరుగుదలను సూచిస్తున్నాయి. రైతుకు జీవనభద్రతను, జాతికి ఆహారభద్రతను కల్పించే దిశగా ప్రభుత్వం చేయాల్సింది మరెంతో ఉంది!

ద్రవ్య క్రమశిక్షణ చర్యలకు అగణిత ప్రాధాన్యమిస్తుందా, ఎన్నికల సమ్మోహన స్వరం వినిపిస్తుందా- నిన్నటి బడ్జెట్ ప్రసంగానికి ముందు భిన్న వేదికలపై వెల్లువెత్తిన ప్రశ్నలివి. సంక్షేమ శ్రుతి కూర్చి గ్రామీణాభివృద్ధి గానం ఆలపించిన జైట్లీ తన ఓటు ఎటో బడ్జెట్ పాఠం తొలి పంక్తుల్లోనే విశదీకరించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ. 4.94 లక్షల కోట్లున్న మౌలిక పద్దు ఇప్పుడు రూ. 5.97 లక్షల కోట్లకు విస్తరించడం కళ్లు జిగేల్మనిపించకమానదు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య రక్షణ యోజనగా పది కోట్ల పేద కుటుంబాలకు రూ. 5లక్షల బీమా పథకాన్ని అమలుపరుస్తామంటున్నారు. రమారమి 50కోట్ల మందికి ప్రయోజనం కలిగించేదిగా 'ఆయుష్మాన్ భారత్'ను పట్టాలకు ఎక్కించడానికి తగినన్ని నిధులు ఎక్కడినుంచి ఎలా ప్రవహిస్తాయన్నదానిపై బడ్జెట్లో వివరణ లేదు! 99 నగరాల ఆధునికీకరణకు సుమారు రెండు లక్షల కోట్ల రూపాయలు, రైల్వేలకు రూ. 1.48 లక్షల కోట్లు కేటాయించిన ప్రభుత్వం రక్షణకు ప్రత్యేకించింది రూ. 2.95 లక్షల కోట్లు. ఉపఖండంలో నెలకొన్న ప్రత్యేక స్థితిగతుల దృష్ట్యా రక్షణకు మరింత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికింతేననడంలో సర్దు'పాట్లు' ప్రస్ఫుటమవుతున్నాయి. ఎనిమిది కోట్ల పేద మహిళలకు ఉచిత ఎల్పీజీ, నిరుపేదలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు, ముంబయి అర్బన్ రైల్వే వ్యవస్థ నవీకరణ, బెంగళూరు స్థానిక రైల్‌నెట్‌వర్క్... ప్రభుత్వ రాజకీయావసరాలకు అద్దం పట్టాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఈసారీ నిరాశే మిగిలింది. విభజన చట్టం హామీలు ఎప్పుడెప్పుడు నెరవేరతాయా అని నిరీక్షిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు- గిరిజన విశ్వ విద్యాలయాలు, ఐఐటీలకంటూ ఏదో కొంత విదపడం మింగుడుపడేది కాదు. మిషన్ కాకతీయకు, అమరావతికి మొండిచెయ్యి చూపిన గత బడ్జెట్ల ఒరవడే- నిన్న విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇతరత్రా హామీలకు సంబంధించీ పునరావృతమైంది.

'మేం కలలు కంటున్న నవభారతం ఆవిష్కృతమై తీరుతుంది' అని దృఢవిశ్వాసం వ్యక్తపరచిన విత్తమంత్రి, వర్గాలవారీగా సంక్షేమ ప్రధాన చర్యల్ని ప్రముఖంగా ప్రస్తావించారు. 2019నాటికి మహిళా సంఘాలకు రూ. 75 వేలకోట్ల రుణాలు అనుగ్రహిస్తామన్న ప్రభుత్వం- ఎస్సీలకు రూ. 56 వేలకోట్లు, ఎస్టీలకు రూ. 39వేల కోట్ల మేర వ్యయీకరిస్తామంటోంది. ఆ వరసలోనే ముద్రా రుణాలు, ఇంటింటికీ తాగునీటి పథకం, నిరుపేదలకు ఇళ్లు, గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు... వంటివీ బారులు తీరాయి. సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలకు తోడ్పాటుతో ఉపాధి కల్పన ఊపందుకుంటుందంటున్న ప్రభుత్వం, ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం యువతకు అక్కరకొస్తుందని దిలాసాగా చెబుతోంది. దేశ యువత జాతి కలిమిగా బలిమిగా రూపాంతరం చెందాలంటే, యావత్ విద్యా వ్యవస్థే మారాలి. కృత్రిమ మేధకు సంబంధించి పరిశోధనలు ప్రోత్సహిస్తామంటున్నా, మౌలిక చట్రం మార్పుల జోలికిపోలేదు. 38వేల కళాశాలలు, 760 విశ్వవిద్యాలయాలు, 12 వేలకు పైగా శిక్షణ సంస్థల్ని గరిష్ఠ ప్రయోజన సాధకాలుగా మలచే సమగ్ర చొరవ తాజా బడ్జెట్లోనూ కానరాలేదు. వయోవృద్ధులకు అదనపు వైద్య వ్యయ రాయితీలు ప్రసాదించిన ప్రభుత్వం, వేతన జీవులను పరిమితంగానే అనుగ్రహించింది! విశ్వవ్యాప్తంగా ఎన్నో దేశాలు పర్యాటకాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మలచుకోవడం చూస్తున్నాం. ఇప్పటికీ భారత్‌ను సందర్శించే విదేశీ పర్యాటకుల సంఖ్య కోటికి మించడంలేదు. బహుముఖ ప్రోత్సాహక చర్యలు ప్రకటించాల్సిన దశలో కొత్తగా పది పర్యాటక కేంద్రాల్ని అభివృద్ధి చేయదలచామన్న వివరణతో కేంద్రం సరిపుచ్చడం విస్మయపరచేదే. చమురు ఉత్పత్తులపై ఎక్సైజ్ రాయితీ ప్రయోజనం, కొత్తగా విధించిన రవాణా సెస్సుతో హళ్లికి హళ్లి సున్నకు సున్న కానుంది! దేశార్థిక రంగాన శీఘ్రతర అభివృద్ధిని లక్షిస్తున్నామన్న మోదీ ప్రభుత్వం ద్రవ్యలోటును స్థూల దేశీయోత్పత్తిలో 3.3 శాతానికి కట్టడి చేస్తామంటున్నా, అది ఖాయంగా అదుపు తప్పుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాటిని నిజం కానివ్వరాదన్న గట్టి పట్టుదలతో బడ్జెట్ ప్రతిపాదనల్ని యథాతథంగా అమలుపరచడమే అసలైన గడ్డుసవాలు. సడక్ (రోడ్డు), సఫాయీ (పారిశుద్ధ్యం), బిజిలీ (విద్యుత్తు), పానీ (నీరు) సహా దేశజనావళికి సకల మౌలిక సదుపాయాలూ కల్పించేదాకా అహరహం శ్రమిస్తామని కేంద్రప్రభుత్వం చెబుతోంది. నిరంతర మార్పు, ఉత్తేజం, స్వచ్ఛతల మేళవింపుతో సమ్మిళిత అభివృద్ధిని సాకారం చేస్తామన్నది ప్రధాని మోదీ నినాదం. కోట్లాది భారతీయుల జీవన ప్రమాణాల్ని ఇనుమడింపజేసే బృహత్ ప్రణాళికను కొత్త సెస్సుల దన్నుతో సమర్థంగా అమలుపరుస్తామన్న హామీని నిలబెట్టుకున్నప్పుడే- నిన్నటి బడ్జెట్ కసరత్తు సార్థకమైనట్లు!



# స్వావలంబన బాటలో
# కొత్త సంకేతాలు

పూర్వ యూపీఏ ప్రభుత్వాలు శత్రువుపై మెతక వైఖరి అవలంబించాయంటూ గతంలో నిప్పులు చెరిగిన భారతీయ జనతా పార్టీ- అధికార పగ్గాలు చేతికి రాగానే కరకు పంథాకు శ్రీకారం చుట్టింది. తడాఖా చూపండంటూ సాయుధ బలగాలను ఉరకలెత్తించడంతో మన దళాలు సరిహద్దు దాటి మియన్మార్, పాకిస్థాన్ భూభాగాల్లోని ఉగ్రవాద మూకలపై విజయవంతంగా లక్షిత దాడులు నిర్వహించాయి. సరిహద్దుల్లో పాక్ సేనల కాల్పులకు దీటుగా బదులిస్తూ, డోక్లామ్‌లో చైనా చొరబాటును గట్టిగా నిలువరించాయి. హిందూ మహాసముద్రంలో చైనా యుద్ధనౌకలు, జలాంతర్గాముల సంచారం పెరుగుతున్న దృష్ట్యా- అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి ఉమ్మడి గస్తీకి భారత నౌకాదళం సన్నద్ధమవుతోంది. అవసరమైతే ఏక కాలంలో ఇద్దరు శత్రువులతో తలపడటానికి భారత్ తయారుగా ఉండాలని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. ఇది చాలదన్నట్లు ఇండో-పసిఫిక్ జలాల్లో చైనా దూకుడును ఎదుర్కోవడానికి భారత్ సిద్ధపడాలని అమెరికా ఆశిస్తోంది. రక్షణపరంగా పెరుగుతున్న బరువు బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలంటే భారత్ తన త్రివిధ సాయుధ బలగాలను పెద్దయెత్తున ఆధునికీకరించాలి. ఇందుకు స్వదేశంలో హైటెక్ ఆయుధాలను తయారుచేసుకోవడంతోపాటు, విదేశాల నుంచీ దిగుమతి చేసుకోక తప్పదు. ఈ వ్యయప్రయాసలను తట్టుకోవడానికి భారత్ ఆర్థికంగా సిద్ధమేనా అన్నది ప్రశ్న. దీనికి 2018-19 బడ్జెట్‌లో రక్షణ రంగ కేటాయింపులను చూస్తే అంత సంతృప్తికరమైన సమాధానం లభించదు.

### పెరుగుదల స్వల్పమే

బడ్జెట్ కేటాయింపులు పైచూపులకు ఎక్కువే అనిపించినా ద్రవ్యోల్బణాన్ని, ఇతర దేశాల రక్షణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుంటే అవి మన అవసరాలకు చాలవని తేలుతుంది. తాజా బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ. 2.95 లక్షల కోట్లు కేటాయించారు. 2017-18 బడ్జెట్ కేటాయింపు రూ. 2.74 లక్షల కోట్లకన్నా ఇది 7.81 శాతం ఎక్కువ. 2017-18 బడ్జెట్ అంతకు క్రితం బడ్జెట్ కన్నా ఆరు శాతం ఎక్కువ నిధులు కేటాయించింది. కొత్త బడ్జెట్ ఎక్కువ నిధులు కేటాయించినట్లు కనిపిస్తున్నా అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే ఇప్పటికీ అవి తక్కువే. నిజానికి గడచిన 50 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ నిధులతో ఈసారి సరిపెట్టారు. ప్రపంచంలో ప్రముఖ దేశాలు తమ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో సగటున రెండు నుంచి 2.25 శాతం నిధులను రక్షణ రంగానికి కేటాయిస్తుంటే, భారత్ ఈ ఏడాదీ కేవలం 1.58 శాతమే కేటాయించింది. పాకిస్థాన్ 2016లోనే తన జీడీపీలో 3.6 శాతాన్ని రక్షణ రంగానికి కేటాయించినట్లు ప్రపంచ బ్యాంకు లెక్కగట్టింది. ఇక చైనా జీడీపీ చాలా ఎక్కువ కాబట్టి అందులో 1.9 శాతాన్నే రక్షణ రంగానికి కేటాయించినా, 2017లోనే ఆ నిధులు (రూ. 10 లక్షల కోట్లు) మనకన్నా మూడు రెట్లు ఎక్కువగా లెక్కతేలాయి. భారత్ తన రక్షణ అవసరాల కోసం పూర్తిగా ప్రభుత్వ నిధుల మీదే ఆధారపడకుండా ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులనూ ప్రోత్సహించాలని నిశ్చయించింది.

దేశంలో రెండు రక్షణ పారిశ్రామిక ఉత్పత్తి నడవాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగ (ఎంఎస్ఎంఈ) భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి 2018 రక్షణోత్పత్తి విధానాన్ని ప్రకటిస్తామనీ ఆయన వెల్లడించారు. సరిహద్దుల్లో, జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతాల్లో దేశ భద్రతను కాపాడటానికి త్రివిధ సాయుధ బలాల కృషిని, త్యాగాలను జైట్లీ ప్రశంసించినా- రక్షణ వ్యయాన్ని చెప్పుకోదగిన రీతిలో పెంచకపోవడం నిరాశ కలిగించింది. స్వదేశంలో చాలినన్ని సంప్రదాయ, ఆధునిక ఆయుధాలను తయారుచేసుకొనే ప్రయత్నాలు ఊపందుకోకపోవడంతో, విదేశాల నుంచి వాటిని కొనవలసి వస్తోంది. ఫలితంగా నేడు భారత్ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా నిలిచింది. ఇది చాలదన్నట్లు రక్షణ బడ్జెట్‌లో సింహభాగం సిబ్బంది జీతభత్యాలకే సరిపోతోంది. ముఖ్యంగా ఏడో వేతన సంఘ సిఫార్సులు, ఒకే హోదాకు ఒకే పింఛన్ (ఒరాప్) విధానం అమలుతో ఈ వ్యయం బాగా పెరిగింది. దీంతో కొత్త ఆయుధాల సేకరణ, ఉత్పత్తికి నిధులు చాలకుండా పోతున్నాయి. 2018-19 బడ్జెట్‌లో రక్షణకు రూ. 2.95 లక్షల కోట్లు కేటాయించినా జీతభత్యాలు, రోజువారీ పాలనపరమైన ఖర్చులకే రూ. 1.96 లక్షల కోట్లు ఖర్చవనున్నాయి. ఇక కొత్త ఆయుధ ప్రాజెక్టులకు మిగిలే మొత్తం రూ. 99,947 కోట్లు మాత్రమే. పింఛన్ల చెల్లింపులకు వెచ్చించే రూ. 1,08,853 కోట్లు బడ్జెట్ కేటాయింపులకు అదనం. ఈ లెక్కన భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 25,000 కోట్ల డాలర్ల (రూ. 16 లక్షల కోట్ల) సైనిక ఆధునికీకరణ ప్రాజెక్టు ఎలా ముందుకు ఉరుకుతుందనే అనుమానం పీడించకమానదు. 'భారత్‌లో తయారీ' కింద సొంత గడ్డమీదే ఆయుధాలు తయారుచేస్తే యువతకు ఉపాధి లభించడంతోపాటు దిగుమతి బిల్లునూ తగ్గించుకోవచ్చునని మోదీ ప్రభుత్వం ఆశిస్తోంది. కానీ, స్వదేశీ పరిశ్రమలు, ముఖ్యంగా ప్రభుత్వరంగ రక్షణ పరిశ్రమలు చౌక ఆయుధాల మీదనే దృష్టిపెడుతున్నాయి తప్ప ఆధునిక ఆయుధాల రూపకల్పనకు, పరిశోధన-అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం లేదన్న విమర్శ ఉంది. అందుకే భారత్‌లో తయారైన రైఫిల్‌ను స్వీకరించడానికి మన సైన్యం వరసగా రెండేళ్ల నుంచి నిరాకరిస్తూ వస్తోంది. మన గడ్డపై తయారైన అర్జున్ ట్యాంకులను, తేజస్ ఫైటర్ విమానాలను, చివరకు తూటా రక్షక కవచాలను సైతం చైనా, పాక్ సరిహద్దుల్లో వాడలేని దుస్థితి నెలకొని ఉంది. తేజస్ రూపకల్పనకు మూడు దశాబ్దాల కాలం వెచ్చించిన భారతదేశం చివరకు ఫ్రాన్స్ నుంచి 16 రఫేల్ ఫైటర్ విమానాలను దిగుమతి చేసుకోనుంది. ఇవి 2019 నుంచి మన వాయుసేనకు అందుతాయి.




### కనీస నిల్వలూ కరవు

రక్షణ బడ్జెట్‌లలో ఆధునికీకరణకు ఉద్దేశించిన పెట్టుబడి వ్యయంలో 80 శాతం గతంలో కుదుర్చుకున్న ప్రాజెక్టులకు వాయిదాలు కట్టడానికే ఖర్చయిపోతూ కొత్త ప్రాజెక్టులకు నిధులు తరిగిపోతున్నాయి. దానితో మన సైన్యం, నౌకా, వాయు సేనలకు సరికొత్త తుపాకులు, శతఘ్నులు, ఫైటర్ విమానాలు, యుద్ధ నౌకలు అందకుండా పోతున్నాయి. అంతేకాదు- రోజుల తరబడి యుద్ధం చేయడానికి కావలసిన మందుగుండుకూ తీవ్రకొరతే. మన సైన్యం దగ్గర కనీసం 10 రోజులపాటు యుద్ధం చేయడానికైనా మందుగుండు లేదని కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) గత ఏడాది మార్చి నివేదికలో తెలిపింది. మొత్తం 152 రకాల మందుగుండులో 61 రకాలకు 40 శాతం కొరత ఉంది. పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్థాన్ పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఉద్రిక్తతలను పెంచుతున్న నేపథ్యంలో మందుగుండు కొరత ఏమాత్రం క్షంతవ్యం కాదు. 2017లో పాక్ 860 సార్లు కాల్పులకు తెగబడింది. అంతకుముందు రెండేళ్లకన్నా ఇది రెట్టింపు. 2018 జనవరి 21వ తేదీ వరకు 124 సార్లు పాక్ దళాలు కాల్పులు జరిపాయి. జమ్మూకశ్మీర్‌లో 2016లో ఉగ్రవాదుల హింసలో 267 మంది మరణిస్తే 2017లో 347 మంది హతమయ్యారు. ఇక చైనా సరిహద్దుల్లో పరిస్థితి సవ్యంగా లేదనడానికి డోక్లాం ఘటనే నిదర్శనం. ఈ సరిహద్దులో రహదారులు, వంతెనలను వేగంగా నిర్మిస్తున్నామని జైట్లీ చెప్పుకొచ్చారు. 'అన్ని రుతువుల్లో లడఖ్‌కు చేరడానికి వీలు కల్పించే రోహతాంగ్ సొరంగం పూర్తయింది. 14 కిలోమీటర్ల జోజిలా సొరంగ నిర్మాణం వేగంగా సాగుతోంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో సెలా కనుమ కింద కూడా సొరంగాన్ని నిర్మించదలచాం' అని ఆయన చెప్పారు. మొత్తంమీద భారత్, చైనాల నడుమ 3,488 కిలోమీటర్ల పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి రహదారులు, సొరంగాలు, వంతెనల వంటి మౌలిక వసతుల నిర్మాణ ఆవశ్యకతను ప్రభుత్వం గుర్తించిందనడంలో సందేహం లేదు. సరిహద్దుకు అవతల చైనా ఇలాంటి నిర్మాణాలను జోరుగా చేపడుతోందనడానికి డోక్లాం ఘటన నిదర్శనం. చైనా సరిహద్దుల్లో వ్యూహపరంగా కీలకమైన 73 రహదారులను భారత ప్రభుత్వం గుర్తించినట్లు 'కాగ్' తెలిపింది. వీటిలో 61 రోడ్లను 2012 కల్లా పూర్తిచేసే బాధ్యతను సరిహద్దు రహదారుల నిర్మాణ సంస్థకు అప్పగించినా, 2016 మార్చినాటికి కేవలం 22 రహదారులే పూర్తయ్యాయి. ఇవి కాకుండా 'కాగ్' తనిఖీ చేసిన 24 రోడ్లలో కేవలం ఆరు మాత్రమే ప్రత్యేక సైనిక వాహనాలు తిరగడానికి అనువుగా ఉన్నాయి.

### ప్రైవేటుకు భాగస్వామ్యం

సరిహద్దుల్లో మౌలిక వసతుల విస్తరణను వేగవంతం చేస్తూనే మోదీ ప్రభుత్వం రక్షణ దళాల ఆధునికీకరణను ఉద్ధృతం చేయాల్సి ఉంది. కానీ, బడ్జెట్ ఇబ్బందుల రీత్యా ప్రభుత్వం రక్షణ రంగంలో ప్రైవేటురంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించదలచింది. రక్షణ రంగం కోసం 'భారత్‌లో తయారీ'లో రెండో అంచె కింద ఆయుధోత్పత్తికి ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ సరళీకృత విధానం ప్రకారం ఇక నుంచి ప్రైవేటు పరిశ్రమలు తాము తయారుచేయదలచిన ఆయుధాలు, విడిభాగాలను తామే స్వయంగా రక్షణ శాఖకు తెలపవచ్చు. ఇంతవరకు రక్షణ శాఖ సూచించిన వస్తువులనే ప్రైవేటు రంగం తయారుచేయవలసి ఉండేది. ఇకపై వారు సొంత ఆలోచనలతో ముందుకు రావడానికి 'భారత్‌లో తయారీ' విధానం వీలు కల్పిస్తోంది. ప్రైవేటు రంగం రూపొందించిన ఆయుధ నమూనాలను రక్షణ విభాగాలు ఒకసారి కనుక ఆమోదించాయంటే వాటిని తప్పక కొనుగోలు చేస్తాయి. గతంలో తాము ఎంతో వ్యయప్రయాసలతో రూపొందించిన ఆయుధాలను, విడిభాగాలను రక్షణ శాఖ కొనుగోలు చేస్తుందా అని ప్రైవేటు పరిశ్రమలు సందేహించేవి. దాన్ని తొలగించడానికి తాజా నిబంధనలు రూపొందించారు. ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్న ఆయుధ వ్యవస్థలు, విడిభాగాల నమూనాల తయారీలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) రంగ, అంకుర పరిశ్రమలను ప్రోత్సహిస్తారు. ఈ విభాగంలో రూ. 3 కోట్ల ప్రాజెక్టులకు రక్షణ శాఖ తోడ్పాటు లభిస్తుంది. మొత్తం 50 నమూనాల తయారీకి ఈ పరిశ్రమలకు అవకాశమిస్తారు. భారత్ ఏటా రూ. 1.25 లక్షల కోట్ల విలువైన ఆయుధాలను సేకరిస్తోంది. వీటిలో దాదాపు రూ. 55,000 కోట్ల విలువైన ఆయుధాలను ప్రభుత్వ రంగ సంస్థలు తయారుచేస్తుంటే, ఎంఎస్ఎంఈ రంగం రూ. 5,000 కోట్ల విలువైన ఆయుధాలు, ఆయుధ వ్యవస్థలను ఉత్పత్తి చేస్తోంది. మిగతా ఆయుధాలకు దిగుమతులే శరణ్యం. 2020 కల్లా ఎంఎస్ఎంఈ రంగం నుంచి రూ. 10,000 కోట్ల ఆయుధాలు, విడిభాగాల సేకరణ సాధ్యమే. రక్షణ రంగంలో స్వావలంబనకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎంఎస్ఎంఈ సంస్థలు తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రక్షణ పారిశ్రామిక నడవాలు భాగస్వాములు కావాలి.

**- ఏఏవీ ప్రసాద్**



గంజివరపు శ్రీనివాస్

# నగరాలకు ప్రకృతి రక్ష

'సుస్థిర నగరాల భవిష్యత్తు కోసం... చిత్తడి నేలల పరిరక్షణ' నినాదంతో నేడు ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నగరాలకు ఆనుకుని ఉన్న చిత్తడి నేలలను వ్యర్థ భూములుగా చూడటం పరిపాటిగా మారింది. వాస్తవానికి అవి నగరాలకు ప్రకృతి ప్రసాదించిన అరుదైన బహుమానాలు. పర్యావరణ సమస్యలు ముమ్మరిస్తున్న తరుణంలో అనేక దేశాలు చిత్తడి నేలల గొప్పతనాన్ని గ్రహిస్తున్నాయి. వాటి పరిరక్షణకు పెద్దయెత్తున చర్యలు చేపడుతున్నాయి. అధిక ఆహార దిగుబడుల సాధన, మత్స్యసంపద ఉత్పత్తితో పాటు అటవీ, తీర ప్రాంత నగరాల పరిరక్షణలో చిత్తడి నేలలు కీలకపాత్ర పోషిస్తాయి. భూమికి ఊపిరితిత్తుల్లా అవి పనిచేస్తాయి. వరదలు, కరవు కాటకాల నుంచి మానవాళిని ఆదుకుంటాయి. పర్యావరణ వ్యవస్థలను, జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తాయి. ఇన్ని రూపాల్లో మానవాళిని ఆదుకుంటున్న చిత్తడి నేలల పరిరక్షణ విషయంలో మనదేశంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యం రాజ్యమేలిందన్నది చేదు వాస్తవం. ఫలితంగా చిన్నపాటి వానలకే నగరాలు వరదల్లో మునకలేస్తున్నాయి. ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా వంటి నగరాల్లో వరద ముంపు దుస్థితిగతులే అందుకు తిరుగులేని దాఖలా. ఈ పరిణామాల దృష్ట్యా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడిప్పుడే దిద్దుబాటు చర్యల దిశగా అడుగులేస్తున్నాయి. నిరుడు సెప్టెంబరులో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ చట్టానికి అనుగుణంగా ప్రత్యేకంగా చిత్తడి నేలల పరిరక్షణ, యాజమాన్యం నిబంధనలు- 2017ని అమలులోకి తీసుకురావడం ఆశావహ పరిణామం. తాజా బడ్జెట్‌లో కూడా కేంద్ర ప్రభుత్వం పర్యావరణ హిత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ నిధులు కేటాయించింది.

### బహుముఖ సవాళ్లు

ఆధునిక సమాజం నగరీకరణ చుట్టూ తిరుగుతోంది. ప్రస్తుతం కోటి మంది ప్రజలు గల మహానగరాల జనాభా 2030నాటికి మూడు నుంచి నాలుగు కోట్ల వరకు పెరగొచ్చని అంచనా. పెచ్చరిల్లుతున్న నగరీకరణ బహుముఖాలుగా సవాళ్లు రువ్వుతోంది. రవాణా, తాగునీరు వంటి వసతుల కల్పనే కాకుండా విపత్తుల నుంచి త్వరగా తేరుకునే అవకాశాలను నగరాభివృద్ధి ప్రణాళికలో విస్మరించడంవల్ల తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. తుపానులు, వరదల సమయంలో నగరాల్లోని చిత్తడి నేలలు అదనపు వర్షపు నీటిని ఒడిసి పడతాయి. త్వరగా వరద తగ్గుముఖం పట్టడానికి దోహదపడతాయి. దైనందిన, పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసి నీటి నాణ్యత పెంచడంలో చిత్తడి నేలలు విశేష పాత్ర పోషిస్తున్నాయి. కానీ, ఇబ్బడి ముబ్బడిగా నిర్మితమవుతున్న కాలనీలు, విస్తరిస్తున్న నగర శివార్లు చిత్తడి నేలలను క్రమంగా మింగేస్తున్నాయి. వ్యర్థాలతో ఆ నేలలు నిండిపోతున్నాయి. సద్వినియోగపరచుకుంటే ఇవే నేలలు ఆదాయాన్ని కురిపిస్తాయి. సాంఘిక, సాంస్కృతిక లాభాలను అందజేస్తాయి. వివిధ దేశాల్లో నిర్వహించిన అధ్యయనాల ఫలితాలే అందుకు తార్కాణం!

ఇరాన్‌లోని రామ్‌సార్‌లో 1971నాటి సదస్సు తరవాత మనదేశంలో చిత్తడి నేలల పరిరక్షణకు చర్యలు మొదలైనా ఆశించిన మేర ఫలితాలు రాలేదు. అప్పట్లో 164 దేశాలు చిత్తడి నేలల పరిరక్షణకు అంతర్జాతీయ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 'రామ్‌సార్ ప్రమాణాల' ప్రకారం మనదేశంలో 25 ప్రాంతాలను చిత్తడి నేలలుగా గుర్తించారు. జాతీయ పరిరక్షణ పథకం కింద



**నేడు ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినం**

మరో 115 ప్రాంతాలను గుర్తించి ఆయా రాష్ట్రాలకు నిధులు విడుదల చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని కొల్లేరు సరస్సు ఒక్కటే ఈ జాబితాలో ఉంది. తీరప్రాంతాల్లో బీల, తంపర, మడ అడవుల ప్రాంతాలన్నింటినీ చిత్తడి నేలలుగా గుర్తించి పరిరక్షణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని అనేక అధ్యయనాలు కోరుతున్నాయి. కోయంబత్తూరుకు చెందిన సలీం అలీ సంస్థ (సాకాన్) దేశవ్యాప్తంగా 700 ప్రదేశాలకు ప్రభుత్వం గుర్తింపునిచ్చి జాతీయ చిత్తడి నేలల పరిరక్షణ పథకం కిందకు తీసుకురావాలని సూచించింది. వీటిలో 200 ప్రాంతాలను రామ్‌సార్ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ జాబితాలో చేర్చాలనీ సూచించింది. తెలుగు రాష్ట్రాల్లో కోరింగ అభయారణ్యం, పాకాల చెరువు, కృష్ణానదీ పరివాహక ప్రాంతాలు, సోంపేట, నౌపడ, వాకాలపూడి, బద్వేలు, కంభం, విశాఖపట్నం జిల్లాలోని కొండకర్ల ఆవ, తిమ్మరాజు చెరువు ప్రాంతాలు చిత్తడి నేలలేనని, వీటి పరిరక్షణకు చర్యలు అత్యవసరమని స్పష్టీకరించింది. అర్హత ఉన్నప్పటికీ వాటిని చిత్తడి నేలలుగా గుర్తించకపోవడం వల్ల పదేళ్ల వ్యవధిలో నలభై శాతం మేర ప్రాంతాలు రూపాన్ని కోల్పోయాయి. 2006లో జాతీయ అటవీ కమిషన్- చిత్తడినేలల సంరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని కేంద్రానికి సూచించింది. జాతీయ పర్యావరణ విధానాన్ని అమలుచేయడంలో భాగంగా, 2010 డిసెంబరులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ చిత్తడి నేలల నిర్వహణ, పరిరక్షణ కోసం పలు నిబంధనలను అమలులోకి తీసుకొచ్చింది.

'ఆసియా చిత్తడి నేలల కేంద్రం' ప్రకారం దేశంలోని 18.4 శాతం భూభాగంలో 5.8 కోట్ల హెక్టార్ల పరిధిలో 19 రకాల చిత్తడి నేలలు సాగు, తాగునీరు అందిస్తూ ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతోమందికి ఉపకరిస్తున్నాయి. దాదాపు 70 శాతం మేర వరిసాగు చిత్తడి నేలల పరిధిలోనే సాగుతోంది. అనేక చిత్తడి ప్రాంతాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. అవి ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుస్తున్నాయి. 2010లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ విడుదల చేసిన పలు మార్గదర్శకాలను అమలుచేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కేంద్ర, రాష్ట్రాల స్థాయుల్లో ఉన్నతస్థాయి కమిటీలు అటవీ, వన్యప్రాణి, కోస్తా నియంత్రణ చట్టాలతో అనుసంధానిస్తూ ఈ ప్రదేశాల పరిరక్షణకు అవసరమైన చర్యలను నిర్దేశించాలి. పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరాభివృద్ధి సంస్థల స్థాయుల్లో ఈ నేలల గురించి అవగాహన గల సిబ్బందిని నియమించి, వాటి పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ఎంతో అవసరం.

### భవిష్యత్ ప్రణాళిక అత్యవసరం


తాజాగా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన చిత్తడి నేలల పరిరక్షణ-యాజమాన్య నిబంధనలు- 2017లను పటిష్ఠంగా అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. వీటి ప్రకారం చిత్తడి నేలల ఆక్రమణ, ఘనవ్యర్థాల పారబోత, అక్రమ వేట, శుద్ధిచేయని జలాలను పరిశ్రమలు ఈ భూముల్లోకి వదలడం, పదేళ్ల వరద ఉద్ధృతి ఆధారంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలను నిషేధించారు. అటవీ, పర్యావరణం, జీవవైవిధ్య రంగాలకు చెందిన అధికారులతో కూడిన కేంద్ర, రాష్ట్రాల స్థాయుల్లో ఉన్నతస్థాయి కమిటీలు ఈ నిబంధనల అమలును పర్యవేక్షించాలి. అర్హత కలిగిన చిత్తడి నేలలకు కొత్తగా జాతీయ హోదా లభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాష్ట్రప్రభుత్వాలు జిల్లాసాయుల్లో చిత్తడి నేలల పరిరక్షణకు ఇకనైనా ప్రణాళికలు రూపొందించాలి. నగరాభివృద్ధి ప్రణాళికల్లో చిత్తడి నేలలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసే చర్యలను చేపట్టాలి. ఈ ఏడాది అక్టోబర్‌లో దుబాయ్‌లో జరగనున్న రామ్‌సార్ అంతర్జాతీయ సదస్సులో మొదటిసారిగా చిత్తడి నేలలను పరిరక్షిస్తూ ఒడుపుగా, పొదుపుగా వినియోగించుకుంటున్న నగరాలకు ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వనున్నారు. ఆ గౌరవానికి అర్హత ఉన్న 700పైగా ప్రదేశాల్లో ప్రభుత్వం సంరక్షణ చర్యలు చేపట్టాలి. నేలల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించి, జిల్లాల స్థాయిలో ఎక్కడికక్కడ చిత్తడి నేలల పరిరక్షణ ప్రణాళికలను చిత్తశుద్ధితో అమలుచేస్తే- మన చిత్తడి నేలలూ అంతర్జాతీయ ఖ్యాతిపొందగలవు!

# జీవన కళ

కాలాన్ని సద్వినియోగం చేయడం ఒక కళ. అందులో నిష్ణాతులు సుఖంగా జీవిస్తారు. పనిని సకాలంలో చేయకపోవడం వల్ల జీవితం అస్తవ్యస్తమవుతుంది. వైఫల్యాలు వెంటాడతాయి. అలా మాటిమాటికీ జీవన సమరంలో ఓడేవారు దురదృష్టవంతులనో, విధివంచితులనో సమాజం జాలి చూపుతుంది. కొన్ని సందర్భాల్లో నిర్దయగా వ్యవహరిస్తుంది. ఆ ముఖాల్లో జీవకళ కొరవడేలా చేస్తుంది.

మనిషిని సంకల్పశక్తి ముందుకు నడిపిస్తుంది. శీలవంతుడైన మనిషి మహావృక్షంలా దృఢంగా ఉంటాడు. అతడి చరిత్రలో బద్ధకం, భయాలకు స్థానం ఉండదు. ఇంకొకరి సాయంకోసం ఎదురుచూడడు. తాను ఎంచుకున్న మార్గంలోనే సాగిపోతుంటాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రసిద్ధ గీతంలో చెప్పినట్లు 'ఓ బాటసారీ! ఒంటరిగా సాగిపో' అంటూ జీవితం అతడి వెన్ను తట్టి ధైర్యం కలిగిస్తుంది.

ఇతిహాసాల్లో అనేకం- కష్టాలు అనుభవించినవారి చరిత్రలే! శ్రీరామచంద్రుడు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు వంటి మహాపురుషుల జీవితాలన్నీ ఆదర్శప్రాయాలు. కష్టాల్ని ఆనందంగా స్వీకరించిన వారికి దుఃఖం ఎందుకు ఉంటుంది?



అంతర్యామి

సమయాన్ని సద్వినియోగం చేస్తూ, నలుగురికీ మేలు కలిగిస్తూ, నవ్వుతూ ఉండటం ఒక కళ! మహాత్ములుగా లోకం భావించేవారందరూ ఆ కళలో ప్రసిద్ధులు. జీవనకళ సాధించడం అంటే, భగవానుడు ప్రసాదించిన మానవజన్మను సార్థకం చేసుకోవడమే. సీతాన్వేషణ సందర్భంలో 'సముద్రాన్ని ఎలా దాటాలి' అని వానరులు మథనపడుతుంటారు. అప్పుడు సముద్రుణ్ని ప్రార్థించాలంటూ రాముడికి విభీషణుడు సూచిస్తాడు. లక్ష్మణుడు కలగజేసుకొని- 'ఓ ఆజానుబాహూ! మహాబలా! ఇక ఆగవద్దు. అనుకున్నదాన్ని భుజబలంతో సాధించండి' అంటాడు.

ఆలోచన కార్యరూపం దాల్చినప్పుడే విజయం సిద్ధిస్తుంది. దృఢసంకల్పమే మానవుడికి అపార శక్తినిస్తుంది. అతడి జీవితం కళకళలాడుతుంది. జీవితాన్ని కళాత్మకంగా గడపటానికి పెద్దలు అనేక సంప్రదాయాలు ఏర్పాటు చేశారు. కొత్త జంట పెళ్లి వస్త్రాలతో అగ్నిహోత్రానికి ప్రదక్షిణ చేయడాన్ని ఒక సజీవ కళగా భావిస్తూ, బంధుమిత్రులందరూ సంతోషంగా చూస్తారు. జీవితంలో ప్రతి అడుగూ కళాత్మకతను సంతరించుకోవాలి. అందుకే ఆచారాల పేరుతో విజ్ఞులు, ఇల్లు ఎప్పుడూ కళకళలాడే పద్ధతులు సూచించారు.

మహోన్నత భావ వైవిధ్యానికి సూచికలు- లలిత కళలు. ఆ భావాలు, ఒక్కో కాలంలో ఒక్కొక్క తీరున ఉంటాయి. త్యాగం, సేవాభావం వంటి సంస్కృతులూ పలు రూపాల్లో కనిపిస్తుంటాయి. వీటన్నింటినీ ఒక్కచోటికి చేరిస్తే- అదే 'ప్రేమ' అవుతుంది. దాని పరిధిలో ఉన్నదే సంస్కృతి. గొప్ప పనులు చేసినవారిపై అభినందనలు కురుస్తాయి. వారికి అప్పుడే జాగ్రత్త అవసరం. అహంకారానికి లోనైతే, అది పతనానికి దారితీస్తుంది. తనతో పనిచేసేవారితో కలిసిమెలిసి ఉంటూ, ఐక్యభావనతో ముందుకు సాగితే... అదే నిజమైన జీవన కళ!

**- పి.భారతి**

## తితిదే ఈవో ఇచ్చిన సంజాయిషీ నోటీసుల్ని కొట్టేయండి

### హైకోర్టును ఆశ్రయించిన క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు

**ఈనాడు, హైదరాబాద్:** హిందూయేతర్లు తితిదే, ఆ దేవస్థానం పరిధిలోని దేవాలయాల్లో ఉద్యోగం చేయడానికి వీల్లేదంటూ.. తితిదే కార్యనిర్వాహణాధికారి(ఈవో) గత నెల 11న జారీచేసిన సంజాయిషీ నోటీసులను(షోకాజ్) కొట్టేయాలని అభ్యర్థిస్తూ పలువురు క్రిస్టియన్, ముస్లిం ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. తితిదే ఉద్యోగుల సర్వీసు నిబంధనల్లో పేర్కొన్న నిబంధన 9(4)ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. తాము నేరుగా చేపట్టిన నియామకాల ద్వారా తితిదే, దాని పరిధి లోని కార్యాలయాల్లో అటెండర్లు, తోటమాలి, పారిశుద్ధ్య కార్మికులు, కాపలాదార్లు తదితర పోస్టుల్లో 1998-2004 మధ్య కాలంలో నియమితులయ్యామన్నారు. హిందూ సంస్థల ఒత్తిడితో తమతో పాటు సుమారు 42 మందికి షోకాజ్ నోటీసులిచ్చి మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని కోరారన్నారు. తమ ధ్రువీకరణ పత్రాలు, తదితర వివరాల్ని పరిశీలించే ఉద్యోగంలోకి తీసుకున్నారని పేర్కొన్నారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, తితిదే ఈవోలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

## కరవు నివారణ ప్రాజెక్టుకు రూ.1042 కోట్లు

### రాష్ట్రంలో 5 జిల్లాల్లో అమలు

**విజయవాడ, న్యూస్‌టుడే:** కరవు జిల్లాల్లోనూ రైతుల జీవన ప్రమాణాలు పెంచాలనేది తమ లక్ష్యమని, దానికనుగుణంగా ప్రభుత్వం రాష్ట్ర కరవు నివారణ ప్రాజెక్టు రూపొందించిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. విజయవాడలోని ఓ హోటల్లో రాష్ట్ర కరవు నివారణ ప్రాజెక్టు విధివిధానాలపై వ్యవసాయ, పశుసంవర్ధక శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు గురువారం కార్యశాల నిర్వహించారు. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలను కరవు జిల్లాలుగా గుర్తించామన్నారు. శాశ్వత ప్రయోజనాలు కల్పించాలనే చర్యల్లో భాగంగా కరవు నివారణ ప్రాజెక్టుకు రూ.1,042 కోట్లు నిధులు కేటాయించామన్నారు. తద్వారా రాష్ట్రంలోని 105 మండలాల్లోని 315 గ్రామ పంచాయతీల్లో 1.65 లక్షల మంది కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర కరవు నివారణ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వీడీవీ కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌రహీంసింగ్, ఇద్దరు వైద్యులపై అభియోగపత్రం

**దిల్లీ:** 400 మంది భక్తులు, మద్దతుదారుల వృషణాలను బలవంతంగా తొలగించారనే నేరారోపణలపై డేరా సచ్చా సౌధా అధ్యక్షుడు గుర్మీత్ రామ్ రహీంసింగ్‌తో పాటు ఇద్దరు వైద్యులపై సీబీఐ గురువారం అభియోగపత్రం దాఖలు చేసింది. రెండు అత్యాచారం కేసుల్లో నేరం రుజువు కావడంతో సింగ్ 20 ఏళ్ల కారాగారవాసం శిక్ష అనుభవిస్తున్న సంగతి విదితమే. తాజాగా పంకజ్‌గార్గ్, ఎం.పి.సింగ్ అనే వైద్యులపై కూడా పంచకులలోని ప్రత్యేక న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసింది. 2015లో జరిగిన అమానుషాలపై పంజాబ్, హరియాణా హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ పైమేరకు దర్యాప్తు జరిపింది.

# ఈ-కంటి కేంద్రాలు ప్రారంభం

- **ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఆస్పత్రులను బలోపేతం**

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో ఆస్పత్రులను బలోపేతం చేస్తున్నామని దీనివల్ల జవాబుదారీతనం పెరగడంతోపాటు వ్యయంచేసే ప్రతి పైసాకు ఫలితం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ- కంటి కేంద్రాల(టెలీ ఆప్తల్‌మాలజీ)ను ఆయన తన అధికారిక నివాసంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఆయన కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. 30 ఏళ్లు పైబడిన మహిళలందరినీ ఏడు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. ఇందుకోసం 1200 మంది ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి 'తల్లి సురక్ష' యాప్‌ను ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఏరియా ఆస్పత్రుల్లో ప్రారంభించనున్న 'ఎన్‌సీయూ' మినీ కేంద్రం నమూనాను పరిశీలించారు. ఈ కేంద్రాల ద్వారా శిశు మరణాలను అరికట్టేందుకు వీలవుతుంది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకు రూ.7.19 లక్షలను వ్యయం చేయనున్నారు. ఎంఎంఆర్, ఐఎంఆర్‌పై యూనిసెఫ్‌తో వైద్య ఆరోగ్య శాఖ ఒప్పందాన్ని కదుర్చుకుంది. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి వారు భాగస్వాములవుతున్నారు. జాతీయ స్థాయిలో ప్రమాణాలను పాటించిన విజయనగరం, రాజమండ్రి, అనకాపల్లి, ఒంగోలు ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ముఖ్యమంత్రి ప్రశంసాపత్రాలను అందచేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలను చెల్లించేందుకు రూ.4 కోట్లు, సీనియర్ రెసిడెంట్స్‌కు 7 కోట్ల రూపాయలను విడుదలచేస్తూ జీఓ జారీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలోనే జూనియర్ వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు.



రోగులకు అందచేసే కళ్లజోళ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### అమరావతి నిర్మాణంలో భాగస్వాములవుతాం

**ఈనాడు, అమరావతి:** అమరావతి నిర్మాణంలో తామూ భాగస్వాములవుతామని కొరియన్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు హామీ ఇచ్చింది. నిధులు సమకూర్చడంతోపాటు మౌలిక సౌకర్యాలు అభివృద్ధి చేసి ప్రపంచంలో పేరెన్నికగన్న సంస్థలను రాష్ట్రానికి వచ్చేలా చూస్తామని స్పష్టం చేసింది. బృందం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ ప్రతిపాదనలు వివరించింది. పుణెలో ఆకర్షణీయ నగరాన్ని అభివృద్ధి చేసిన ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోనూ స్మార్ట్‌సిటీ అభివృద్ధికి ఆసక్తి కనబరచింది. నిర్దిష్ట ప్రతిపాదనలతో వస్తే 15 రోజుల్లో భూకేటాయింపులు చేస్తామని సీఎం వారికి హామీ ఇచ్చారు. ఆస్ట్రియా సంస్థ ఆండ్రిజ్ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రిని కలిసి మత్స్య, హైడ్రోపవర్, మొక్కల పెంపకం, కాగితపు పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. కృష్ణా జిల్లా ఆరుగొలనులో యూరోపియన్ టెక్నాలజీతో ఆక్వాఫీడ్ ప్రాజెక్టు చేపట్టిన వైనాన్ని వివరించారు.

# సానుకూల దృక్పథంతో ఆలోచించాలి

- **నెక్కల్లులో విశ్వశాంతి కేంద్రం శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు**

**ఈనాడు డిజిటల్, అమరావతి:** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, సానుకూల దృక్పథంతో ఆలోచించినప్పుడే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ సంస్థ తుళ్లూరు మండలం నెక్కల్లులో ఏర్పాటుచేస్తున్న విశ్వశాంతి కేంద్రానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమరావతికి బ్రహ్మకుమారి ముఖ్య అధినేత్రి డాక్టర్ దాదీజానకి రావడం అదృష్టమని పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆనందమయ జీవితం గడిపేందుకు ఇక్కడి కేంద్రం ఆలంబన కావాలని ఆకాంక్షించారు. ఈసంస్థలో కొన్ని వేలమంది నిస్వార్థంగా సేవలందించడం గొప్ప విషయమని, మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తూ శక్తిమంతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అన్ని కేంద్రాలకు దీటుగా ఇక్కడి కేంద్రాన్ని నిర్మించాలని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఐటీ హబ్ నిర్మిస్తున్నపుడు ఎకరం స్థలంలో కంపెనీ పెట్టినట్టయితే వెయ్యి మందికి ఉద్యోగాలివ్వాలనే నిబంధన ఉన్నప్పటికీ 34 ఎకరాలను ఈ సంస్థకు కేటాయించామని గుర్తుచేశారు. అమరావతిలోనూ పదెకరాలు ఇచ్చామన్నారు. ఇక్కడ దాదాపు రెండువేల మంది ప్రేక్షకులు వీక్షించేలా ఆడిటోరియం, ఆధునిక సెమినార్ హాలు, మ్యూజియం, లేజర్‌షో, ధ్యానమందిరం, నివాసగృహాల సముదాయం నిర్మించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. తొలుత హెలికాప్టర్‌లో చంద్రబాబు సభాస్థలికి చేరుకున్నారు. కేంద్రం నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణకు ఏర్పాటు చేసిన హుండీలో చంద్రబాబు తొలి విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు, మంత్రులు పి.నారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, అయ్యన్నపాత్రుడు, నక్కా ఆనంద్‌బాబు, కలెక్టర్ కోన శశిధర్, చైతన్య తపోవనం వ్యవస్థాపకులు మాతా శివానంద సరస్వతి, బ్రహ్మకుమారిలు పాల్గొన్నారు.



తుళ్లూరు మండలం నెక్కల్లులో విశ్వశాంతి కేంద్రం శంకుస్థాపనలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మకుమారి ముఖ్య అధినేత్రి దాదీజానకి.. చిత్రంలో సభాపతి కోడెల, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, ఆనంద్‌బాబు

## తెలుగువర్సిటీ 2016 ప్రతిభా పురస్కారాలు

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** తెలుగు భాషా సాహిత్యం, సంస్కృతి, కళా ప్రక్రియల్లో సేవలందించిన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన గల సంఘం పురస్కారాలకు ఎంపిక చేసింది. కె.శ్రీనివాసరావు (పత్రికారంగం), వసంతరావు దేశ్‌పాండే (కథ/నవల), వేణు సంకోజు (కవిత్వం), నియోగి (విమర్శ), మాసురామ్ రవికాంత్ (చిత్రకళ), శివరామాచారి (శిల్పకళ), వనజా ఉదయ్ (నృత్యం), కె.ఎస్.ఆర్. బాలకృష్ణశాస్త్రి (సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు (నాటకరంగం), అంగళకుర్తి రామమూర్తి (జానపద కళలు), జి.ఎం.రామశర్మ (అవధానం), అయినంపూడి శ్రీలక్ష్మి (ఉత్తమ రచయిత్రి) తదితరులను పురస్కారాల కోసం ఎంపిక చేసినట్లుగా వర్సిటీ రిజిస్ట్రార్ వెల్లడించారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పురస్కారాలు ప్రదానం చేస్తారు.

## మహాశివరాత్రికి పట్టువస్త్రాల సమర్పణ

**ఈనాడు-అమరావతి:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి, శ్రీశైలం ఆలయాల్లో మంత్రి మాణిక్యాలరావు, కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో సభాపతి కోడెల శివప్రసాదరావు శివదేవునికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించి అవసరమైన నిధులు కేటాయిస్తూ దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ పేరును ఇక నుంచి దేవదాయ, ధర్మదాయశాఖగా మారుస్తూ మన్మోహన్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## రాజస్థాన్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

**జయపుర/కోల్‌కతా:** రెండు రాష్ట్రాల్లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌లోని మూడు లోక్‌సభ, రెండు అసెంబ్లీ స్థానాల్లో ఏ ఒక్క సీటునూ ఆ పార్టీ గెలుచుకోలేకపోయింది. రాజస్థాన్‌లో ఓడిపోయిన మూడు స్థానాలు... అజ్మేర్, అల్వార్ (లోక్‌సభ), మండల్‌గఢ్(అసెంబ్లీ) భాజపా సిట్టింగ్‌వే కావటం గమనార్హం. తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని రెండు సీట్లలో... ఉలుబేరియా (లోక్‌సభ), నొవాపరా (అసెంబ్లీ) ఓటమి ఎదురైనప్పటికీ సీపీఐ(ఎం)ను తృతీయ స్థానంలోకి నెట్టివేసి, భాజపా ద్వితీయ స్థానంలో నిలవటం గమనార్హం. కమలనాథులు తమ ఓట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకున్నారు. రాజస్థాన్‌లో మళ్లీ అధికారంలోకి రావాలని భావిస్తున్న కమలం పార్టీకి తాజా ఉప ఎన్నికల ఫలితాలు నిరాశ పర్చేవే. రాజ్‌పుత్‌లు గణనీయ సంఖ్యలో ఉన్న అజ్మేర్ లోక్‌సభా స్థానంలోనూ భాజపా అభ్యర్థి ఓటమిపాలు కావటం గమనార్హం. ఈ ఏడాది డిసెంబరులో ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో విపక్ష కాంగ్రెస్ గెలుపు ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నిలిపింది. ఈ విజయం తనకెంతో గర్వంగా ఉందంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ట్వీట్ చేశారు.

# తెలుగును మరిచిపోతే భవిష్యత్తు లేదు

- **సిలికాన్ ఆంధ్రా వర్సిటీ వార్షికోత్సవ సభలో మంత్రి లోకేశ్**

**ఈనాడు, అమరావతి:** తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు మరచిపోతే భవిష్యత్తు ఉండదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి లోకేశ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా గురువారం ఆయన కాలిఫోర్నియాలో సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మాట్లాడారు. అమెరికాకు వచ్చిన వారే ఎక్కువగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు పెట్టుకునేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. తెలుగు భాషపై అధ్యయనం కోసం ఒక వేదిక అవసరమని, ఇందుకోసం సిలికాన్ ఆంధ్రా సహకరించాలని మంత్రి కోరారు.



సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయ ప్రథమ వార్షికోత్సవ సభలో పాల్గొన్న మంత్రి లోకేశ్‌కు జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

కూచిపూడిపై ఏర్పాటుచేసే 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్'కు సిలికాన్ ఆంధ్రా సహకరించాలని సూచించారు.

**రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం:** పెట్టుబడుల కోసం నిర్వహించిన రోడ్డుషోలో భాగంగా 'బ్లాక్ చైన్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్'గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు సహకరించాలన్న మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై జనరల్ క్యాటలిస్ట్ మేనేజింగ్ డైరక్టర్ హేమంత్ తనేజా సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఫైబర్ గ్రిడ్‌ని ఉపయోగించుకొని 'వర్క్ ఫ్రం హోం' తరహా ప్రయోగాత్మక ప్రాజెక్టుని ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించేందుకు సుముఖంగా ఉన్నామని ఫస్ట్ అమెరికన్ కంపెనీ సీఈఓ డెన్నిస్ జే గిల్మోర్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కెన్త్ డిజియోర్జియో, చీఫ్ ఫైనాన్షియల్ ప్రెసిడెంట్ మార్క్ ఈ సీయాటన్ తెలిపారు. ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్టాన్‌ఫోర్డ్ బిజినెస్ స్కూల్ డీన్ జోనతాన్ లెవిన్ వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావుకు తులాభారం

## వనం నుంచి జనంలోకి సమ్మక్క

**ఈనాడు, మేడారం:** లక్షలాది భక్తులు ఆత్రుతగా ఎదురుచూస్తుండగా.. గిరిజన పూజారుల పూజలు, డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాల నడుమ.. సమ్మక్క తల్లి వనం నుంచి జనంలోకి తరలివచ్చింది. మేడారంలో గద్దెలపై కొలువై భక్తులకు దివ్యదర్శనం ఇస్తోంది. జాతర రెండో రోజైన గురువారం సమ్మక్కను చిలకలగుట్టపై నుంచి తీసుకొచ్చి తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. ఈ అద్భుత ఘట్టాన్ని గిరిజన పూజారులు గురువారం కనులపండువగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు కూడా అమ్మలను దర్శించుకున్నారు. తులాభారం వేసుకుని నిలువెత్తు బంగారం సమర్పించారు.

## పార్టీని బలోపేతం చేయాలి

### కమల శ్రేణులకు అధినేత దిశానిర్దేశం!

**ఈనాడు, దిల్లీ:** సంస్థాగతంగా బలోపేతానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీ నేతలకు భాజపా అధ్యక్షుడు అమిత్‌షా దిశానిర్దేశం చేశారు. పొత్తులు ఉంటాయా? ఉండవా? అన్న అంశంతో సంబంధం లేకుండా 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ పుంజుకోడానికి చర్యలు తీసుకోవాలని ఉద్బోధించినట్టు తెలిసింది. గురువారం రాత్రి దిల్లీలో నిర్వహించిన భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు, కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి, శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు, సంస్థాగత వ్యవహారాల కార్యదర్శి రవీంద్రరాజు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు రాంమాధవ్, మురళీధర్ రావు, సతీష్‌జీ, రాంలాల్ పాల్గొన్నారు. ప్రధానంగా 25 లోక్‌సభ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, బూత్‌కమిటీల విస్తరణ, మంచి వాగ్ధాటి ఉన్న అధికార ప్రతినిధుల నియామకం లాంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీనేత సతీష్‌జీ ఈనెల 10న విజయవాడ రానున్నారు. నియోజకవర్గాల పెంపు అంశం గురించి ఎక్కడా ప్రస్తావనేరాలేదు. సమావేశానంతరం కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ అధ్యక్షుడిని రాయలసీమకు ఆహ్వానించామని తెలిపారు. భాజపా, తెదేపా ఈరోజు మిత్రపక్షాలేనని, రెండూ కలిసే పనిచేస్తున్నాయని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై ఆంధ్రప్రదేశ్ తెదేపా నాయకులు అసంతృప్తి వ్యక్తంచేసిన విషయం ప్రస్తావనకు వచ్చిందన్నారు. ఇది దేశ బడ్జెట్ తప్పితే ఒక రాష్ట్రాన్ని దృష్టి పెట్టుకొని చేసిది కాదని అమిత్‌షా పేర్కొన్నట్లు తెలిపారు.

## గ్రూప్-1 మౌఖిక పరీక్షలకు 151 మంది ఎంపిక

**ఈనాడు, అమరావతి:** గ్రూప్-1(2016 నోటిఫికేషన్) ప్రధాన పరీక్షల ద్వారా మౌఖిక పరీక్షలకు 151 మందిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేసింది. వీరికి మార్చి 12 నుంచి 23వ తేదీ వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయి. అభ్యర్థులకు వ్యక్తిగత సమాచారాన్ని పంపుతామని ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కర్ శుక్రవారం తెలిపారు. రోజుకి 16 నుంచి 15 మంది అభ్యర్థులకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ నోటిఫికేషన్ ద్వారా 78 పోస్టులను భర్తీ చేస్తున్నారు.

# సీమలో హైకోర్టు సాధనకు నిరసనలు

- **కడప, కర్నూలులో ఆందోళన**

**కడప, కర్నూలు న్యూస్‌టుడే:** రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలంటూ కడప, కర్నూలు జిల్లాల్లో ఆందోళనలు కొనసాగాయి. కడపలో న్యాయవాదులు గురువారం జిల్లా కోర్టుకు తాళం వేసి రోడ్డుపై బైఠాయించారు. హైకోర్టును అమరావతిలో ఏర్పాటు చేసేందుకు తాత్కాలిక భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. అదే సమయానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు కోర్టుకు వచ్చారు. చివరకు వారందరూ రోడ్డుపైనే నిరీక్షించాల్సి వచ్చింది. కడప డీఎస్పీ మాసుంబాషా తన సిబ్బందితో కోర్టు వద్దకు చేరుకుని జిల్లా జడ్జితో చర్చించారు. వాహనదారులు అవస్థలను గమనించిన జిల్లా జడ్జి, డీఎస్పీలు న్యాయవాదులకు నచ్చజెప్పి గేటు తాళాలు తీయించారు. నిరసనలు జరుగుతున్నా అమరావతిలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు ఆకృతులు పరిశీలించడం దారుణమని కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మస్తాన్‌వల్లీ ఖండించారు. శుక్రవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించారు.

★ కర్నూలు నగరంలో ప్రజాసంఘాలు, న్యాయవాదుల సంఘం నాయకులు గురువారం మహా ర్యాలీ నిర్వహించారు. రాయలసీమ హైకోర్టు సాధన సమితి కో-కన్వీనర్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు వి.నాగలక్ష్మీదేవి మాట్లాడుతూ.. హైకోర్టు ఏర్పాటుపై స్పష్టత ఇవ్వకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



రోడ్డుపై నిరీక్షిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

# లక్ష్మీ ప్రసాద్‌కు 14 రోజుల రిమాండ్

- **రూ. 6 కోట్ల ఆస్తుల గుర్తింపు**

**విశాఖపట్నం, న్యూస్‌టుడే:** వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ గెడ్డాపు లక్ష్మీప్రసాద్‌కు అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అతణ్ని బుధవారం అరెస్టు చేయగా గురువారం న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అనిశా డీఎస్పీ రామకృష్ణ... లక్ష్మీప్రసాద్ నుంచి స్వాధీనం నుంచి చేసుకున్న బంగారు ఆభరణాలు, ఆస్తులకు సంబంధించిన దస్త్రావేజులు ప్రదర్శించారు. అతడు వాణిజ్య పన్నుల శాఖలో మొండిబకాయిల వసూలు విభాగంలో పనిచేస్తూ బకాయిలు చెల్లించని వ్యాపారులతో కుమ్మక్కై వారి నుంచి భారీగా లబ్ధిపొందారనేది ప్రధాన అభియోగమన్నారు. అతనికి, అతని కుటుంబ సభ్యులకు వాస్తవంగా ఆదాయం ప్రకారం ఆస్తి, ఖర్చులు కలుపుకున్నా రూ. 2.11 కోట్లు ఉండాలని... అయితే సుమారు రూ. ఆరు కోట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో మూడు, నాలుగు రెట్లు అధికంగా ఉంటుందన్నారు. శ్రీకాకుళం, గుంటూరు, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, విశాఖపట్నంలోని మధురవాడ, పెందుర్తి, అచ్యుతాపురంలో తన పేరిట, బంధువుల పేరిట ఆస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇంకా హైదరాబాదులో ఒక బ్యాంకు లాకర్ తెరవాల్సి ఉందన్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఒడ్డాణం

## సోనియాగాంధీ సారథ్యంలో ప్రతిపక్షాల సమావేశం


**దిల్లీ:** పార్లమెంట్ గ్రంథాలయ భవనంలో గురువారం నాడిక్కడ జరిగిన ప్రతిపక్ష పార్టీ నాయకుల సమావేశానికి యూపీఏ సారథి సోనియాగాంధీ సారథ్యం వహించారు. బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం, భాజపాపై దాడికి ఒక్కతాటిపైకి రావడానికి చేపట్టాల్సిన చర్యలను చర్చించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఎన్సీపీ సారథి శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత జయప్రకాశ్ నారాయణ్‌యాదవ్, టీఎంసీ ప్రతినిధి డెరెక్ ఓ బ్రెయిన్, సీపీఐ నాయకుడు డి.రాజా, సమాజ్‌వాది పార్టీ నాయకుడు రాంగోపాల్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్‌నేతలు అహ్మద్‌పటేల్, గులాంనబీ అజాద్, మల్లిఖార్జున ఖర్గే తదితరులు హాజరైనారు.

## పాత్రికేయులపై దాడుల నియంత్రణకు కమిటీ

**ఈనాడు, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో పాత్రికేయులపై దాడుల నియంత్రణకు హోంమంత్రి అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ స్వరూపం, ఎవరెవరు సభ్యులుగా ఉండాలో పేర్కొంటూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంక్షేమ నిధి కమిటీని ఏర్పాటు చేస్తూ మరో ఉత్తర్వును జారీ చేసింది.

## పోలవరంలో ప్రత్యేక నిధి పెంపు

**ఈనాడు-అమరావతి:** పోలవరం ప్రాజెక్టులో అత్యవసర పనుల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధిని రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్లకు పెంచుతూ జలవనరులశాఖ ఉత్తర్వులు ఇచ్చింది.



# బడ్జెట్ 2018-19

## భలే వేతనం

రాష్ట్రపతి నెల జీతం తాజాగా రూ. 5 లక్షలకు పెరిగింది. అలాగే ఉప రాష్ట్రపతి, గవర్నర్ల వేతనాలను పెంచుతూ.. లోక్‌సభలో సభ్యుల హర్షధ్వానాల నడుమ ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో ప్రకటన చేశారు. త్రివిధ దళాధిపతులు, అత్యంత ఉన్నతాధికారులతో పోలిస్తే ఇంతవరకు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్ల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. 2016 జనవరి 1న పే కమిషన్ అమలు తర్వాత దేశంలోని అత్యున్నత అధికారి జీతం రూ. 2.5 లక్షలు కాగా.. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు రూ. 2.25 లక్షల వేతనం పొందుతున్నారు. ఈ వ్యత్యాసాలను సరిదిద్దుతూ తాజాగా రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్ల వేతనాలను పెంచుతూ ప్రతిపాదించారు.

వేతనాలు (నెలకు రూ.లలో)

| | ఇంతవరకు.. | కొత్తగా |
|---|---|---|
| రాష్ట్రపతి | 1,50,000 | 5,00,000 |
| ఉపరాష్ట్రపతి | 1,25,000 | 4,00,000 |
| గవర్నర్ | 1,10,000 | 3,50,000 |

# అన్నదాత సుఖీభవ

- ఖరీఫ్ పంటలకూ మద్దతు ధర పెంపు
- రైతుల ఆదాయం రెట్టింపు దిశగా కీలక ముందడుగు
- సాగు రుణాలు రూ.11లక్షల కోట్లు
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా 22వేల సంతలు
- పాడి రైతులకూ కిసాన్ క్రెడిట్ కార్డులు
- వెదురు పరిశ్రమ ప్రోత్సాహానికి రూ.1290 కోట్లు
- పరిమళ పరిశ్రమలకు ఊతం
- సేంద్రియ బాటలో స్వయం సహాయక సంఘాలు
- పెద్ద క్లస్టర్లలో సేంద్రియ సాగుకు ప్రోత్సాహం
- పంట వ్యర్థాల సమస్య పరిష్కారానికి రాయితీపై యంత్రాలు

**దిల్లీ:** రైతులకు భారీ భరోసా లభించింది. వ్యవసాయ రంగం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వం పరిష్కారం దిశగా ముఖ్యమైన నిర్ణయాన్ని ప్రకటించింది. గిట్టుబాటు ధరల్లేక అల్లాడుతున్న రైతులకు ఉపశమనం కలిగించే చర్య చేపట్టింది. ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరను సాగు వ్యయం కన్నా కనీసం ఒకటిన్నర రెట్లు అధికంగా స్థిరపర్చనున్నట్లు వెల్లడించింది. రబీ పంటలకు ఇప్పటికే వర్తింప చేసిన ఈ సూత్రాన్ని తాజాగా ఖరీఫ్ పంటలకూ ప్రకటించడంతో దాదాపు పంటలన్నింటికీ గిట్టుబాటు ధర కల్పించినట్లయింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న మోదీ ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించే దిశగా ఇది కీలక ముందడుగు. వరి, జొన్న, సోయాబీన్, కంది వంటి పంటలు ఖరీఫ్ సాగులోకి వస్తాయి. కనీస మద్దతు ధర పెంపు సరిపోదని చెప్పిన ఆర్థిక మంత్రి జైట్లీ.. రైతుల పంటలకు తగిన ధర లభించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నీతిఆయోగ్ సంప్రదించి ఒక పకడ్బందీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సమస్యల సుడి నుంచి వ్యవసాయ రంగాన్ని ఒడ్డున పడేయడానికి ఇంకా పలు చర్యలను ప్రభుత్వం ప్రకటించింది.

- వ్యవసాయ రుణాల లక్ష్యం వచ్చే ఆర్థిక సంవత్సరానికి పదిశాతానికి అంటే రూ.11లక్షల కోట్లకు పెంపు.

రూ. కోట్లలో

| | |
|---|---|
| 2017-18 (అంచనా) | 56,992 |
| 2017-18 (సవరణ) | 56,589 |
| 2018-19(అంచనా) | 63,836 |

- త్వరగా పాడయిపోయే బంగాళదుంప (ఆలూ), టమాటా, ఉల్లి వంటి పంటల ధరల్లో అనూహ్య హెచ్చు తగ్గుల సమస్య పరిష్కారానికి 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో రూ.500 కోట్ల కేటాయింపు.
- కౌలు రైతులకు రుణ సౌకర్యం లభించేందుకు వీలుగా తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్న నీతి ఆయోగ్.
- ఔషధ, సుగంధ మొక్కల వ్యవస్థీకృత సాగుకు, సంబంధిత పరిశ్రమకు రూ.200 కోట్ల కేటాయింపు.
- వినియోగదారులకు రైతులు నేరుగా విక్రయించుకోవడానికి, టోకు కొనుగోళ్లకు వీలుగా 22 వేల గ్రామీణ సంతలు.. గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు(గ్రామ్స్)గా అభివృద్ధి.
- గ్రామ్స్, 585 మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.2000 కోట్లతో నిధి ఏర్పాటు. మార్కెట్ కమిటీల నిబంధనల నుంచి గ్రామ్స్‌కు మినహాయింపు.
- మత్స్య, పశుపాలన రైతుల పెట్టుబడి అవసరాలు తీర్చడానికి కిసాన్ క్రెడిట్ కార్డుల సౌకర్యం. వీరికీ వడ్డీ రాయితీ ప్రయోజనం. ఈ రెండు రంగాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.10వేల కోట్లు.
- ఆకుపచ్చ బంగారమైన వెదురు రంగాన్ని సమగ్రంగా ప్రోత్సహించేందుకు రూ.1290 కోట్లతో పునర్వ్యవస్థీకరించిన జాతీయ వెదురు కార్యక్రమం ప్రారంభం. అటవీయేతర భూముల్లో పెంచే వెదురుకు చెట్ల నిర్వచనం నుంచి మినహాయింపు.
- పెద్ద క్లస్టర్లలో సేంద్రియ సాగు చేసే ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ(ఎఫ్‌పీఓ)లు, గ్రామీణ ప్రొడ్యూసర్ సంస్థ(వీపీఓ)లకు ప్రోత్సాహం.
- జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా సేంద్రియసాగు చేసేలా ప్రోత్సాహం.
- పరిమళ ద్రవ్యాలు, సుగంధ నూనెలు, సంబంధిత ఇతర ఉత్పత్తులు తయారు చేసే చిన్న, కుటీర పరిశ్రమలకు సహాయం.
- వాయు కాలుష్యంతో సతమతమవుతున్న హరియాణ, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీకి తోడ్పాటు నందించడానికి, పంట వ్యర్థాల సమస్య పరిష్కారం కోసం అవసరమయ్యే యంత్రాలను రాయితీపై అందించడానికి ప్రత్యేక పథకం.

## రైతుకు 'మద్దతు' అరకొరే!

పంట ధరలు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతుంటాయి. చెమటోడ్చి పండించిన పంట- అమ్మటానికి వచ్చేసరికి ధర పలక్కపోతే రైతు కుంగిపోతాడు. అందుకే ఏటా రైతుల ఉత్పత్తులకు ప్రభుత్వం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటిస్తుంది.



- **మద్దతు ధర అంటే:** ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా మార్కెట్ ధరలు పడిపోయినప్పుడు సేకరణ సంస్థలు బరిలో దిగి తామే పంటల్ని సేకరిస్తాయి. ఖరీఫ్, రబీ, చెరకు, ముడి జనుము, కొబ్బరి.. ఇలా మొత్తం పంటలన్నింటినీ 5 విభాగాలుగా వర్గీకరించి మద్దతు ధర ప్రకటిస్తారు.
- **సేకరణ:** భారత ఆహార సంస్థ, జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ ఫెడరేషన్. వరి, గోధుమ సేకరిస్తారు. మిగతా పంటలు అంతగా పట్టించుకోవు.
- **అమలు:** పంటలను ప్రభుత్వానికి అమ్ముతున్న రైతులు 5.8%
- నిధుల కొరత వల్ల కొన్ని రాష్ట్రాలు పంటలను మద్దతు ధరకు సేకరించటం లేదు. ప్రైవేటులో అమ్మే వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు.

**నాలుగేళ్లలో ప్రధాన పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు**

(క్వింటాలుకు రూ.లలో)...

| పంట | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 |
|---|---|---|---|---|
| వరి (సాధారణ) | 1360 | 1410 | 1470 | 1550 |
| వరి (గేడ్-ఏ) | 1400 | 1450 | 1510 | 1590 |
| గోధుమ | 1450 | 1525 | 1625 | 1735 |
| పత్తి | 4050 | 4100 | 4160 | 4320 |
| జొన్న (హైబ్రీడ్) | 1530 | 1570 | 1625 | 1700 |
| మొక్కజొన్న | 1310 | 1325 | 1365 | 1425 |
| కంది | 4350 | 4625 | 5050 | 5450 |
| మినుము | 4350 | 4625 | 5000 | 5400 |
| పెసలు | 4600 | 4850 | 5225 | 5575 |
| వేరుసెనగ | 4000 | 4030 | 4220 | 4450 |
| పొద్దు తిరుగుడు | 3750 | 3800 | 3950 | 4100 |
| చెరకు | 230 | 230 | 255 | - |



**చాలని మద్దతు**

పంట సాగు కోసం రైతులకు అయ్యే వాస్తవ ఖర్చు కంటే కూడా మద్దతు ధర ఎప్పుడూ తక్కువగానే ఉంటోంది.

(క్వింటాలు)

**కంది**
మద్దతు ధర: రూ.5450
వాస్తవ ఖర్చు: రూ.7000

**పత్తి**
మద్దతు ధర: రూ.4320
వాస్తవ ఖర్చు: రూ.5300

**వరి**
మద్దతు ధర: రూ.1550
వాస్తవ ఖర్చు: రూ.1850

**మద్దతు లేని పంటలు**
మిర్చి, పొగాకు, శనగ, వాము, ఉద్యానపంటలు

## మద్దతు ఉంటుందా!

**ఈనాడు, హైదరాబాద్:** పంటలను మద్దతు ధరకు కొంటారా లేదా.. కొంటే ఎంతమేరకు కొంటారనే అంశాలపై కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత రాలేదు. 'మార్కెట్ జోక్యం పథకం-మద్దతు ధర పథకం'(ఎంఐఎస్-పీఎస్ఎస్) అనే రెండు రకాల పథకాల పేరుతో ఇప్పటివరకూ కేంద్రం పంటలను కొంటోంది. వీటికి 2018-19కి రూ.200 కోట్లనే కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.950 కోట్లకన్నా బాగా తగ్గించింది. రెండు పథకాలను కలిపి వచ్చే ఏడాదినుంచి 'మార్కెట్ హామీ పథకం'(ఎంఏఎస్) పేరుతో కొత్తదాన్ని తెస్తామని ఇటీవల రాష్ట్రాల మార్కెటింగ్ శాఖల అధికారులతో కేంద్ర వ్యవసాయశాఖ చర్చలు జరిపింది. ఇది అమల్లోకి వస్తే మద్దతు ధర జాబితాలో ఉండే 23 రకాల పంటలను రాష్ట్రాలే సొంత నిధులతో తొలుత కొనాలి. వాటిని తిరిగి అమ్ముకున్నపుడు నష్టమొస్తే, ఆసొమ్ములో 40 శాతం ఇస్తామని కేంద్రం ప్రతిపాదించింది.

### అంగీకరించని తెలుగు రాష్ట్రాలు

ఈపథకానికి తెలుగు రాష్ట్రాలు అంగీకరించడం లేదు. పంటలు తిరిగి అమ్మినపుడు పెద్దగా నష్టాలు రావన్న ఉద్దేశంతోనే బడ్జెట్‌లో రూ.200 కోట్లనే కేటాయించి ఉండవచ్చని తెలుగు రాష్ట్రాల మార్కెటింగ్ అధికారవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నష్టపోయిన సొమ్ములో 55శాతం ఇస్తే సిద్ధమని పలు రాష్ట్రాలు తెలిపాయి. కేంద్రం దీనికింకా అంగీకరించలేదు. మరోవైపు వ్యవసాయ మార్కెట్లను ఆన్‌లైన్ వేదికలోకి తెచ్చి ఆన్‌లైన్ కొనుగోళ్లను పెంచేందుకు రూ.1050 కోట్లను కేంద్రం కేటాయించింది. వీటితో దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లను ఆధునికీకరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామంది.

### హరియాణ పథకం.. ఇక దేశమంతా!

వచ్చే ఏడాది నుంచి ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, టమాటాలకు కనీసధర ఇచ్చేలా కొత్తగా 'ఆపరేషన్ గ్రీన్స్' అనే కొత్త పథకాన్ని అమలు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. జనవరి ఒకటోతేదీ నుంచి 4 రకాల పంటలకు హరియాణలో ఇలాంటి పథకాన్నే అక్కడి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అందులో ఒక పంటను తగ్గించి 3పంటలను కేంద్రం 'ఆపరేషన్ గ్రీన్స్'ను ప్రకటించింది. కేంద్రం ప్రకటించే మద్దతు ధరల జాబితాలో లేని ఇతర పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు హరియాణ ప్రభుత్వం 'భవంతర్ బర్పాయి యోజన'(బీబీవై) పథకాన్ని గతనెల 1నుంచి అమలు చేస్తోంది. పైలెట్ ప్రాజెక్టు కింద టమాటా, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, క్యాలీఫ్లవర్ పంటలను దీని అమలుకు ఎంపిక చేశారు.

## అనుసంధానం.. నీటిమీద రాతే!

**ఈనాడు, హైదరాబాద్:** నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం పదే పదే ప్రకటిస్తున్నా ఆ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. ఎప్పట్లాగే ఈ కార్యక్రమంపై అధ్యయనానికి, సమగ్ర ప్రాజెక్టు నివేదికల(డీపీఆర్) తయారీకే నిధులు కేటాయించిన కేంద్రం.. అనుసంధానానికి 2018-19కి కేవలం రూ.కోటి కేటాయించింది.

గత ఒకటిన్నర దశాబ్దకాలంగా నదుల అనుసంధానంపై చర్చ జరుగుతోంది. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దీనిపై ప్రత్యేక నిపుణుల కమిటీ ప్రతి రెండు నెలలకోసారి రాష్ట్రాల అధికారులతో చర్చలు జరుపుతోంది. కేంద్ర జలవనరులశాఖ గత మంత్రి ఉమాభారతి, ప్రస్తుత మంత్రి గడ్కరీ తరచూ నిపుణులతో సమావేశమవుతూ వస్తున్నారు.

**అన్ని అనుమతులు వచ్చినా?:** నదుల అనుసంధానాల్లో మొదటిది కెన్-బెట్వా ప్రాజెక్టు. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల మధ్య ఉండే ఈ నదుల అనుసంధానికి అనుమతులు వచ్చాయి. గత ఆర్నెల్లుగా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు అనుమతి కోసం ఎదురు చూస్తోంది. దీని పనులను ప్రారంభించబోతున్నామంటూ కేంద్రం ఎప్పటికప్పుడు చెబుతూ వస్తోంది. ఇక ఒడిశాతోపాటు.. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి తొమ్మిది అనుసంధాన ప్రాజెక్టులు ప్రతిపాదిత దశలో ఉన్నాయి. మహానది నుంచి నీటిని మళ్లించడానికి ఒడిశా అంగీకరించకపోవడంతో తెలంగాణలో గోదావరి నుంచి కృష్ణా-పెన్నా-కావేరి నదులను మొదట అనుసంధానించాలని నిర్ణయించిన కేంద్రం ఇందుకు సంబంధించి నివేదిక కూడా సిద్ధం చేసింది. ధవళేశ్వరం నుంచి గోదావరి-పెన్నా నదులను అనుసంధానం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ముందుకొచ్చింది. కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్ ఇప్పటికే డీపీఆర్ సిద్ధంచేసింది. ఈ కార్యక్రమానికి ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా.. బడ్జెట్‌లో రూ.కోటి కేటాయించడం గమనార్హం.

**ఆ సారీ అధ్యయనంతో సరి:** ప్రస్తుత బడ్జెట్‌లో గత రెండేళ్ల తరహాలోనే అధ్యయనానికి, నివేదికల తయారీకిగానూ జాతీయ జల అభివృద్ధి సంస్థకు రూ.225 కోట్లు కేటాయించారు. ఈ సంస్థ డీపీఆర్‌ల తయారీకే పరిమితం. పనులతో దానికి సంబంధం లేదు. కేటాయింపుల ఆధారంగా చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఈ కార్యక్రమం అధ్యయనాలకే పరిమితమవబోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఫసల్ బీమా రైతుకు ధీమా

**రైతుకు కష్ట కాలం:** వర్షాభావం, కరవులు, వరదలు, చీడపీడలు, దావానలం, పిడుగుపాటు, సుడిగాలులు, మొ॥

**గతంలో**

పంట నష్టంలో రైతును ఆదుకునేందుకు 1999లోనే జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్ఏఐఎస్) తెచ్చారు. 2011లో దాన్ని కొంత సవరించారు కూడా. కానీ వాటి వల్ల రైతుకు ఒరిగింది లేదు. 'రిస్క్ కవరేజీ' తక్కువుండటం వల్ల రైతులు దీనివైపు పెద్దగా మొగ్గుచూపలేదు.


**ఇప్పుడు**

కష్టనష్టాల్లో ఉన్న రైతును సమర్థవంతమైన బీమాతో ఆదుకునేందుకు మోదీ సర్కారు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) తెచ్చింది.

**ప్రత్యేకతలు**

- ప్రీమియంపై పరిమితి ఎత్తేశారు.
- రైతు బీమా చేసిన మొత్తంపై ఖరీఫ్ పంటలకు 2%, రబీ పంటలకు 1.5%, ఉద్యాన, వాణిజ్య పంటలకు 5% ప్రీమియం చెల్లిస్తారు.
- ప్రీమియం అంతకన్నా ఎక్కువుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దీంతో ఈ బీమాకు ఆదరణ బాగా పెరిగింది.

**గత మూడేళ్లలో పంటల బీమా తీరు ఇలా..(రూ.కోట్లలో..)**




| అత్యధిక క్లెయిమ్‌లు పొందిన 3 రాష్ట్రాలు | 2014-15 | 2015-16 | 2016-17 |
|---|---|---|---|
| | మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్ | మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్ | మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక |




2016-17లో వసూలు చేసిన ప్రీమియం రూ.22,437 కోట్లు

2017 జులై నాటికి రైతులు క్లెయిమ్ చేసింది: రూ.8,087.23 కోట్లు.

2017 ఆగస్టు నాటికి (పాత వాటితో సహా) మొత్తం క్లెయిమ్‌లు: రూ.15,100 కోట్లు.

బీమా కంపెనీలు ఆమోదించింది: రూ.9,446 కోట్లు.

2016-17లో మొత్తం పంటల్లో రైతులు బీమా చేసింది
దేశవ్యాప్తంగా 26%
తెలంగాణలో 15%, ఏపీలో 22%

**తెలంగాణలో**
2016 ఖరీఫ్‌లో ప్రీమియం వసూలు : రూ. 190 కోట్లు
క్లెయిమ్‌లు : రూ. 153 కోట్లు

**ఆంధ్రప్రదేశ్‌లో**
ప్రీమియం వసూలు : రూ. 977 కోట్లు
క్లెయిమ్‌లు : రూ. 649 కోట్లు

## వ్యవసాయం ఇలా..



దేశంలోని రైతుల్ని ఆదుకునేందుకు కేంద్రం వివిధ పథకాల్ని అమలుచేస్తోంది. రాయితీల్ని కల్పిస్తోంది. రైతు సంక్షేమం కోసం రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తోంది.

**వ్యవసాయ శాఖలో పథకాలు...**

- సుస్థిర వ్యవసాయ జాతీయ మిషన్
- రాష్ట్రీయ కృషి వికాస్ యోజన
- ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన
- జాతీయ ఆహార భద్రత మిషన్
- వ్యవసాయ విస్తరణ, సాంకేతిక మిషన్
- నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్
- పరంపరాగత కృషి వికాస్ యోజన
- ప్రధానమంత్రి కృషి సించాయి యోజన

**ఉద్యాన శాఖలో పథకాలు...**

- ఉద్యానాభివృద్ధి మిషన్
- నూనె గింజలు, ఆయిల్‌పామ్ మిషన్
- రాష్ట్రీయ కృషి వికాస యోజన
- ప్రధానమంత్రి కృషి వికాస యోజన

**ఆంధ్రప్రదేశ్‌లో నిధుల కేటాయింపు, ఖర్చు తీరు(రూ.కోట్లలో)**

ఉద్యాన పంటలకు...

| వివరం | బడ్జెట్ అంచనా | విడుదల, ఖర్చు |
|---|---|---|
| కేంద్రం | 423.79 | 418.49 |
| రాష్ట్రం | 584.40 | 477.74 |

వ్యవసాయ పంటలకు... (రూ. కోట్లలో)

| వివరం | బడ్జెట్ అంచనా | విడుదల | ఖర్చు |
|---|---|---|---|
| కేంద్రం | 685 | 543 | 540 |
| రాష్ట్రం | 457 | 362 | 360 |

## పంటల బీమాకు తక్కువే!

**ఈనాడు, హైదరాబాద్:** పంటలబీమా పథకాల అమలుకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెద్దగా లేదు. 2018-19కి రూ.13 వేల కోట్లు కేటాయించింది. ప్రధాన మంత్రి పంటల బీమా పథకం(పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమా(డబ్ల్యుబీసీఐ) పథకం పేరుతో 2రకాలుగా అమలు చేస్తున్నారు. కేంద్రం విధించిన లక్ష్యాలకు తెలుగు రాష్ట్రాలు దూరంగా ఉండటంతో తక్కువగా నిధులు రానున్నాయి. పీఎంఎఫ్‌బీవై కింద వరి ఎకరానికి తెలంగాణలో రూ.25 వేలు విలువగా నిర్ణయించి బీమా చేయించాలి. పీఎంఎఫ్‌బీవై పథకంలో ఖరీఫ్‌లో 2, రబీలో 1.5 శాతమే రైతు చెల్లిస్తారు. అంతకన్నా ఎక్కువున్న సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. ఇందుకు 2018-19కి కేంద్రం వాటాగా పీఎంఎఫ్‌బీవై పథకానికి రూ.13 వేల కోట్లు అవసరం కావచ్చుని కేటాయించారు.

2016-17 బడ్జెట్‌లో పీఎంఎఫ్‌బీవై పథకానికి రూ.5500 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈ సొమ్ముతో దేశవ్యాప్తంగా 30 శాతం విస్తీర్ణానికి బీమా చేయించాలన్నది లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 10శాతం విస్తీర్ణానికే రైతులు బీమా ప్రీమియం కట్టారు. దేశమొత్తమ్మీద 30 శాతం విస్తీర్ణానికి రైతులు ప్రీమియం కట్టారని ఇందుకోసం చివరికి రూ.13,240 కోట్లు సవరించిన 2016-17 బడ్జెట్‌లో ఇచ్చినట్లు కేంద్రం వెల్లడించింది. దీన్నిబట్టి 30 శాతం విస్తీర్ణానికి రైతులు ప్రీమియం కట్టి బీమా చేయిస్తేనే రూ.13,240కోట్లు అవసరమని తేలింది. 2018-19లో 50శాతం విస్తీర్ణం పంటలకు రైతులు ప్రీమియం చెల్లించేలా చూసి బీమా పరిధిలోకి తేవాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

### బిందుసేద్యానికి రూ.4 వేల కోట్లు

సాగునీటిని పొదుపుగా వాడుతూ పంటల ఉత్పాదకత పెంచేందుకు రూ.4 వేల కోట్లను కేంద్రం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్లో బిందుసేద్యం పరికరాల ఏర్పాటుకు నిధులు వెచ్చిస్తారు. ప్రధానమంత్రి కృషి సించయి యోజన(పీఎంకేఎస్‌వై) పథకంలో ఈ నిధులు కేటాయించింది. వీటినుంచి తెలుగు రాష్ట్రాలకు తగినంగా వచ్చే అవకాశాలున్నాయి. కేంద్రం నుంచి రూ.250 కోట్లు బిందుసేద్యానికి వస్తాయని తెలంగాణ ఉద్యానశాఖ తెలిపింది. ఏపీకి ఇలాగే రావచ్చుని భావిస్తున్నారు.

## దేశంలో కీలక బడ్జెట్లు

**1951(ఫిబ్రవరి 28న)**

ప్రవేశపెట్టింది: జాన్ మథాయ్




గణతంత్ర భారత తొలి బడ్జెట్ ఇది. పేదరిక నిర్మూలన లక్ష్యంగా రూపొందించారు.

- ప్రణాళిక సంఘం ఏర్పాటు చేయాలన్న కీలక నిర్ణయం ఈ బడ్జెట్‌లోనే వెలువడింది.

**1968(ఫిబ్రవరి 29న)**

ప్రవేశపెట్టింది: మొరార్జీ దేశాయ్



పూర్తిగా ప్రజాకోణంలో రూపొందించిన బడ్జెట్ ఇది.

- వస్తు ఉత్పత్తులపై ఎక్సైజ్ విభాగం మదింపు విధానానికి ముగింపు పలికి... స్వీయ మదింపు విధానానికి రూపకల్పన చేశారు.

**1973(ఫిబ్రవరి 28న)**

ప్రవేశపెట్టింది: వైబీ చవాన్



దీన్ని బ్లాక్ బడ్జెట్‌గా అభివర్ణిస్తారు.

- బొగ్గు గనులు, సాధారణ బీమా సంస్థలు, భారత రాగి సంస్థ జాతీయం చేసేందుకు రూ.56 కోట్లు కేటాయించారు. రూ.550 కోట్ల భారీ బడ్జెట్ లోటుగా పేర్కొన్నారు.

**1986(ఫిబ్రవరి 28న)**


ప్రవేశపెట్టింది: విశ్వనాథ్ ప్రతాప్ సింగ్



కొన్ని వరాలు, మరికొన్ని భారాలతో రూపొందించిన ఈ బడ్జెట్‌ను "ది క్యారెట్ అండ్ స్టిక్ బడ్జెట్"గా పేర్కొంటారు.

- మోడ్‌వ్యాట్‌ను మొట్టమొదటసారిగా అమల్లోకి తెచ్చారు. పన్ను ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అధికారాలు పెంచారు.

# బడ్జెట్ 2018-19



**ప్రజా ప్రతి నిధి**

పార్లమెంటేరియన్లకు తీపి కబురు.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఎంపీల మూల (బేసిక్) వేతనం రెట్టింపు కానుంది. ప్రస్తుతం ఉన్న రూ. 50 వేల నుంచి అది రూ. లక్షకు పెరగనుంది. వివిధ పద్దుల కింద వారికి అందజేసే భత్యాలు కూడా పెరగనున్నాయి. అలాగే జీతభత్యాలు ప్రతి ఐదేళ్లకోసారి సహజంగా మార్పుచేసే విధానాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న విధానం చర్చనీయాంశమవుతున్న నేపథ్యంలో.. ఎలాంటి విమర్శలకు తావు లేని రీతిలో ద్రవోల్బణ సూచికి అనుగుణంగా జీతభత్యాలను నిర్ణయించేలా సూచించారు. ఈమేరకు ఎంపీల వేతనాలు, నియోజకవర్గ భత్యాలు, కార్యాలయ ఖర్చులు, ఇతర భత్యాలకు సంబంధించి అవసరమైన మార్పులు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం మూల వేతనం, నియోజకవర్గ భత్యం(రూ. 45 వేలు) తదితరాలన్నీ కలిపి ప్రభుత్వం ఒక్కో ఎంపీపై నెలకు సుమారు రూ. 2.7 లక్షలు వెచ్చిస్తోంది.

# ఆరోగ్య విధాత

- ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం ప్రకటన
- పేద కుటుంబానికి ఏటా రూ.5లక్షల మేర కవరేజీ
- 50 కోట్ల మంది పేదలకు ప్రయోజనం

**దిల్లీ:** ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో మంచి ప్రాధాన్యం లభించింది. పేదల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 10 కోట్ల కుటుంబాలకు దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది. ఆసుపత్రుల్లో చికిత్సల కోసం ఆస్తులను తెగనమ్ముకోవాల్సిన పరిస్థితిని నివారించడమే దీని ఉద్దేశం. ఆరోగ్య భారత్‌తోనే సుభిక్ష భారత్ సాధ్యమన్న స్ఫూర్తికి అనుగుణంగా ఈ రంగానికి కేటాయింపులను ప్రభుత్వంలో పెంచింది.

'ఆయుష్మాన్ భారత్' కింద రెండు ప్రధాన పథకాల ప్రకటన. ఇందులో మొదటిది.. జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్). దీని కింద మధ్యస్థాయి, ఉన్నతస్థాయి ఆసుపత్రిల్లో చేరి, చికిత్స పొందడానికి కుటుంబానికి ఏడాదికి రూ. 5లక్షల వరకూ కవరేజీ లభిస్తుంది. 50 కోట్ల మంది లబ్ధి పొందుతారని అంచనా. ప్రపంచంలో ప్రభుత్వ నిధులతో నడిచే ఆరోగ్య పథకాల్లో ఇదే అతిపెద్దది. ప్రస్తుత 'రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన' కింద పేద కుటుంబాలకు వార్షిక కవరేజీ రూ. 30వేల మేర మాత్రమే లభిస్తోంది.

- ఇక రెండో పథకం.. ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు. భారత ఆరోగ్య వ్యవస్థకు ఈ కేంద్రాలే పునాది అని జాతీయ ఆరోగ్య విధానం-2017 చెబుతోంది. అందువల్ల ఈ విధానానికి రూ. 1200 కోట్ల కేటాయింపు. ఈ సొమ్ము.. 1.5 లక్షల ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలకు అందుతుంది.
- ఈ కేంద్రాలు అంటువ్యాధులు కాని రోగాలు, ప్రసూతి, శిశు ఆరోగ్య పరిరక్షణ సేవలు సహా సమగ్ర ఆరోగ్య పరిరక్షణను అందిస్తాయి. అవసరమైన ఔషధాలు, రోగ నిర్ధారణ సేవలనూ అక్కడ పొందొచ్చు.
- కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఈ కేంద్రాలను దత్తత తీసుకోవాలని ప్రైవేటు సంస్థలు, దాతృత్వ సంస్థలకు విజ్ఞప్తి.
- ప్రాథమిక, మధ్యస్థాయి, ఉన్నతస్థాయి ఆరోగ్య పరిరక్షణలో సమూల చర్యలు తీసుకోవడం ఈ రెండు పథకాల ఉద్దేశం. వీటి వల్ల 'నవీన భారత్-2022' ఆవిష్కృతమవుతుంది. ఉత్పాదకత, స్వస్థతను ఇవి పెంచుతాయి. వేతన నష్టాన్ని నివారిస్తాయి. పేదరికంలోకి జారిపోకుండా చూస్తాయి. లక్షల ఉద్యోగాలను సృష్టిస్తాయి. మొత్తం మీద సార్వత్రిక ఆరోగ్య కవరేజీ లక్ష్యం దిశగా ప్రభుత్వం క్రమంగా అడుగులు వేస్తోంది.

| | | రూ. కోట్లలో |
|---|---|---|
| 2017-18 (అంచనా) | 48,878 | |
| 2017-18 (సవరణ) | 53,198 | |
| 2018-19(అంచనా) | 54,667 | |

- నాణ్యమైన వైద్య విద్య, ఆరోగ్య పరిరక్షణ లభ్యతను పెంచేందుకు.. దేశంలో ప్రస్తుతమున్న జిల్లా ఆసుపత్రుల స్థాయిని పెంచడం ద్వారా కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ఏర్పాటు చేస్తారు.
- దీనివల్ల ప్రతి రాష్ట్రంలోనూ మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు కనీసం ఒక్కటి చొప్పున్నైనా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడుతుంది.
- ఇతర అంటువ్యాధుల కన్నా క్షయతో ఏటా ఎక్కువ మరణాలు చోటుచేసుకుంటున్నాయి. పేదలు, పోషకాహార లోపం ఉన్నవారే దీనికి ఎక్కువగా బాధితులవుతున్నారు. అందువల్ల క్షయ వ్యాధిగ్రస్థులందరికీ.. చికిత్స కాలంలో నెలకు రూ. 500 చొప్పున అందిస్తారు. ఇందు కోసం బడ్జెట్‌లో రూ. 600 కోట్లు కేటాయింపు.

### నగదు రహిత పథకం

'మోదీకేర్'గా వ్యవహరిస్తున్న ఎన్‌హెచ్‌పీఎస్ గురించి కేంద్ర వ్యయశాఖ కార్యదర్శి ఎ.ఎన్. ఝా విలేఖరులకు వివరించారు. 2018-19లో ఈ పథకం కోసం తాత్కాలికంగా రూ. 2వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. దీని తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో కసరత్తు చేశాక, తదుపరి కేటాయింపులు జరుగుతాయన్నారు. "ఇది నగదు రహిత పథకం. ప్రస్తుతమున్న ఆర్ఎస్‌బీవైను పునర్వ్యవస్థీకరించి దీన్ని తెస్తున్నాం. ఈ పథకం నిర్వహణ కోసం వివిధ నమూనాలను పరిశీలిస్తున్నాం. ట్రస్టు నమూనాలో నడపాలా? బీమా నమూనాలో నిర్వహించాలా అన్నది పరిశీలిస్తున్నాం" అని చెప్పారు. ఈ పథకాన్ని ఎప్పటి నుంచి ఆరంభిస్తారన్నది ఆయన నిర్దిష్టంగా వెల్లడించలేదు. ఏప్రిల్ 1 నుంచి నిధులు అందుబాటులో ఉంటాయన్నారు.

## ఆంధ్రప్రదేశ్: ఆరోగ్యానికి రూ.644 కోట్లు

వైద్య, ఆరోగ్యశాఖలో నిర్దేశించిన పథకాలు, కార్యక్రమాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల్ని విడుదల చేస్తున్నాయి. కేంద్ర వాటా 60%, రాష్ట్ర వాటా 40% ఉంటుంది. ఏపీ వైద్య, ఆరోగ్య శాఖకు కేటాయింపులు. (రూ. కోట్లలో)

| అంశం | కేంద్రం కేటాయింపులు | రాష్ట్ర ప్రభుత్వ మంజూరు | వాటా | విడుదల |
|---|---|---|---|---|
| మాతా శిశు ఆరోగ్యం | 100.27 | 90.24 | 60.16 | 50.13 |
| ఆరోగ్య రంగ బలోపేతం | 260.44 | 234.39 | 156.26 | 130.22 |
| టీకాలు | 7.23 | 6.51 | 4.34 | 3.61 |
| పల్స్ పోలియో | 11.86 | 10.67 | 7.11 | 5.93 |
| అయోడిన్ | 0.31 | 0.28 | 0.19 | 0.00 |
| అంటువ్యాధులు | 37.55 | 21.07 | 12.16 | 10.93 |
| జీవనశైలి వ్యాధులు | 30.23 | 22.67 | 15.11 | 13.61 |
| జాతీయ పట్టణ ఆరోగ్యం | 149.73 | 183.59 | 15.99 | 74.88 |
| మౌలిక సదుపాయాలు | 149.73 | 183.59 | 74.88 | 74.88 |
| | 644.40 | 611.52 | 345.80 | 303.34 |


## ప్రత్యేక హోదా పారిశ్రామిక ప్రయోజనం

**ఈనాడు, దిల్లీ:** దేశంలో ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాల్లోని పారిశ్రామిక యూనిట్లకు 2018-19 బడ్జెట్‌లో పన్ను, ఇతరత్రా ప్రోత్సాహకాల కింద రూ. 2,573 కోట్ల ప్రయోజనం కలుగనుంది. ప్రత్యేకహోదా ఉన్న జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు వడ్డీరాయితీ కింద రూ. 145 కోట్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కలిపి రూ. 100 కోట్లు ఇచ్చారు. ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాలకు జీఎస్‌టీ రీఫండ్ కింద రూ. 1,500 కోట్లు ప్రయోజనం కలుగనుంది. ఈశాన్యరాష్ట్రాల పారిశ్రామిక, పెట్టుబడి ప్రోత్సాహక విధానం కింద రూ. 528 కోట్లు, సరుకు రవాణా సబ్సిడీ కింద రూ. 400 కోట్లు దక్కనుంది. ఇవే అంశాల కింద 2017-18 బడ్జెట్‌లో ఈ రాష్ట్రాలకు రూ. 2,937 కోట్ల ప్రయోజనం దక్కింది.

## దేశ రాజధానికి ఉపశమనం!

**కాలుష్య నియంత్రణకు ప్రత్యేక పథకం**

- పర్యావరణ మంత్రిత్వశాఖకు కేటాయింపులు: రూ.2,675.42 కోట్లు
- దిల్లీలో కాలుష్యం నియంత్రణకు ప్రత్యేక పథకం తీసుకురానున్నారు. కాలుష్యానికి కారణమవుతున్న హర్యానా, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోని పంటల వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు అవసరమైన యంత్రాలను ఆయా రాష్ట్రాలకు రాయితీపై ఇవ్వనున్నారు. ఈ పథకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 20 కోట్లు కేటాయించారు.
- 'ప్రాజెక్ట్ టైగర్'కు రూ. 350 కోట్లు; 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్'కు రూ. 30కోట్లు కేటాయించారు.
- జాతీయ అటవీకరణ పథకానికి రూ. 160 కోట్లు కేటాయించారు.






బడ్జెట్ సందర్భంగా గురువారం పార్లమెంట్ వద్ద కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ సతీమణి సంగీత

## మైనార్టీ శాఖకు 4,700 కోట్లు

**భోపాల్:** మైనార్టీల వ్యవహారాల శాఖకు ఈసారి కేంద్రం రికార్డు స్థాయిలో కేటాయింపులను పెంచినట్లు ఆ శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ అన్నారు. 2017-18లో రూ. 4,197 కోట్లుగా ఉన్న కేటాయింపులను.. ఈసారి రూ. 4,700 కోట్లు చేసినట్లు వివరించారు. మైనార్టీల ఆర్థిక, విద్య, సామాజిక అభివృద్ధికి ఈ నిధులు తోడ్పడతాయని ఆయన అన్నారు. కేంద్రం ఈ శాఖకు 2015-16లో రూ. 3,713 కోట్లు.. 2016-17లో రూ. 3,800 కోట్లు కేటాయించింది.


## రుణాల ఊబిలో గ్రామీణ కుటుంబం

దేశంలో గ్రామీణ కుటుంబాలు అధికశాతం రుణాల ఊబిలో కూరుకుంటున్నాయి. పట్టణ, నగర ప్రాంతాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువగా ఉంటోంది.

| గ్రామాల్లో అప్పుల ఊబిలో కుటుంబాలు | కుటుంబంపై సగటు రుణం |
|---|---|
| 31.4% | రూ.1,03,457 |


**అప్పులకు కారణాలు**

- సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం.
- పంట పెట్టుబడులు, వ్యవసాయం నష్టదాయకంగా మారడం.
- ఇళ్లల్లో జరిగే శుభాశుభకార్యక్రమాలు.
- తీవ్రమైన అనారోగ్యాలు.
- పిల్లల ఉన్నత చదువులు.



**ఇదీ గ్రామీణ రుణ చిత్రం..**

- సంస్థాగత రుణాలు 56%
  సహకారం వాటా 24.8%, వాణిజ్య బ్యాంకుల వాటా 25.1%
- సంస్థాగతేతర రుణాలు 44%
  ఇందులో వడ్డీ వ్యాపారుల ద్వారా 28.2%
  వీరు వసూలు చేసే వడ్డీ సుమారు 20.3%
- స్వల్ప, మధ్య కాలిక రుణాలనే తీసుకుంటున్న కుటుంబాలు 12 %
- దీర్ఘకాలిక రుణాలు తీసుకుంటున్న కుటుంబాలు 10%



**పట్టణాల్లో..**

- రుణగ్రస్తమవుతున్న కుటుంబాలు 22.4 %
- ఒక్కో కుటుంబానికి సగటు రుణభారం రూ. 3,78,238.

- రుణాల ఊబి ఒక తరం నుంచి మరోతరానికి బదిలీ అవుతోంది.
- గ్రామీణుల్లో కొంతమంది ఉత్పాదకత లేని అవసరాలకు అప్పులు చేస్తున్నారు.
- భూమి, ఆస్తుల తగాదాలపై న్యాయం కోసం కోర్టులకు ఎక్కడం కారణంగా ఖర్చులు పెరిగి రుణాలపాలవుతున్నారు.

## ఉద్యోగ కల్పనకు ఊపు!

- ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో ఉద్యోగావకాశాల సృష్టి, ఉద్యోగితా కల్పనకు కీలక ప్రాధాన్యం.
- ఒక సర్వే ప్రకారం.. ఈఏడాది సంఘటిత రంగంలో 70లక్షల ఉద్యోగాల కల్పన.
- దేశంలో ఉద్యోగ కల్పన కోసం గత మూడేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన ఎన్నో కార్యక్రమాల ఫలితంగా పెరిగిన ఉద్యోగితా ఊపును కొనసాగించేందుకు.. అన్ని రంగాల్లోని కొత్త ఉద్యోగుల వేతనాల్లో 12 శాతం ఈపీఎఫ్ చందాను వచ్చే మూడేళ్లు ప్రభుత్వం భరిస్తుంది.
- స్థిరకాల ఉద్యోగిత సౌకర్యం అన్ని రంగాలకూ వర్తింపు.
- సంఘటిత రంగంలో మహిళా ఉద్యోగుల్ని ప్రోత్సహించేందుకు, వారి చేతికందే వేతనం మొత్తం పెంచేందుకు.. తొలి మూడేళ్లలో వారి ఈపీఎఫ్ చందాను ప్రస్తుతమున్న 12 లేదా 10 శాతం నుంచి 8 శాతానికి తగ్గించేలా ఈపీఎఫ్ చట్టంలో మార్పులకు ప్రతిపాదన.
- ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, జాతీయ ఆరోగ్య సురక్ష పథకం వంటి కార్యక్రమాలతో లక్షల ఉద్యోగాల సృష్టి.
- గ్రామీణ, మౌలికవృద్ధి రంగాలకు భారీ కేటాయింపులతో పెద్దసంఖ్యలో ఉద్యోగ సృష్టి.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కేటాయింపులు, కార్పొరేట్ పన్నుల తగ్గింపు ప్రతిపాదన, ప్రధానమంత్రి ముద్ర యోజన, జాతీయ వెదురు మిషన్, జీవనోపాధి మిషన్‌లకు తగినన్ని కేటాయింపుల ద్వారా ఉద్యోగ కల్పన.
- "ఉద్యోగిత సృష్టి, వృద్ధికి తోడ్పడేందుకు 2018-19లో మౌలిక రంగంలో ప్రభుత్వ బడ్జెటరీ, అదనపు బడ్జెటరీ వ్యయాలు పెంపు.. 2018-19లో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి, మౌలిక సదుపాయాల కల్పనతో వ్యవసాయ కార్యకలాపాల ద్వారా ఉద్యోగ అవకాశాలు, స్వయంఉపాధి మాత్రమే కాకుండా, 321 కోట్ల పనిదినాల ఉద్యోగితా సృష్టి జరుగనుంది' -అరుణ్‌జైట్లీ
- 'ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర' కార్యక్రమం కింద ప్రతి జిల్లాలోనూ ఆదర్శ నైపుణ్య కేంద్రాల ఏర్పాటు.

## గ్రామీణ భారతానికి 14.34 లక్షల కోట్లు

**దిల్లీ:** గ్రామీణ భారతంపై వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 14.34 లక్షల కోట్లను కేంద్రం వెచ్చించనుంది. దీంతో గ్రామీణులకు 321 కోట్ల పని దినాల ఉపాధి లభించనుంది. మొత్తంగా 3.17 లక్షల కి.మీ. రహదారులు, 51 లక్షల కొత్త ఇళ్లు, 1.88 కోట్ల మరుగుదొడ్లు, 1.75 కోట్ల ఇళ్లకు విద్యుత్ సరఫరా అందించేందుకు కేంద్రం ప్రతిపాదనలు సిద్ధంచేసింది. వ్యవసాయ రంగాన్ని పటిష్ఠం చేయడం, గ్రామీణాభివృద్ధిని ప్రోత్సహించడమే ఈ ఏడాది లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు నొక్కి చెప్పింది. గ్రామీణులకు అవకాశాలను మెరుగు పరచడం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఊతం లాంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపింది.

- జాతీయ గ్రామీణ జీవనోపాధి కల్పన పథకం (ఎన్ఆర్ఎల్ఎం)కూ కేటాయింపులను పెంచింది. 2017-18లో రూ. 4,500 కోట్లుగా ఉన్న వీటిని ప్రస్తుతం రూ. 5,750 కోట్లు చేసింది.
- మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రుణాలు వచ్చే ఏడాది మార్చి నాటికి రూ. 75,000 కోట్లకు చేరుకుంటాయని తెలిపింది.

## బుసకొడుతున్న నిరుద్యోగం




దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది. చదువుకున్న కోట్ల మంది యువత ఉద్యోగాల వేటలో అలసిపోతున్నారు.

- ప్రస్తుతం దేశ జనాభా – సుమారు 132 కోట్ల పైచిలుకు.
- 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం దేశంలో నిరుద్యోగుల సంఖ్య – 12 కోట్లు (ఇప్పుడు ఈ సంఖ్య భారీగా పెరిగిఉండొచ్చని అంచనా.).
- అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) గణాంకాలు భిన్నంగా ఉన్నాయి. దాని సర్వే ప్రకారం దేశంలో 2017లో నిరుద్యోగుల సంఖ్య– 1.83 కోట్లు.
- 2018లో నిరుద్యోగుల సంఖ్య 1.86 కోట్లకు, 2019లో 1.89 కోట్లకు పెరుగుతుందని ఐఎల్ఓ లెక్కతేల్చింది.
- బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ, సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీ(సీఎంఐఈ) తాజా అంచనా ప్రకారం దేశ జనాభాలో నిరుద్యోగుల శాతం 5.8 (పట్టణాల్లో 6.4 శాతం, గ్రామాల్లో 4.4 శాతం).
- 2022 నాటికి ప్రపంచంలోనే ఎక్కువ మంది యువత కలిగిన దేశంగా భారత్ అవతరించనుంది.
- ప్రస్తుతం దేశంలో 65 శాతం శ్రామిక శక్తి అందుబాటులో ఉంది.
- దేశంలో ఏటా 1.20 కోట్ల మంది శ్రామిక శక్తి జతపడుతుండగా.. ఉపాధి కల్పన 55 లక్షలు మాత్రమే ఉంటోంది.
- కేంద్ర ప్రభుత్వ శాఖల్లో భర్తీ చేయాల్సిన ఉద్యోగాల సంఖ్య సుమారు– 14 లక్షల పైచిలుకు.
- పెద్ద నోట్ల రద్దు వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అనేకం మూతపడి సుమారు అరకోటి మందికి పైగా ఉపాధి కోల్పోయారు.
- ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేకమందికి ఉపాధి లభిస్తోంది.

## దేశంలో కీలక బడ్జెట్లు

**1987(ఫిబ్రవరి 28న)** — ప్రవేశపెట్టింది: ప్రధాని రాజీవ్ గాంధీ



దీన్ని గాంధీ బడ్జెట్‌గా పేర్కొంటారు.

- పన్ను ఎగవేస్తున్న అధిక ఆదాయ సంస్థలకు ముకుతాడు వేసేలా కనీస కార్పొరేట్ పన్ను విధానాన్ని తీసుకొచ్చారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగింది.

**1991(జులై 24న)** — ప్రవేశపెట్టింది: మన్మోహన్ సింగ్



ఈ బడ్జెట్‌తో దేశ ఆర్థిక రంగంలో కొత్త శకం మొదలైంది. పీ.వి. నరసింహారావు ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సంక్షోభంలో కూరుకుపోయిన దేశాన్ని గట్టెక్కించాయి.

- ఎగుమతి, దిగుమతుల విధానంలో సమూల మార్పులు చేశారు. కస్టమ్స్ సుంకాన్ని 220 శాతం నుంచి 150 శాతానికి తగ్గించారు. ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టేందుకు చర్యలు తీసుకున్నారు.


**1997(ఫిబ్రవరి 28న)** — ప్రవేశపెట్టింది: చిదంబరం



ఆర్థిక నిపుణులు దీన్ని కలల బడ్జెట్‌గా అభివర్ణిస్తారు.

- నల్లధనం వెలికితీతకు ఆస్తుల స్వీయ ప్రకటన పథకం తీసుకొచ్చారు. ఆదాయపు పన్ను పరిమితులు, రేట్లు తగ్గించడంతో పన్ను చెల్లించేవారి సంఖ్య పెరిగి ఆదాయం పెరిగింది.

- అత్యధికంగా పది బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్. తన పుట్టినరోజైన ఫిబ్రవరి 29న రెండుసార్లు(1964, 68ల్లో) బడ్జెట్లు ప్రవేశపెట్టారు. అలాంటి ప్రత్యేకత ఇంకే ఆర్థికమంత్రికీ దక్కలేదు.



# బడ్జెట్ 2018-19

## శాస్త్ర సౌరభం

వివిధ శాస్త్ర సాంకేతిక శాఖలు, విభాగాలకు బడ్జెట్ కేటాయింపులను.. కేంద్రం గతేడాది కన్నా 5% నుంచి 17% పెంచింది. అణు ఇంధన విభాగానికి రూ.13,971 కోట్ల (5.76% పెంపు)ను ఇచ్చింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వరుస విజయాల నేపథ్యంలో.. అంతరిక్ష విభాగానికి కేంద్రం అన్ని శాఖలు, విభాగాల కన్నా ఎక్కువగా కేటాయింపులను (17.78%) పెంచింది. శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖకు రూ.12,322 కోట్ల (6.11% పెంపు)ను ఇచ్చింది. శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్‌టీ), శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి (సీఎస్ఐఆర్), బయోటెక్నాలజీ విభాగం దీని పరిధిలో ఉన్నాయి. డీఎస్‌టీకి 8.21%.. సీఎస్ఐఆర్‌కు 3.59% కేటాయింపులను పెంచారు. భూ విజ్ఞాన మంత్రిత్వశాఖకు రూ. 1800 కోట్ల (12.66% పెంపు)ను కేంద్రం ఇచ్చింది.

# ఇంటికి ఇంపు

అందరికీ 2022 కల్లా గృహవసతి కల్పించాలనే లక్ష్యంలో భాగంగా పలు ప్రత్యేక చర్యలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ సారి గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోనూ పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలను బడ్జెట్‌లో వెల్లడించింది.

- జాతీయ హౌసింగ్ బ్యాంకులో అందుబాటు ధరల గృహాల నిధి(ఏహెచ్ఎఫ్) ఏర్పాటు. ప్రభుత్వ అధీకృత బాండ్లు, ఇతర మార్గాల ద్వారా దీనికి నిధులు సమీకరిస్తారు.
- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 2018-19లో 51 లక్షల ఇళ్ల నిర్మాణం. ఇప్పటికే 2017-18లో 51 లక్షల ఇళ్ల కేటాయింపు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కోటికిపైగా ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఏర్పడుతుంది.
- పట్టణ ప్రాంతాల్లో 37 లక్షల గృహాల నిర్మాణానికి సాయం.

## అందరికీ ఆవాసం.. అమల్లో ఎక్కడ?



2022 నాటికల్లా 'దేశంలో అందరికీ ఇళ్లు' లక్ష్యాన్ని సాకారం చేసేందుకు మోదీ సర్కారు కంకణం కట్టుకుంది. అల్ప, మధ్యాదాయ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సొంత ఇంటి కలల్ని నెరవేర్చేందుకు.. మునుపటి 'ఇందిరా ఆవాస్ యోజన' పరిధిని మరింతగా విస్తరించి.. దాని రూపురేఖలు మార్చి.. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)'కు రూపకల్పన చేశారు.

**లక్ష్యం**

2022 నాటికి నిర్మించాల్సిన ఇళ్లు... పట్టణాల్లో 2 కోట్లు; గ్రామీణ ప్రాంతాల్లో 3 కోట్లు

**పురోగతి ఇదీ...**

పీఎంఏవైని ప్రారంభించింది 2015లో

- తొలిగా దృష్టి పెట్టింది: 500 క్లాస్ వన్ నగరాలు

ఈ రెండేళ్లలో కేంద్రం...

- ఆమోదించిన ఇళ్లు : 30.76 లక్షలు
- నిర్మించిన ఇళ్లు : 1,57,106
- నిర్మాణంలో ఉన్నవి : 15.65 లక్షలు
- ప్రస్తుతం అమలవుతున్న పట్టణాలు : 4041

మూడేళ్ల ప్రణాళికలో భాగంగా 2017-18 చివరికి నిర్మించాల్సింది: మరో 33 లక్షలు

**పీఎంఏవై**

| రాష్ట్రం | ఇళ్ల నిర్మాణం |
|---|---|
| **మెరుగ్గా అమలవుతున్న రాష్ట్రాలు** | |
| గుజరాత్ | 37,135 |
| కర్ణాటక | 20,512 |
| తమిళనాడు | 19,454 |
| రాజస్థాన్ | 12,012 |
| మహారాష్ట్ర | 11,503 |
| పశ్చిమబెంగాల్ | 11.077 |
| **అధ్వాన్నంగా అమలువున్న రాష్ట్రాలు** | |
| బిహార్ | 2,659 |
| ఛత్తీస్‌గఢ్ | 1,970 |
| ఒడిశా | 1,643 |
| ఉత్తరాఖండ్ | 1,338 |
| హరియాణ | 1,070 |
| కేరళ | 595 |
| పంజాబ్ | 336 |
| హిమాచల్ ప్రదేశ్ | 25 |

**ప్రోత్సాహం**

- అందుబాటు ధరల్లో పట్టణ గృహ నిర్మాణానికి మౌలిక సదుపాయాల హోదా కల్పించింది. దీంతో స్థిరాస్తి వ్యాపారులు తక్కువ వడ్డీకి రుణాలు పొందొచ్చు.
- మోదీ సర్కారు రెండేళ్లలో 'అందుబాటులో అందరికీ ఇళ్లు' పథకాలకు కేటాయించింది: రూ. 1,10,753 కోట్లు

**సవాళ్లు**


- లాభాలు భారీగా ఉండవని వ్యవస్థీకృత స్థిరాస్తి వ్యాపారులు ఇటు రావటం లేదు.
- ఇది జాతీయ పథకం, అమలులో కేంద్ర-రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాలి. కానీ సమన్వయ లేమితో క్షేత్రస్థాయిలో అయోమయం నెలకొంటోంది.
- పారదర్శకత కోసం 'రెరా'ను అమల్లోకి తెచ్చినా.. ప్రాజెక్టులు ఇంకా నత్తనడకనే సాగుతున్నాయి.
- భూమి లభ్యత లేకపోవటం, భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలు, అధ్వాన్న రికార్డులు.. అమలుకు అడ్డు

## లక్ష్యం 41.. వేస్తున్నది 25

వేగం రెట్టింపవ్వాలి!

మోదీ సర్కారు రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యమిస్తోంది.
బృహత్ లక్ష్యం: వచ్చే ఐదేళ్లలో 83,677 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం
ఇది రెండుసార్లు భూమిని చుట్టొచ్చినంత దూరం కంటే ఎక్కువ!
నిర్మాణ వ్యయ అంచనా: రూ.6,92,000 లక్షల కోట్లు!

**పనులెలా?**



**గతంలో** 2012-14 మధ్య అప్పటి ప్రభుత్వం వేసిన రహదార్లు 5,000 కి.మీ.

**ఇప్పుడు** 2017-18లో వేసింది 8,200 కి.మీ.

**లక్ష్యం** మోదీ సర్కారు విధించుకున్న లక్ష్యం: రోజుకు 41 కి.మీ.

**సాధించింది** కానీ వాస్తవంగా అందుకున్న వేగం రోజుకు 25 కి.మీ.

**దేశంలో రహదారులిలా...**

మొత్తం జాతీయ రహదారుల పొడవు: 1,15,435 కిలోమీటర్లు

అన్ని రకాల రహదారుల పొడవు: 33 లక్షల కిలోమీటర్లు

## రహదారులకు రాజయోగం

దిల్లీ: ప్రగతి రథం ప్రధాన చక్రాల్లో ఒకటిగా పరిగణించే రహదారుల అభివృద్ధి రంగం మనదేశంలో మరింత ఊపందుకోనుంది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్ల నిర్మాణానికి కేంద్రం భారీగా నిధులు కేటాయించింది. 2017-18లోనే 9 వేల కిలోమీటర్లకుపైగా పొడవైన జాతీయ రహదారుల నిర్మాణం పూర్తవుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది.

- 'భారతమాల పరియోజన' పథకం తొలిదశలో భాగంగా రూ. 5.35 లక్షల కోట్లతో 35 వేల కిలోమీటర్ల పొడవైన రహదారులను నిర్మించనున్నారు.
- ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై) పథకం మూడో దశ కింద గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి రూ. 19 వేల కోట్లు కేటాయించారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులతో అనుసంధానించే రోడ్లను నిర్మిస్తారు.

గతేడాది బడ్జెట్ కేటాయింపులు : రూ.64,900 కోట్లు
తాజా బడ్జెట్ కేటాయింపులు : రూ.71 వేల కోట్లు

### ప్రయాణించిన దూరానికే టోల్ రుసుము!

రుసుము చెల్లింపునకుగాను టోల్‌ప్లాజాల వద్ద అధిక సమయం ఎదురు చూసే పరిస్థితి మారనుంది. నగదు రూపంలో టోల్ చెల్లింపులకూ తెరపడనుంది. ప్లాజాల వద్ద వాహనాన్ని నిలిపే అవసరం లేకుండానే ఎలక్ట్రానిక్ విధానంలో రుసుము చెల్లించేందుకు వీలు కల్పించే 'ఫాస్టాగ్'లు విస్తృతంగా వినియోగంలోకి రానున్నాయి. ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్ చెల్లించేందుకు వీలుగా కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుకురానుంది. మరో వైపు, రోడ్డుమార్గాల ఆస్తులను 'ప్రత్యేక ప్రయోజన సంస్థ(ఎస్‌పీవీ)'లుగా మార్చడంతోపాటు ఆదాయ సముపార్జనకుగాను 'టోల్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(టీవోటీ)', 'మౌలిక వసతుల పెట్టుబడుల నిధి' వంటి వినూత్న పద్ధతులను ఉపయోగించే అవకాశాలను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) పరిశీలించనుంది.

## తెలుగు రాష్ట్రాలకు పన్నుల వాటాలో 16% వృద్ధి


### గత ఏడాది కంటే మిన్నగా లభ్యత

ఈనాడు, దిల్లీ: కేంద్ర పన్నులలో గత ఏడాది కంటే మిన్నగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు లభించే వాటా 2018-19 ఆర్థిక సంవత్సరంలో 16% పెరగనుంది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలకు కేంద్రం ఆర్థిక సంవత్సరంలో రూ. 7.88లక్షల కోట్ల పన్నులను పంచనుండగా అందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 33,929.84 కోట్లు రానుంది. 2017-18 కంటే ఇది 16.99% అధికం. తెలంగాణకు రూ. 19,207.43 కోట్లు దక్కనుంది. ఇది గత ఏడాది కంటే 16.97% అధికం. మొత్తం పన్నుల్లో ఏపీకి 4.305%, తెలంగాణకు 2.437% వాటా రానుంది. 2018-19లో సెంట్రల్ జీఎస్‌టీలో రాష్ట్రాలకు వాటా భారీగా పెరగనుంది. గత ఏడాది ఈ పద్దు కింద అన్ని రాష్ట్రాలకు రూ. 92,988 కోట్లు లభించగా 2018-19లో రూ. 2,53,638 కోట్లకు పెరగనుంది. ఇది 272% అధికం. ఐజీఎస్‌టీ, కస్టమ్స్ సుంకాల్లో వాటా గత ఏడాది కంటే ఈసారి భారీగా తగ్గింది.

**రెండు రాష్ట్రాలకు పన్నుల వాటా (రూ. కోట్లలో)**

| పన్ను | ఏపీ | తెలంగాణ |
|---|---|---|
| కార్పొరేట్ ట్యాక్స్ | 9,526.44 | 5,392.78 |
| ఆదాయ పన్ను | 8,440.37 | 4,772.31 |
| సంపద పన్ను | -0.30 | -0.17 |
| కేంద్ర జీఎస్‌టీ | 10,919.11 | 6,181.16 |
| ఐజీఎస్‌టీ | 904.05 | 511.77 |
| కస్టమ్స్ | 1,671.58 | 946.26 |
| యూనియన్ ఎక్సైజ్‌డ్యూటీ | 1,628.92 | 922.11 |
| ఇతర పన్నులు | -0.31 | 0.00 |
| 2016-17 నుంచి సర్దుబాటు | 849.68 | 481.21 |

## అక్కడ పన్ను పీకేస్తారు!



కొన్ని దేశాల్లో ఆదాయపు పన్ను మనకంటే ఎక్కువ

మన దగ్గర సరే, ఆదాయపు పన్ను విదేశాల్లో ఎలా ఉంటుందన్నది ఎప్పుడూ ఆసక్తికరమైన చర్చే.

ఇతర దేశాలతో పోలిస్తే పన్ను రేట్లుగానీ, శ్లాబులుగానీ మనకే తక్కువ!

**మన దేశంలో ఆదాయపు పన్ను**

ఒకప్పుడు: 1970-71లో దాదాపు 11 శ్లాబులుండేవి. పన్ను రేటు గరిష్ఠంగా 93.5% వరకూ ఉండేది.

తర్వాత కాలంలో క్రమేపీ శ్లాబులు, పన్ను రేట్లు తగ్గుతూ వచ్చాయి.

ప్రస్తుతం: 3 శ్లాబులున్నాయి. పన్ను రేటు కనిష్ఠంగా 10% నుంచి గరిష్ఠంగా 30% వరకూ ఉంది.



వివిధ దేశాల్లో పన్ను రేట్లు, విధిస్తున్న శ్లాబులు ఇలా ఉన్నాయి(శాతాల్లో)...


| దేశం | పన్ను రేట్లు కనిష్ఠం - గరిష్ఠం | శ్లాబులు |
|---|---|---|
| బ్రిటన్ | 20 - 45 | 3 |
| అమెరికా | 10 - 39.6 | 7 |
| బ్రెజిల్ | 7.5 -27.5 | 4 |
| చైనా | 3 - 45 | 7 |
| భారత్ | 10 - 30 | 3 |
| రష్యా | 13 | 1 |
| దక్షిణాఫ్రికా | 18 - 41 | 6 |
| పాకిస్థాన్ | 2 - 30 | 11 |

ఒక్క పాకిస్థాన్ తప్ప.. ఈ దేశాలన్నింటిలోనూ తలసరి ఆదాయం భారత్ కంటే ఎక్కువే. అయితే చాలా దేశాలు ఆరోగ్య సంరక్షణ, నిరుద్యోగులు, పెన్షనర్లకు సదుపాయాల్లాంటి సామాజిక భద్రతా కార్యక్రమాల్ని మనకన్నా మెరుగ్గా అమలు చేస్తున్నాయి.

## ఇంటింటి బడ్జెట్ ఇలా..

ప్రపంచవ్యాప్తంగా ఇంటింటి ఖర్చు ఎలా ఉంటుందన్నది అందరికీ ఆసక్తికరం. నెలలో రూ.100 సంపాదన అనుకుంటే అందులో ఏ దేశంలోని వారు ఎలా ఖర్చుపెడుతున్నారో చూద్దాం...

ఒక్కో దేశం ఖర్చు రూపాయల్లో...







# బహుముఖ లక్ష్యం

- గ్రామీణ ఓటర్ల ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం
- రైతులు, చిన్నతరహా పారిశ్రామికవేత్తలకు ఊరట
- మధ్య తరగతికి మాత్రం అందని ప్రయోజనం
- ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలతో ఆర్థిక క్రమశిక్షణను పక్కనపెట్టిన జైట్లీ

ఈనాడు, దిల్లీ: కేంద్ర సర్కారు నూతన బడ్జెట్ బహుముఖ లక్ష్యంతో రూపొందింది. ఆగ్రహంతో ఉన్న గ్రామీణ ఓటర్లను శాంతింపజేయడం, ఉద్యోగాల సృష్టి, సార్వత్రిక ఆరోగ్య బీమా పథకం దిశగా అడుగులు... ఇవన్నీ ఈ బడ్జెట్ వెనుకనున్న ప్రయత్నాలుగా చెప్పవచ్చు. ఈ సంవత్సరం 8 రాష్ట్రాలకు జరగనున్న శాసనసభ ఎన్నికలు, వచ్చే ఏడాది రాబోతున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈసారి బడా కార్పొరేట్లను కొంత దూరం పెట్టినట్లు అర్థమవుతోంది. ఎన్నికల పరమైన అనివార్యతల కారణంగా ఆర్థిక క్రమశిక్షణను ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పక్కన పెట్టేశారు. ద్రవ్యలోటు కొంత పెరగబోతోందని తెలుస్తున్నా కొన్ని ప్రజాకర్షక పథకాల వైపు వెళ్లక తప్పని అనివార్యత కేంద్ర ప్రభుత్వానికి ఎదురయింది. వ్యవసాయంలో ఖర్చు తగ్గి, రాబడి పెరగాలనే సంకల్పంతో వివిధ చర్యల్ని అరుణ్‌జైట్లీ బడ్జెట్లో ప్రకటించారు. అదే సమయంలో సంస్థాగత రుణ పరిమితిని పెంచారు.

దేశ జనాభా దాదాపు 130 కోట్లు ఉంటే దీనిలో 68% మంది గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్నవారే. గ్రామీణుల్లో, ముఖ్యంగా రైతుల్లో ఉన్న వ్యతిరేకత గుజరాత్ సహా అనేక చోట్ల ఫలితాలను ప్రభావితం చేసిన విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో మద్దతు ధరలు, పంటల బీమా, వ్యవసాయ మార్కెట్లు, రుణాలు వంటివాటిపై దృష్టి సారించింది. 50 కోట్ల మంది పేదలకు ప్రయోజనం కల్పించేలా బీమా పథకాన్ని రూపొందించడమంటే అందరికీ ఆరోగ్య బీమా దిశగా అడుగులు పడుతున్నట్లేనని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం కింద బీమా సంస్థలతో కలిపి రాబోయే రోజుల్లో ప్రభుత్వం దీనిని అమలు చేస్తుందని అంచనా వేశారు. దళితులు, గిరిజనులు, వయోధికులు, చిన్నతరహా పారిశ్రామికవేత్తలు... ఇలా భిన్నవర్గాల వారికి ప్రయోజనం కలిగే నిర్ణయాలు తీసుకున్నా, పార్టీకి సంప్రదాయంగా వెన్నుదన్నుగా ఉన్న మధ్య తరగతికే ఎలాంటి ఉపశమనాన్నీ ఇవ్వకపోవడం ఆశ్చర్యకరం.

## పన్ను వసూళ్ల ధోరణులు




## సంపదలో ఐరావతాలు

ముఖేష్ అంబానీ పేరు ఇప్పుడు ప్రపంచ సంపన్నుల జాబితాలో ఉండొచ్చు కానీ.. మునుపటి చరిత్రలోకి వెళితే.. భారత సంపన్నుడు ఎవరో తెలుసా!! మొఘల్ చక్రవర్తి అక్బర్. ప్రపంచ జీడీపీలో దాదాపు 25 శాతం మేర సంపద ఆయన అజమాయిషీలో ఉండేదట! అనాదిగా సంపన్నుల లెక్కతేలుస్తూ 'మనీ మ్యాగజీన్' ఎనిమిది మంది జాబితా ఇదీ..

### 01 మన్సా మూసా


కాలం: 1280-1337
దేశం: మాలి, సంపద: లెక్కకు అందనంత



పశ్చిమ ఆఫ్రికాలోని మాలిలో టింబక్టుకు రాజుగా పనిచేసిన మన్సా మూసా మానవజాతి చరిత్రలోనే అత్యంత ధనవంతుడు అని చెబుతారు. టింబక్టు అత్యధికంగా బంగారాన్ని ఉత్పత్తి చేసేదని, ఒకసారి మూసా మక్కా వెళ్లినపుడు డజన్ల కొద్దీ ఒంటెలపై టన్నుల కొద్దీ బంగారాన్ని తీసుకువెళ్లారని చరిత్రకారులు చెబుతారు.

### 02 అగస్టస్ సీజర్

కాలం: క్రీ.పూ. 63- క్రీ.శ. 14, దేశం: రోమ్
సంపద: రూ. 286,104,401,360,100 (ఇప్పటి లెక్కల ప్రకారం..)



ప్రపంచ జీడీపీలో దాదాపు 25-30 శాతం మేర వాటా కలిగిన రోమన్ సామ్రాజ్యానికి అగస్టస్ సీజర్ నేతృత్వం వహించారు. రోమన్ సామ్రాజ్యపు ఆర్థిక వ్యవస్థలో దాదాపు ఐదోవంతు మేర వ్యక్తిగత సంపదను సీజర్ కలిగి ఉండేవారన్నది స్టాన్‌ఫర్డ్ వర్సిటీ ప్రొఫెసర్ ఇయాన్ మోరిస్ అంచనా.

### 03 షెన్‌జోంగ్ చక్రవర్తి


కాలం: 1048-1085, దేశం: చైనా
సంపద: ప్రపంచ జీడీపీలో 25-30 శాతం మేర వాటా కలిగిన సామ్రాజ్యానికి అధిపతి.



ప్రపంచ ఆర్థిక వృద్ధి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు అందులో దాదాపు 25 నుంచి 30 శాతం మేర వాటాను చైనాలోని సాంగ్ సామ్రాజ్యం(960-1279) కలిగి ఉండేది. ఆ సంపదలో అత్యధికం షెన్‌జోంగ్‌దే.

### 04 అక్బర్

కాలం: 1542-1605, దేశం: భారత్
సంపద: ప్రపంచ జీడీపీలో 25-30 శాతం మేర కలిగిన మొఘల్ సామ్రాజ్యానికి అధిపతి.



మొఘల్ చక్రవర్తి అక్బర్- అప్పట్లో అందరికన్నా ఎక్కువ సంపదను కలిగి ఉండేవారు. అక్బర్ కాలంలో భారత తలసరి జీడీపీ ఇంగ్లండ్‌లోని ఎలిజబెత్ రాణితో సమానంగా ఉండేదని చరిత్రకారుడు యాంగస్ మాడిసన్ చెబుతారు.

# బడ్జెట్ 2018-19

**మోదీ మాట**

"ఈ బడ్జెట్ దేశాభివృద్ధిని పరుగులు పెట్టిస్తుంది. ప్రభుత్వం కేవలం సులభతర వాణిజ్యంపైనే దృష్టి పెట్టలేదు. సులభతరంగా జీవించడంపైనా దృష్టిపెట్టింది. పన్నుల పరంగా ఎంఎస్ఎంఈలు చాలా కాలంగా భారాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈలు చెల్లించాల్సిన కార్పొరేట్ పన్నులను తగ్గించాం. ఇప్పుడు వారు 30శాతం బదులు 25శాతం చెల్లిస్తే చాలు. నాణ్యమైన చికిత్స పొందాలనుకుంటే ఆర్థిక భారం పడుతుందేమోనన్న ఆందోళన వారికి లేకుండా చేస్తుంది. పది కోట్ల కుటుంబాలకు (45 కోట్ల నుంచి 50 కోట్ల మంది ప్రజలకు) ఈ పథకం సహాయకారిగా ఉంటుంది. 125 కోట్ల మంది భారతీయుల ఆశలను ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుంది. మన రైతులను మరింత బలోపేతం చేసేందుకు పలు ముఖ్యమైన చర్యలు తీసుకున్నాం."



# ఈ-పల్లెకు బాట

## రాయితీల్లో రెండో దశ సంస్కరణలకు సిద్ధం

రాయితీల దుర్వినియోగాన్ని అరికట్టనిదే ఆర్థిక స్థిరీకరణ సాధ్యం కాదని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా మరిన్ని చర్యలు కొనసాగించనుంది. అర్హులకే రాయితీలు దక్కేలా చేసి తద్వారా మిగిలే నిధులను మౌలిక వసతుల కల్పన, కొత్త పథకాల అమలుకు వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో రెండో దశ సంస్కరణలు తీసుకురానుంది. తొలి దశలో ఆధార్ అనుసంధానం, కంప్యూటర్ల వినియోగంతో అక్రమాలను కొంతవరకు అరికట్టగలిగింది. ప్రజాపంపిణీ వ్యవస్థను అన్ని స్థాయిలో కంప్యూటరీకరించడం, ఎఫ్‌సీఐ సామర్థ్యం పెంచడం రెండో దశలో ఉన్నాయి. ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) అమలుకు 57 శాఖల్లోని 462 పథకాలను గుర్తించారు. 2017-18లో 52 కోట్ల మందికి నగదు బదిలీ ప్రయోజనం అందింది. వంట గ్యాస్ తరహాలోనే కిరోసిన్ సబ్సిడీని కూడా వినియోగదారుల ఖాతాలో జమ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో ఝార్ఖండ్ ముందంజలో ఉంది. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హరియాణ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కిరోసిన్ రహితంగా మారాయి. ఎరువులపై నగదు బదిలీని దేశమంతటా విస్తరించాలని నిర్ణయించింది. స్థూలజాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో రాయితీల వాటాను కనిష్ఠస్థాయికి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేస్తోంది. 2014-15లో జీడీపీలో సబ్సిడీల వాటా 2%గా ఉండగా, 2017-18లో 1.8 శాతానికి తగ్గింది. 2017-18లో 1.4%, తాజా బడ్జెట్‌లోనూ 1.4%గా ఉంది.

## గ్రామాలకు భారత్‌నెట్ సొబగులు

'డిజిటల్ భారత్' మహాన్! దేశవ్యాప్తంగా సాంకేతిక వసతులు కల్పించడం ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తేవడం... పల్లెలను, పట్టణాలను సాంకేతికంగా అనుసంధానించడమే 'డిజిటల్ ఇండియా' లక్ష్యం. **2015** జులై **1**న ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శాశ్వత వసతుల కల్పన; డిజిటల్ రూపంలో ప్రభుత్వ సేవల అందజేత; వాటిని ఉపయోగించుకునేలా ప్రజల్లో సాంకేతిక అక్షరాస్యతను పెంచడం- ఈ క్రతువులో మూడు కీలకాంశాలు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది.




## సాహో సాంకేతిక భారత్

భారత్‌ను సాంకేతిక విజ్ఞాన సమాజంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. కృత్రిమ మేధ, పరిశోధన, అభివృద్ధికి చర్యలు తీసకుంటున్నట్లు ప్రకటించింది.

- 'డిజిటల్ ఇండియా' కార్యక్రమానికి నిధులు రెట్టింపు చేస్తూ రూ.3073 కోట్లు కేటాయించింది.
- అత్యున్నత విద్యా కేంద్రాల ఏర్పాటుకు చేయూతనిచ్చే సైబర్ ఫిజికల్ వ్యవస్థ(సీపీఎస్)లు ఏర్పాటు చేస్తామని తెలిపింది.
- గ్రామాల్లో 5 లక్షల వైఫై హాట్‌స్పాట్ కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయం. దీంతో 5 కోట్ల మంది గ్రామీణులకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయి.
- టెలికాం రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.పది వేల కోట్లు కేటాయింపు.
- మద్రాస్ ఐఐటీలో దేశీయ 5జి ప్రయోగకేంద్రం ఏర్పాటుకు నిర్ణయం.
- బ్లాక్ చైన్ టెక్నాలజీకి ప్రోత్సాహం.

### ఉపాధి కల్పనకు దోహదం

సాంకేతిక భారత్ దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఉద్యోగాల కల్పనకు, గ్రామీణుల జీవనం మెరుగుపరిచేందుకు, నాణ్యమైన విద్యకు, ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేస్తాయని పారిశ్రామిక వర్గాల నిపుణులు పేర్కొన్నారు. నాస్కామ్ సహవ్యవస్థాపకుడు, ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్ డైరెక్టర్ సౌరభ్ శ్రీవాత్సవ స్పందిస్తూ.. డిజిటల్ ఇండియా కార్యక్రమానికి కేటాయింపులు రెట్టింపు చేయడం ఓ మంచి నిర్ణయమని పేర్కొన్నారు. డిజిటల్ ఆర్థికవ్యవస్థ దిశగా అడుగులు వేసేందుకు ఇది దోహదం చేస్తుందని తెలిపారు. డెలాయిట్ సంస్థకు చెందిన హేమంత్ జోషి మాట్లాడుతూ ఐఐటీ మద్రాస్‌తో కలిసి 5జి ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం కొత్త టెలికం రంగం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

## ఏం చేశారు?

### మౌలిక వసతుల కల్పన

**2018** డిసెంబర్ నాటికి **6,25,000** గ్రామాలను ఫైబర్ తీగల ద్వారా అనుసంధానించే బాధ్యతను ప్రభుత్వ రంగ సంస్థ 'భారత్‌నెట్'కు అప్పగించారు.

– మొత్తం అనుసంధానించాల్సిన దూరం **7** లక్షల కిమీ

తొలిదశలో లక్ష గ్రామ పంచాయతీలు 'హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్'తో అనుసంధానం పూర్తి. దీంతో 20 కోట్ల మందికి పైగా బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

### డిజిటల్ సేవలు

డిజిటల్ లాకర్, ఈ-ఎడ్యుకేషన్, ఈ-హెల్త్, ఈ-సైన్, నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లో అందించేందుకు నేషనల్ 'ఈ-గవర్నెన్స్ ప్లాన్'ను రూపొందించింది. పౌరులు తమ సూచనలను సలహాలను ప్రభుత్వానికి అందించేందుకు 'మైగవ్.ఇన్' వేదికను ఏర్పాటుచేసింది. అన్ని సేవలను ఒకే గొడుగు కిందకు తెస్తూ 'ఉమంగ్' పేరున ఉచిత యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నల్లధనాన్ని అరికట్టేందుకు **11** రకాల సాంకేతిక కార్యక్రమాలు చేపట్టింది.

### డిజిటల్ అక్షరాస్యత


సాంకేతిక వసతులు, ప్రభుత్వం అందించే డిజిటల్ సేవలను ప్రజలు విరివిగా వాడుకుంటేనే 'డిజిటల్ ఇండియా' సాకారమవుతుంది. ఇందుకోసం ప్రభుత్వం 'ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరతా అభియాన్'ను చేపట్టింది. **2019** మార్చి నాటికి **6** కోట్ల మంది గ్రామీణులను డిజిటల్ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ఈ పథకం లక్ష్యం. ఇందుకు రూ. **2,351.38** కోట్లు వెచ్చించనుంది.

– ఈ అక్షరాస్యత పెంపునకు **606** సంస్థలు భాగస్వామ్యమయ్యాయి.

– వీటిల్లో చేరి **1,05,20,154** మంది సాంకేతిక శిక్షణ పొందారు.

ఒకప్పుడు మనదేశంలో విద్యుదుత్పత్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలోనే సాగింది. జలవిద్యుత్తు, థర్మల్ విద్యుత్తు కేంద్రాలు మాత్రమే ఉండేవి. క్రమేపీ ప్రైవేటు రంగానికి బాటలు పరిచారు. క్రమేపీ పునరుత్పాదక, సాంప్రదాయేతర విద్యుత్ రంగమూ విస్తరించింది.

- గత నాలుగేళ్లలో దేశంలో విద్యుదుత్పత్తి సామర్థ్యం 80,000 మెగావాట్ల మేర పెరిగింది.
- ముఖ్యంగా అదనపు ఉత్పత్తి అంతా కూడా థర్మల్ విద్యుత్తుతో పాటు పునరుత్పాదక విభాగంలోనే అధికంగా ఉంది. వీటివల్ల దేశవ్యాప్తంగా విద్యుత్తు కోతలు తగ్గుముఖం పట్టాయి.
- మున్ముందు 'మిగులు విద్యుత్తు' పెరిగి, అదో సమస్యగా తయారవనుందని విద్యుత్తు రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు!



ఈ గణాంకాలు మార్చి 31, 2014, డిసెంబరు 31, 2017 నాటివి

## గడప గడపకూ వెలుగులు

ప్రతి ఇంటినీ విద్యుత్ వెలుగులతో నింపే దిశగా కేంద్రం వడివడిగా పరుగులు తీస్తోంది. ప్రతిష్ఠాత్మక పథకాలకు వరుస కేటాయింపులతో బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. దీంతో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశముంది. మరోవైపు రైతుల నుంచి సౌరశక్తి మిగులు విద్యుత్ కొనుగోలు ప్రతిపాదన ఉత్పత్తి పెరిగేందుకూ తోడ్పడనుంది. ఫలితంగా రైతుల జీవన ప్రమాణాలూ మెరుగుపడనున్నాయి.

- నాలుగు కోట్ల గ్రామీణ, పట్టణ పేదల ఇళ్లకు ఉచిత విద్యుత్ పంపిణీయే లక్ష్యంగా ప్రవేశపెట్టిన సౌభాగ్య యోజనకు కేంద్రం రూ.16,000 కోట్లు కేటాయించింది.
- గ్రామీణ విద్యుదీకరణకు ప్రవేశపెట్టిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ గ్రామజ్యోతి యోజన (డీయూజీజేవై)కు రూ. 3,800 కోట్లు ప్రకటించింది.
- పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థకు ఊపిరిలూదే సమీకృత విద్యుత్ అభివృద్ధి పథకం (ఐపీడీఎస్)కూ రూ. 4,900 కోట్లు కేటాయించింది.
- మరోవైపు పవన, సౌర, హరిత ఇంధన నడవా ప్రాజెక్టుకూ రూ. 4,200 కోట్లు ప్రకటించింది.

## సౌర విద్యుత్‌కు భరోసా

సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తామని కేంద్రం హామీఇచ్చింది. చాలా మంది రైతులు ప్రత్యేక సౌర ఫలకాలను పొలాల్లో బిగించుకుంటున్నారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే అదనపు విద్యుత్తును కొనుగోలు చేస్తామని కేంద్రం భరోసా ఇచ్చింది. విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ అదనపు విద్యుత్‌ను కొనుగోలుచేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసేలా చూస్తామని వివరించింది. లేని పక్షంలో మిగులు విద్యుత్‌ను సముచిత ధరలో కొనేలా సంస్థలకు లైసెన్సులు ఇప్పిస్తామని స్పష్టంచేసింది. మరోవైపు సౌర ఘటాలు, ఫలకాలపై ఉపయోగించే గాజుపైనున్న ఐదు శాతం దిగుమతి సుంకాన్నీ రద్దుచేస్తామని హామీఇచ్చింది. అయితే దేశీయ సౌర ఉత్పత్తుల పరిశ్రమలకు రక్షణ కల్పించేలా కొన్ని ఉపకరణాలపై 70 శాతం వరకూ దిగుమతి సుంకం విధిస్తారన్న అంశంపై ఎలాంటి స్పష్టతా లభించలేదు. సౌరశక్తి కార్పొరేషన్‌కూ ప్రస్తుతం కేటాయింపులు తగ్గాయి. 2017-18లో ఇవి రూ.250.42 కోట్లు ఉండగా.. ప్రస్తుతం రూ.217.43 కోట్లకు తగ్గిపోయాయి.

# గత బడ్జెట్ హామీలు.. అమలు తీరు

### రైతుల ఆదాయం రెట్టింపు

**హామీ:** ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తాం. 2017-18లో వ్యవసాయ రుణ లక్ష్యం రూ.10 లక్షల కోట్లు.

**అమలు:** ఇప్పటికే నీతిఆయోగ్ రూపొందించిన విధాన పత్రాన్ని అన్ని రాష్ట్రాలకు పంపాం. మంత్రుల సంఘం నియమించాం. త్వరలో సిఫార్సులు రానున్నాయి. అక్టోబర్ 2017 నాటికి 6.71 లక్షల కోట్ల రుణాల మంజూరు.

### పాడి పరిశ్రమ అభివృద్ధి

**హామీ :** రానున్న మూడేళ్లలో రూ. ఎనిమిది వేల కోట్ల మూలనిధిలో నాబార్డులో పాడి ఆధారిత పరిశ్రమల అభివృద్ధి నిధి ఏర్పాటు. మూలనిధికి రూ. రెండువేల కోట్ల కేటాయింపు.

**అమలు:** పాడి ఆధారిత పరిశ్రమల అభివృద్ధి నిధికి రూ.10,881 కోట్ల కేటాయింపునకు క్యాబినెట్ కమిటీ అనుమతి. అమలు చేసేందుకు డిసెంబర్ 12, 2017న అంగీకరించిన నాబార్డు, జాతీయ పాడి అభివృద్ధి సంస్థ, జాతీయ సహకార అభివృద్ధి సంస్థలు

### గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి

**హామీ:** 2022 నాటికి ఐదులక్షల మంది గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధి లక్ష్యం.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 20వేల మందికి శిక్షణ.

**అమలు:** డిసెంబర్18, 2017 నాటికి 5,107 మందికి శిక్షణ పూర్తి.. 1057 మందికి కొనసాగుతున్న శిక్షణ.

### పీఎంకేకే విస్తరణ

**హామీ:** యువతకు ఆధునాతన శిక్షణ ఇచ్చి, విదేశీ భాషలు నేర్పి ఉపాధికి ఉతమిచ్చే ప్రధాన మంత్రి కౌషల్ కేంద్రాలను(పీఎంకేకే)60 జిల్లాల నుంచి 600 జిల్లాలకు విస్తరిస్తాం.

**అమలు:** నవంబర్24, 2017 నాటికి 527 కేంద్రాలకు విస్తరించాం.

### గృహరుణాలు

**హామీ:** వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం కోసం రూ.20వేల కోట్లు రుణమివ్వాలని లక్ష్యం.

**అమలు:** మధ్యఆదాయ వర్గాల గృహరుణానికి వర్తించే సబ్సిడీ పథక మార్గదర్శకాలను ఇప్పటికే గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ విడుదల చేసింది.

### రూ.3 లక్షలు పైబడిన లావాదేవీలన్నీ నగదు రహితం

**హామీ:** నల్లధనం నియంత్రణకు సంబంధించి ఏర్పాటైన సిట్ రూ.3 లక్షలకు పైబడిన లావాదేవీలన్నీ నగదు రహితం చేయాలని సూచన.

**అమలు:** అమల్లోకి వచ్చింది. పరిమితి రూ.3 లక్షల నుంచి రూ.2 లక్షలకు తగ్గింపు.

### స్వచ్ఛ రైల్

**హామీ:** ప్రయాణ సమయంలో బోగీలలో ఇబ్బందులు చెప్పేందుకు 'కోచ్ మిత్ర' ఏర్పాటు. 2019 నాటికి అన్ని బోగీలకు బయో మరుగుదొడ్లు.

**అమలు:** 'కోచ్ మిత్ర' సదుపాయం 670 రైళ్లలో ఏర్పాటు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో నవంబరు నాటికి బోగీలలో 5,417 బయో మరుగుదొడ్ల ఏర్పాటు పూర్తి. ఇప్పటిదాకా పూర్తయినవి 33,856.

### మెట్రో రైలు విధానం

**హామీ:** నగరాల్లో మెరుగైన ప్రజారవాణా వ్యవస్థ కోసం మెట్రో రైలు విధానం. కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం.

**అమలు:** కొత్త మెట్రో రైలు విధానానికి ఆమోదం. పట్టణాభివృద్ధి శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో సమగ్ర వివరాలు. తయారవుతున్న మెట్రో నిర్మాణం, నిర్వహణ ముసాయిదా బిల్లు.

### రైలు ప్రయాణికులకు భద్రత

**హామీ:** ఐదేళ్ల పాటు అమలయ్యేలా రూ. లక్ష కోట్ల మూలనిధితో రాష్ట్రీయ రైలు సంరక్ష కోష్ ఏర్పాటు.

**అమలు:** 2017-18 సంవత్సరానికి రాష్ట్రీయ రైలు సంరక్ష కోష్‌కి రూ. 20,000 కోట్ల ఫండ్ ఏర్పాటు. రైల్వే ట్రాఫిక్ సదుపాయాలు, సిగ్నలింగ్ తదితర పనులకు వినియోగం.

## కృత్రిమ మేధస్సుకు దన్ను

### నీతి ఆయోగ్ కీలకపాత్ర



ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగుతున్న ప్రణాళికా సంఘాన్ని కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడగానే రద్దు చేసింది. దాని స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ సంస్థకు కేంద్ర ప్రభుత్వం గురుతర బాధ్యత నొకదాన్ని అప్పగించింది. అదే 'కృత్రిమ మేధస్సు' రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం. కృత్రిమ మేధస్సు విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా ఎంతో వేగవంతమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ రంగంలో మనదేశం వెనుకంజ వేయకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఒక జాతీయ కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను నీతి ఆయోగ్‌కు అప్పగించింది. కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ విషయాన్ని స్పష్టం చేశారు.

- ఏర్పాటు: 2015 జనవరి 1
- ఛైర్మన్: ప్రధాన మంత్రి

**నీతి ఆయోగ్ ప్రత్యేకతలు:** వివిధ రంగాలపై లోతైన అధ్యయనం సంస్కరణలపై నివేదికల రూపకల్పన ప్రభుత్వానికి విధానపరమైన సిఫార్సులు చెయ్యటం

**తెచ్చిన మార్పులు**

- రద్దయిన పంచవర్ష ప్రణాళికల స్థానే 15 ఏళ్ల 'విజన్ డాక్యుమెంట్' రూపకల్పన.
- 'జాతీయ అభివృద్ధి కార్యక్రమం' పేరుతో 2017-18 నుంచి 7 ఏళ్ల కార్యాచరణపై కసరత్తు.

**సంస్కరణలకు సిఫార్సులు:**

- **వ్యవసాయ రంగంలో:** భూమి కౌలు చట్టం రూపకల్పన, పంటల మార్కెటింగ్ కమిటీ చట్టంలో మార్పులు
- **వైద్య విద్యలో:** భారత వైద్య మండలి(ఎంసీఐ) రద్దు. దీని స్థానే జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు

**డిజిటల్ చెల్లింపులకు ప్రోత్సాహం**

- పెద్దనోట్ల రద్దు రద్దు తర్వాత- డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించటంలో కీలక పాత్ర.
- డిజిటల్ లావాదేవీల్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్రాల్లో జిల్లాకు రూ. **50** కోట్ల చొప్పున సహాయానికి సిఫార్సు.

**ఇంకా ఏంచేస్తోంది?**

- అటల్ ఇన్నోవేషన్ మిషన్.
- రాష్ట్రాల్లో విద్య, వైద్యం, నీటి యాజమాన్య స్థితిగతుల పరిశీలనకు సూచీల తయారీ.
- కేంద్ర ప్రాయోజిత పథకాలను హేతుబద్ధం చేయటానికి సీఎంలతో ఉపబృందం ఏర్పాటు.
- స్వచ్ఛభారత్, నైపుణ్యాభివృద్ధిపై ముఖ్యమంత్రులతో ఉపబృందం ఏర్పాటు.
- వ్యవసాయాభివృద్ధి, పేదరికం నిర్మూలనపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు.
- ప్రభుత్వ మేధో సంస్థగా 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' ఉపన్యాసాల నిర్వహణ

## తీర ప్రాంత భద్రతకు భరోసా!

### ఏపీ మెరైన్ పోలీసు విభాగానికి చేకూరనున్న లబ్ధి

**ఈనాడు, అమరావతి:** కేంద్ర బడ్జెట్ కేటాయింపులతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత భద్రత వ్యవస్థకు సంబంధించి మెరైన్ పోలీసుస్టేషన్లకు సొంత భవనాలు, జెట్టీల నిర్మాణం, బోట్ల కొనుగోలుకు నిధులు రానున్నాయి. మెరైన్ పోలీసు విభాగం బలోపేతానికి ఇవి దోహదం చేయనున్నాయి. రాష్ట్రంలో 21 మెరైన్ పోలీసుస్టేషన్లు ఉండగా, అనేకం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మన మెరైన్ పోలీసు విభాగంలో 18 బోట్లే ఉన్నాయి. ప్రత్యేకంగా ఒక్క జెట్టీ కూడా లేదు. తాజా కేటాయింపులతో.. దేశవ్యాప్తంగా 60 జెట్టీల నిర్మాణం, 225 బోట్లు కొనుగోలు చేయనున్నందున ఆ మేరకు ఏపీ మెరైన్ పోలీసు విభాగానికి లబ్ధి చేకూరనుంది. మరోవైపు అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న అత్యాధునిక ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణానికి కేంద్రం రూ.152 కోట్లు కేటాయించటం.. అది త్వరగా పూర్తికావడానికి ఉపకరించనుంది.

**05 ఆండ్రూ కార్నెగీ**

కాలం: 1835-1919, దేశం: అమెరికా

సంపద: 37200 కోట్ల డాలర్లు (2014 లెక్కల ప్రకారం)




అన్ని కాలాల్లోకెల్లా అమెరికా అత్యంత ధనవంతుడు ఆండ్రూ కార్నెగీయేనని చెబుతారు. స్కాట్లాండ్ నుంచి వలస వచ్చిన కార్నెగీ తన 'యూఎస్ స్టీల్' కంపెనీని 1901లో జేపీ మోర్గాన్‌కు 48 కోట్ల డాలర్లకు విక్రయించారు. ఆ సమయంలో అమెరికా జీడీపీలో అది 2.1 శాతం.

**06 జాన్ డి.రాక్‌ఫెల్లర్**

కాలం: 1839-1937, దేశం: అమెరికా

సంపద: 34100 కోట్ల డాలర్లు (2014 లెక్కల ప్రకారం)



జాన్ డి.రాక్‌ఫెల్లర్ 1863లో పెట్రోలియం పరిశ్రమలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. 1880 నాటికి ఆయన నేతృత్వంలోని స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ అమెరికా చమురు ఉత్పత్తుల్లో దాదాపు 90 శాతాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకుంది. 1918 నాటికి అమెరికా మొత్తం జీడీపీలో దాదాపు 2 శాతం సంపద రాక్‌ఫెల్లర్ వద్ద ఉండేది. ఆ ఏడాది ఆయన 150 కోట్ల డాలర్ల ఆదాయపు పన్ను చెల్లించారు.

**07 అలన్ రఫస్(ఎ.కె.ఎ. అలన్ ది రెడ్)**

కాలం: 1040-1093, దేశం: ఇంగ్లండ్

సంపద: 19400 కోట్ల డాలర్లు(2014 లెక్కల ప్రకారం)



రెండో విలియం మేనల్లుడైన రఫస్ 11వ శతాబ్దంలో నార్మన్ యుద్ధంలో తన మేనమామతో చేతులు కలిపారు. అలన్ రఫస్ చనిపోయే నాటికి ఆయన సంపద 11వేల పౌండ్లు. అప్పటికి ఇంగ్లండ్ జీడీపీ 7 శాతం. ఆ లెక్కన అలన్ సంపద 19400 కోట్ల డాలర్లు.


**08 బిల్ గేట్స్**

కాలం: 1955- ప్రస్తుతం, దేశం: అమెరికా

సంపద: 9000 కోట్ల డాలర్లు



మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడైన బిల్‌గేట్స్ సంపద 2017 చివరి నాటికి దాదాపు 9వేల కోట్ల డాలర్లు. అమెజాన్ సీఈఓ జెఫ్ బెజోస్(10 వేల కోట్ల డాలర్లు) తర్వాత రెండో అతిపెద్ద ధనవంతుడు బిల్‌గేట్స్.



## కాంగ్రెస్ చెణుకు

మోదీ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు ట్విటర్‌లో చెణుకులు విసిరారు. 'నాలుగేళ్లు గడిచిపోయాయి. కేవలం హామీలే మిగిలాయి. పేరుగొప్ప పథకాలు. బడ్జెట్‌లో వాటికి సరిపడా కేటాయింపులే లేవు. యువతకు ఉద్యోగాలూ కరవయ్యాయి. హమ్మయ్యా...! దేవుడి దయ వల్ల వారికి ఇక ఒక ఏడాదే మిగిలింది' అంటూ ట్విటర్ వేదికగా గురువారం ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడమూ హామీగానే మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు. ఏం చేసినా ఫలితం ఉండబోదని మోదీ ప్రభుత్వానికీ అర్థమైపోయిందంటూ కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని విమర్శించింది. 'బడ్జెట్‌లో నిర్ణయాలు చూస్తుంటే కాడిని మధ్యలోనే వదిలిసినట్లు కనిపిస్తోంది. కీలక అంశాల్లో విఫలమయ్యామని ప్రభుత్వమే అంగీకరించినట్లు అర్థమవుతోంది'అని పి.చిదంబరం వ్యాఖ్యానించారు.

**బడ్జెట్ 2018-19**

# ఉడతా భక్తి

తీవ్ర వ్యాధులు ఉన్న సీనియర్ సిటిజన్లకు రూ.60వేల వరకూ, 80ఏళ్లు దాటిన వయోధికులకు రూ.80వేల వరకూ సెక్షన్ 80డీడీబీ కింద మినహాయింపు వర్తిస్తుంది. ఇప్పుడు దీన్ని అందరికీ సమానంగా రూ.లక్ష చేయాలని ప్రతిపాదించారు.

ఆరోగ్య బీమా ప్రీమియం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సీనియర్ సిటిజన్లు తీసుకునే పాలసీల ప్రీమియానికి సెక్షన్ 80డీ మినహాయింపు పరిమితిని పెంచాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ మినహాయింపు రూ.30వేలు ఉండగా.. దీన్ని రూ.50వేలకు పెంచనున్నారు. ఒకవేళ ఏడాదికి మించి పాలసీ తీసుకుంటే.. ఆ ప్రీమియాన్ని దామాషా పద్ధతిలో పరిమితికి లోబడి ఆయా సంవత్సరాలకు మినహాయింపు కోసం క్లెయిం చేసుకోవచ్చు.

## 50వేలకు పెంచారు

- ఓ వైపు వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి.. మరోవైపు వడ్డీ ఆదాయం రూ.10 వేలు దాటితే ఆదాయపు పన్ను చెల్లించాలి.. దీంతో వడ్డీ ఆదాయంపైనే ఆధారపడే వయోధికులకు ఇబ్బంది ఎదురవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్థిక మంత్రి వీరిపై కాస్త కరుణ చూపారనే చెప్పాలి.
- బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు పథకాలు తదితర పథకాల్లో ఆర్జించిన వడ్డీ ఆదాయానికి ప్రస్తుతం సెక్షన్ 80టీటీఏ కింద వర్తించే రూ.10వేల మినహాయింపు పరిమితిని సీనియర్ సిటిజన్లకు రూ.50 వేలకు పెంచారు. దీనికోసం కొత్తగా సెక్షన్ 80టీటీబీ ప్రతిపాదించారు. అంటే, ఈ మొత్తం వరకూ మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) ఉండదన్నమాట. మిగతా వారికి సెక్షన్ 80టీటీఏ ఇప్పటిలాగే రూ.10వేలు వర్తిస్తుంది.
- ప్రధానమంత్రి ఎల్ఐసీ వయ వందన యోజన కింద సీనియర్ సిటిజన్లు రూ.7.5 లక్షల వరకూ మదుపు చేసేందుకు వీలుండేది. దీన్ని ఇప్పుడు రూ.15 లక్షలకు పెంచారు. ఇందులో వార్షిక వడ్డీ 8.3 శాతం వరకూ (వడ్డీ స్వీకరించే వ్యవధులను బట్టి ఇది మారుతూ ఉంటుంది) వస్తోంది. ఇతర పథకాల వడ్డీ రేట్లు తగ్గుతున్న నేపథ్యంలో అధిక పెట్టుబడికి అవకాశం కల్పించడం ఊరటగానే చెప్పొచ్చు.



## వృద్ధులకు భద్రత వీపీబీవై

దేశంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు సామాజిక భద్రత కల్పనలో భాగంగా తీసుకువచ్చిన పథకమే వరిష్ఠ పింఛను బీమా యోజన(వీపీబీవై). ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం. భారత జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) ద్వారా అమలు చేస్తోంది. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయం(2003-04)లో 55 ఏళ్లు దాటినవారి కోసం తొలిసారిగా వీపీబీవైను ప్రారంభించారు. ఇది అత్యధిక ప్రజాదరణను పొందింది. ఏకంగా 3.16 లక్షల పాలసీల అమ్మకం జరిగి రూ.6,095 కోట్ల కార్పస్ నిధి జమైంది. ఆపై 2014 ఆగస్టులో మరోసారి కేంద్రం వీపీబీవై పాలసీని తీసుకువచ్చింది. ఇందులో 60 ఏళ్ల వయస్సును పాలసీ ప్రవేశ అర్హతగా పేర్కొంది. గరిష్ఠంగా రూ.6,66,665 ఏక ప్రీమియంగా నిర్ణయించింది. ఈ మొత్తానికి పాలసీదారుకు జీవితకాలంపాటు నెలకు గరిష్ఠంగా రూ.5 వేలు పింఛనుగా పేర్కొంది. 9% రాబడికి హామీ ఇచ్చింది.

- వీపీబీవైకి గల ఆదరణను దృష్టిలో ఉంచుకుని సీనియర్ సిటిజన్స్ కోసం 2017 జనవరి నెలలో కేంద్రం వీపీబీవై-2017ను మళ్లీ తీసుకువచ్చింది.
- వీపీబీవై-2017లో మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా 8% వడ్డీని 10 సంవత్సరాలపాటు అందిస్తారు.
- గరిష్ఠ ఏకప్రీమియం రూ.7,50,000.
- ఈ పథకంలో పాలసీదారులకు పింఛను చెల్లింపులో ఎల్ఐసీకి ఏదైనా లోటు ఏర్పడితే ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆ సంస్థకు రాయితీగా తిరిగి చెల్లిస్తుంది.
- ప్రస్తుతం పోస్టాఫీసుల్లో సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీంలో ఏడాది కాలానికి సుమారు 8.6 % వడ్డీ దక్కుతోంది. దీంతో వీపీబీవై-17కు ఆదరణ ఆశించినస్థాయిలో లేదు.



బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు పార్లమెంటుకు వస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, సహాయ మంత్రులు పొన్ రాధాకృష్ణన్, ఎస్పీ శుక్లా, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు

## ప్రామాణిక తగ్గింపు రూ.40వేలు

జి.సాంబశివరావు,
ప్రత్యక్ష పన్నుల నిపుణులు



'ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేస్తున్న వారి సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. ప్రత్యక్ష పన్నుల ఆదాయమూ అధికమవుతోంది' అంటూ చెప్పినప్పటికీ.. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈసారి సగటు వేతన జీవులపై పెద్దగా కరుణ చూపలేదు. 2018-19 కేంద్ర బడ్జెట్ వ్యవసాయ, ఆరోగ్య రంగాలను ప్రోత్సహించేదిలా ఉన్నప్పటికీ.. ప్రత్యక్ష పన్నుల విషయంలో ఊరట కల్పించలేదు. సీనియర్ సిటిజన్లకు వడ్డీ మినహాయింపు పరిమితి పెంచడమే ఉపశమనంగా చెప్పుకోవచ్చు.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ఎంతోకొంత పెంచుతారని ఉద్యోగులు ఆశించారు. కానీ, కేవలం ప్రామాణిక తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) ఇచ్చి సర్దుకోమని చెబుతూ.. పన్ను శ్లాబుల్లో కానీ, రేట్లలో కానీ ఎలాంటి కొత్త ప్రతిపాదనలూ ప్రవేశ పెట్టలేదు.. కొత్త బడ్జెట్‌లో కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలను పరిశీలిస్తే...

- కొన్నేళ్ల క్రితం వరకూ అమల్లో ఉండి, రద్దయిన ప్రామాణిక తగ్గింపును పునఃప్రవేశ పెట్టారు. రూ.40వేల వరకూ ఈ రాయితీని ప్రతిపాదించారు. ఉద్యోగులతోపాటు, పింఛనర్లకూ ఇది వర్తిస్తుంది. అయితే, ఇక్కడే చిన్న మెలిక పెట్టారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం నెలకు రూ.1,600 మేరకు ప్రయాణ భత్యం (ఏడాదికి రూ.19,200); ఏడాదికి రూ.15 వేలు వైద్య ఖర్చుల తిరిగి చెల్లింపులకు మినహాయింపు వర్తించేది. ఈ రెండిటికీ బదులు స్టాండర్డ్ డిడక్షన్ ఒక్కటే వర్తిస్తుందని తెలిపారు. దీనివల్ల నికరంగా చూస్తే.. రూ.5,800 మినహాయింపు తప్ప పెద్ద ప్రయోజనమేమీ లేదు. గతంలో వాస్తవంగా చెల్లించిన వైద్య ఖర్చులకు తగిన రుజువులు చూపించాల్సి ఉండేది. ఇకనుంచీ ఆ అవసరం ఉండదు. రూ.40వేలను నేరుగా రాయితీ పొందే అవకాశం ఏర్పడింది.
- ప్రస్తుతం.. సెక్షన్ 10(38) కింద ఎక్స్ఛేంజీల్లో నమోదైనా ఈక్విటీ షేర్లు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్ల ద్వారా వచ్చిన దీర్ఘకాలిక మూలధన లాభంపై ఎలాంటి పన్ను ఉండేది కాదు. ఇక నుంచీ ఈ దీర్ఘకాలిక మూలధన లాభం రూ.లక్ష దాటినప్పుడు ఆ మొత్తంపై 10శాతం పన్ను విధించనున్నారు. అయితే, దీన్ని గణించేప్పుడు ఇప్పటికే ఉన్న పెట్టుబడులపై జనవరి 31, 2018 వరకూ వచ్చిన లాభాలపై ఎలాంటి పన్ను విధించరు. ఫిబ్రవరి 1, 2018 నుంచి చేసిన కొత్త పెట్టుబడులపై ఇది తక్షణమే వర్తించేలా సవరణ చేశారు. దీని కోసం కొత్తగా 'సెక్షన్ 112ఏ' ప్రతిపాదించారు.
- విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ)లను కూడా ఈ నిబంధన కిందకు తీసుకొచ్చేందుకు 'సెక్షన్ 115ఏడీ'ని సవరించారు.

### సేవా సంస్థలూ పన్ను పరిధిలోకి..

సేవా సంస్థల పేరిట జరుగుతున్న అవకతవకలను అరికట్టే లక్ష్యంతో ఆర్థిక మంత్రి ప్రస్తుతం ఉన్న 'సెక్షన్ 40ఏ(3), (3ఏ)లకు కొన్ని సవరణలను ప్రతిపాదించారు.

కొన్ని సేవా సంస్థలు మూలం వద్ద ఎలాంటి పన్ను వసూలు చేయడం లేదు. అవి నిత్యం నిర్వహించే కార్యకలాపాలన్నీ నగదు రూపేణా జరుగుతున్నాయి. వీటన్నింటినీ నిరోధించే ఉద్దేశంతో ఇకపై సేవా సంస్థలు కూడా రూ.10 వేలు మించి ఎలాంటి ఖర్చు చేసినా నగదు రూపంలో చెల్లించరాదు. అంతేకాకుండా సేవా సంస్థలు ఇకపై వ్యాపార సంస్థల మాదిరిగానే మూలం వద్ద పన్ను వసూలు చేయాలి. ఒకవేళ పన్ను వసూలు చేయకుండా ఖర్చు చేసినప్పుడు ఆయా ఖర్చులపై 30శాతం వరకూ తగ్గించి, ప్రత్యేకంగా పన్ను విధిస్తారు.

- ప్రస్తుతం వ్యాపార లావాదేవీల్లో కొన్ని రకాల పరిహారాలు పన్ను పరిధిలోకి రావడం లేదు. ఈ బడ్జెట్‌లో దీన్ని సవరించారు. ఈ పరిహారాలపై ఇకపై పన్ను విధించే విధంగా సెక్షన్ 56ను మార్పు చేయనున్నారు.
- రవాణా వాహనాలను నిర్వహించేవారు 10 వాహనాలు దాటినప్పుడు అంచనా పద్ధతిలో ఆదాయాన్ని గణించేందుకు వెసులుబాటు ఉండేది. అయితే, ఈ నిబంధన పెద్ద వాహనాలు నడుపుతున్న వారు దుర్వినియోగం చేస్తున్నారనే కారణంతో 12 టన్నులకు మించి వాహనాలకు టన్నుకు నెలకు రూ.1,000 చొప్పున ఆదాయంగా చూపించాలనే నిబంధన విధించారు. దీనికి అనుగుణంగా సెక్షన్ 44ఏఈని మార్పు చేయనున్నారు. 12 టన్నుల లోపు ఉన్న వాహనాలకు పాత నిబంధనలే వర్తిస్తాయి.

## ఆదరణ పథంలో ఏపీవై




అటల్ పింఛను యోజన(ఏపీవై): దేశంలో ఎక్కువ మంది ప్రజలకు(60 ఏళ్లు వచ్చాకా) హామీ పూర్వక పింఛనును అందించేందుకు మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2015 మే 9న అటల్ పింఛను యోజన(ఏపీవై)ను ప్రవేశపెట్టింది. అసంఘటిత రంగంలోని కార్మికులు, ప్రభుత్వం నుంచి ఎటువంటి పింఛను పొందే పథకంలో లేని 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల భారత పౌరులెవరైనా ఈ పథకంలో చేరొచ్చు. కనిష్ఠంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.5,000 పింఛనును పొందేలా చందాదారులు చందా చెల్లింపును ఎంపిక చేసుకోవచ్చు.

**ఏపీవై విశిష్టతలు**

- ఈ పథకంలో చేరిన వారికి 60 ఏళ్లు వచ్చినప్పటి నుంచి పింఛను అందడం ప్రారంభమవుతుంది.
- ఉత్తర్‌ప్రదేశ్(11.41లక్షలు), బిహార్(8.87లక్షలు), తమిళనాడు(6.60లక్షలు) ఈ పథకంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.
- భారత పింఛను నిధి నియంత్రణ సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) ఈ పథకాన్ని నిర్వహిస్తోంది.
- 2017 ఆగస్టు చివరి నాటికి ఈ పథకంలో చేరిన చందాదారుల సంఖ్య 62 లక్షలు.
- 2018 జనవరి నాటికి 80 లక్షల మందికి పైగా సభ్యులుగా చేరారు.
- నాలుగు నెలల కాలంలోనే 18 లక్షల మంది ఈ పథకంలో కొత్తగా చేరడాన్ని బట్టి ఇటీవల కాలంలో ఈ పథకం పట్ల ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నారని అర్థమవుతోంది.
- చిన్న వయస్సులోనే ఈ పథకంలో చేరితే తక్కువ చందా మొత్తంతో ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

### 2018-19 ఆర్థిక సంవత్సరానికి వర్తించే పన్ను శ్లాబులు (వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు)

**60 ఏళ్ల లోపు వారందరికీ**



| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 2,50,000 | లేదు |
| రూ. 2,50,001-5,00,000 | 5 % |
| రూ. 5,00,001-10,00,000 | 20 % |
| రూ. 10,00,001- ఆపైన | 30 % |

**60-80 ఏళ్ల మధ్య వయసు వారందరికీ**



| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 3,00,000 | లేదు |
| రూ. 3,00,001-5,00,000 | 5 % |
| రూ. 5,00,001-10,00,000 | 20 % |
| రూ. 10,00,001- ఆపైన | 30 % |

**80 ఏళ్ల పైబడిన వారికి**

| ఆదాయ పరిమితి | పన్ను రేటు |
|---|---|
| రూ. 5,00,000 | లేదు |
| రూ. 5,00,001-10,00,000 | 20 % |
| రూ. 10,00,001- ఆపైన | 30 % |


## పన్ను ఆదాయంలో మనమెక్కడున్నాం?



**ట్యాక్స్-జీడీపీ రేషియో:** మన దేశంలో జరుగుతున్న సంపద సృష్టితో పోలిస్తే మనం కడుతున్న పన్నుల మొత్తం చాలా తక్కువగా ఉంటోంది. మన స్థూల జాతీయోత్పత్తిలో- పన్నుల రూపంలో సమకూరుతున్నది చాలా తక్కువగా ఉంటోందని చాలాకాలంగా ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్నే ఆర్థికవేత్తల పరిభాషలో 'ట్యాక్స్-జీడీపీ రేషియో' అంటారు.

**తక్కువుంటే:** ఇది తక్కువగా ఉంటోందంటే దానర్థం చాలావరకూ- సంపద సృష్టి జరుగుతున్నా, ఆర్జన బాగానే ఉన్నా ప్రజలు పన్నులు కట్టే విషయంలో అంతగా ముందుకు రావటం లేదనే!

**విదేశాల్లో:** అమెరికా, రష్యా, జర్మనీ, స్వీడన్ వంటి సంపన్న దేశాలతో పోలిస్తే ఈ పన్ను ఆదాయం విషయంలో మనం ఇప్పటికీ కొంత వెనకబడే ఉన్నాం.





దేశ ఆర్థిక రంగం విస్తరిస్తున్న కొద్దీ.. జీడీపీలో పన్నుల శాతం పెరుగుతుండాలి. కానీ ప్రస్తుతం మన ఆర్థిక రంగం విస్తరిస్తున్నంత వేగంగా పన్నుల ఆదాయం పెరగటం లేదు.

- దేశంలోని ఆర్జన పరుల్లో పన్ను కడుతున్నది 5.5%
- ప్రతి 100 మంది ఓటర్లకు కేవలం 7 గురు మాత్రమే పన్ను కడుతున్నారు. ఇది కనీసం 23% ఉండాలన్నది ఆర్థిక వేత్తల అంచనా.
- మొత్తం జాతీయ సంపాదనలో కేవలం 15.5% సంపద మాత్రమే పన్ను అధికారుల దృష్టికి వస్తోంది.
- సంపన్న దేశాల్లో పన్ను చెల్లింపు అనేది దాదాపుగా 90% వరకూ ఉంటోంది.

**ప్రపంచ దేశాల పరిస్థితి ఏమిటి?**


| | |
|---|---|
| చైనా | 19.4 |
| వియత్నాం | 22.2 |
| రష్యా | 23 |
| దక్షిణ కొరియా | 24.3 |
| అమెరికా | 25.4 |
| దక్షిణాఫ్రికా | 28.8 |
| టర్కీ | 29.3 |
| బ్రిటన్ | 32.9 |
| బ్రెజిల్ | 35.6 |



**పన్ను-జీడీపీ నిష్పత్తి తక్కువగా ఉందంటే అర్థం ఏమిటి?**

- పన్ను ఎగవేత ఎక్కువగా ఉండటం!
- తలసరి ఆదాయమే తక్కువగా ఉండటం
- అసంఘటిత రంగం చాలా ఎక్కువగా ఉండటం
- పన్ను పరిధిలో ఉన్న వారి సంఖ్యే తక్కువగా ఉండటం
- పన్ను వివాదాలు పరిష్కారం కాకుండా సాగుతుండటం
- పన్ను మినహాయింపులు, సబ్సిడీలు ఎక్కువగా ఉండటం

**మెరుగుపరచాలంటే ఏం చెయ్యాలి?**




- పన్ను చెల్లింపుదారుల పరిధిని పెంచాలి. జీఎస్‌టీ అమలుతో ఇది బాగా విస్తరించింది. దీన్ని మరింత కట్టుదిట్టం చెయ్యాలి.
- పన్ను ఎగవేతకు అడ్డుకట్ట వేసేలా పన్ను చట్టాలను మెరుగుపరచాలి.
- సబ్సిడీలను కేవలం లక్షిత వర్గాలకే పరిమితం చెయ్యటం.
- పన్నుల విషయంలో ఇస్తున్న రాయితీలు, మినహాయింపులను బాగా తగ్గించెయ్యటం
- పన్ను వివాదాలు వేగంగా పరిష్కృతమయ్యేలా చర్యలు తీసుకోవటం

## భయపెడుతున్న ఆదాయ అంతరాలు

భారత్‌లో ఆదాయ అంతరాలు విపరీతంగా పెరుగుతున్నాయి. 58% దేశ సంపద కేవలం 1% మంది చేతుల్లోనే ఉంది.

**దేశంలో కుబేరులు:**

2000లో: 9 మంది
2017లో: 101 మంది

గతేడాది కొత్తగా సంపన్నుల జాబితాలోకి వచ్చినవారు: 17

దేశంలో అట్టడుగునున్న 50% మందికి దేశ ఆదాయంలో 15% వాటా మాత్రమే



**దేశంలో 26% దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారు.**

(2012, టెండూల్కర్ కమిటీ నివేదిక)

ఒక వస్త్ర పరిశ్రమలో అత్యధిక వేతనం పొందే ఎగ్జిక్యూటివ్‌తో సమానంగా గ్రామీణ భారతంలోని కనీస వేతన కార్మికుడు సంపాదించాలంటే 941 ఏళ్లు పడుతుందని ఆక్స్‌ఫామ్ తేల్చింది.

**దేశంలో సంపదను శాసిస్తున్నది 1% మంది**

**ఏడాదిలో:**

- ఏడాదిలో పోగుపడిన సంపదలో 73% కేవలం 1% మంది సంపన్నుల చేతిల్లోకే వెళ్లింది.
- పేదలైన 67 కోట్ల మంది సంపద మాత్రం ఏడాదిలో 1% పెరిగింది.
- గత ఏడాది దేశంలోని కుబేరుల సంపద రూ.21 లక్షల కోట్లు పెరిగింది.

**ఎందుకీ అంతరాలు?**

- **వ్యవసాయం నుంచి పరిశ్రమలకు మళ్లటం:** వృద్ధి మందగమనంలో ఉండే వ్యవసాయం నుంచి జనాభా పెద్దఎత్తున శీఘ్ర వృద్ధి ఉండే పరిశ్రమలకు మళ్లుతుండటం ముఖ్యకారణం. ఇక పారిశ్రామిక రంగంలో కూడా కార్మికుల వేతనాలు తక్కువ. కాబట్టి కార్మికుల ఆదాయం పెద్దగా పెరగదు, అదే సమయంలో పెట్టుబడి పెట్టిన కొద్దిమంది సంపన్న పారిశ్రామికవేత్తల ఆదాయం మాత్రం శరవేగంగా పెరుగుతోంది.
- **కొద్దిమంది చేతుల్లోనే ఆస్తులు:** ఆదాయాన్ని ఆర్జించిపెట్టే ఆస్తులు భారత్‌లో కొద్దిమంది చేతుల్లోనే ఉన్నాయి. వాటిసాయంతో అనతికాలంలోనే సంపన్నులవుతున్నారు. ఆస్తులు లేనివారు నిరుపేదలుగా మిగిలిపోతున్నారు.
- **సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం:** దీంతో పేదలు మరింత పేదలుగా మారుతున్నారు.
- **ప్రాంతీయ అసమానతలు:** అధికశాతం పేదలు వెనుకబడిన ప్రాంతాల్లోనే ఉంటున్నారు.

# బడ్జెట్ 2018-19



## వ్యాపారం సరళం

సుపరిపాలన ప్రధాని లక్ష్యమని, ఆ దిశగా చేపట్టిన చర్యలు సరళతర వ్యాపార నిర్వహణ (ఈజ్ ఆఫ్ డూయింగ్‌బిజినెస్)లో దేశాన్ని ముందుకు తీసుకెళ్లాయని జైట్లీ చెప్పారు.

★ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మన దేశం గత మూడేళ్లలో 42 స్థానాలు దూసుకెళ్లింది. ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో 30 స్థానాలు ఎగబాకి తొలిసారి 100లోపు ర్యాంకుల్లో నిలిచింది. ఇందుకు కృషి చేసిన వారందరినీ అభినందించారు.

★ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రాష్ట్రాల్లోనూ మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తారు.

★ ఇందుకోసం 372 అంశాలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి రాష్ట్రాలకు పంపుతారు. రాష్ట్రాలు వీటిని ప్రాధాన్యంగా చేపట్టి ర్యాంకుల్లో పోటీపడాలి.


★ పరిశ్రమ వర్గాల నుంచి వచ్చే సమాచారం ఆధారంగా వ్యాపార నిర్వహణలో రాష్ట్రాల పనితీరు లెక్కిస్తారు.

# ఊరట మాట

❐ ఇ.ఎం.ఆర్.ఎస్. పథకం 2008లోనే తెరపైకి వచ్చినా అత్యధిక రాష్ట్రాలు ఆసక్తి చూపలేదు. 25 శాతం కంటే ఎక్కువ ఎస్టీల జనాభా ఉన్న 163 జిల్లాలను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ 2017 మార్చి నాటికి గుర్తించింది.

❐ వచ్చే ఐదేళ్లలో 672 మండలాల్లో పాఠశాలలు నిర్మించాలని కేంద్రం యోచిస్తోంది. ఇప్పటికే 112 జిల్లాల్లో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసింది. ఆరు నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

దిల్లీ: నవోదయ విద్యాసంస్థలతో సమానంగా 'ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల' (ఇ.ఎం.ఆర్.ఎస్.)లను అభివృద్ధి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి రానుంది. గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాల్లో వీటిని నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2022నాటికి గిరిజనులందర్నీ అక్షరాస్యులుగా చేయాలని భావిస్తోంది. మండల జనాభాలో సగానికి పైగా లేదా కనీసం 20 వేల మంది గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మిస్తారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ రూపొందించిన ఇ.ఎం.ఆర్.ఎస్. పథకం అమలు బాధ్యత పూర్తిగా రాష్ట్రాలదే. 2018లో ఆంధ్రప్రదేశ్‌లో ఐదు నుంచి ఏడు పాఠశాలలను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఇటీవల రూ.120 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. డిసెంబరు 26 నుంచి జనవరి 4 మధ్య పది పాఠశాలలు ప్రారంభించింది. తెలంగాణకు అదనంగా మరో 20 వరకు ఏకలవ్య పాఠశాలలు వచ్చే అవకాశముంది. తెలంగాణ గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే పది పాఠశాలలు నడుస్తున్నాయి.




### తగ్గిన ఉపకారవేతనాల నిధులు

ఎస్సీల పోస్టుమెట్రిక్ ఉపకారవేతనాల నిధులు కేంద్ర బడ్జెట్‌లో తగ్గాయి. 2017-18లో రూ.3,347 కోట్లు కేటాయించగా, తెలంగాణకు రూ.110 కోట్లు వచ్చాయి. తాజా బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.మూడువేల కోట్లకు పరిమితం చేయడంతో తెలంగాణకు వచ్చే నిధులూ తగ్గనున్నాయి.

### ఎస్సీ, ఎస్టీలకు పెరిగిన కేటాయింపులు *రూ.10,527 కోట్లు*

గత ఏడాదితో పోలిస్తే 2018-19 బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపులు రూ.10,527 కోట్లు పెరిగాయి. ఎస్సీలకు రూ.3900 కోట్లు, ఎస్టీలకు రూ.6627 కోట్లు చొప్పున పెంచారు. 2017-18లో ఎస్సీలకు రూ.52,719 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో రూ.56,619 కోట్లు కేటాయించింది. 2016-17లో ఈ కేటాయింపులు రూ.34,334 కోట్లు మాత్రమే. మరోవైపు ఎస్టీలకు 2017-18లో రూ.32,508 కోట్లు కేటాయించగా, తాజాగా రూ.39,135 కోట్లుకు పెంచింది. 2016-17లో ఈ కేటాయింపులు రూ.21,811 కోట్లు మాత్రమే. ప్రస్తుతం ఎస్సీలకు 279 పథకాలు, ఎస్టీలకు 305 పథకాల ద్వారా ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందుతున్నాయి.

## ఊతం

ఉపాధి మార్గాలను మెరుగుపరిచి.. యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. కొత్తగా చేరే ఉద్యోగులు 'ఉద్యోగ భవిష్య నిధి(ఈపీఎఫ్)'కి చెల్లించే 12శాతం మొత్తాన్ని మూడేళ్ల పాటు ప్రభుత్వమే భరిస్తుంది. ఇది అన్ని రంగాల్లో పనిచేసే వారికీ వర్తిస్తుంది. ఇప్పటికే 'ప్రధాన మంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహన్ యోజన(పీఎంఆర్‌పీవై) పథకంలో భాగంగా కొత్తగా చేరే ఉద్యోగులకు మూడేళ్ల పాటు 8.33శాతం మొత్తం ఈపీఎఫ్‌కు చెల్లిస్తున్నారు. ఈ శాతాన్ని పెంచి తాజాగా అన్ని రంగాలకు విస్తరించారు.

★ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండే చేనేత, చర్మ, పాదరక్షల తయారీ రంగాల్లో మాత్రమే ఇప్పటివరకు నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ఉద్యోగ నియామకాలకు అవకాశం ఉండేది. దీన్ని అన్ని రంగాలకు విస్తరించారు. దీని ప్రకారం పరిశ్రమలు తక్కువ కాలపరిమితి కోసం ఉద్యోగులను నియమించుకోవచ్చు. నిర్దిష్ట ప్రాజెక్టు పూర్తికాగానే ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంటుంది. ఈ ఉద్యోగులకు పరిశ్రమలో పనిచేసే కాలంలో శాశ్వత ఉద్యోగులకు లభించే అన్ని ప్రయోజనాలు కల్పిస్తారు.

## ఇప్పటికి వాటా 42%

కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకూ వాటా ఉంటుంది. ఈ వాటా ఎంత ఉండాలన్నది నిర్ధారించేది ఆర్థిక సంఘం. పన్ను ఆదాయం నికరంగా ఎంత ఉంటోందన్నది చూసి.. దాన్ని కేంద్ర, రాష్ట్రాల మధ్య ఏ నిష్పత్తిలో పంచాలో ఈ సంఘం ఖరారుచేస్తుంది. ఈ ఆర్థిక సంఘాన్ని ప్రభుత్వం 5 ఏళ్లకోసారి ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం 14వ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులు అమల్లో ఉన్నాయి.. కొత్తగా ఏర్పడిన 15వ ఆర్థిక సంఘం తన నివేదికను 2019లో సమర్పిస్తుంది.




**42%.. 14వ సంఘం సిఫార్సే!**

**గతంలో 13వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 32% వాటా ఇచ్చేవాళ్లు.**

**14వ ఆర్థిక సంఘం దీన్ని 42% చెయ్యాలని సిఫార్సు చేసింది. దానికి కేంద్రం కూడా అంగీకరించింది.**

**ఇతర సిఫార్సులు:**

- గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీలకు గ్రాంట్ల కింద రూ.**2.88** లక్షల కోట్లు పంపిణీ
- రెవెన్యూ లోటు అధికంగా ఉన్న **11** రాష్ట్రాలకు రూ.**48,906** కోట్లు ఇవ్వటం
- ఆర్థిక లోటును గణనీయంగా తగ్గించాలి. **2017-18** నాటికి ఈ లోటు జీడీపీలో **3%** దాటకూడదు.
- కేంద్ర ప్రాయోజిక పథకాలను క్రమేపీ తగ్గించాలి. వీటి అమల్లో రాష్ట్రాల బాధ్యత పెరగాలి.

### 14వ ఆర్థిక సంఘం:



- ఏర్పాటు: 2014 జనవరి
- ఛైర్మన్: డాక్టర్ వైవీ రెడ్డి (ఆర్‌బీఐ మాజీ గవర్నర్)
- సభ్యులు: సుష్మానాథ్, ఎం.గోవిందరావు, అభిజిత్ సేన్, సుదీప్తో ముండ్లే
- సిఫార్సుల అమలు కాలం: 2015-16 నుంచి 2019-20 వరకు

### 15వ ఆర్థిక సంఘం:



- ఏర్పాటు: 2017 నవంబరులో
- ఛైర్మన్: ఎన్‌కే సింగ్ (ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు)
- సభ్యులు: శక్తికాంత దాస్, అనూప్ సింగ్, ఆశోక్ లాహిరి, రమేష్ చంద్, అర్వింద్ మెహతా
- నివేదిక సమర్పణ గడువు: 2019 అక్టోబరు
- సిఫార్సుల అమలు కాలం: **2020-2025**
- బాధ్యత: కొత్తగా తెచ్చిన జీఎస్‌టీ ప్రభావాన్ని అంచనా వెయ్యటం. దానివల్ల రాష్ట్రాలు కోల్పోయే ఆదాయాన్ని ఏ విధంగా భర్తీ చేయాలనేది పరిశీలించటం.

## అభివృద్ధి సూచికలుగా 115 జిల్లాలు

సంఘటిత సమాజ నిర్మాణం కోసం వివిధ రంగాల్లో అభివృద్ధి సూచికలుగా రూపొందించడానికి దేశవ్యాప్తంగా 115 జిల్లాలను గుర్తించి వాటిపై కేంద్రం దృష్టి పెట్టనుంది. ఈ జిల్లాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి సామాజికాంశాలైన వైద్యం, విద్య, నైపుణ్య అభివృద్ధి, ఆర్థిక చేయూతతోపాటు మౌలికరంగాలైన నీటిపారుదల, గ్రామీణ విద్యుదీకరణ, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల సదుపాయాల కల్పనకు కాలపరిమితితో కూడిన లక్ష్యాలను నిర్దేశించుకుంది. అభివృద్ధికి నమూనాగా ఈ జిల్లాలు నిలుస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

## సబ్సిడీలు భారం తగ్గుతోంది.. బకాయిలే బూచి



**రాయితీలు.. ప్రభుత్వానికి తలకుమించిన భారంగా తయారవటంతో వీటిని తగ్గించుకునేందుకు మోదీ సర్కారు పలు సృజనాత్మక విధానాలను తెరపైకి తెచ్చి.. కొంత పురోగతి సాధించింది. కాకపోతే ఏళ్లుగా పేరుకున్న పాత బకాయిల భారం మాత్రం పెద్ద తలనొప్పిగానే ఉంది.**

### సృజనాత్మక మార్గాలు

- ☛ రాయితీ నేరుగా లబ్ధిదారులకే అందేలా ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ)
- ☛ ఆధార్ లింకేజీ ద్వారా నకిలీల నివారణ
- ☛ అధికాదాయం ఉన్న వారికి వంటగ్యాస్ రాయితీలో కోత
- ☛ సబ్సిడీ కిరోసిన్ వాడకం తగ్గించేందుకు భారీగా గ్యాస్ కనెక్షన్ల కేటాయింపు
- ☛ ఎరువుల పంపిణీలో లొసుగుల నివారణకు నేరుగా రైతులకే రాయితీలు

**భారం తగ్గుతోంది!**

| ఆర్థిక సంవత్సరం | మొత్తం రాయితీలు (రూ.కోట్లలో) | బడ్జెట్‌లో వాటా |
|---|---|---|
| 2013-14 | 2,54,632 | 16.33% |
| 2014-15 | 2,66,692 | 15.86 |
| 2015-16 | 2,43,811 | 13.72 |
| 2016-17 | 2,60,485 | 13.0% |
| 2017-18 | 2,29,716 | 16% |
| 2018-19 | 2,64,336 | 15% |

**2016-17లో ప్రత్యక్ష బదిలీల ద్వారా ఆదా రూ.57 వేల కోట్లు**

ప్రజా పంపిణీ: **14,000** కోట్లు

ఉపాధి హామీ: రూ.**11,741** కోట్లు

వంటగ్యాస్ 'పహల్' ద్వారా రూ.**29,769** కోట్లు

వృద్ధాప్య, వితంతు పింఛన్లలో రూ.**399** కోట్లు

### ఆహారానిదే అధిక భారం



జాతీయ ఆహార భద్రతా పథకం కింద దాదాపు 80 కోట్ల మందికి రాయితీ మీద ధాన్యాలను ఇచ్చేందుకు 'జాతీయ ఆహార భద్రతా పథకం' తెచ్చారు. దీంతో ఆహార రాయితీ అన్నది ప్రభుత్వానికి పెను భారంగా తయారైంది. అమల్లో అక్రమాల్ని నివారించినా బిల్లు మాత్రం తగ్గట్లేదు. ఆహార ధాన్యాల ధరలు తగ్గితేనే ప్రభుత్వానికి ఈ భారం తగ్గుతుంది.

**మొత్తం సబ్సిడీలు (రూ.కోట్లలో)**

| అంశం | 2017–18 బడ్జెట్ అంచనాలు | 2017–18 సవరించిన అంచనాలు | 2018–19 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|
| ఎరువులు | 70,000 | 64,974 | 70,080 |
| ఇందులో.. | | | |
| (ఫాస్పేట్, పొటాషియం) | | 22,252 | 25,090 |
| యూరియా | | 42,722 | 44,990 |
| ఆహారం | 1,45,339 | 1,40,282 | 1,69,323 |
| పెట్రోలియం | 25,000 | 24,460 | 24,933 |
| ఇందులో.. | | | |
| వంటగ్యాస్ | | 15,656 | 20,388 |
| కిరోసిన్ | | 8,804 | 4,555 |
| మొత్తం | 2,40,339 | 2,29,716 | 2,64,336 |

### ఎరువులదే రెండో స్థానం



ఎరువుల రాయితీ బకాయిల్ని తగ్గించడానికి సబ్సిడీ మొత్తాన్ని పెంచాలని ఎరువుల పరిశ్రమ కోరుతున్నా.. ప్రభుత్వం మాత్రం 2018-19లో దీనిని రూ.70,080 కోట్లకే పరిమితం చేసింది. రైతుకు ఎరువులు అమ్మినట్లు ధ్రువీకరణ అయిన 7 రోజుల్లోగా నేరుగా వారి ఖాతాల్లో రాయితీ మొత్తాన్ని వేయడం, బకాయిల్ని ఏకమొత్తంగా పరిష్కరించడం, అవసరం.

### పెట్రో



వంటగ్యాస్ రాయితీని వదులుకోవాలంటూ ప్రభుత్వం పెద్దఎత్తున చేసిన ప్రచారం ఫలించింది. ఇక కిరోసిన్ రాయితీలకూ కోతవెయ్యనున్నారు. కిరోసిన్ ధర మూణ్ణెల్లకోసారి లీటర్‌కు 25 పైసలు పెంచాలని ఆదేశించారు. కిరోసిన్ వాడకం కాలుష్యాని పెంచుతోందంటూ.. గ్రామీణులకు విరివిగా వంటగ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నారు. దీంతో 2016-17లో గ్రామీణ ప్రాంతాల్లో కిరోసిన్ వాడకం బాగా తగ్గింది.

### బకాయిల బరువు

**రాయితీ చెల్లింపుల విషయంలో మోదీ సర్కారు సకాలంలో స్పందిస్తున్నా.. ఇప్పటికీ ఇంకా రూ.1.25 లక్షల కోట్ల మేర గత బకాయిలు పేరుకున్నాయి. ముఖ్యంగా ఆహారం, ఎరువుల సబ్సిడీలే పెద్ద బకాయిలు.**

**ఎఫ్‌సీఐకి చెల్లించాల్సిన బకాయి: దాదాపు లక్ష కోట్లు**

**ఎరువుల కంపెనీలకు: రూ.23 వేల కోట్లు**

# ప్రాజెక్టులకు కొంతే!

ఈనాడు, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నామమాత్రంగానే సాయం అందనుంది. అవసరమైతే నాబార్డు నుంచి రుణంగా తీసుకోవడం తప్ప, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కావలసిన నిధులు కేంద్రం నుంచి నేరుగా రాష్ట్రాలకు అందే అవకాశం తక్కువే. దీనికి కారణం ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులే. సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద అమల్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు, వినియోగంలో ఉండి పూర్తిగా ఆయకట్టుకు నీరందని ప్రాజెక్టుల కింద పలు కార్యక్రమాలు చేపట్టడం, చిన్న నీటి వనరులు, భూగర్భజల వనరుల అభివృద్ధి ఇలా పలు కార్యక్రమాలను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఏఐబీపీతో సహా అన్ని నీటి వనరులకు సంబంధించిన అన్ని పథకాలనూ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పరిధిలో చేర్చింది. సత్వరసాగునీటి ప్రయోజన పథకం కింద గుర్తించి పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు తెలంగాణలో ఐదు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో మూడు ఉన్నాయి. రెండు రాష్ట్రాలకు కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్రవాటాగా సుమారు రూ.500 కోట్లకు పైగా రావల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు కేవలం రూ.13 కోట్లు మాత్రమే వచ్చాయి. దేశవ్యాప్తంగా 99 ప్రాజెక్టుల కింద గ్యాప్ ఆయకట్టు తగ్గించడానికి, నీటి వినియోగ సామర్థ్యం పెంచడానికి, రైతుల్లో అవగాహన పెంచడానికి కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ మరో కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో తెలంగాణ నుంచి 28 ప్రాజెక్టులు, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎనిమిది ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిని చేపట్టడానికి జలవనరుల మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. కేంద్రవాటాగా రెండు రాష్ట్రాలకు సుమారు రూ.1,700 కోట్లు అవసరమవుతాయి. దేశ మొత్తం మీద కనీసం రూ.ఆరేడువేల కోట్లు అవసరం. కానీ ఈ పథకాలకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించలేదు. రూ.ఆరువేల కోట్లు నాబార్డుకు కేటాయించింది. ఈ మొత్తాన్ని నాబార్డు ఆరుశాతం వడ్డీకి రాష్ట్రాలకు రుణంగా ఇస్తుంది తప్ప గ్రాంటు కాదు. రూ.2,600 కోట్లు ఏఐబీపీ కింద కేటాయించింది. ఇందులో రూ.2,300 కోట్లు నాబార్డుకు అసలు, వడ్డీ కింద చెల్లించడానికి కేటాయించింది. పోలవరం ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఎలాంటి కేటాయింపు చేయలేదు. నాబార్డు ద్వారా పోలవరం ప్రాజెక్టుకు ఇస్తే, కేంద్రం ఈ రూ.2,300 కోట్ల నుంచి నాబార్డుకు వడ్డీతో సహా చెల్లిస్తుంది. ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలనుకొన్న 48 ప్రాజెక్టులకు, గ్యాప్ ఆయకట్టు తగ్గించే ప్రాజెక్టులకు, చిన్ననీటి వనరుల పథకాలకు ఇలా అన్నింటికి ఈ రూ.2,300 కోట్ల నుంచి వడ్డీ, అసలు చెల్లించాల్సిందే. మరో 50 ఉపరితల నీటి అభివృద్ధి పథకాలు కూడా పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఒక్క ఫరక్కా బ్యారేజి నిర్వహణకు మాత్రమే కేంద్రం ప్రత్యేకంగా రూ.195 కోట్లు కేటాయించింది తప్ప జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన పోలవరానికి కూడా ఇవ్వలేదు.

### *నిరుడు పోలవరానికి రూ.1,297 కోట్లు*

ఈనాడు, దిల్లీ : పోలవరం ప్రాజెక్టుకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.1,297.58 కోట్లు మంజూరుచేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత ఏడాది బడ్జెట్‌లో చెప్పిన అంశాల అమలు గురించి వివరిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద నాబార్డు ద్వారా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు రూ.1,720.68 కోట్లు మంజూరుచేయగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే రూ.1,297.58 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది. ఏపీ రాజధాని నిర్మాణం కోసం వినూత్న పద్ధతిలో చేపట్టిన భూసమీకరణ పద్ధతిని ప్రోత్సహిస్తూ క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ రాయితీని అమలుచేసినట్లు పేర్కొంది. 2014 జూన్ 2 నాటికి భూములున్న వారందరికీ ఈ ప్రయోజనం వర్తింపజేసినట్లు తెలిపింది.

### *తెలంగాణకు తాగునీటికోసం రూ.440 కోట్లు*


రక్షిత తాగునీటికోసం తెలంగాణకు గత ఏడాది రూ.440.51 కోట్లు ఇచ్చినట్లు కేంద్రం వెల్లడించింది.

## మహాత్ముడి జయంతి వేడుకల సన్నాహాలకు రూ.150 కోట్లు

దిల్లీ: మహాత్మా గాంధీ 150వ జయంతి వేడుకలను ఏడాదిపాటు(2019 అక్టోబరు 2 నుంచి 2020 అక్టోబరు 2 వరకు) ఘనంగా నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకుగాను ప్రధాని మోదీ అధ్యక్షతన జాతీయ కమిటీ ఏర్పాటైంది. ఈ వేడుకల కోసం తాజా బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించింది.

## 'నీటిపారుదల'కు అత్తెసరే

దేశంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం ఈసారి అంతంతమాత్రంగానే నిధులివ్వనుంది. ప్రాజెక్టులకు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన(పీఎంకేఎస్‌వై) కింద నిధులు సమకూరుస్తోంది. మరికొన్నింటిని తానే స్వయంగా చేపడుతోంది. పీఎంకేఎస్‌వైలో భాగమైన ఏఐబీపీ కింద దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం **99** ప్రాజెక్టులకు నిధులు అందిస్తోంది. ఈ **99** ప్రాజెక్టులకు కేంద్రం **25%** నిధులు సమకూరుస్తుంది. మిగతా **75** శాతాన్ని రాష్ట్రాలే భరించాలి. గిరిజన ప్రాంతాలు, రైతు ఆత్మహత్యల జిల్లాల్లో అమలయ్యే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం గతంలో **90%** నిధులు అందించేది. ఇప్పుడు దానిని **60** శాతానికి కుదించింది.


ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులకు ఇలా...

**పీఎంకేఎస్‌వై కింద అమలవుతున్న పథకాలు**

1. సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ)
2. వాటర్‌షెడ్ కార్యక్రమం పర్ డ్రాప్ మోర్
3. క్రాప్(బొట్టు బొట్టుకీ మరింత పంట)
4. హర్ ఖేత్ కో పానీ(ప్రతి పొలానికీ నీరు)

- పోలవరం ప్రాజెక్టు(దీన్ని కేంద్రమే అమలు చేస్తోంది)కు తాజా బడ్జెట్లో కేటాయింపులేమీ లేవు.
- 2017-18లో ఈ ప్రాజెక్టుకు ఇచ్చిన మొత్తం-**979.36** కోట్లు
- ప్రాజెక్టులకు రుణాలిచ్చేందుకు నాబార్డుకు రూ.6 వేల కోట్ల కేటాయింపు.
- ఏఐబీపీ కింద రూ.2,600 కేటాయింపు
- పీఎంకేఎస్‌వై కింద సాయం అందించే ప్రాజెక్టుల్లో ఏపీలో **8** ప్రాజెక్టులున్నాయి. ఇవి పూర్తికావాలంటే ఇంకా రూ.**1093.49** కోట్లు అవసరం. ఇందులో కేంద్ర వాటా కింద **2017-18**లో రూ.**112.05** కోట్లు రావాలి.

# ఆడపడుచులకు అండదండలు




దిల్లీ: ఆడపడుచులకు బడ్జెట్ తీపి కబురే అందించింది. మహిళా సంక్షేమం, ప్రగతే లక్ష్యంగా ఉద్దేశించిన పథకాలకు కేటాయింపులు నాలుగు శాతం పెరిగాయి. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధిత పథకాలకు చేసిన కేటాయింపుల మొత్తం 1,21,961.32 కోట్లు కాగా.... 2017-18లో సవరించిన బడ్జెట్ అంచనాల మొత్తం 1,17,221.47 కోట్లుగా ఉంది.

- మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని జాతీయ పౌష్టికత మిషన్(ఎన్ఎన్ఎం)కు కేటాయింపులు ఏకంగా మూడురెట్లు పెంపు. రూ.3వేల కోట్ల నిధుల కేటాయింపు. గతేడాది ఈ మొత్తం రూ.950 కోట్లే.
- రక్తహీనత, శిశువుల్లో బరువు లోపం, పోషకాహారలోపాల తగ్గింపునకు ఎన్ఎన్ఎం కృషి.
- 'బేటీ బచావో-బేటీ పఢావో' పథకానికి రూ.280 కోట్లు. 2017-18కి సవరించిన బడ్జెట్ అంచనాల మొత్తం రూ.186.04 కోట్లు.
- మహిళా హెల్ప్‌లైన్‌కు 2017-18లో రూ.10కోట్లు కేటాయించగా.. ఈ దఫా రూ.28.8 కోట్ల కేటాయింపు.
- జాతీయ మహిళా కమిషన్‌కు 2018-19కి రూ.24 కోట్ల కేటాయింపు. గతేడాది కంటే ఈ దఫా నిధుల తగ్గింపు.
- ఆడపిల్లల అక్రమ రవాణా నిరోధానికి ఉద్దేశించిన పథకానికి రూ.60 కోట్లు. గతేడాది ఈ మొత్తం రూ.35 కోట్లు.
- 'నిర్భయ నిధి'కి పెరిగిన నిధుల మొత్తం. ఈ ఏడాదికి రూ.19.75 కోట్లు. 2017-18కి సవరించిన అంచనాల ప్రకారం రూ.11.20 కోట్లు. అయితే, 2018-19కి నిర్భయ నిధి నుంచి సంబంధిత ఇతర పథకాలకు కేటాయింపుల మొత్తం తగ్గింది. రూ.359.09 కోట్ల కేటాయింపు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం ఈ మొత్తం రూ.4 వందల కోట్లు.
- 'ప్రధానమంత్రి మాతృవందన యోజన'కు 2018-19కి కేటాయింపులు రూ.2400 కోట్లు. గతేడాది ఈ మొత్తం రూ.2,594.55 కోట్లు.
- ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద పేద మహిళలకిచ్చే ఉచిత గ్యాస్ కనెక్షన్ల సంఖ్య లక్ష్యం మరో మూడుకోట్లు పెరిగింది. ఇదివరకటి లక్ష్యం అయిదుకోట్ల కనెక్షన్లుగా ఉన్న విషయం గమనార్హం. మొత్తం కలిపితే నిరుపేద ఇల్లాలికి ఇచ్చే ఉచిత వంటగ్యాసు కనెక్షన్ల సంఖ్య లక్ష్యం 8 కోట్లకు చేరింది.
- మహిళా స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ)కు ఇచ్చే రుణాల మొత్తం 2019 నాటికల్లా రూ.75 వేల కోట్లకు పెంపు. సేంద్రియ సాగు దిశగా వారికి ప్రోత్సాహం. జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద చేపట్టేందుకు చేయూత.

**2016–17లో చేసిన కేటాయింపులు రూ.42,500 కోట్లు**

**మహిళా సంక్షేమంలో వ్యయ అంచనాలు రూ. కోట్లలో....**

| | |
|---|---|
| 2017–18 సవరించిన అంచనాలు... | 1,17,221.47 |
| 2018–19 అంచనాలు | 1,21,961.32 |



## నగరాలకు అమృతం

2020 నాటికి పూర్తికానున్న అమృత్ పథకంలో దేశవ్యాప్తంగా 500 నగరాల్లో ఇంటింటికీ తాగు నీటి సరఫరాకు పనులు జరుగుతున్నాయి. ఈ నగరాల్లో రూ.77,640 కోట్లతో రాష్ట్ర స్థాయి పథకాలు ఆమోదం పొందాయి. రూ.19,428 కోట్లతో 494 ప్రాజెక్టులకు తాగునీటి సరఫరా; రూ.12,429 కోట్లతో 272 మురుగునీటి పారుదల ప్రాజెక్టులు మంజూరు అయ్యాయి.


అమృత్ పట్టణాలైన ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, నల్గొండ, నిజామాబాద్, రామగుండం, సూర్యాపేట, వరంగల్, జీహెచ్‌ఎంసీ, సిద్ధిపేటలలో రూ.702.98 కోట్లు వ్యయం చేయనున్నారు. ఇందులో కేంద్రం రూ.351 కోట్లు అందించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం ఇప్పటి వరకూ రూ.70 కోట్లు విడుదల చేసింది.

**బడ్జెట్ 2018-19**

# ఎంతైనా సరే

- 2018-19 బడ్జెట్‌లో రూ.85,010 కోట్ల కేటాయింపు
- గత ఏడాది కన్నా రూ.3,141 కోట్లు అధికం
- కొత్తగా విద్యా వ్యవస్థల, మౌలిక సదుపాయాల పునరుత్తేజ(రైజ్) కార్యక్రమం..
- వచ్చే నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడి
- ప్రతిభావంతులైన వెయ్యి మంది బీటెక్ విద్యార్థులకు ప్రధాన మంత్రి విశిష్ట సభ్యత్వాలు
- నల్లబల్లల స్థానంలో క్రమీణా డిజిటల్ బోర్డులు
- గిరిపుత్రులకు ఏకలవ్య గురుకుల పాఠశాలలు
- భోధనలో నాణ్యత పెంచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ
- మరిన్ని ప్లానింగ్, ఆర్కిటెక్చర్ విద్యా సంస్థల ఏర్పాటు

మన విద్యారంగంలో వెనకబాటుతనాన్ని తొలగించి.. ఒకవైపు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు, మరోవైపు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేందుకు కేంద్రం కసరత్తులు ఆరంభించింది. ఇందుకోసం గత ఏడాదిలో కొన్ని కీలక చర్యలు తీసుకుంది.




## విద్యోదయానికి ఆరు అశ్వాలు

**గురువుల్లేని చదువులు!**

ఆచార్య పోస్టుల ఖాళీలు..
- కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో: 53.28%
- ఐఐటీల్లో: 35%
- ఎన్ఐటీల్లో: 47%
- ఐఐఎంలలో: 26.01%

**కళాశాలల సాంద్రత**

18-23 ఏళ్ల వయసున్న ప్రతి లక్షమందికి అందుబాటులో ఉన్న కాలేజీలు:
- సగటు: 28
- గరిష్ఠం: తెలంగాణ–59
- ఏపీ–45
- కనిష్ఠం: బిహార్–7

**ప్రైవేటే ఎక్కువ**

- దేశంలో 77.8% కళాశాలలు ప్రైవేటు యాజమాన్యాల చేతిలో ఉన్నాయి.
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో అత్యధికంగా 81% కళాశాలల్ని పూర్తిగా ప్రైవేటు యాజమాన్యాలే నిర్వహిస్తున్నాయి.

**దేశంలో ఉన్నత విద్య ఇలా...**

- విశ్వవిద్యాలయాలు: 864
- కళాశాలలు: 40,026
- గ్రామీణ కళాశాలలు: 59.3%
- స్వయం ప్రతిపత్తి విద్యా సంస్థలు: 11,669
- మహిళా విద్యా సంస్థలు: 9.3%
- పీహెచ్‌డీ కోర్సులున్నవి: 2.6%
- పీజీ కోర్సులు అందిస్తున్నవి: 36.7%

**జీడీపీలో పరిశోధనలకు వెచ్చిస్తున్నదిలా...**

భారత్: 0.85%
- చైనా: 2.1%
- అమెరికా: 2.74%
- జపాన్: 3.58%
- ద.కొరియా: 4.29%

"విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావటంలో సఫలమయ్యాం. అయితే, నాణ్యమైన విద్యనందించటం ఇప్పటికీ సవాల్‌గానే ఉంది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యను విభాగాల వారీగా కాకుండా ఏకఖండంగా సమగ్ర దృష్టితో చూడాలి. విద్యను డిజిటలీకరించే చర్యలను వేగవంతం చేయాలని ప్రతిపాదిస్తున్నాం. నల్లబల్లల నుంచి క్రమంగా డిజిటల్ బోర్డులకు మళ్లాలి"

–కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

**విద్యకు కేటాయింపులు(రూ.కోట్లలో)...**

| 2016–17 (వాస్తవిక) | 2017–18 (బడ్జెట్ అంచనా) | 2017–18 (సవరించాక) | 2018–19 (బడ్జెట్ అంచనా) |
|---|---|---|---|
| 72016 | 79686 | 81869 | 85010 |

దేశంలో ప్రతి చిన్నారికీ విద్యావకాశాలను చేరువచేయటంతో పాటు వారి చదువులు నాణ్యమైనవిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యించింది. అదే సమయంలో ఆధునిక వసతుల కల్పన, ఉన్నత విద్యలో సంస్కరణలు, డిజిటలీకరణకు ప్రాధాన్యమిచ్చింది. ఉన్నత విద్యా సంస్థల నిధుల కొరత సమస్యను అధిగమించేందుకు కొత్త మార్గాన్ని ప్రతిపాదించింది. పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల శిక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం ఏకీకృత బీఎడ్ కార్యక్రమాన్ని ముందుకుతెచ్చింది. విద్యా బోధనలో ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించనుంది. తరగతి గదుల్లో నల్లబల్లల స్థానంలో డిజిటల్ బోర్డులు రానున్నాయి.

అశిక్షితులైన 13 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు విద్యాహక్కు చట్టానికి చేసిన సవరణను ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే అందించేందుకు ఏకలవ్య గురుకుల పాఠశాలలను రాష్ట్రాల భాగస్వామ్యంతో నెలకొల్పనున్నారు. ఈ లక్ష్యాన్ని 2022కల్లా పూర్తి చేయాలని నిర్దేశించారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో పరిశోధనలకు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన భారీ నిధులు సమకూర్చేందుకు "విద్యా వ్యవస్థల మౌలికసదుపాయాల పునరుత్తేజం" (రైజ్) కార్యక్రమాన్ని ప్రతిపాదించారు. వచ్చే నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులను ప్రతిపాదించారు. దీనికోసం ఉన్నత విద్య పెట్టుబడుల సంస్థ (హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్సింగ్ ఏజెన్సీ-హెచ్ఈఎఫ్ఏ) ఆవిర్భవించనుంది.

- కొత్తగా రెండు పూర్తిస్థాయి స్పా (స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్)ల స్థాపన. స్వయంప్రతిపత్తి గల మరో 18 స్పాలను ఐఐటీలు, ఎన్ఐటీల ప్రాంగణాల్లో నెలకొల్పటం.
- దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో బీటెక్ చదివే వెయ్యి మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రధాన మంత్రి విశిష్ట సభ్యత్వ (ఫెలోషిప్) పథకం కింద ఐఐటీలు, ఐఐఎస్సీ (ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ సైన్సెస్)లలో పీహెచ్‌డీలు చేసే అవకాశం. పరిశోధకత్వానికి ఆకర్షణీయమైన ఉపకారవేతనాలు అందజేస్తారు.
- వైద్యులు, రోగుల నిష్పత్తి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు కనీసంగా ప్రతి మూడు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఒక వైద్య కళాశాల ఏర్పాటు.
- ఉన్నత విద్యలో పెద్ద ఎత్తున సంస్కరణలను ప్రవేశపెట్టే దిశగా ఈ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులను సమకూర్చేందుకు సరికొత్త నమూనాను అనుసరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలు తమకు అవసరమైన మొత్తం నిధుల్లో 25శాతం వరకూ ఆ విధానంలో సేకరిస్తారు.

## నైపుణ్యమస్తు

Skill India

**2020** నాటికి **50** కోట్ల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో **2015**లో ఎన్డీయే సర్కారు 'నైపుణ్య భారత్'కు పునాదేసింది. దీని కింద ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై 2.0), దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన, జాతీయ శిక్షణ ప్రోత్సాహక పథకం తదితర కార్యక్రమాలను చేపట్టింది. వీటికి ఏటా నిధులను మంజూరు చేస్తోంది.

**పీఎంకేవీవై కింద ఏంచేశారు?**

- **2017** మే వరకు **28** లక్షల మందికిపైగా యువతకు వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ.
- **2016-17**లో **5,57,787** మంది; **2017-18**లో **4,37,440** మంది ఉత్తీర్ణత.
- **2018** జనవరి నాటికి వీరిలో **2,30,601** మందికి ఉద్యోగాల కల్పన.

| | 2016-17 | 2017-18 | 2017-18 సవరించిన అంచనాలు | 2018-19 |
|---|---|---|---|---|
| నైపుణ్యాభివృద్ధి, వ్యాపార వ్యవస్థాపకతకు కేటాయింపులు | 2,173 | 3,016 | 2,356.22 | 3,400 |

(రూ. కోట్లలో)



**ఉద్యోగాల్లో మనమెక్కడ?**

**15-29** ఏళ్ల భారతీయ యువతలో **30.83%** మందిని 'నిరుద్యోగం, అవిద్య, శిక్షణలేమి (నీట్)' పీడిస్తోంది. ఆర్థిక సహకారాభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) సభ్య దేశాల సగటు నీట్ కంటే భారత్‌ది రెండు రెట్లు ఎక్కువ. చైనా నీట్ కంటే మూడురెట్లు అధికం.

**నీట్ %**

- చైనా: 11.22
- రష్యా: 14.04
- బ్రెజిల్: 19.96
- భారత్: 30.83
- దక్షిణాఫ్రికా: 36.65
- ఓఈసీడీ సగటు: 14.56

## ఎన్‌టీఏకి నిధుల మద్దతేదీ?

### రూ.10 కోట్ల కేటాయింపుతో సరి

**ఈనాడు, హైదరాబాద్:** జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)ను ఏర్పాటు చేసిన కేంద్రం బడ్జెట్‌లో నామమాత్రపు నిధులతో సరిపెట్టింది. ప్రస్తుతం జేఈఈ మెయిన్, యూజీసీ నెట్, నీట్‌లను సీబీఎస్‌ఈ నిర్వహిస్తోంది. ఇక కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు(సీమ్యాట్), గ్రాడ్యుయేట్ ఫార్మసీ అడ్మిషన్ టెస్టు(జీప్యాట్)లను ఏఐసీటీఈ జరుపుతోంది. దీనివల్ల ఆయా సంస్థలు పనిభారాన్ని ఎదుర్కొంటూ ఉండటంతో పరీక్షల నిర్వహణకు కేంద్రం ఎన్‌టీఏను ఏర్పాటు చేసింది. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించడం, పరీక్షల విధానాన్ని మార్చడం, ఫలితాలను వేగంగా ఇవ్వడం తదితర మార్పులు చోటుచేసుకుంటాయని నిపుణులు భావించారు. తాజా బడ్జెట్‌లో దీనికి కేవలం రూ.10 కోట్లు మాత్రం కేటాయించడం గమనార్హం. ఇప్పటికే జాతీయస్థాయి పరీక్షలకు ప్రకటనలు జారీ అయ్యాయి. ఆయా పాత సంస్థలే నిర్వహిస్తున్నందున వచ్చే బడ్జెట్‌లో ఎన్‌టీఏకు ఎక్కువ నిధులు కేటాయించే అవకాశం ఉందని విద్యావేత్తలు చెబుతున్నారు.

## 'రక్షణ'లో స్వావలంబనే లక్ష్యం

**దిల్లీ:** రక్షణ రంగంలో స్వావలంబన సాధించడంపై.. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం దృష్టి పెట్టింది. దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు.. ప్రభుత్వ, ప్రైవేటు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అనుకూలంగా ఉండే 'రక్షణ ఉత్పత్తి విధానా'న్ని ఈ ఏడాది తీసుకురానున్నట్లు ప్రకటించింది. దేశంలో రెండు రక్షణ పారిశ్రామిక ఉత్పత్తి నడవాలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. వీటిలో మొదటి నడవాను చెన్నై, బెంగళూరులను కలుపుతూ తమిళనాడులో ఏర్పాటు చేయనున్నట్లు రక్షణమంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించారు. ఇటు సరిహద్దుల్లో చైనా, పాకిస్థాన్‌లతో సవాళ్లు పెరుగుతున్న తరుణంలో.. రక్షణ బడ్జెట్‌లో గణనీయ పెరుగుదల ఉంటుందన్న అంచనాలు నెరవేరలేదు. నామమాత్రపు పెంపుతోనే కేంద్రం సరిపెట్టింది.

- 2018-19కు గానూ రక్షణ రంగానికి రూ.2.95 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్రం కేటాయించింది. మొత్తం బడ్జెట్‌లో ఇది 12.1%. గతేడాది (రూ.2.74 లక్షల కోట్లు) కన్నా ఈసారి రక్షణ బడ్జెట్‌ను కేవలం 7.81% పెంచారు. సవరించిన అంచనాలతో (రూ.2.79 లక్షల కోట్లు) పోలిస్తే ఈ పెంపు 5.91% మాత్రమే.
- తాజా రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయం రూ.99.9 వేల కోట్లు. కేంద్ర బడ్జెట్‌లోని మొత్తం మూలధన వ్యయంలో దీని వాటా 33.1%. నూతన ఆయుధాలు, యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు, ఇతర సైనిక సామగ్రి కొనుగోలుతో పాటు.. ఆధునికీకరణ చర్యల కోసం దీన్ని ఖర్చు చేస్తారు. గతేడాది రక్షణ బడ్జెట్‌లో మూలధన వ్యయంగా రూ.86.5వేల కోట్లు కేటాయించారు. అయితే తాజా కేటాయింపులు సైన్యం ఆధునీకరణకు సరిపోవని రక్షణ నిపుణులు అభిప్రాయపడ్డారు.
- రెవెన్యూ వ్యయంగా రూ.1.96 లక్షల కోట్లను ఈసారి కేటాయించారు. వేతనాలు, సైనిక వ్యవస్థల నిర్వహణ తదితర చెల్లింపులకు దీన్ని ఖర్చు చేస్తారు.
- ఇవి కాకుండా రూ.1.08 లక్షల కోట్లను రక్షణ రంగంలో పింఛన్ల కోసమే కేటాయించారు. వీటిని బడ్జెట్‌లో కలపలేదు. గతేడాది అంచనాలతో పోలిస్తే ఇవి 26.6% పెరిగాయి.
- సరిహద్దు ప్రాంతాలకు అనుసంధానతను పెంచడంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సెలా పర్వతమార్గం కింద సొరంగ నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించింది. జమ్ముకశ్మీర్‌లోని లద్దాఖ్ ప్రాంతానికి అన్ని కాలాల్లోనూ చేరుకునేలా.. రోహ్‌తాంగ్ సొరంగం నిర్మాణం ఇప్పటికే పూర్తైంది. 14 కి.మీ.ల పొడవైన జోజిలా సొరంగ నిర్మాణ కాంట్రాక్టుకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.
- పాకిస్థాన్, చైనా సహా చాలా దేశాలు దేశ జీడీపీలో కనీసం 2% రక్షణరంగానికి కేటాయిస్తున్నాయి. అయితే భారత్ మాత్రం 1.58% మాత్రమే కేటాయించింది. 1962 తర్వాత.. రక్షణకు జీడీపీలో అత్యల్ప వాటాను భారత్ ఇప్పుడే ఇచ్చింది.

**రక్షణ బడ్జెట్ 2017-18**

| అంచనాలు | సవరించిన అంచనాలు |
|---|---|
| రూ. 2.74 లక్షల కోట్లు, | రూ. 2.79 లక్షల కోట్లు |

**రక్షణ బడ్జెట్ 2018-19**

అంచనాలు రూ. 2.95 లక్షల కోట్లు

## 'స్వచ్ఛ'ంగా ముందడుగు!

స్వచ్ఛ భారత్

పరిసరాల శుభ్రతపై ప్రజల్ని చైతన్యపరచి పరిశుభ్ర భారత్‌ను ఆవిష్కరించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ అభియాన్ (ఎస్‌బీఏ) కార్యక్రమాన్ని చేపట్టింది.

**నిర్మించిన మరుగుదొడ్లు ఎన్ని?**

- గ్రామీణ: 6.01 కోట్లు
- పట్టణ: 40.84 లక్షలు

**బహిరంగ మలవిసర్జన రహిత**


- గ్రామాలు: 3.13 లక్షలు
- జిల్లాలు: 307
- రాష్ట్రాలు: 10
- పట్టణాలు: 1,698

**కమ్యూనిటీ/ పబ్లిక్ టాయిలెట్లు:** 2.34 లక్షలు

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే ఏర్పాటున్న వార్డులు **51,734**

**ఐదేళ్లలో..**

- **లక్ష్యం:** పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, బహిరంగ మల విసర్జన నిర్మూలించటం, పరిశుభ్ర భారత్‌ను ఆవిష్కరించటం
- **ప్రారంభం:** 2014 అక్టోబరు 2. గాంధీజీ 150వ జయంతిని పురస్కరించుకొని 2019 అక్టోబరు2 నాటికి పూర్తి లక్ష్యం సాధించాలి.
- **విమర్శ:** ఈ కార్యక్రమం మరుగుదొడ్ల నిర్మాణం చుట్టూ తిరుగుతుందనే అభిప్రాయం ఉంది. మురుగునీటి పారుదల సౌకర్యం, మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, తాగునీటి వసతి, వ్యర్థాల నిర్వహణపై దృష్టిలేదనే ఆరోపణలున్నాయి.



| సంవత్సరం | ఎస్‌బీఎం గ్రామీణ్ | ఎస్‌బీఎం అర్బన్ | ఎస్ఆర్ఎంఎస్ |
|---|---|---|---|
| 2014-15 | 2,850 | 1,691 | 47 |
| 2015-16 | 6,525 | 1,000 | 5 |
| 2016-17 | 10,500 | 2,300 | 1 |
| 2017-18 | మూడు విభాగాలకు కలిపి 19,248 | | |

- ఎస్‌బీఎం- స్వచ్ఛభారత్ మిషన్
- ఎస్ఆర్ఎంఎస్- సఫాయీ కర్మచారుల పునరావాసం పథకం

**ఇవీ సాధించాం**

చెత్త నుంచి విద్యుత్తు: **88.4** మెగావాట్లు

చెత్త నుంచి కంపోస్టు: **1.64** లక్షల టన్నులు (2016లో...)

**2017 పురోగతి** స్వచ్ఛభారత్ అమలులో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ముందుంది.

## స్వచ్ఛ భారత్‌కు నిధుల కోత

- కేటాయింపు: రూ.17,843 కోట్లు
- ఇందులో గ్రామీణ ప్రాంతాలకు: రూ.15,343 కోట్లు
- పట్టణ/నగర ప్రాంతాలకు: రూ.2,500 కోట్లు. (పట్టణ ప్రాంతాలకు రూ.200 కోట్ల బడ్జెట్ పెరిగింది)
- 2017–18 బడ్జెట్ కేటాయింపు: 19,248 కోట్లు. **లక్ష్యం:** వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 కోట్ల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం
- బహిరంగ మల విసర్జన 20% నుంచి 10% తగ్గింపు
- గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు గోబర్-ధాన్ (గాల్వనైజింగ్ ఆర్గానిక్ బయో-ఆగ్రో రీసోర్సెస్ ధాన్) ప్రాజెక్టును తెస్తున్నారు. పశువుల పేడ, ఘన వ్యర్థాలను కంపోస్ట్, ఎరువు, బయో సీఎన్‌జీగా మార్చేందుకు ఈ పథకాన్ని రూపొందించారు.

## 'భారత్‌లో తయారీ'కి ఊతం

- భారత్‌లో తయారీకి(మేక్ ఇన్ ఇండియా) ఊతమిచ్చేందుకు గాను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకం 15శాతం నుంచి 20 శాతానికి పెంపు. ఆ ఫోన్ల కొన్ని విడిభాగాలు, ఉపకరణాలపై కూడా 15శాతానికి పెంపు.
- కొన్ని టీవీ విడిభాగాలపై 15 శాతం కస్టమ్స్ సుంకం విధింపు.

## మేక్ ఇన్ ఇండియా.. విజయానికి సుదూరం

**మేక్ ఇన్ ఇండియా: మూడు లక్ష్యాలు**

1. తయారీ రంగాన్ని విస్తరించటం
2. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించటం
3. ఉద్యోగాల కల్పన

**అంచనా**

తయారీ రంగం పునరుత్తేజితం కావటానికి 'మేకిన్ ఇండియా' దోహదపడింది. ఓ నినాదంగా ఇది విజయవంతం అయినట్లే. ఆచరణలో మాత్రం ఫలితాలు ఇంకా కనిపించాల్సి ఉంది.


**వేతనాల సమస్య**

తయారీ రంగ విస్తరణకు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనా నైపుణ్యం ఉన్న నిపుణులు కావాలి. మంచి వేతనాలు ఉంటేనే వీళ్లుంటారు. మన తయారీ రంగం ఈ విషయంలో మెరుగుపడాలి.




చైనాలో: 2016లో ఫ్యాక్టరీ కార్మికుల గంట పని వేతనం 3.60 డాలర్లు.
భారత్‌లో: చైనా చెల్లించే దానిలో ఐదో వంతే

**నేపథ్యం** మేడిన్ జపాన్ నుంచి మేకిన్ ఇండియా వరకూ!



**రెండో ప్రపంచ యుద్ధం తర్వాత..** కుంగిన తమ ఆర్థిక వ్యవస్థను బాగుచేసుకునేందుకు జపాన్ పెద్దఎత్తున తయారీ రంగంలో విస్తరించింది. గృహోపకరణాలు, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల వంటివి తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేసింది. కానీ వాటి నాణ్యత శూన్యం. నెమ్మదిగా దీన్ని సవాల్‌గా తీసుకుని సిక్స్-సిగ్మా, కైజన్, టీక్యూఆర్ వంటి నాణ్యత ప్రమాణాలతో జపాన్ తయారీ రంగంలో శిఖరాయమానంగా ఎదిగింది.



**రెండు దశాబ్దాల క్రితం..** చైనా కూడా జపాన్ బాటలో ప్రయాణిస్తూ తయారీ రంగానికి పెద్దపీట వేసింది. కానీ తొలిదశలో చైనా వస్తువులూ నాసిరకమే. చైనావంటే 'చీప్'వనుకునే పరిస్థితి. కానీ ఇప్పుడు చైనా కూడా దాన్ని అధిగమించి, నాణ్యతాప్రమాణాలను సాధిస్తోంది.

**భారత్‌కు స్ఫూర్తి:** జపాన్, చైనాలే స్ఫూర్తికావొచ్చు.. నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తూనే 'తయారీ రంగం' ప్రాధాన్యం పెంచారు. 2014 సెప్టెంబరులో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.

**ఏం చేశారు?**


- పౌర విమానయానం, ఆటో, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్ తదితర 25 రంగాల్లో విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

2014 అక్టోబరు నుంచి 2016 మధ్య 61.58 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లభించాయి. **వృద్ధి 46%**

గత బడ్జెట్‌లో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు ప్రకటించిన చర్యలు

◆ 50 కోట్ల వరకూ టర్నోవరున్న చిన్న, మధ్యతరహా సంస్థలకు ఆదాయపు పన్ను తగ్గింపు ◆ విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ) రద్దు. ◆ మ్యాట్ క్రెడిట్‌ను 15 ఏళ్లకు వర్తింపజేయటం ◆ ఎలక్ట్రానిక్ తయారీని ప్రోత్సహించేందుకు దశల వారీ తయారీ కార్యక్రమం (పీఎంపీ) విస్తరణ ◆ రక్షణ తయారీలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 51 శాతానికి పెంచటం ◆ నాలుగు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) కేంద్రాలను ఏర్పాటు.

# బడ్జెట్ 2018-19



## స్వచ్ఛతకు అరకొరే

బహిరంగ మల విసర్జన రహితంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆశలపై కేంద్ర బడ్జెట్ నీళ్లు చల్లింది. రాష్ట్రంలోని పురపాలక, నగరపాలక సంస్థల్లో ఇప్పటికే 2,14,645 వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ప్రకటించారు. గ్రామీణంలో మరో 27,20,086 మరుగుదొడ్లు నిర్మించి నాలుగు జిల్లాలను బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతాలుగా ధ్రువీకరించారు. మిగిలిన తొమ్మిది జిల్లాల్లోనూ మార్చిలోగా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా ప్రకటించే యోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం స్వచ్ఛ భారత్ మిషన్‌కు బడ్జెట్‌లో రూ.17,843 కోట్లనే కేటాయించడం నిరాశ కలిగించింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇతర పనుల కోసం ఈ ఏడాది ఇప్పటివరకు రూ. వెయ్యి కోట్లకుపైగా వెచ్చించారు. పల్లెల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల అవసరం ఎక్కువగా ఉన్నందున కొత్త ఆర్థిక సంవత్సరంలో అత్యధిక నిధులు వస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ఏదీ వినియోగం

**4% సెస్.. 10% సర్‌ఛార్జి!**

వ్యక్తిగత ఆదాయపన్ను, కార్పొరేట్ పన్నుపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 4శాతం 'ఆరోగ్య, విద్యా సెస్' విధించింది. ప్రస్తుతం 2శాతం ప్రాథమిక విద్యాసెస్, 1శాతం మాధ్యమిక, ఉన్నత విద్యాసెస్... రెండూ కలిపి 3 శాతం సెస్ వసూలు చేస్తున్నారు. ఈ రెండింటి స్థానంలో 4 శాతం ఆరోగ్య, విద్యా సెస్‌ను ప్రతిపాదించారు. పేదలు, గ్రామీణ ప్రజల విద్య, వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ సెస్ విధిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఈ సెస్ వల్ల కేంద్ర ప్రభుత్వానికి రూ. 11,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా.

**సెస్ స్థానంలో సర్‌ఛార్జి:** దిగుమతి చేసుకున్న వస్తువులపై ఇప్పటి వరకూ విద్యా సెస్, మాధ్యమిక, ఉన్నత విద్యా సెస్ అమల్లో ఉంది. వీటిని ఈ బడ్జెట్‌లో రద్దు చేశారు. ఆ స్థానంలో 10 శాతం సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జి విధించారు. దీన్ని దిగుమతి చేసుకున్న వస్తువులపై వసూలు చేసే కస్టమ్స్ పన్ను మీద లెక్కిస్తారు. విద్యా సెస్ నుంచి ఇప్పటికే మినహాయింపు ఉన్న వస్తువులకు సర్‌ఛార్జి నుంచి కూడా మినహాయింపు ఉంటుంది. కొన్ని వస్తువులకు మాత్రం 3 శాతం సర్‌ఛార్జి వర్తిస్తుంది.

**లీటరుకు రూ.8 చొప్పున రోడ్డు సెస్:** పెట్రోలు, డీజిల్ మీద ప్రాథమిక ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ. 2 తగ్గించారు. రూ. 6 అదనపు ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేశారు. కానీ వాటి స్థానంలో లీటరుకు రూ. 8 చొప్పున రోడ్డు సెస్ ప్రవేశపెట్టారు. దీనివల్ల పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గినప్పటికీ వినియోగదారుడికి అంతగా ప్రయోజనం ఉండటం లేదు.

**జీఎస్‌టీ తర్వాత..:** జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన ఫలితంగా పలు పరోక్ష పన్నులు జీఎస్‌టీలో కలిసిపోయాయి. వాటిపై ఏ నిర్ణయమైనా జీఎస్‌టీ కౌన్సిల్‌లోనే తీసుకోవాలి. కేంద్ర ఆర్థిక శాఖ తనకు తానుగా ఆ పన్ను రేట్లలో మార్పు చేయలేదు. అందువల్ల ఈసారి ఆర్థిక మంత్రి కస్టమ్స్ పన్నుల్లో మార్పులకు మాత్రమే పరిమితం అయ్యారు. అంతేగాక కొంతమేరకు ఆదాయాన్ని పెంచుకోవటానికి సెస్‌లు- సర్‌ఛార్జిల మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.

## వసూళ్లే గానీ.. వినియోగమేదీ?



**టీ సెస్సు, పంచదార సెస్సు, విద్యా సెస్సు, స్వచ్ఛభారత్ సెస్సు, రహదారి భద్రతా సెస్సు.. ఇలా ఎడాపెడా వాయించిన బోలెడన్ని సెస్సుల గురించి విన్నారు కదా... జీఎస్‌టీ పుణ్యమాని ఈ సెస్సుల మోత బాగానే తగ్గిపోయింది. మంచిదే. ఎందుకంటే మన ముక్కుపిండి ఈ సెస్సులనైతే వసూలు చేశారుగానీ.. వీటిని కచ్చితంగా ఆయా అవసరాలకే వాడిన దాఖలాల్లేవు.**

సెస్‌లు, సర్‌ఛార్జిల రూపంలో వసూళ్లు (రూ.కోట్లలో)

| | |
|---|---|
| 2014-15 | 75,533 |
| 2015-16 | 83,997 |
| 2016-17 | 2,35,308 |
| 2017-18 | 1,69,662* |

* బడ్జెట్ అంచనా

ప్రభుత్వానికి పన్నులే ప్రధాన ఆదాయం. పన్ను రూపేణా వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వం చాలా రకాల అవసరాలకు వాడుతుంది. ఇలా కాకుండా ఏదో ఒక ప్రత్యేక లక్ష్యం, అవసరం కోసం ప్రజల నుంచి నేరుగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు 'సెస్'లు విధిస్తుంది. విద్యా సెస్, స్వచ్ఛభారత్ వంటివన్నీ ఇలా వచ్చినవే. ఇలా వసూలు చేసిన సెస్సును ప్రభుత్వం కచ్చితంగా ఆ అవసరానికే వాడాలి. ఉదాహరణకు 'స్వచ్ఛభారత్ సెస్' పేరుతో వసూలు చేసిన సొమ్మును స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకే వాడాలి. కానీ మనదేశంలో ఇలా జరగటం లేదు. సెస్సుల నిధులు ఖర్చుకాకుండా మిగిలిపోతున్నాయి లేదా ఇతరత్రా అవసరాలకు మళ్లిపోతున్నాయి.

### మూలుగుతున్న నిధులు

ఘన లక్ష్యాలతో నానా సెస్సులు వసూలు చేసినా ఆ సొమ్మును నిర్దేశిత ప్రయోజనాలకు వెచ్చించటం లేదు.

- 2006-07 నుంచి 2016-17 మధ్య రూ. 83,497 కోట్ల విద్యాసెస్ వసూలు చేశారుగానీ.. వాటిని సంబంధిత నిధికి బదిలీ చేయలేదు.
- 1996-97 నుంచి 2016-17 మధ్య రూ. 7,885 కోట్ల పరిశోధన-అభివృద్ధి సెస్ వసూలు చేశారు. అందులో రూ. 7,226 కోట్లు నిరుపయోగంగా పడిఉన్నాయి.
- 2015-16, 2016-17ల్లో రూ. 16,401 కోట్ల స్వచ్ఛభారత్ సెస్ వసూలయ్యాయి.. గానీ అందులో రూ. 4,001 కోట్లు ఖర్చు కాలేదు.

(కాగ్ నివేదిక)

## వెలవెలబోతున్న 'ఆకర్షణీయం'



**నిధులున్నా ఖర్చు చేయడంలేదు**

నరేంద్ర మోదీ ప్రభుత్వం 2015, జూన్ 25న ప్రవేశపెట్టిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఆకర్షణీయ నగరాలు(స్మార్ట్‌సిటీస్). దేశంలో 100 నగరాలను ఐదేళ్లలో (2017-2022) పౌర అనుకూల, సుస్థిర అభివృద్ధి కేంద్రాలుగా మార్చడం దీని లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆకర్షణీయ నగరాల కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 2018 జనవరి నాటికి 99 నగరాలు ఆకర్షణీయ నగరాల కార్యక్రమానికి ఎంపికయ్యాయి.

**ప్రస్తుత పరిస్థితి**

- ఆకర్షణీయ నగరాల అభివృద్ధి కార్యక్రమం నత్త నడకన నడుస్తోంది. కేంద్రం విడుదల చేసిన నిధులను కనీసం ఖర్చు చేసిన పరిస్థితి లేదు.
- 2015-16 నుంచి ఇప్పటి వరకూ కేంద్రం 60 ఆకర్షణీయ నగరాల కోసం రూ. 9,860 కోట్లను కేటాయించింది.
- ఒక్కో నగరానికి రూ. 196 కోట్లను కేటాయించగా అహ్మదాబాద్ మాత్రం రూ.80 కోట్లు పైగా ఖర్చు చేసి నిధుల వినియోగంలో ముందుంది. ఇండోర్(రూ. 70.69కోట్లు), సూరత్(రూ. 43.41కోట్లు), భోపాల్(42.86 కోట్లు) తరువాత స్థానాల్లో ఉన్నాయి.
- ఆకర్షణీయ నగరాల్లో అభివృద్ధి పనులకు చాలా రాష్ట్రాలు తమ వంతు వాటా నిధులను కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి.
- ఇదే పరిస్థితి కొనసాగితే 2022 నాటికి దేశంలో 100 ఆకర్షణీయ నగరాలను రూపొందించే లక్ష్యం నెరవేరడం కష్టసాధ్యమే.

**ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి**

- విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి నగరాలను ఆకర్షణీయ నగరాల జాబితాలో చేర్చారు. ఆపై అమరావతిని కూడా ఎంపిక చేశారు.
- మూడు నగరాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 600 కోట్లు కేటాయించాయి.
- విశాఖలో ఇప్పటి వరకు రూ. 15 కోట్లకు మించి ఖర్చు చేయలేదు.
- కాకినాడ, తిరుపతిలో పనుల కోసం టెండర్లు పిలిచారు.
- 2019-20 నాటికి మరో రూ. 600 కోట్లు ఖర్చు చేయాలి.

- ఆకర్షణీయ నగరాలకు కేటాయింపు: రూ. 6,169 కోట్లు
- 2017-18 బడ్జెట్ కేటాయింపు: రూ. 4 వేల కోట్లు
- అధికం: 54%
- ఎంపిక చేసిన 99 నగరాల్లో మొత్తం రూ. 2.04 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నారు.
- ఇప్పటివరకూ రూ. 2,350 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తిచేశారు.
- రూ. 20,852 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయి.
- ఈ నగరాల్లో స్మార్ట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం, స్మార్ట్ రహదారులు, సోలార్ పైకప్పులు, అధునాతన రవాణా వ్యవస్థ, స్మార్ట్ ఉద్యానవనాల నిర్మాణాలు ప్రారంభించారు.
- గృహ, పట్టణ వ్యవహారాల (హెచ్‌యూఏ) మంత్రిత్వశాఖకు కేటాయింపులు: రూ. 41,765 కోట్లు (నగరాభివృద్ధి, గృహ, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వ శాఖలను కలిపి.. హెచ్‌యూఏగా ఏర్పాటు చేశారు. ఈ శాఖకు 2017-18లో 40,618కోట్లు కేటాయించారు)

# బడ్జెట్ ప్రాధాన్యం తగ్గుతోందా?

కేంద్ర బడ్జెట్ ఎంతో పెద్ద కసరత్తు. దేశంలోని అన్ని రంగాల మీద ఎంతో ప్రభావాన్ని చూపేదిగా బడ్జెట్‌కు ప్రాధాన్యం ఉంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వైఖరి ఏమిటి? ఏవిధంగా ముందుకు వెళ్లాలనుకుంటోంది? అనేది బడ్జెట్‌లో కనిపిస్తుంది. పలు కీలకమైన నిర్ణయాలు, మార్పులను బడ్జెట్ ద్వారా ప్రభుత్వం వెల్లడిస్తుంది. సామాన్య ప్రజల నుంచి అసామాన్యుల వరకూ ప్రతిఒక్కరూ తమపై బడ్జెట్ నిర్ణయాల ప్రభావం ఎంతా ఉంటుందోనని ఎదురుచూస్తారు. కానీ ఇదంతా... ఒకప్పుడు. ఇప్పుడు బడ్జెట్‌లో కీలకమైన నిర్ణయాలు ఉండటం లేదు. కీలకమైన నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రకటించటం, పన్ను సంస్కరణలు, సంబంధిత ఇతర మార్పులను పరిగణలోకి తీసుకుంటే బడ్జెట్‌కు ప్రాధాన్యం తగ్గిపోతున్నట్లు స్పష్టమవుతోంది.

### పరోక్ష పన్నులు

పరోక్ష పన్నులన్నింటినీ చాలా వరకూ జీఎస్‌టీ కిందకు తీసుకువచ్చారు. జీఎస్‌టీ తగ్గింపు, పెంపుదల... లేక కొత్తగా విధింపు, తొలగింపు... ఏదైనా జీఎస్‌టీ కౌన్సిల్ పరిధిలోని అంశం. దీంతో బడ్జెట్‌లో పరోక్ష పన్ను రేట్ల హెచ్చుతగ్గుల ప్రస్తావన తగ్గిపోయింది. కస్టమ్స్ పన్నుల్లో మార్పులు, సర్‌ఛార్జిలు, సెస్‌ల విధింపునకు మాత్రమే పరిమితం కావలసిన పరిస్థితి ఉంది.

### ఈ కేంద్ర పన్నులు జీఎస్‌టీలో కలిశాయి..

- కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ
- అదనపు ఎక్సైజ్ డ్యూటీలు
- ప్రత్యేక అదనపు కస్టమ్స్ డ్యూటీ
- కొన్ని సర్‌ఛార్జిలు, సెస్‌లు
- సేవా పన్ను

### జీఎస్‌టీలో కలిసిన రాష్ట్ర పరోక్ష పన్నులు

- వ్యాట్
- కేంద్ర అమ్మకం పన్ను
- లగ్జరీ పన్ను
- ఎంట్రీ ట్యాక్స్
- వినోదపు పన్ను
- ప్రకటనలపై పన్ను
- కొనుగోలు పన్ను
- కొన్ని సర్‌ఛార్జిలు, సెస్‌లు

### ప్రత్యక్ష పన్నులు

వ్యక్తిగత ఆదాయ పన్ను, వ్యాపార సంస్థలు చెల్లించే కార్పొరేట్ పన్ను, సంపద పన్ను ప్రత్యక్ష పన్నుల కిందకు వస్తాయి. ఆదాయ పన్ను శ్లాబుల్లో మార్పులు, పరిమితిలో హెచ్చుతగ్గులు ఏమైనా ఉంటే... వాటి ప్రస్తావన బడ్జెట్‌లో ఉంటోంది.

### ప్రణాళిక, ప్రణాళికేతర...

గతంలో బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయం... అనే విభాగాలు ఉండేవి. ప్రణాళికా వ్యయం... అంటే మూలధన వ్యయం. రెవెన్యూ ఖర్చును ప్రణాళికేతర వ్యయంగా భావిస్తారు. గత బడ్జెట్ నుంచి ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం... అనేది తొలగించారు.


### ఇక లెక్కల పత్రమేనా?

ఈ పరిస్థితుల్లో కేంద్ర బడ్జెట్ ప్రధానంగా జమా, ఖర్చుల లెక్కకు పరిమితం అవుతోంది. ఆదాయం ఎంత? ఖర్చు ఎంత? అనే లెక్కలు తప్పిస్తే బడ్జెట్‌లో అనూహ్యమైన లేదా ఆశ్చర్యం కలిగించే ప్రతిపాదనలు ఉండటం లేదు. సమీప భవిష్యత్తులో బడ్జెట్ అనేది పెద్ద సందర్భంగా ఉండకపోవచ్చు. ఇతర బిల్లులు, చట్టాల మాదిరిగానే బడ్జెట్ కూడా ఏటా ఒక సారి వచ్చిపోయేదిగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్ర బడ్జెట్ అనేది ఒక సందర్భమే కాదు- అని ఇప్పటికే పలువురు నిపుణులు, విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### రద్దయిన రైల్వే బడ్జెట్

- రైల్వే బడ్జెట్ బ్రిటిష కాలం నాటి సంప్రదాయం. సాధారణ బడ్జెట్‌తో కాకుండా విడివిడిగా రెండు రోజుల ముందు రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టేవారు. గత ఏడాది నుంచి ఇది రద్దయింది. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌లో కలిపివేశారు. ఇతర శాఖల మాదిరిగానే రైల్వే శాఖకు కూడా సాధారణ బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్నారు.
- రైలు ఛార్జీలు పెంపుదల లేదా తగ్గింపు నిర్ణయం కోసం దేశ ప్రజలందరూ రైల్వే బడ్జెట్ వైపు చూసే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రైల్వే ఛార్జీల నిర్ణయం, నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం ఒక నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనుంది.
- పూర్తి స్వతంత్రంగా వ్యవహరించే రైల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌డీఏ) ఏర్పాటుకు గత ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇది కార్యరూపం దాల్చితే ఛార్జీల పెంపు లేదా తగ్గింపు అంశాల్లో తుది నిర్ణయం ఆర్‌డీఏదే అవుతుంది.
- కొత్త రైల్వే ప్రాజెక్టుల్లో రాష్ట్రాలు భాగం పంచుకోవాలని రైల్వే శాఖ కోరుతోంది. రాష్ట్రాలు కూడా అందుకు ముందుకు వస్తూ, సగం వరకూ ఖర్చు భరించేందుకు సిద్ధపడుతున్నాయి. అందువల్ల అటువంటి ప్రతిపాదనల కోసం బడ్జెట్ వచ్చే వరకూ ఎదురుచూడాల్సిన అవసరం కూడా ఉండటం లేదు.

# 'నలుపు'పై ఎన్నో అస్త్రాలు



**నల్లధనం నిగ్గు తేల్చేందుకు మోదీ సర్కారు ప్రధానంగా రెండు అస్త్రాలు సంధించింది**

**1 బినామీ లావాదేవీల్ని కట్టడి చేసేందుకు చట్టాలు**

**బినామా లావాదేవీల్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు**

- బినామీ లావాదేవీల(నిషేధం) సవరణ చట్టం, 2016. నల్లధనం నిరోధానికి ఈ చట్టం తెచ్చారు.
- నల్లధనంపై ఇద్దరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులతో 2014లో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు.
- పనామా, ప్యారడైజ్ పేపర్ల లీక్‌లలో వెలుగులోకి వచ్చిన పేర్లపై పరిశీలనకు మ్యాగ్(మల్టీ- ఏజెన్సీ గ్రూప్) ఏర్పాటు.
- షెల్ కంపెనీలపై టాస్క్‌ఫోర్స్.
- నగదు లావాదేవీలపై రూ.2 లక్షల పరిమితి విధింపు.
- పాన్ నెంబర్లతో ఆధార్ అనుసంధానం.
- భారత్-మారిషస్, భారత్- సింగపూర్ దేశాల మధ్య ఉన్న పన్ను ఒప్పందాల సవరింపు.

**2 స్వచ్ఛంద ఆదాయ వెల్లడికి పలు పథకాల ప్రకటన**



**విదేశీ నల్లధనం పథకం**

నల్లధనం(వెల్లడించని విదేశీ ఆదాయం, ఆస్తులు), పన్ను విధింపు చట్టం, 2015

**లక్ష్యం:** భారతీయులు విదేశీ స్వర్గాల్లో దాచుకున్న నల్లధనం వెలుగులోకి తేవటం

**పథకం:** వెల్లడించిన విదేశీ ఆదాయం, ఆస్తులపై 30% పన్ను చెల్లించాలి.

**అమలు:** 2015 జులై 1 నుంచి 3 నెలలు

**ఫలితం:** నామమాత్రమే



**ఆదాయ వెల్లడి పథకం-2016**

**లక్ష్యం:** దేశీయంగా ఉన్న నల్లధనాన్ని బయటకు తేవటం

**పథకం:** వెల్లడించిన నల్లధనంపై 30% పన్ను, ఆ పన్నుపై 25% అపరాధ రుసుము, మరో 25% సర్‌ఛార్జి= మొత్తం 45%

**అమలు:** 2016 జూన్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకూ

**ఫలితం:** 71,726 మంది రూ.67,382 కోట్ల నల్లధనాన్ని వెల్లడించారు.

(వీటితో ఫలితం కొంతమేరే కనిపించింది.)

**గతంలో ప్రభుత్వాలు అమలుచేసిన పథకాలు**

| | |
|---|---|
| 1961 | త్యాగి పథకం |
| 1965 | బ్లాక్ స్కీమ్ |
| 1965 | నేషనల్ డిఫెన్స్ గోల్డ్ బాండ్స్ |
| 1975 | వీడీఎస్ |
| 1997 | వీడీఐఎస్ |

### ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన (పీఎంజీకేవై)

**లక్ష్యం:** పెద్ద నోట్ల రద్దు తర్వాత- నల్లధనాన్ని తప్పనిసరిగా బయటపెట్టాల్సిన వారి నుంచి భారీగా పన్ను వసూలుచేయడం.

**పథకం:** ప్రకటించిన నల్లధనంపై పన్ను, అపరాధ రుసుము, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ సెస్... మొత్తం కలిపి 50% చెల్లించాలి. మిగతా 50%లో 25% సొమ్మును బ్యాంకుల్లో నాలుగేళ్ల కాలానికి వడ్డీ లేని డిపాజిట్ కింద పెట్టాలి. ఇక సంబంధిత వ్యక్తికి మిగిలేది మిగతా 25 శాతమే.

**అమలు:** 2016 డిసెంబరు 16 నుంచి 2017 మార్చి 31 వరకు. తర్వాత మరో రెండు నెలలు పొడిగించారు.

**ఫలితం:** రూ లక్ష కోట్ల నల్లధనం వెలుగు చూస్తుందని ప్రభుత్వం ఆశించినా... రూ.5,000 కోట్లే వచ్చాయి.

## నల్లధనం కట్టడికి మరిన్ని చర్యలు

### పెద్దనోట్ల రద్దు 'నిజాయతీపరుల పండగ'

నల్లధనం కట్టడికి తీసుకున్న వివిధ రకాల చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. మరిన్ని చర్యలకు ప్రయత్నిస్తాం. పన్ను ఎగవేతదారులను కట్టడి చేయడం ద్వారా గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 90,000 కోట్లు రాబట్టగలిగాం. పెద్దనోట్ల రద్దు అనేది 'నిజాయతీపరుల పండగ'. నల్ల కుబేరుల ఆట కట్టిస్తూనే నిజాయతీగా పన్నులు కట్టేవారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపడతాం. నగదు చలామణిని నిరుత్సాహపరచడానికి, అత్యధికశాతం లావాదేవీలను పన్ను పరిధిలోకి వచ్చేలా చూడ్డానికి ప్రయత్నాలు చేస్తున్నాం. వారందరికీ తగిన ప్రతిఫలాలు ముట్టేలా చూస్తాం. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లలో గణనీయమైన వృద్ధిరేటు నమోదైంది.


★ గత ఆర్థిక సంవత్సరం (2016-17) ప్రత్యక్ష పన్నుల్లో 12.6 శాతం వృద్ధి కనిపించింది. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) జనవరి 15 నాటికి అది 18.7 శాతానికి చేరింది.

### నోట్ల రద్దుతో సత్ఫలితాలు

- నోట్ల రద్దు తర్వాత వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 2016-17లో కొత్తగా నమోదైనవారి సంఖ్య 85.51 లక్షలు ఉండగా అది అంతక్రితం నాటి ఆర్థిక సంవత్సరంలో అది 66.26 లక్షలు మాత్రమే ఉంది.
- 2014-15 ఆర్థిక సంవత్సరం ఆరంభంలో 6.47 కోట్ల ఉన్న ఆదాయపు పన్ను చెల్లిపుదారుల సంఖ్య 2017 మార్చి నాటికి 8.27 కోట్లకు చేరింది.
- డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా పేదలకు మేలు చేసే లక్ష్యంతో మరిన్ని చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నాం. పెద్దనోట్ల రద్దు తర్వాత మార్కెట్లో నగదు చలామణి గణనీయంగా తగ్గింది. డిజిటల్ లావాదేవీలు పెరిగాయి.
- దీనివలన పన్ను వసూళ్లు భారీగా పెరుగుతున్నాయి.

## పేదల ఆకాంక్షలను నెరవేర్చే బడ్జెట్


- **'ఆయుష్మాన్ భారత్'ను మోదీకేర్ అంటున్నారు: అమిత్‌షా**



**దిల్లీ:** పేదప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఈ బడ్జెట్ ఎంతగానో ఉపకరిస్తుందని భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా పేర్కొన్నారు. సమాజంలోని అన్నివర్గాలు అభివృద్ధి చెందాయని బడ్జెట్ చాటిచెప్పిందన్నారు. 2022 నాటికి కొత్త భారత్‌ను ఆవిష్కరింపజేయాలన్న ప్రభుత్వ ఆశను సాకారం చేయడంలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉపకరిస్తుందన్నారు. ఇది ప్రజల బడ్జెట్ అని, దేశాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తుందన్నారు. రైతులు, మౌలికవసతులు, గ్రామీణరంగం, చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గ్రామీణ, వ్యవసాయరంగాలకు రికార్డు స్థాయిలో నిధులు కేటాయించడం వల్ల అపూర్వమైన అభివృద్ధి జరగనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పేదలు, రైతులు, మధ్యతరగతివారి ఆశలు నెరవేర్చే బడ్జెట్‌గా అమిత్‌షా అభివర్ణించారు. సమాజంలోని అన్ని రంగాలు సాధికారత సాధించడానికి ఉపకరిస్తుందన్నారు. పది కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా కల్పించాలన్న 'ఆయుష్మాన్ భారత్' పథకంతో ఆరోగ్య హామీ కూడా లభించనుందన్నారు. దీనిపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని, 'మోదీకేర్'గా అభివర్ణిస్తున్నారని తెలిపారు.

## రూ.2.5 లక్షల లావాదేవీలున్న సంస్థలకు 'పాన్' తప్పనిసరి

వార్షిక ఆర్థిక లావాదేవీలు రూ. 2.5 లక్షలు ఉన్న అన్ని సంస్థలకూ శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ఈ నిబంధన అమల్లోకి రానుంది. 'పాన్' ఆయా సంస్థల విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనీక్ ఎంటిటీ నెంబర్)గా ఉపయోగపడుతుంది. ఆ సంస్థ తరఫున మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్, భాగస్వామి, ట్రస్టీ, సీఈవో, వ్యవస్థాపకుడు లేదా అధికారంగల సంబంధిత వ్యక్తులు పాన్ కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపుదారుల సంఖ్యను పెంచుకోవడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.



“అధిక జనాభా కలిగిన వ్యవసాయ ప్రధానమైన దేశంలో, ఎన్నికల ముందు కూడా వృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది. కీలకమైన గ్రామీణ మార్కెట్లలో వృద్ధికి ప్రేరణ కలిగించేలా రూపొందించారు. 10 కోట్ల పేద కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ పథకం ఎంతో హర్షణీయం. అభివృద్ధి చెందిన సమాజానికి ఇదే వాస్తవిక బాట.”

- మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా



**బడ్జెట్ 2018-19**

## కార్పొరేట్ పన్ను

### 25 శాతమే

→ రూ.250 కోట్ల టర్నోవరు వరకు కంపెనీలకే
→ ఎమ్ఎస్ఎమ్ఈలకు ఊతం

దిల్లీ: రూ.250 కోట్ల వరకు టర్నోవరు ఉన్న కంపెనీలకు కార్పొరేట్ పన్నును 25 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నిర్ణయం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్య తరహా(ఎమ్ఎస్ఎమ్ఈ) రంగానికి చెందిన 99 శాతం కంపెనీలకు ప్రయోజనం చేకూరుతుందని జైట్లీ పేర్కొన్నారు. కాగా, రూ.250 కోట్లకు పైబడిన టర్నోవరున్న వ్యాపారాలకు 30 శాతం పన్ను యథావిధిగా కొనసాగుతుంది. వచ్చే నాలుగేళ్లలో ప్రస్తుత 30 శాతం నుంచి 25 శాతానికి కార్పొరేట్ పన్నును తగ్గిస్తామని 2015-16 బడ్జెట్‌లో జైట్లీ హామీనిచ్చిన విషయం తెలిసిందే.

**రూ.7000 కోట్లు**
2018-19లో కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల ఖజానాకు పడే గండి


### కార్పొరేట్ ఆధార్ వస్తోంది!



ప్రతీ భారతీయుడికి ఆధార్ ఒక గుర్తింపునిచ్చినట్లుగానే.. భారత్‌లోని ప్రతీ కంపెనీకి సైతం ఆధార్ తరహాలో ఒక గుర్తింపునివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ మేరకు గురువారం లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ప్రతీ కంపెనీ అది పెద్దదయినా చిన్నదైనా ఒక విశిష్ఠ గుర్తుంపు అయితే ఉండాలి. ఆ దిశగా ప్రభుత్వం ఒక పథకాన్ని తీసుకురావాలని భావిస్తోంది. ఇప్పటిదాకా 119 కోట్ల మందికి ఆధార్ జారీ అయిన సంగతి తెలిసిందే.

# మదుపరికి ఇబ్బందే

→ రూ.లక్షకు పైన 10% విధింపు
→ ఎఫ్‌పీఐలు, మ్యూచువల్ ఫండ్‌లపైనా



**దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను**

దిల్లీ

స్టాక్ మార్కెట్ మదుపర్లకు రుచించని బడ్జెట్ ప్రతిపాదన ఇది. రూ.లక్షకు పైబడ్డ ఈక్విటీ లాభాలపై 10 శాతం దీర్ఘకాల మూలధన లాభాల(ఎల్‌టీసీజీ) పన్నును ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పన్ను ఎగవేతలను అరికట్టే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ‘పన్ను మినహాయింపు లేకుండా కూడా స్టాక్ మార్కెట్ల నుంచి వస్తున్న ప్రతిఫలాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. పన్ను పరిధిలోకి నమోదిత కంపెనీల ద్వారా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలను తీసుకురావాల్సిన అవసరం ఉంద’ని ఈ సందర్భంగా జైట్లీ అన్నారు. అయితే ఆర్థిక వృద్ధికి ఒక ఉజ్జ్వల ఈక్విటీ మార్కెట్ అత్యవసరం కాబట్టి ప్రస్తుత బడ్జెట్‌లో ఓ మోస్తరు మార్పులనే చేపడుతున్నాం. రూ.1 లక్షకు పైబడ్డ లాభాలపై మాత్రమే 10 శాతం పన్నును విధిస్తున్నామ’ని ఆయన అన్నారు. జనవరి 31, 2018 వరకు వచ్చిన లాభాలను మాత్రం పరిగణనలోకి తీసుకోమని.. ఆ తర్వాత వచ్చిన లాభాలనే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకూ ఒక ఏడాది తర్వాత జరిపే షేర్ల విక్రయాల ద్వారా వచ్చే లాభాలను మూలధన లాభాల పన్ను నుంచి మినహాయించిన సంగతి తెలిసిందే. (అయితే ఏడాదిలోపు విక్రయాలపై 15% పన్ను ఉంటోంది.)

**రూ.20,000 కోట్లు**
మూలధన లాభాలపై పన్ను వల్ల తొలి ఏడాదిలో ఖజానాకు వచ్చే ఆదాయం

ఎఫ్‌పీఐలకూ: దేశీయ మదుపర్ల తరహాలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) మన స్టాక్ మార్కెట్ల ద్వారా వచ్చే దీర్ఘకాల మూలధన లాభాలపై 10 శాతం పన్నును చెల్లించాల్సి వస్తుంది.

మ్యూచువల్ ఫండ్‌లపైనా 10%: ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్‌ల నుంచి వచ్చే ఆదాయం (డిస్ట్రిబ్యూటెడ్) పైనా మదుపర్లు 10 శాతం పన్నును కట్టాల్సి వస్తుంది. ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్‌లకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిణామం సెంటిమెంటును దెబ్బతీస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ ఛైర్మన్ దీపక్ పరేఖ్ పేర్కొన్నారు. షేర్లు, బాండ్లు, డిబెంచర్లు, డెరివేటివ్స్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లపై వర్తించే సెక్యూరిటీల లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ)కు ఇది అదనం.

**రూ.1,00,000 కోట్లు**
గతేడాది మ్యూచువల్ ఫండ్‌లు స్టాక్ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు

“ఒకేసారి రెండు పన్నులు(ఎస్‌టీటీ, ఎల్‌టీసీజీ) ఉన్న ఏకైక దేశం మనదేనేమో. అయితే మార్కెట్ సెంటిమెంట్‌పై భారీ ప్రభావం ఏమీ ఉండదు. జనవరి 31 వరకు ఎల్‌టీసీజీని లెక్కవేయకపోవడం(గ్రాండ్‌ఫాదరింగ్) వల్ల స్టాక్ మార్కెట్లలో ఊగిసలాటను అదుపులో పెట్టినట్లయింది.”

- రిలయన్స్ సెక్యూరిటీస్ సీఈఓ బి. గోప్‌కుమార్

### క్రిప్టో కరెన్సీలు చట్టబద్ధం కాదు

బిట్‌కాయిన్లు సహా ఏ క్రిప్టో(ఊహాజనిత) కరెన్సీకీ చట్టబద్ధత లేదని.. వాటిని ఎవరూ వినియోగించకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని జైట్లీ తెలిపారు. భారత్‌లో వర్చువల్ కరెన్సీల నియంత్రణకు ఎటువంటి నిబంధనలు లేవని గతేడాది జైట్లీ పార్లమెంటుకు సమాచారమిచ్చారు. అలాంటి కరెన్సీలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ ఎలాంటి లైసెన్సును ఇవ్వలేదని అప్పట్లోనే వెల్లడించారు.

### జౌళి రంగానికి రూ.7148 కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి జౌళి రంగ కేటాయింపులను ప్రభుత్వం పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.6,250.80 కోట్లుగా ఉంది. మరోవైపు పట్టు వస్త్రాలపై కస్టమ్స్ సుంకాన్ని కూడా 20 శాతానికి పెంచింది. ఇంతకుముందు ఇది 10 శాతంగా ఉంది. చైనా నుంచి దిగుమతులకు అడ్డుకట్ట వేసి, దేశీయ పరిశ్రమను కాపాడేందుకు ఈ పరిణామం దోహదం చేస్తుందని జైట్లీ చెప్పారు.

## కొత్త ఉద్యోగాలకు మార్గం సుగమం..



భారత్‌ను డిజిటల్ సమాజంగా తీర్చిదిద్దడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. కృత్రిమ మేధ, రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఐఓటీ వంటి సాంకేతిక పరిజ్ఞానాల్లో పరిశోధన, శిక్షణ, నైపుణ్యాల పెంపునకు తీసుకున్న చర్యలు కొత్త ఉద్యోగావకాశాలను సృష్టింగలవు. 2020 నాటికి 50 లక్షల మందికి ప్రత్యేక నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యం గొప్ప నిర్ణయం.

–బి.వి.ఆర్.మోహన్ రెడ్డి, నాస్‌కామ్ మాజీ ఛైర్మన్

## తెలుగు రాష్ట్రాలను విస్మరించారు



బడ్జెట్ వాణిజ్య, పారిశ్రామిక వర్గాలను నిరుత్సాహ పరిచింది. ఇది ప్రజాకర్షక బడ్జెట్. అయితే.. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, గ్రామీణ అభివృద్ధి, ఆరోగ్య సంరక్షణ, విద్యా రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం సంతోషకరమే. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను బడ్జెట్‌లో విస్మరించారు. హామీ ఇచ్చినట్లుగా అన్ని కంపెనీలకు కార్పొరేట్ పన్ను రేటును తగ్గించలేదు. ముద్రా రుణాల మంజూరు మార్గదర్శకాలను సమీక్షించనున్నట్లు ప్రకటించడం మంచి నిర్ణయం.

–గౌర శ్రీనివాస్, ప్రెసిడెంట్, ఎఫ్‌టాప్సీ

## డిజిటల్ ఇండియా సాకారం..



డిజిటల్ ఇండియాను సాకారం చేసే విధంగా బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు ప్రకటించడం సంతోషకరం. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యాలు, శిక్షణ పెంచడానికి ప్రాధాన్యం ఇచ్చారు. బ్లాక్‌చైన్ వంటి సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా ఇ-పాలనపై ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ డిజిటల్ అంతర్యాన్ని తగ్గిస్తుంది. ఫిన్‌టెక్ కంపెనీల వృద్ధికి తగిన విధానాన్ని ప్రభుత్వం తీసుకువస్తున్నట్లు ప్రకటించడం ఆర్థిక వ్యవస్థ డిజిటలీకరణకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోంది.

–సుమన్ రెడ్డి, ఎండీ, పెగాసిస్టమ్స్ ఇండియా

## వ్యవసాయానికి భరోసా..



ప్రజలను ఆకర్షించడానికే వ్యవసాయానికి పెద్దపీట వేశారని అనుకుంటున్నప్పటికీ.. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతోనే వ్యవసాయ రంగం అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయ మార్కెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.2,000 కోట్ల నిధిని ఏర్పాటు ప్రతిపాదన, ఫుడ్ పార్కుల్లో ప్రపంచ స్థాయి టెస్టింగ్ సదుపాయాలను ఏర్పాటు వంటి నిర్ణయాలు వ్యవసాయ రంగ ఎగుమతులు పెంచడానికి దోహదం చేస్తాయి.

– పి.గోపాల్ కృష్ణ, సలహాదారు, నాగార్జునా ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్

## గత 5 బడ్జెట్ సందర్భాల్లో సెన్సెక్స్ కదలికలు

| | | |
|---|---|---|
| 2017 | 28142 | +482 |
| 2016 | 23002 | -152 |
| 2015 | 29362 | +141 |
| 2014 (జులై) | 25373 | -72 |
| 2013 | 18862 | -291 |

## గత బడ్జెట్ నుంచి ఈ బడ్జెట్‌కు..

| సూచీ | 2017 | 2018 | వృద్ధి |
|---|---|---|---|
| సెన్సెక్స్ | 28142 | 35,907 | 7,765 (28%) |
| నిఫ్టీ | 8716 | 11017 | 2,301 (26%) |

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ ↓ 58 — 35907 | నిఫ్టీ ↓ 11 — 11017 | యంత్ర పరికరాలు ↑ 319 — 20,682 |
| బ్యాంకింగ్ ↓ 198 — 30,788 | వాహన ↑ 174 — 26,120 | ఆరోగ్య సంరక్షణ ↓ 201 — 14,359 |
| చమురు గ్యాస్ ↓ 209 — 16,159 | ఎఫ్‌ఎమ్‌సీజీ ↑ 68 — 10,780 | వినిమయ వస్తువులు ↓ 400 — 22,077 |

# పన్ను ప్రతాపం

→ బడ్జెట్ ప్రసంగం వేళ తీవ్ర హెచ్చుతగ్గులు
→ 750 పాయింట్లు ఊగిసలాడిన సెన్సెక్స్

బడ్జెట్‌పై ఎన్నో ఆశలతో.. మరెన్నో అంచనాలతో గత కొన్ని రోజులుగా మార్కెట్ రికార్డుల మోత మోగించింది. అయితే ఒకే ఒక్క ప్రతిపాదన మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసింది. దీర్ఘకాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ) రూ.లక్ష మించితే 10 శాతం పన్ను విధిస్తున్నట్లు జైట్లీ ఎప్పుడైతే ప్రతిపాదించారో మార్కెట్ ఒక్కసారిగా కుదుపునకు లోనైంది. అయితే ఆ తర్వాత తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో.. సూచీలకు భారీ పతనం తప్పింది. మధ్యాహ్నం తర్వాత సూచీలు తీవ్ర హెచ్చుతగ్గుల మధ్య చలించాయి. సెన్సెక్స్ రోజులో 750 పాయింట్ల వరకు ఊగిసలాడింది.

**బడ్జెట్ ప్రసంగానికి ముందు:** ప్రస్తుత ప్రభుత్వానికి ఇదే ఆఖరి బడ్జెట్ కావడం వల్ల సానుకూల ప్రతిపాదనలే ఉండొచ్చన్న అంచనాలతో ఉదయం సెన్సెక్స్ ఉత్సాహంగానే ప్రారంభమైంది. క్రితం ముగింపుతో పోలిస్తే 83 పాయింట్ల లాభంతో 36048.99 పాయింట్ల వద్ద మొదలైంది. బడ్జెట్ ప్రసంగం ప్రారంభమయ్యే వరకు కూడా ఇదే ధోరణిలో చలించింది.

**ప్రసంగం వేళ:** జైట్లీ ప్రసంగం ప్రారంభించిన తర్వాత కొద్ది సేపు వరకు మార్కెట్లు లాభాల్లోనే కొనసాగాయి. అయితే పన్నుల ప్రతిపాదనల దగ్గరకు వచ్చేసరికి మదుపర్లు అప్రమత్తం అయ్యారు. తీవ్ర అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సూచీలు కుదుపునకు లోనయ్యాయి. సెన్సెక్స్ 450 పాయింట్ల వరకు పతనమైంది.

**ప్రసంగం అనంతరం:** బడ్జెట్ ప్రసంగం ముగిసిన కొద్దిసేపు తర్వాత సూచీలు పూర్తిగా లాభాల్లోకి వచ్చాయి. సెన్సెక్స్ తిరిగి 290 పాయింట్ల వరకు పెరిగింది. అయితే ఈ స్థాయిల వద్ద కూడా సూచీలు నిలదొక్కుకోలేదు. మళ్లీ మదుపర్లు అమ్మకాలకు దిగడంతో లాభాలు ఆవిరయ్యాయి. చివరకు సెన్సెక్స్ 58.36 పాయింట్ల నష్టంతో 35,906.66 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.80 పాయింట్లు కోల్పోయి 11,016.90 వద్ద స్థిరపడింది.

**రైల్వే షేర్లు డీలా:** రైల్వే రంగానికి మూలధన వ్యయాల కేటాయింపు, కొత్త రైళ్ల ప్రతిపాదనలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ రంగ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. స్టోన్ ఇండియా షేరు 4.98%, టిటాగఢ్ వ్యాగన్స్ 4.63%, కెర్నెక్స్ మైక్రోసిస్టమ్స్ 4.6%, కంటెయినర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 0.57% చొప్పున నష్టపోయాయి. ఆహార తయారీ రంగానికి (ఫుడ్ ప్రాసెసింగ్) నిధుల కేటాయింపులను రెట్టింపు చేయడంతో ఈ రంగ షేర్లు రాణించాయి. మౌలిక నిధుల కేటాయింపును రూ.5.97 లక్షల కోట్లకు పెంచడంతో ఈ రంగ షేర్లు కళకళలాడాయి. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 10 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వార్షిక బీమాను వర్తింపచేసే నిమిత్తం రూ.1,200 కోట్లను కేటాయించడంతో ఆరోగ్య సంరక్షణ షేర్లు కళకళలాడాయి.




## ఎన్‌ఎస్‌ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

### నిఫ్టీ 50

ADANI PORT & 428.75 (428.85) 1681704
AMBUJA CEMEN 266.45 (261.80) 3355964
ASIAN PAINTS 1153.00 (1128.30) 1103162
AUROBIND PHA 611.20 (629.55) 2665368
AXIS BANK LT 592.80 (593.60) 7839731
BAJAJ AUTO L 3412.95 (3337.15) 439064
BAJAJ FINANC 1729.45 (1677.85) 1939812
BHARTI AIRTE 438.40 (439.85) 7297226
BHARTI INFRA 346.85 (351.55) 3045857
BOSCH LTD 19517.85 (19400.25) 14331
BPCL 490.35 (492.30) 3649443
CIPLA 587.05 (592.15) 1050098
COAL INDIA L 295.60 (299.55) 4533542
DR. REDDYS 2157.95 (2225.35) 968321
EICHER MOTOR 28047.35 (26923.60) 125564
GAIL 486.25 (478.60) 4610450
HCL TECH 984.90 (986.55) 1527829
HDFC 1967.55 (1956.30) 3838192
HDFC BANK 1991.15 (2005.70) 1630355
HERO MOTOCOR 3732.95 (3691.45) 346581
HINDALCO IND 256.25 (256.15) 8940788
HINDUSTAN UN 1371.25 (1369.35) 1563429
HPCL 392.35 (397.70) 4927698
ICICI BANK 346.20 (352.95) 29472295
INDIABULLS H 1377.45 (1390.95) 2027712
INDIAN OIL 417.90 (417.60) 5851539
INDUSINDBANK 1795.45 (1753.10) 3720115
INFOSYS LTD 1144.60 (1150.25) 6502727
ITC 275.30 (271.40) 59362154
KOTAK MAHIND 1120.95 (1108.95) 3856283
LARSEN & TOU 1455.60 (1416.50) 8187730
LUPIN 860.40 (883.75) 1834018
M&M 798.75 (763.05) 6896060
MARUTI SUZIK 9401.85 (9509.70) 550971
NTPC LTD 169.05 (170.25) 9187297
ONGC 194.90 (203.45) 10015459
POWER GRID C 194.85 (193.80) 9578382
RELIANCE IND 943.85 (961.30) 7554587
SBI 306.05 (313.25) 19515991
SUN PHARMA 554.30 (579.90) 8789899
TATA CONSULT 3138.60 (3112.35) 1200315
TATA MOTORS 393.65 (399.50) 7259426
TATA STEEL L 696.75 (705.05) 7403931
TECH MAHINDR 611.05 (612.65) 2479739
ULTRATECH 4391.45 (4382.00) 268309
UPL LIMITED 758.85 (752.05) 2563374
VEDANTA LIMI 341.45 (340.35) 15344365
WIPRO 300.75 (304.70) 2202328
YES BANK LTD 359.90 (354.40) 15217926
ZEE ENTERTAI 594.95 (593.70) 1806045

### ఘనం (+)

| నిఫ్టీ | 1న | మార్పు% |
|---|---|---|
| M&M | 798.75 | 4.68 |
| EICHER MOTO | 28047.35 | 4.17 |
| BAJAJ FIN | 1729.45 | 3.08 |
| L&T | 1455.60 | 2.76 |
| INDUSIND BANK | 1795.45 | 2.42 |
| BAJAJ AUTO | 3412.95 | 2.27 |
| ASIAN PAINTS | 1153.00 | 2.19 |


### గ్రహణం (-)

| నిఫ్టీ | 1న | మార్పు% |
|---|---|---|
| SUN PHARM | 554.30 | -4.41 |
| ONGC | 194.90 | -4.20 |
| DR. REDDYS LAB | 2157.95 | -3.03 |
| AUROBINDO PHAR | 611.20 | -2.91 |
| LUPIN LIM | 860.40 | -2.64 |
| SBI | 306.05 | -2.30 |
| ICICI BANK | 346.20 | -1.91 |

### నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1700.45 (1653.20) 200484
ACC 1737.00 (1715.25) 300979
ASHOK LEYLAN 123.35 (126.10) 15946691
AVENUE SUPER 1174.30 (1179.65) 477292
BAJAJ FINSER 5038.40 (4812.35) 350858
BANK OFBAROD 152.35 (156.80) 12039264
BEL 161.55 (169.35) 13787038
BHEL 100.35 (100.20) 10520230
BRITANNIA 4740.50 (4684.15) 148844
CADILA HEALT 417.65 (425.80) 1318106
COLGATE PALM 1130.45 (1121.35) 120516
CONTAINER 1387.30 (1390.30) 419912
CUMMINS INDI 903.05 (903.90) 411736
DABUR INDIA 349.70 (355.60) 2438075
DLF LIMITED 245.00 (250.10) 10509963
EMAMI LIMITE 1142.10 (1124.75) 131864
GLAXOSMI CON 6716.80 (6642.65) 8517
GLAXOSMI PHA 2459.15 (2460.60) 8351
GLENMARK PHA 588.15 (606.20) 780428
GODREJ CONSU 1053.30 (1053.40) 550552
HAVELLS INDI 525.40 (522.35) 1727081
HINDUSTAN ZI 307.95 (310.25) 1511270
ICICI PRU LI 424.90 (406.70) 3525925
IDEA CELLULR 91.30 (93.10) 9783796
INTERGLOBE A 1216.80 (1214.95) 544967
JSW STEEL LT 302.65 (289.95) 8031105
LIC HOUS.FIN 531.85 (534.95) 2716764
MARICO LIMIT 310.70 (309.40) 853132
MCDOWELL 3302.80 (3285.60) 761358
MOTHERSON 362.75 (365.80) 2832380
MRF 71776.65 (68113.35) 29028
NHPC LTD 29.15 (29.45) 7469641
NMDC LTD 141.70 (140.30) 4339124
OIL INDIA 357.90 (358.95) 659151
ORACLE FIN S 4207.95 (4182.65) 52194
P&G HYG&HEAL 9259.25 (9271.70) 2157
PETRONET LNG 252.10 (254.75) 3358587
PIDILITE IND 899.00 (896.30) 970796
PIRAMAL ENTE 2749.15 (2743.00) 248875
PNB 167.55 (171.35) 15801115
POWER FIN CO 117.00 (116.80) 6983235
RURAL ELEC C 153.45 (155.50) 6096903
SAIL 89.35 (88.90) 13593547
SHREE CEMENT 17453.05 (17206.30) 20836
SHRIRAM TRAN 1380.05 (1379.75) 721851
SIEMENS 1323.75 (1301.85) 305415
SUN TV LTD 1012.40 (1024.40) 651336
TATA POWER 89.70 (89.00) 9055967
TITAN IND 831.00 (869.55) 6097492
TORRENT PHAR 1354.90 (1362.40) 288717

### 1వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 360 | వరంగల్ | 362 |
| చిల్లరగా (ఒక గుడ్డు) | 4.20 | విశాఖపట్నం | 365 |
| బెంగళూరు | 380 | చెన్నై | 390 |
| 2న | | చిత్తూరు | 383 |
| విజయవాడ/గోదావరి | 360 | నమక్కల్ | 375 |

## బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు


AISHWARYA TE 8.60 (8.60) 39286
AMAR RAJA BA 804.05 (807.75) 31445
ANDHRA BANK 51.25 (52.60) 376339
ANDHRA CEMEN 13.20 (13.03) 21376
ANDHRA PAPER 325.40 (348.80) 25698
ANDHRA PETRO 67.05 (70.45) 149253
ANDHRA SUGAR 628.20 (628.70) 9207
ASTRA MICROW 112.70 (114.30) 126875
AUROBINDO PH 612.80 (629.50) 173318
AVANTEL SOFT 537.50 (538.90) 13160
AVANTI FEEDS 2400.80 (2223.95) 74909
AVON ORG 15.10 (15.77) 14246
BALAJI AMIN 675.70 (656.40) 17027
BARTRONICS 13.78 (14.04) 21445
BRILLIANT SE 15.65 (16.46) 293773
CAMBRIDGE TE 83.40 (84.80) 15312
CONT COFFEE 294.60 (294.80) 8366
COROMAN FERT 544.80 (552.50) 34230
CYBERMATE 3.51 (3.67) 102640
CYIENT LIMIT 640.85 (642.45) 27944
DIVI'S LAB 1040.95 (1036.45) 28848
DR REDDY 2156.95 (2225.25) 137221
GATI CORPN 128.15 (130.55) 272085
GAYATRI PROJ 211.10 (207.65) 17842
GMR INFRASTR 22.75 (21.75) 8679006
GOLDST INFRA 222.15 (224.60) 44543
GOLDSTONE EN 15 (15.10) 11282
GRANULES (I) 128 (132.20) 237927
GSS AMERICA 35.15 (34.75) 12140
GVK POWER 21.55 (20.55) 869565
HBL NIFE POW 62.25 (61.10) 196685
HERITAGE FOO 751.40 (758.55) 5851
IKF SOFT 1.14 (1.04) 714738
ILFS ENGINEE 46.45 (44.25) 6643
INNAREDY COM 4.50 (4.29) 32064
IVRCL INFRAS 5.25 (5.31) 84610
KAKATIYA CEM 373.55 (366.45) 19409
KALLAM SPG 22.70 (22.15) 10836
KAVERI SEED 507.55 (515.45) 213710
KCP LTD 140.45 (145.70) 45136
KERNEX MICRO 51.90 (54.40) 26084
KNR CONSTRUC 305.20 (307.45) 25980
LANCO INDUS 378.90 (377.05) 18209
LANCO INFRAT 1.56 (1.60) 5805771
LAURUS LABS 517.55 (519) 89326
LOKESH MACH 69 (69.25) 89337
MADHUCON PRO 32.10 (32) 38865
MEGA SOFT 14.21 (14.30) 9046
MIC ELECTRON 8.55 (8.76) 79538
NAGARJAGRICH 57 (55.45) 98104
NATCO PHARMA 942.60 (944.30) 18462
NAVA BH VENT 157 (157.05) 38493
NCC 124.50 (122.60) 746237
NCL IND 270.95 (274.85) 17540
NEHA INTER 7.58 (7.73) 25163
NETTLINX 92.10 (91.65) 21376
NIHAR INFO 14.50 (14.50) 1587
OIL COUNTRY 50.55 (50.70) 9039
PANYAM CEMEN 57.50 (57.15) 7647
PENNER IND 60.95 (61.15) 73490
PHYTOCHEM I 70.95 (71.10) 8967
PITTI LAMIN 85.65 (86.25) 7769
POKARNA 221.25 (219.35) 5691
PRAJAY ENGS 16.20 (15.45) 208695
PRISM CEMENT 134.65 (138.45) 147225
PRUDENTL PHA 4.65 (4.68) 170189
RAIN INDUSTR 362.85 (380.90) 579508
SAMPRE NUTRI 68.20 (69.05) 6046
SATVAH. ISPA 25.80 (27.75) 28208
SMS PHARMA 97.40 (97.70) 19440
SOUTH BIO TE 4.15 (3.96) 20799
SPHERE GLOBA 40.15 (40.25) 13204
SREE RAYAL A 63.55 (62.45) 348664
SRINIVASA SH 68.50 (70.50) 21249
STEEL EXCHAN 33.10 (32.60) 19137
SUJANA METAL 1.50 (1.57) 16874
SUJANA TOWER 4.33 (4.55) 5494
SUJANA UNIVE 1.17 (1.12) 111213
SURANA TELE 5.93 (5.94) 1250
SURYALAKSH.C 89 (90.25) 3012
SURYALATA SP 162.40 (164) 100
SURYAVA SPIN 7.82 (7.46) 300
SUVEN PHARMA 209.45 (214.30) 228605
TAJ GVK HOTE 174.55 (176.35) 10130
TANLA 33.35 (33.95) 155845
TERA SOFTWAR 65.40 (67.15) 7031
TRANS BIOTEK 2.34 (2.30) 12690
TRENDY KNIT 0.23 (0.24) 7900
VBC FERRO 51.55 (49.40) 1180
VICEROY HOTE 17.20 (17.50) 79806
VIJAY TEXTIL 59.45 (59.20) 1918
VIMTA LABS 214.20 (209.55) 56680
VISAKA IND 761.95 (743.60) 13058
VISTA PHARMA 42.30 (41.70) 19163
VIVIMED LABS 85.10 (86.15) 300002
VJIL CONSULT 17.05 (17) 100
VST INDUS 3352.05 (3250.05) 164
XL TELENE 3.82 (3.81) 7506
YBRANT DIGIT 6.01 (6.11) 153591
ZENOTECH LAB 46.05 (46) 10025
ZENTECH 119.85 (120.70) 35652

# బడ్జెట్ 2018-19



"గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టిపెట్టడాన్ని స్వాగతిస్తున్నాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంతో కాలంగా కోరుకుంటున్నారు. గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ రంగాలను బలోపేతం చేయడానికి బడ్జెట్‌లో తీసుకున్న చర్యలు గిరాకీని పెంచుతాయి. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద ప్రకటించిన జాతీయ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం 10 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ భరోసా ఇవ్వడం గొప్ప మార్పు. రూ.250 కోట్ల కంటే తక్కువ టర్నోవరున్న కంపెనీలకు మాత్రమే తగ్గించిన కార్పొరేట్ పన్ను రేటును వర్తింప చేయడం కొద్దిగా నిరుత్సాహాన్ని కలిగిస్తోంది."

–సతీశ్ రెడ్డి, ఛైర్మన్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్



## ద్రవ్యలోటు 3.5 శాతం!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2017-18) ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరడం కష్టమే. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా జైట్లీ ప్రకటించిన ద్రవ్యలోటు అంచనాలు ఈ విషయాన్ని చెబుతున్నాయి. 2017-18లో ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతం లోపునకు కట్టడి చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే ద్రవ్యలోటు జీడీపీలో 3.5 శాతంగా నమోదుకావచ్చని జైట్లీ వెల్లడించారు. ఈ ప్రకారం చూస్తే ద్రవ్యలోటు లక్ష్యం అసాధ్యమేనని మనం అర్థం చేసుకోవచ్చు.

## స్పెక్ట్రమ్ నుంచి 48,661 కోట్లు

టెలికాం రంగం నుంచి 2018-19లో ప్రభుత్వానికి స్పెక్ట్రమ్ విక్రయం రూపంలో రూ.48,661.42 కోట్ల ఆదాయం లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఆదాయ అంచనా అయిన రూ.30,736.47 కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువే. టెలికాం ఆపరేటర్ల నుంచి లైసెన్సు ఫీజు, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. 2017-18లో టెలికాం సేవల ద్వారా ప్రభుత్వం రూ.44,342.2 కోట్ల ఆదాయాన్ని పొందింది.

## మౌలిక ప్రాజెక్టులకు 6 లక్షల కోట్లు

దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే సత్తా ఉన్న రంగాల్లో మౌలికం ఒకటని ప్రభుత్వం పేర్కొంది. 2018-19 బడ్జెట్‌లో ఈ రంగానికి రూ.లక్ష కోట్లు పెంచి రూ.5.97 లక్షల కోట్లను కేటాయించింది. ప్రజలకు నాణ్యమైన సేవల కల్పనకు దేశీయంగా రహదారులు, వాయు, రైల్వే, జల మార్గాల్లో భారీ స్థాయిలో పెట్టుబడులు కావాలని బడ్జెట్‌లో చెప్పుకొచ్చారు. ఈ నిధులను స్టాక్ మార్కెట్ల నుంచి సమీకరించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

## విలాస కార్ల ధరలు ప్రియం

వాహన విడిభాగాల (సీకేడీ) దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని 10 నుంచి 15 శాతానికి పెంచేందుకు బడ్జెట్లో ప్రతిపాదించారు. దీనికి తోడు దిగుమతి వస్తువులపై సాంఘిక సంక్షేమ సర్‌ఛార్జీ కూడా విధించేందుకు నిర్ణయించడంతో విలాసవంత కార్ల ధరలు 10 శాతం వరకు పెరగొచ్చు. ఆడి మోడళ్లు రూ.1.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రియమయ్యే అవకాశం ఉంది. మెర్సిడెస్ బెంజ్ మోడళ్ల ధరలు కూడా రూ.1.35–5 లక్షల వరకు పెరగొచ్చు.

## సరికొత్తగా పసిడి నగదీకరణ పథకం

బంగారానికి సంబంధించి సమగ్ర విధానం రూపొందించనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. 2015లో ప్రవేశపెట్టిన పసిడి నగదీకరణ పథకాన్ని పునర్‌వ్యవస్థీకరించి, సరికొత్తగా ఆవిష్కరిస్తామని తెలిపారు. బంగారం డిపాజిట్ చేసేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినియోగదారులు ఖాతా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పసిడి ఎక్స్ఛేంజీల్లో వాణిజ్యం మరింత సామర్థ్యంతో జరిగేలా, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు.

## అంకుర సంస్థల నిబంధనలు సరళం

పన్ను ప్రయోజనాలను పొందడానికి వీలు కల్పిస్తూ అంకుర సంస్థలకు నిబంధనలను సడలిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిపాదిత మార్పుల ప్రకారం.. ఏప్రిల్ 1, 2021 వరకు ఆదాయ పన్ను ప్రయోజనాలను పొడిగించారు. అంతక్రితం ఈ పొడిగింపు ఏప్రిల్ 2019 వరకు మాత్రమే ఇచ్చారు. మరో పక్క, రూ.25 కోట్ల కంటే తక్కువ టర్నోవరు ఉన్న అంకురాలకైతే అవి ఏర్పాటైన ఏడేళ్ల పాటు ఆదాయ పన్ను మినహాయింపును పొందొచ్చు.

## టెలికాం

# దిగుమతి ఫోన్లు భారం

- కస్టమ్స్ సుంకం 15 నుంచి 20 శాతానికి పెంపు
- యాపిల్ వంటి ఖరీదైన మోడళ్లపై ప్రభావం
- దేశీయ తయారీ మోడళ్ల ధరలు మారవు

దేశంలోకి దిగుమతి అయ్యే సెల్‌ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచారు. దేశీయంగా తయారీ-బిగింపు (అసెంబ్లింగ్)ను ప్రోత్సహించేందుకే ఈ చర్య తీసుకున్నారు. ఇందువల్ల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. స్మార్ట్‌వాచీలు, ఇతర ఉపకరణాలపైనా కస్టమ్స్‌ను 10 నుంచి 20 శాతానికి పెంచారు. మొబైల్ ఫోన్ల విడిభాగాలపై 7.5-10 శాతంగా ఉన్న కస్టమ్స్‌ను 15 శాతం చేశారు.



**ప్రభావం:** దిగుమతి అయ్యే సెల్‌ఫోన్ల ధర మరో 5 శాతం పెరగనుంది. ఎస్ఈ మోడల్ మినహా మిగిలిన ఐఫోన్లను యాపిల్, గూగుల్ కూడా తమ హైఎండ్ మోడళ్లను చైనా వంటి దేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. వీటి ధరలు పెరుగుతాయి. 4జీ వోల్టె సాంకేతికతతో పనిచేసే ఫీచర్‌ఫోన్లనూ దిగుమతి చేసుకుంటున్నందున, వీటి ధరలు స్వల్పంగా పెరుగుతాయి. దేశీయంగా తయారయ్యే ఫోన్ల ధరల్లో ఎటువంటి మార్పు ఉండదు. విడిభాగాలు కూడా దేశీయంగా తయారు చేయడం పెరుగుతుంది. స్మార్ట్‌వాచీల వంటి ఉపకరణాల అమ్మకాలు పెరుగుతున్నందున, అవీ ఇక్కడే రూపొందుతాయి.

✦ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు (పీసీబీ), కెమేరా మాడ్యూళ్లు, కనెక్టర్లు, ఇతర విడిభాగాల తయారీ కూడా దేశీయంగా పెరగనుంది.

✦ దిగుమతి అయ్యే సెల్‌ఫోన్లపై కస్టమ్స్‌ను 10 నుంచి 15 శాతానికి గత డిసెంబరులో పెంచినపుడు, యాపిల్ సంస్థ తమ ఐఫోన్ల ధరలను సగటున 2.5 శాతం పెంచింది. ఇప్పుడూ ఇదే తరహాలో పెంచవచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఇదీ లెక్క:** దేశీయంగా విక్రయమవుతున్న సెల్‌ఫోన్లలో సంఖ్యాపరంగా 81 శాతం, విలువ పరంగా 84.5 శాతం ఇక్కడే రూపొందుతున్నాయి. తాజా ప్రభావంతో ఇది 90 శాతాన్ని మించవచ్చు.

**దేశీయ తయారీ 16-17లో**
**రూ.96,000 కోట్లు**

**2019-20కి అంచనా**
**రూ.1.35 లక్షల కోట్లు**

# 56 విమానాశ్రయాలు

## కొత్తగా 900 విమానాలు



దేశంలో విమాన ప్రయాణాలు శరవేగంగా పెరుగుతున్నందున, అందుకనుగుణంగా విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. చిన్న నగరాలకు విమానాలు నిర్వహించేందుకు అమలు చేస్తున్న ప్రాంతీయ విమానయాన పథకం (ఉడాన్) కింద 56 విమానాశ్రయాలను, 31 హెలిప్యాడ్లను వినియోగంలోకి తేనున్నట్లు ప్రకటించారు. వీటిల్లో 16 విమానాశ్రయాల్లో ఇప్పటికే రాకపోకలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

✦ విమానాశ్రయాల సామర్థ్యాన్ని 5 రెట్లు పెంచి, ఏడాదికి 100 కోట్ల మంది రాకపోకలు సాగించేలా తీర్చిదిద్దుతామన్నారు. విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) 124 విమానాశ్రయాలను నిర్వహిస్తోందని తెలిపారు.

✦ గత మూడేళ్లుగా విమాన ప్రయాణికుల సంఖ్యలో 18 శాతం వార్షిక వృద్ధి లభిస్తోందని, దేశీయ విమానయాన సంస్థలు కొత్తగా 900 విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని తెలిపారు.

**విమానయానం**

### *పౌర విమానయాన శాఖకు రూ.6,602 కోట్లు*

పౌర విమానయాన శాఖకు గత బడ్జెట్‌లో రూ.2,710.31 కోట్లు కేటాయించగా, 2018-19 బడ్జెట్‌లో 3 రెట్లు అధికంగా రూ.6,602.86 కోట్లు చూపించారు. అయితే ఇందులో అత్యంత ప్రాధాన్యతా వ్యక్తుల (వీవీఐపీ) కోసం 2 కొత్త విమానాల కొనుగోలుకే రూ.4,469.50 కోట్లు కేటాయించడం గమనార్హం. బోయింగ్ 777-300 ఈఆర్ విమానాలు రెండింటిని వీవీఐపీల కోసం కొనుగోలు చేయబోతున్నారు.

**బడ్జెట్ కేటాయింపులు**
**రూ.6603 కోట్లు**

**వీవీఐపీల కోసం 2 కొత్త విమానాల కొనుగోలుకు**
**రూ.4,470 కోట్లు**

✦ ప్రాంతీయ విమానయానం కోసం గత బడ్జెట్‌లో రూ.200.11 కోట్లు కేటాయించగా, ఈసారి బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.1,014.09 కోట్లకు పెంచారు.

✦ పునరుద్ధరణ ప్రణాళిక కింద ఎయిరిండియాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1,800 కోట్లు కేటాయించగా, 2018-19లో ఈ మొత్తం రూ.650 కోట్లు మాత్రమే. అంతర్గతంగా, బడ్జెట్ కేటాయింపులకు అదనంగా రూ.506 కోట్లు సంస్థకు లభిస్తాయని పేర్కొన్నారు.

✦ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ)కు కేటాయింపులు రూ.149.93 కోట్ల నుంచి రూ.73.31 కోట్లకు తగ్గిపోయింది.

✦ జాతీయ విమానయాన విశ్వవిద్యాలయం, ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీకి రూ.50 కోట్లు కేటాయించారు.

## ఫుడ్ ప్రాసెసింగ్

# ఆహార తయారీకి రూ.1,400 కోట్లు

వ్యవసాయ దిగుబడులు వృథా అవ్వకుండా పరిరక్షించడంతో పాటు రైతు ఆదాయం పెంచాలంటే ఆహార తయారీ (ఫుడ్ ప్రాసెసింగ్) రంగాన్ని బలోపేతం చేయడం ప్రధాన మార్గం. ఇందుకోసమే 2018-19కి ఈ శాఖకు రూ.1,400 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. వీటిల్లో రూ.1,313.08 కోట్లను మెగాఫుడ్ పార్కులు, వ్యవసాయ ప్రాసెసింగ్ ప్రాంతాలు, శీతల గిడ్డంగుల వంటి విలువ జతచేసే మౌలిక వసతుల వంటి వాటికి ఉద్దేశించారు. ప్రతి జిల్లా పరిధిలో నిర్దేశించిన పంటలు పండించేలా ప్రోత్సహిస్తామన్నారు. 2017-18లో ఆహార తయారీకి కేటాయింపులు రూ.715 కోట్లు మాత్రమే.

**ఎగుమతులు**
**రూ.2 లక్షల కోట్లు**

**లక్ష్యం**
**రూ.6.5 లక్షల కోట్లు**

### దేశీయ పరిశ్రమను కాపాడేందుకు..

కమలా పళ్ల రసాల దిగుమతిపై కస్టమ్స్‌ను 30 నుంచి 35 శాతానికి, ఇతర పళ్ల రసాలు, కూరగాయల రసాలపై 30 నుంచి 50 శాతానికి, క్రాన్‌బెర్రీ రసంపై 10 నుంచి 50 శాతానికి, సోయా ప్రోటీన్ మినహా ఇతర ఆహార తయారీ పదార్థాలపై 30 నుంచి 50 శాతానికి పెంచనున్నారు.



✦ 150 ఫుడ్‌పార్కులు అభివృద్ధి చేయనున్నారు. 42 మెగా ఫుడ్‌పార్కుల్లో ప్రపంచ స్థాయి పరీక్షా కేంద్రాలు నెలకొల్పుతారు.


✦ జీడిపప్పు తయారీ పరిశ్రమను కాపాడేందుకు, ముడి జీడిపప్పు దిగుమతిపై కస్టమ్స్‌ను 5 నుంచి 2.5 శాతానికి తగ్గించారు.

✦ వ్యవసాయ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేసేందుకు, ప్రత్యేక ఆర్థిక సంస్థలను నెలకొల్పుతారు.

✦ వ్యవసాయ దిగుబడులతో తదనంతర ప్రాసెసింగ్‌ను కనుక రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) ఆధ్వర్యంలో చేపడితే, రూ.100 కోట్ల టర్నోవర్‌పై ఎంత లాభం వచ్చినా, 2018-19 నుంచి అయిదేళ్ల పాటు 100 శాతం పన్ను మినహాయింపు ఉంటుంది.

# రూ.3,00,000 కోట్లు


వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2018-19) ముద్రా యోజన కింద రూ.3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ముద్రా రుణాల లక్ష్యాన్ని రూ.2.44 లక్షల కోట్లుగా బడ్జెట్‌లో నిర్దేశించారు. వ్యవసాయేతర కార్యకలాపాలకు, డెయిరీ, పౌల్ట్రీ లాంటి వ్యవసాయ అనుబంధ రంగాలకు ముద్రా రుణాలు ఇస్తారు. నిధుల అవసరం, వ్యాపార వృద్ధి పరిమాణక్రమం ఆధారంగా శిశు, కిశోర్, తరుణ్ పేర్లతో విభజించి ఈ రుణాలు మంజూరు చేస్తారు. శిశు విభాగం కింద రూ.50,000 వరకు, కిశోర్ విభాగంలో రూ.50,000- రూ.5 లక్షల వరకు, తరుణ విభాగంలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రుణాలు తీసుకున్నవారిలో 76 శాతం మంది మహిళలు కాగా, 50 శాతానికి పైగా మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందినవారు.



**ముద్రా యోజన పురోగతి తీరు**

| | 2015-16 | 2016-17 | 2017-18 |
|---|---|---|---|
| మంజూరు చేసిన రుణాలు | 3,48,80,924 | 3,97,01,047 | 3,03,32,003 |
| అనుమతించిన రుణనిధి(రూ.కోట్లలో) | 1,37,449.27 | 1,80,528.54 | 1,50,030.17 |
| మంజూరు చేసిన రుణం(రూ.కోట్లలో) | 1,32,954.73 | 1,75,312.13 | 1,44,355.09 (19-01-18నాటికి) |

## పెట్టుబడుల ఉపసంహరణ




# రూ.80,000 కోట్లపై గురి

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)ల పెట్టుబడుల ఉపసంహరణల ద్వారా రూ.80,000 కోట్లు సమీకరించాలని బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకుంది. పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగం(దీపమ్) ఆ దిశగా పయనిస్తుందని మరిన్ని ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లను తీసుకొస్తుందని ఆర్థిక మంత్రి జైట్లీ పేర్కొన్నారు. వాటితో పాటు ఒక డెట్ ఫండ్‌ను సైతం ప్రవేశపెడుతుందని బడ్జెట్ సమర్పణ సందర్భంగా తెలిపారు. 2017-18లో రూ.లక్ష కోట్లకు పైగా ప్రభుత్వం సమీకరించింది. ఇందులో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా అమ్మకం ద్వారా రూ.46,500 కోట్లు; వ్యూహాత్మక వాటా విక్రయం ద్వారా రూ.15,000 కోట్లు; బీమా కంపెనీల నమోదు ద్వారా రూ.11,000 కోట్లు చొప్పున సమీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈఐఎల్, ఎన్‌టీపీసీ, నాల్కో, ఓఐఎల్ వంటి పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాను తగ్గించుకున్న సంగతి తెలిసిందే. ఇంకా జీఐసీ, న్యూ ఇండియా ఇన్సూరెన్స్, హడ్కోలను నమోదు చేసింది. భారత్ 22- ఈటీఎఫ్‌ను సైతం ప్రవేశపెట్టింది.

**నష్టాల్లోని పీఎస్‌యూలు**
**254**

**2017-18లో ఉపసంహరణ**
**రూ.1 లక్ష కోట్లు**

## బీమా

# మూడు సాధారణ బీమా సంస్థల విలీనం



**2016-17లో 3 సంస్థల స్థూల డైరెక్ట్ ప్రీమియం**
**రూ.41,462 కోట్లు**

ప్రభుత్వ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా మూడు సాధారణ బీమా సంస్థలను ఒక్కటిగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతరం ఆ సంస్థను స్టాక్ మార్కెట్లో నమోదు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రభుత్వ సాధారణ బీమా సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియకు గత ఏడాదిలోనే శ్రీకారం చుట్టారు. ఇప్పటికే జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూ ఇండియా ఎస్యూరెన్స్ ఐపీఓలకు వచ్చాయి. మిగిలిన మూడు సంస్థలు.. నేషనల్ ఇన్సూరెన్స్, యునైటైడ్ ఇండియా ఎస్యూరెన్స్, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్‌లు విలీనం అవుతాయని మంత్రి తెలిపారు.

నాలుగు ప్రభుత్వ సాధారణ బీమా సంస్థలను కలపాలని గతంలోనే ప్రతిపాదనలు వచ్చాయి. అయితే, న్యూ ఇండియా ఎస్యూరెన్స్, జీఐసీలు ఐపీఓలకు రావడంతో మిగిలిన మూడింటినీ విడిగానే మార్కెట్లో నమోదు చేస్తారనే భావించారు. సాధారణ బీమా రంగంలో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో విడివిడిగా ఉండే కన్నా కలిసి ఉంటేనే మంచి వృద్ధిని సాధించే అవకాశం ఉందని బీమా రంగం నిపుణులు కూడా పేర్కొంటున్నారు. అయితే, ఇప్పటికే ఐపీఓకి వచ్చిన బీమా సంస్థల షేర్లు ఇష్యూ ధర కన్నా తక్కువకే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మూడు సంస్థలూ కలిసి, ఒక్కటిగా రాబోయే సంస్థ ఐపీఓకి ఆదరణ ఎలా ఉంటుందో చూడాల్సిందే!

### అధిక ఉపాధి కల్పన

విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉపాధి కల్పన బాగా పెరుగుతుంది. ద్రవ్యలోటు తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్య బీమా అమలు సాధ్యమని భావిస్తున్నా.



ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు క్రిస్ గోపాలకృష్ణన్

### చిరస్మరణీయం

ఇది సంపూర్ణ బడ్జెట్. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. ప్రతి కుటుంబానికీ విద్యుత్తు, ఆరోగ్య సంరక్షణకు తోడు వ్యవసాయానికి ప్రోత్సాహకాల వల్ల సామాజిక భద్రత సమకూరుతుంది. వ్యవస్థ బలోపేతమవుతుంది.



ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్ ఛైర్మన్ సంజీవ్ గోయెంకా

### ఆరోగ్య భారతం

స్వస్థ (ఆరోగ్య) భారత్‌ను రూపొందించే దిశగా ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రకటించడం అభినందనీయం. మూస ధోరణులు విడనాడి, ప్రస్తుత అవసరాలకు తగినట్లు రూపకల్పన చేశారు.



అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఛైర్మన్ ప్రతాప్ సి రెడ్డి

### సమగ్రంగా ఉంది

కౌలు రైతులు, 10 కోట్ల పేద కుటుంబాలు, వృద్ధులు సహా అన్ని వర్గాలకు మేలు చేసేలా బడ్జెట్ సమగ్రంగా రూపొందించారు. ఈ బడ్జెట్‌తో 2018-19లో అర్థవంతమైన వృద్ధి లభిస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు.



ఎస్‌బీఐ ఛైర్మన్ రజనీశ్ కుమార్

### కీలక రంగాలకు ప్రాధాన్యం

కీలక రంగాలైన వ్యవసాయం, ఆహార తయారీ, మౌలిక వసతులు, ఆరోగ్య సంరక్షణ, మానవ వనరులకు సంపూర్ణ విధానాలను ఆవిష్కరించింది. జీఎస్‌టీ వల్ల దీర్ఘకాలంలో సమ్మిళిత వృద్ధితో పాటు భారత ఆర్థిక వ్యవస్థ పోటీతత్వంతో వ్యవహరించగలుగుతుంది. ఆహార తయారీ రంగానికి అధిక నిధుల వల్ల వ్యవసాయ దిగుబడుల వృథాను నివారించవచ్చు.

– ఐటీసీ సీఈఓ సంజీవ్ పురి

### వ్యయాలు తగ్గుతాయ్

విమానాశ్రయాల విస్తరణ, రైల్వేల ఆధునికీకరణ వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యంతో రవాణా మెరుగుపడి, వ్యాపార నిర్వహణ వ్యయాలు తగ్గుతాయి. అందుబాటు ధర గృహాలకు ఇస్తున్న ప్రోత్సాహకాలతో ఉక్కుకు గిరాకీ పెరుగుతుంది.




టాటా స్టీల్ ఎండీ టీవీ నరేంద్రన్

# బడ్జెట్ 2018-19

**అలాంటి బాధేమీ లేదు!**
**పీయూష్ గోయల్, రైల్వే మంత్రి**

పార్లమెంటులో రైల్వే బడ్జెట్‌ను వేరుగా సమర్పించలేకపోయిన బాధేమీ తనకు లేదని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ స్పష్టంచేశారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. నిజానికి ప్రత్యేకంగా బడ్జెట్ ప్రకటించడం రాజకీయ కసరత్తులా ఉండేదని.. దాంతో రైల్వేకు ఇబ్బందులు ఎదురయ్యేవని పేర్కొన్నారు. ప్రయాణికుల భద్రత, సుఖవంతమైన ప్రయాణం, బుల్లెట్ రైలు తమకు ముఖ్యమని వివరించారు. కొత్త రైళ్లు, మార్గాల గురించి నిత్యం వినతులు వస్తున్నాయని.. వీలయినంతమేర అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా కేంద్ర, రైల్వే బడ్జెట్‌లను వేర్వేరుగా సమర్పించే సంప్రదాయాన్ని నిలిపివేస్తూ 2016లో మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.



## సిబ్బంది నిర్లక్ష్యం వల్లే 60% రైల్వే ప్రమాదాలు

మనదేశంలో ఏటేటా రైలు ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి. కానీ, రైల్వే భద్రత మనదేశంలో ఇంకా పెద్ద సమస్యేనని ప్రపంచ బ్యాంకు కొంతకాలం క్రితం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదాల నివారణకు కొన్ని సూచనలూ ఇచ్చింది.

- 2012 నుంచి ఇప్పటివరకూ జరిగిన ప్రతి 10 రైలు ప్రమాదాల్లో ఆరింటికి ప్రధాన కారణం.. రైల్వే సిబ్బంది నిర్లక్ష్యమేనని నీతి ఆయోగ్ అధ్యయనంలో తేలింది.
- 2016-17 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 104 ప్రమాదాల్లో 66 సంఘటనలకు రైల్వే సిబ్బంది అశ్రద్ధ కారణమని భారతీయ రైల్వే గణాంకాలు పేర్కొంటున్నాయి.

### 1960 నుంచి 2016 వరకూ రైలు ప్రమాదాల తీరుతెన్నులు

| సంవత్సరం | రైళ్లు గుద్దుకోవటం | బోగీలు విడిపోవటం | లెవెల్ క్రాసింగులవద్ద ప్రమాదాలు | రైళ్లలో అగ్ని ప్రమాదాలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1960-70 | 834 | 10,664 | 1,394 | 1,037 | 13929 |
| 1970-80 | 597 | 6,763 | 1,120 | 185 | 8,665 |
| 1980-90 | 475 | 6,242 | 677 | 176 | 7,570 |
| 1990-2000 | 360 | 3,943 | 716 | 94 | 5,113 |
| 2001-2010 | 115 | 1,330 | 719 | 76 | 2,290 |
| 2010-2016 | 31 | 355 | 319 | 27 | 732 |



### లోయా కేసుపై నేడు 'సుప్రీం' విచారణ

దిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా మరణంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశాలివ్వాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలపై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ తిరిగి చేపట్టనుంది. సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసుపై విచారణ జరుపుతున్న లోయా.. 2014 డిసెంబర్ 1న గుండెపోటుతో మరణించారు. సహచరుడి కుమార్తె వివాహానికి నాగ్‌పుర్ వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగింది. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపడుతుంది.



# భద్రతకు పెద్దపీట!

## రూ. 1,46,500 కోట్లతో రైల్వే బడ్జెట్

ఈనాడు - దిల్లీ

రైల్వేల వ్యవస్థాగత సామర్థ్యం పెంపు, ప్రయాణికుల భద్రతకు కేంద్రం పెద్దపీట వేసింది. 2018-19 బడ్జెట్‌లో ఆ శాఖకు మూలధన వ్యయంగా రూ.1,46,500 కోట్లు కేటాయించింది. గతేడాది బడ్జెట్‌లో సవరించిన అంచనాలకంటే ఇది 22% ఎక్కువ. కేటాయింపుల్లో సింహభాగాన్ని సామర్థ్య పెంపు కార్యక్రమాలకు వెచ్చించనున్నారు. ముఖ్యంగా 18 వేల కిలోమీటర్ల మేర రెండు, మూడు, నాలుగు లైన్ల మార్గాలను ఏర్పాటుచేస్తారు. 5 వేల కిలోమీటర్ల మేర గేజ్ మార్పు చేపడతారు. ఇది పూర్తయితే, రైల్వే నెట్‌వర్క్ మొత్తం దాదాపు బ్రాడ్‌గేజ్‌గా రూపాంతరం చెందినట్లవుతుంది.

### అన్నిచోట్లా నిఘా నేత్రాలు...

- భద్రతా చర్యల్లో భాగంగా అన్ని స్టేషన్లు, రైళ్లలో సీసీటీవీలను ఏర్పాటు చేస్తారు.
- ఆయా చోట్ల క్రమంగా వై-ఫై సదుపాయాన్నీ అందుబాటులోకి తెస్తారు.
- భారతీయ రైల్వేస్టేషన్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన 600 ప్రధాన స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తారు.
- నిత్యం 25 వేల మంది రాకపోకలు సాగించే స్టేషన్లన్నింటిలో ఎస్కలేటర్లను అందుబాటులోకి తెస్తారు.

అందుబాటులోకి ప్రపంచ స్థాయి వసతులు

- పెరంబూర్‌లోని కోచ్‌ల తయారీ పరిశ్రమలో ప్రస్తుతం అత్యాధునిక, ప్రపంచ స్థాయి వసతులతో కూడిన బోగీలు సిద్ధమవుతున్నాయి. వీటిని 2018-19లో పట్టాలెక్కిస్తారు.
- 2017-18లో లక్షించిన 4,000 కిలోమీటర్ల రైల్వే మార్గం విద్యుదీకరణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని జైట్లీ పేర్కొన్నారు. ఇది పూర్తయితే ఏటా రూ.10 వేల కోట్లు ఆదా అవుతాయి.
- తూర్పు, పశ్చిమ సరకు రవాణా కారిడార్లలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2018-19లో 12,000 వ్యాగన్లు, 5,160 కోచ్‌లు, రమారమి 700 ఇంజిన్లను ఉత్పత్తి చేస్తారు. ప్రైవేటు సంస్థల తోడ్పాటుతో గూడ్స్‌షెడ్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది.



**కేటాయింపులు (రూ.కోట్లలో)**

**2017-18లో**
**1,20,000**

**2018-19లో**
**1,46,500**

### నిధుల సమీకరణ ఇలా...

- రైల్వే కేటాయింపుల్లో రూ.53,060 కోట్లను కేంద్రం బడ్జెట్ ద్వారా సమకూర్చుతుంది.
- అంతర్గత వనరుల రూపంలో రూ.11,500 కోట్లు, ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రూ.25,500 కోట్లు, ఎల్ఐసీ నుంచి రూ.26,440 కోట్లు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య పెట్టుబడుల రూపేణా రూ.27,000 కోట్లు సమీకరిస్తుంది.
- ప్రస్తుత కేటాయింపులు... యూపీఏ సర్కారు చివరిసారిగా 2013-14లో కేటాయించిన రైల్వేబడ్జెట్ కంటే రూ.92,511 కోట్లు అధికం!



గంటకు 160 కి.మీ. వేగంతో దూసుకెళ్లే ట్రైన్-18

### సుఖ ప్రయాణానికి 50% నిధుల పెంపు!

దిల్లీ: రైల్వే ప్రయాణం ఇక మరింత ఆనందమయం కానుంది. ప్రయాణికుల సౌకర్యాల కల్పనకు కేంద్రం 50% మేర నిధులను పెంచింది. 2017-18లో రూ.1,100.90 కోట్లు ఇవ్వగా, ఈసారి రూ.1,657 కోట్లను ఇందుకు కేటాయించింది. రైలు ప్రయాణాన్ని, సేవలను మెరుగుపరిచే క్రతువూ ఆశాజనకంగానే కనిపిస్తోంది. ప్రపంచస్థాయి అత్యాధునిక వసతులతో మెరుగులద్దుకుని... గంటకు 160 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే 'ట్రైన్-18' ఈ ఏడాదే పట్టాలకెక్కనుంది. జర్మనీకి చెందిన లింకే హాఫ్‌మన్ బష్ సంస్థ దీనిని చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారుచేస్తోంది. దీని తర్వాతి తరం రైలుగా చెబుతున్న 'ట్రైన్-20' కూడా శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. 2020 నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశముంది. ఇలాంటివి కనీసం వంద రైళ్లనైనా దేశీయంగా ఉత్పత్తి చేయడమే తన లక్ష్యమనీ, శతాబ్ది, రాజధాని ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో ఇవి త్వరలోనే పరుగులు పెడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.. రైల్వే మంత్రి పీయూష్ గోయల్! ఏడాదిలోగా 600 ప్రధాన రైల్వేస్టేషన్లను పునరాభివృద్ధి చేయాలనీ సర్కారు నిర్దేశించుకుంది. పరిశుభ్రమైన తాగునీరు, వైఫై, ఆధునికీకరించిన నిరీక్షణ గదులు, టీవీలు, ప్రయాణికుల సమాచార కియోస్కులు వంటి సదుపాయాలతో వాటిని ప్రపంచస్థాయి స్టేషన్లుగా తీర్చిదిద్దాలన్నది లక్ష్యం.

# ఊసేలేని విశాఖ జోన్

- కొత్తరైళ్ల ప్రకటన, పొడిగింపు లేకపోవడంపై ఆంధ్రప్రదేశ్ నైరాశ్యం
- ఏడాదిలో పూర్తికానున్న ఓబుళవారిపల్లి-వెంకటాచలం మార్గం
- 5న కొత్త ప్రాజెక్టులు, నిధులపై స్పష్టత వస్తుందంటున్న దక్షిణమధ్య రైల్వే

ఈనాడు - హైదరాబాద్

కొత్త రైల్వే జోన్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. రెండు, మూడేళ్లుగా కొత్త జోన్ ఏర్పాటుపై ఊరిస్తూనే ఉన్నారు. 2018-19లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న కొత్త లైన్లు, రెండో(డబ్లింగ్) లైన్లు, విద్యుదీకరణ పనుల్లోనూ ఏపీకి ప్రాధాన్యం లభించలేదు. ఓబుళవారిపల్లి- వెంకటాచలం 95 కిలోమీటర్ల కొత్త లైను మార్గాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం ఒక్కటే ఊరట. కొత్త రైళ్లను ప్రకటించడం, ఇప్పుడున్న రైళ్లను ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు పొడిగించకపోవడం అసంతృప్తికి కారణమవుతోంది. కొత్త రైళ్ల ప్రారంభ అంశం బడ్జెట్‌తో నిమిత్తం లేదని, అవసరాలకు తగినట్లు, సమయానుకూలంగా ప్రవేశపెడుతున్నామని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. రాజధాని అమరావతికి వేగంగా రాకపోకల కోసం రాయలసీమ నుంచి, విశాఖపట్నం నుంచి శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రకటించాలని ఏపీ ప్రభుత్వం రెండేళ్లుగా కోరుతోంది. సమీప భవిష్యత్తులో కొత్త రైళ్లు అందుబాటులోకి వచ్చే పరిస్థితులు లేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### అత్తెసరు ప్రాధాన్యమే..

కొత్త లైన్లు.. డబ్లింగ్, ట్రిబ్లింగ్ ప్రాజెక్టుల మంజూరు, నిర్మాణంలో ఉన్నవాటికి నిధుల కేటాయింపుపై ఐదో తేదీన పూర్తి వివరాలతో స్పష్టత వస్తుందని దక్షిణమధ్య రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ బడ్జెట్‌లో రైల్వే కేటాయింపులకు సంబంధించిన స్వరూపమే వెల్లడైందని వివరిస్తున్నాయి. బడ్జెట్‌లో ప్రకటించిన అంశాల్లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా పూర్తిచేయనున్న కొత్త రైలు మార్గాలు, డబ్లింగ్, విద్యుదీకరణ పనులను పేర్కొన్నారు. వాటిని పరిశీలిస్తే.. కొత్త లైన్లలో వేయి కిలోమీటర్లలోపు పనులను పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 13 ప్రాజెక్టులు ఉంటే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించింది ఓబుళవారిపల్లి-వెంకటాచలం (95 కిమీ) ఒక్కటే కావడం గమనార్హం. గేజ్ మార్పిడి(1,000 కిమీ) 12 ప్రాజెక్టుల్లో రాష్ట్రానికి సంబంధించినవి లేవు. డబ్లింగ్ పనుల్లో 32 ప్రాజెక్టులుంటే రాష్ట్రం నుంచి దేవరపల్లి- పెనుగొండ ఒక్కటే ఉంది. విద్యుదీకరణ పనులు పూర్తయ్యే మార్గాల్లో దేశవ్యాప్తంగా 74 ఉంటే రాష్ట్రం నుంచి రెండింటికి చోటు లభించింది. గుంతకల్లు- కల్లూరు మధ్య విద్యుదీకరణ పనులు ఏడాదిలో పూర్తవుతాయి.

**2018-19లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్న పనులివే..**

- కొత్తరైలుమార్గం.. ఓబుళవారిపల్లి-వెంకటాచలం **94** కి.మీ.
- డబ్లింగ్ పనులు.. దేవరపల్లి-పెనుగొండ **49** కి.మీ.
- విద్యుదీకరణ పనులు.. గుంతకల్లు-కల్లూరు **40** కి.మీ.
- విద్యుదీకరణ.. లింగంగుంట-నల్గొండ **129** కి.మీ.

### పూర్తయ్యే అవకాశం ఉన్నా ఆలస్యం

నడికుడి-శ్రీకాళహస్తి కొత్త రైల్వేలైను ప్రాజెక్టులో 28.04 కి.మీ.మేర పిడుగురాళ్ల నుంచి రొంపిచర్ల వరకు 2017-18లోనే పూర్తిచేయాల్సి ఉన్నా పనులు ఆలస్యమవుతున్నాయి. రొంపిచర్ల- శావల్యపురం 17.19 కి.మీ. 2018-19లో పూర్తి చేయాలని గతంలోనే దక్షిణమధ్య రైల్వే లక్ష్యంగా పెట్టుకుంది. 2018-19 నాటికి పూర్తిచేసే జాబితాలో వీటికి చోటు దక్కలేదు.

- విజయవాడ-గుడివాడ-మచిలీపట్నం-భీమవరం/నరసాపురం-నిడదవోలు డబ్లింగ్, విద్యుదీకరణ పనుల్లో గుడివాడ-భీమవరం 55 కి.మీ. మార్గాన్ని 2018-19లో పూర్తిచేయాల్సి ఉన్నా తాజా జాబితాలో చోటు దక్కలేదు.

# ఆధునిక పట్టాలపై అభివృద్ధి పరుగులు!

- సాంకేతికత వినియోగం పెంపు
- కాపలాదారుల్లేని క్రాసింగ్‌లే ఉండవు
- ముంబయి, బెంగళూరులకు నజరానాలు
- గుజరాత్‌లో రైల్వే విశ్వవిద్యాలయం

ఈనాడు - దిల్లీ

కొత్త బడ్జెట్‌లో రైలు ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేసిన ప్రభుత్వం ఇందుకు ఆధునిక సాంకేతికత వినియోగంపై కీలకంగా దృష్టి సారించింది. గతంలో ఎన్నడూ లేనంతగా ట్రాక్ ఆధునికీకరణకు కేటాయింపులు జరిపింది. ఈమేరకు రెండేళ్లలో బ్రాడ్‌గేజి మార్గాల్లో ఉన్న 4,267 కాపలాదారుల్లేని లెవెల్ క్రాసింగ్‌లన్నింటినీ తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే భద్రత రీత్యా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లకు మళ్లనున్నారు. ప్రపంచస్థాయి సిగ్నలింగ్, రైలు రక్షణ - హెచ్చరిక వంటి ఆధునిక సాంకేతిక విధానాలను విస్తరించేందుకు చర్యలు చేపడతారు.

### సాంకేతికత.. భద్రత..

- సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్ల వ్యవస్థ సమగ్ర పరిశీలనకు ప్రభుత్వం రూ. 2,025 కోట్లు కేటాయించింది.
- భద్రతకు సంబంధించి 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ (ఆర్ఆర్ఎస్‌కే)' నిధి సహా 2018-19లో రూ. 73,065 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. 2017-18 సవరించిన అంచనాల్లో ఇది రూ. 68,725 కోట్లుగా ఉంది. ఇందులో ఆర్ఆర్ఎస్‌కేకు వివిధ మార్గాల్లో రూ. 20 వేల కోట్లు సమకూరుస్తారు.
- 2017-18లో 3,600 కిలో మీటర్ల ట్రాక్ ఆధునీకరణకు రూ. 9,305 కోట్లు ఖర్చుపెట్టగా ఈసారి రూ. 11,450 కోట్లతో 3,900 కి.మీ.ల పునరుద్ధరణ లక్ష్యం.

### ఆ నగరాలకు ఆనందమాయె..!

బడ్జెట్ ముంబయి, బెంగళూరు నగరాలకు ఆనందం పంచింది. ముంబయి సబర్బన్ ప్రాంతంలో రైల్వేసేవల విస్తరణలో భాగంగా 90 కిలోమీటర్ల మేర మార్గాన్ని రూ. 11 వేల కోట్లతో జంటగా (డబ్లింగ్) చేస్తారు. ముంబయిలో లోకల్ రైల్వే నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా రూ. 40 వేల కోట్లతో 150 కిలోమీటర్ల కొత్త సబర్బన్ వ్యవస్థను నిర్మిస్తారు. దీంతో 'ముంబయికి సంబరాలు' అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవిస్ ట్వీట్ చేశారు. అలాగే బెంగళూరులో రూ. 17 వేల కోట్లతో 160 కిలోమీటర్ల సబర్బన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. దీంతో నగర వాసుల ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది.

### 'బుల్లెట్' నిపుణుల తయారీ

గత ఏడాది ముంబయి-అహ్మదాబాద్‌ల మధ్య భారత తొలి అత్యంత వేగవంతమైన రైలు ప్రాజెక్టు (బుల్లెట్ ట్రైన్)కు ప్రధాని శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఈమేరకు వేగవంతమైన రైలు ప్రాజెక్టులకు అవసరమయ్యే నిపుణుల తయారీ కోసం గుజరాత్‌లోని వడోదరలో రైల్వే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తారు.

### 'ఆదా'య నిర్వహణ..

- 2018-19లో రైల్వే ఆదాయం రూ. 2,01,090 కోట్లకు చేరుతుందని లెక్కించారు. ఇది గతేడాది కంటే 7% అధికం.
- 2017-18లో 96%గా ఉన్న నిర్వహణ నిష్పత్తి (ఆపరేటింగ్ రేషియో)ని ఈసారి 92.8%కి తగ్గించాలన్నది లక్ష్యం. దీనివల్ల రూ. 12,990 కోట్లు ఆదా అవుతుందని అంచనా.
- సరకు రవాణా లక్ష్యం 51 మిలియన్ టన్నులు. ప్రయాణికుల రవాణా ద్వారా రూ. 52 వేల కోట్లు, సరకు రవాణా ద్వారా రూ. 1,21,950 కోట్ల ఆదాయం ఆర్జించాలన్నది లక్ష్యం.
- 2017-18లో సవరించిన అంచనాల మేరకు వ్యాగన్ల ఉత్పత్తి 7,120 కాగా ఈసారి 68.5 శాతం వృద్ధితో 12,000 వ్యాగన్లకు లక్ష్యం నిర్దేశించారు.
- మొత్తం రెవెన్యూ వ్యయం 2018-19లో రూ. 1,88,100 కోట్లకు చేరనుంది. ఇది గతం కంటే 4% అధికం. ఇందులో అత్యధికంగా రూ. 1,38,000 కోట్లు సాధారణ పనుల కోసమే ఖర్చు కానుంది. పింఛను ఫండ్‌కు రూ. 47,500 కోట్లు వెళ్లనుంది.



**పట్టాల పయనం.. (కి.మీ.లలో)**

| విషయం | 2017–18 (స.అం.) | 2018–19 వృద్ధి % |
|---|---|---|
| కొత్త లైన్లు 402 | 1,000 | 148.8 |
| గేజ్ మార్పిడి 574 | 1,000 | 74.2 |
| డబ్లింగ్ 945 | 2,100 | 122 |

### నిధుల సమస్యే లేదు..

ప్రతిచోటా సాంకేతిక వినియోగంపై దృష్టి పెట్టాం. ప్రయాణికులకు భద్రత అందిస్తాం. రైల్వేశాఖలో నిధులు అనేది సమస్యే కాదు. అన్ని రైళ్లలోని అన్ని పెట్టెల్లో సీసీటీవీ కెమేరాలు, వైఫై ఏర్పాటు చేయాలన్నదే నా లక్ష్యం.

– పీయూష్ గోయల్, రైల్వే మంత్రి

### ఆధునికత అత్యవసరం..

రైల్వేల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలంటే ఎస్కలేటర్లు, వైఫై, సీసీటీవీ కెమేరాలు వంటివి చాలా కీలకం. ప్రపంచ స్థాయి సిగ్నలింగ్ వ్యవస్థ, ఆధునికత, మౌలిక వసతుల స్థాయిపెంపు వంటివి ఇప్పటికప్పుడు అత్యవసరం.

– భరత్ సల్హోత్రా, వైస్ ప్రెసిడెంట్, అల్‌స్టోమ్ ఆసియా పసిఫిక్


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
CK THEATRE
GARRICK THEATRE
కొత్త
CB 125
Shine SP
ఎఫర్ట్‌లెస్ స్టైల్
మీరు స్పెషల్ అయినప్పుడు, అంతా మీకు సులభమై పోతాయి.
డిజిటల్ అనలాగ్ మీటర్
5 SPEED TRANSMISSION
5 స్పీడ్ ట్రాన్స్‌మిషన్
LIGHT ON. RIGHT ON.
ఆటోమేటిక్ హెడ్‌ల్యాంప్ ఆన్ 'AHO'
HET TYRE
కొత్త
లో రోలింగ్ రెసిస్టెన్స్ టైర్
₹ 5,999# డౌన్ పేమెంట్
0 ప్రాసెసింగ్ ఫీజు#
HET BS-IV
HDFC BANK
We understand your world
IndusInd Bank
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commerical Complex II, Sector-49-50, Golf Course Extension Road, Gurugram - 122 018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
#T&C Applied. Finance Scheme available through select preferred financiers at their sole discretion. Rs. 5999 down payment subject to financier policy. Finance Scheme is for limited time period & financier can withdraw scheme any time without giving prior notice. For more details please contact your nearest Honda dealership. Product shown in the picture may vary from actual. Application of Combi Brake System on Honda Motorcycles upon engaging the foot pedal. Efficiency of braking depends upon the riding conditions and speed of the vehicle. **Conditions apply.
BEST DEAL
ALWAYS WEAR HELMET WHILE RIDING
Also available:
Annual Maintenance Contract**
Road Side Assistance**
Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Anvita Honda - 9225922599, 0866 6628333; Mithra Honda - 2442149, 8297235235; Sri Santosh Honda - 9703123445, 8019669955; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Mithra Honda - 08297557149/50; MYLAVARAM: Mithra Honda - 8297568888; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977838666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

# ఛాంపియన్స్


రహానె 79

టెస్టు సిరీస్ చేజారడంతో రగిలిన కసో.. వాండరర్స్ గెలుపు ఇచ్చిన ఆత్మవిశ్వాసమో.. కుర్రాళ్లు తెచ్చిన ఉత్సాహమో! వన్డే సిరీస్‌ను టీమ్‌ఇండియా ఘనంగా ఆరంభించింది. డర్బన్‌లో అదరగొట్టింది. అన్ని రంగాల్లోనూ ఆతిథ్య జట్టుపై ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బంతితో కట్టిపడేసి.. బ్యాటుతో చెలరేగిపోయింది. మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్ మాయ చేస్తే.. కోహ్లి తనదైన శైలిలో శతక బాదేశాడు. తన విలువేంటో మరోసారి చాటుతూ రహానె కళ్లు చెదిరే ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో తొలి వన్డేలో ఆతిథ్య దక్షిణాఫ్రికాను భారత్ ఆరు వికెట్ల తేడాతో మట్టికరిపించింది. డుప్లెసిస్ శతకం వృథా! సొంతగడ్డపై 17 వన్డేల తర్వాత దక్షిణాఫ్రికాకు ఇదే తొలి ఓటమి.



## ఆ రహానెనే

విదేశాల్లో, ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో ఎంత గొప్ప రికార్డుంటేనేమి.. అతడికి ఎంత మంచి టెక్నిక్ ఉంటేనేమి.. స్వదేశంలో ఒక సిరీస్‌లో విఫలమయ్యాడని రహానెను తుది జట్టు నుంచి తప్పించేశారు. చివరికి తాము నమ్మిన ఆటగాడు తేలిపోయాక.. విమర్శల దాడి తీవ్రమయ్యాక, సిరీస్ చేజారక ఒక అవకాశమిచ్చారు. ఆ మ్యాచ్‌లోనే తనేంటో చాటిచెప్పాడు రహానె. జొహానెస్‌బర్గ్‌లో బ్యాట్స్‌మెన్‌కు సవాలు విసిరిన ప్రమాదకర పిచ్‌పై విలువైన ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. ఇప్పుడు వన్డే సిరీస్ ఆరంభ పోరులోనూ చక్కటి ఇన్నింగ్స్‌తో తన విలువను చాటి చెప్పాడు. నిజానికి ఈ మ్యాచ్‌లో రహానెకు అవకాశం దక్కుతుందని మొన్నటిదాకా ఎవరికీ నమ్మకం లేదు. నిరుడు వెస్టిండీస్‌లో చక్కటి ప్రదర్శనలతో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' గెలిచినా.. తర్వాతి సిరీస్‌ల్లో అతడిని తుది జట్టుకు దూరంగా ఉంచారు. చాన్నాళ్లుగా నాలుగో స్థానంలో ఆడుతున్న అతడిని 'మూడో ఓపెనర్'గా పరిగణిస్తూ మొండిచేయి చూపించారు. కోహ్లి మళ్లీ మళ్లీ ఇదే మాట చెబుతుండటంతో రహానె వన్డే కెరీర్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఐతే దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులో రహానె ఆట చూశాక కోహ్లి ఆలోచన మారిపోయింది. అతడి విలువ తెలిసొచ్చింది. మూడో ఓపెనర్ మాట వదిలేసి.. రహానె గతంలో నాలుగో స్థానంలో ఆడిన విషయం ప్రస్తావించాడు. దక్షిణాఫ్రికా పరిస్థితుల దృష్ట్యా నాలుగో స్థానానికి రహానె గట్టి పోటీదారే అనడం ద్వారా అతను తుది జట్టులో ఉంటాడని సంకేతాలిచ్చాడు. నిజంగానే రహానె తుది జట్టులోకి వచ్చాడు. ఇక గురువారం నాటి రహానె ఇన్నింగ్స్ గురించి చెప్పేదేముంది? కోహ్లి ఎప్పట్లాగే తన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడగా.. అతడికి మద్దతునిస్తూ.. తిరుగులేని ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు అజింక్య. ఎప్పుడూ కోహ్లి షాట్ల గురించే మాట్లాడుకుంటాం కానీ.. ఈ మ్యాచ్‌లో అజింక్య అతడిని మించిన మెరుపు షాట్లతో అలరించాడు. ముఖ్యంగా మోరిస్ బౌలింగ్‌లో ముందు కొచ్చి లాంగాన్ దిశగా ఆడిన షాట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. తన వేగం గురించి, షాట్లు ఆడే నైపుణ్యం గురించి సందేహాలు వ్యక్తం చేసిన వాళ్లకు రహానె ఈ ఇన్నింగ్స్‌తో సమాధానం చెప్పాడు. మొత్తానికి మొన్న జొహానెస్‌బర్గ్‌లో, ఇప్పుడు డర్బన్‌లో ఫార్మాట్లకు తగ్గట్లుగా ఆడుతూ.. రెండు మేటి ఇన్నింగ్స్‌లతో తన విలువేంటో చాటిచెప్పాడు.

# రహానె తోడుగా.. విరాట్ ఆడగా...


కుల్‌దీప్ (3/34)


- తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ ఘనవిజయం
- కోహ్లి సూపర్ సెంచరీ • ఆకట్టుకున్న అజింక్య

డర్బన్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంపై కన్నేసిన భారత్‌కు వన్డే సిరీస్‌లో అదిరే ఆరంభం. కెప్టెన్ కోహ్లి (112; 119 బంతుల్లో 10×4), రహానె (79; 86 బంతుల్లో 5×4, 2×6) అదరగొట్టడంతో గురువారం తొలి వన్డేలో టీమ్ ఇండియా 6 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. మొదట స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్ (3/34), చాహల్ (2/45) మాయ చేయడంతో దక్షిణాఫ్రికాను భారత్ 269/8కి కట్టడి చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (120; 112 బతుల్లో 11×4, 2×6) సెంచరీతో దక్షిణాఫ్రికాను ఆదుకున్నాడు. కోహ్లి-రహానెల అద్భుత భాగస్వామ్యం (189)తో లక్ష్యాన్ని భారత్ 45.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ విజయంతో ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సంపాదించింది. రెండో వన్డే ఆదివారం సెంచూరియన్‌లో జరుగుతుంది.

**అలరించిన కోహ్లి, రహానె:** లక్ష్యం చిన్నదేమీ కాకున్నా విరాట్ కోహ్లి చెలరేగడంతో భారత్ పని తేలికైంది. మైదానం అన్నివైపులా కళ్లు చెదిరే షాట్లతో అలరించిన కోహ్లి మ్యాచ్ సాగుతున్న కొద్దీ జోరు పెంచాడు. ముచ్చటైన డ్రైవ్‌లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో అభిమానులను మంత్ర ముగ్ధుల్ని చేశాడు. అతడికి రహానె చక్కని బ్యాటింగ్ తోడు కావడంతో ఛేదన సాఫీగా సాగింది. సాధికారికంగా బ్యాటింగ్ చేసిన కోహ్లి ప్రత్యర్థికి చిన్న అవకాశమైనా ఇవ్వలేదు. రహానె కూడా ఎంత అద్భుతంగా ఆడాడో! అతడిది పూర్తిగా లోపరహిత ఇన్నింగ్స్. ఆ టైమింగ్ అమోఘం. వీరబాదుడు లేకుండానే, భీకరంగా కనపడకుండానే.. దక్షిణాఫ్రికాకు చేయాల్సిన నష్టం చేసేశాడు. 13వ ఓవర్లో కోహ్లికి తోడయ్యాడతడు. తన ఇన్నింగ్స్ మొదట్లో ఫెలుక్వాయో బౌలింగ్‌లో అతడు కవర్స్‌లో కొట్టిన బౌండరీని చూసి తీరాల్సిందే. 39వ ఓవర్లో మోరిస్ బౌలింగ్‌లో కొట్టిన సిక్స్ ఇంకా అద్భుతం. ఆఫ్‌స్టంప్ ఆవల పడ్డ బంతిని కళ్లు చెదిరే రీతిలో లాంగాన్‌లోకి బాదేశాడు. ఇక రహానె క్రీజులోకి వచ్చాక దూకుడు పెంచిన కోహ్లి ఏమాత్రం అవకాశం దక్కినా బౌండరీలు బాదుతూ సాగిపోయాడు. తాహిర్ బౌలింగ్‌తో సింగిల్‌తో అర్ధశతకం (56 బంతుల్లో) పూర్తి చేసిన కోహ్లి.. రహానెతో పాటు క్రమం తప్పకుండా సింగిల్స్ తీయడంతో భారత్ వడివడిగా లక్ష్యం దిశగా సాగింది. మరోవైపు తాహిర్ బౌలింగ్‌తో మిడ్‌వికెట్ మీదుగా సిక్స్ కొట్టిన రహానె.. మోర్కెల్ బంతిని బౌండరీ దాటించి అర్ధశతకం (60 బంతుల్లో) పూర్తి చేశాడు. ఆ తర్వాత మరింత వేగం పెంచాడు. 36వ ఓవర్లో స్కోరు 200 దాటింది. ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించిన కోహ్లి.. ఫెలుక్వాయో బౌలింగ్‌లో రెండు బౌండరీలతో వన్డేల్లో 33వ సెంచరీ సాధించాడు. 42 ఓవర్లకు స్కోరు 256/2. రహానె, కోహ్లి ఔటైనా భారత్‌కు ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోయింది. అంతకు ముందు ధావన్ (35; 29 బంతుల్లో 6×4)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన రోహిత్ (20) త్వరగానే నిష్క్రమించాడు. చక్కగా బ్యాటింగ్ చేసిన ధావన్.. క్రీజులో కుదురుకున్నాక కోహ్లితో సమన్వయ లోపంతో అనవసరంగా రనౌటయ్యాడు.

**డుప్లెసిస్ కెప్టెన్ ఇన్నింగ్స్:** దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ డుప్లెసిస్ ఆటే హైలైట్. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు జట్టు మెరుగైన స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆతిథ్య జట్టును కట్టడి చేయడంలో భారత యువ స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, చాహల్‌లు కీలక పాత్ర పోషించారు. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆమ్లా (16), డికాక్ (34) జాగ్రత్తగా ఇన్నింగ్స్ ఆరంభించారు. బుమ్రా, భువి కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఎనిమిదో ఓవర్లో ఆమ్లాను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా భారత్‌కు బుమ్రా తొలి వికెట్‌ను అందించాడు. ఐతే డుప్లెసిస్ వస్తూనే ఎదురుదాడికి దిగాడు. 14 ఓవర్లు ముగిసేసరికి దక్షిణాఫ్రికా 79/1తో మెరుగ్గా కనిపించింది. కానీ మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్‌దీప్ తమ మాయాజాలంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను కకావికలం చేశారు. ఈ స్పిన్ ద్వయం 51 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు పడగొట్టడంతో 134/5తో దక్షిణాఫ్రికా కష్టాల్లో కూరుకుపోయింది. డికాక్‌ను ఎల్బీగా వెనక్కి పంపి 53 (46 బంతుల్లో) పరుగుల భాగస్వామ్యాన్ని విడదీసిన చాహల్... మార్‌క్రమ్ (9)నూ ఎక్కువసేపు నిలువనివ్వలేదు. ఆ తర్వాత మొదలైంది కుల్‌దీప్ జోరు. ముందు డుమిని (12)ని బౌల్డ్ చేసిన అతడు.. ఆ తర్వాత మిల్లర్ (7)నూ బోల్తా కొట్టించాడు. ఐతే చక్కని బ్యాటింగ్ కొనసాగిస్తూ దక్షిణాఫ్రికాను డుప్లెసిస్ ఆదుకున్నాడు. 54 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న అతడు.. మోరిస్‌తో 57 బంతుల్లోనే అర్ధశతక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. స్కోరు 200 దాటాక కుల్‌దీప్ బౌలింగ్‌లో మోరిస్ బౌల్డ్ కావడంతో 74 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యం విడిపోయింది. ఆ తర్వాత ఫెలుక్వాయో (27 నాటౌట్) నుంచి కూడా మంచి సహకారం లభించడంతో డుప్లెసిస్ శతకం (101 బంతుల్లో) పూర్తి చేసుకుని, జట్టు స్కోరు 250 దాటించాడు. చివరికి ఆఖరి ఓవర్లో ఔటయ్యాడు. చివరి మూడు ఓవర్లలో దక్షిణాఫ్రికాకు 32 పరుగులొచ్చాయి.





కోహ్లి 112

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్:** డికాక్ ఎల్బీ (బి) చాహల్ 34; ఆమ్లా ఎల్బీ (బి) బుమ్రా 16; డుప్లెసిస్ (సి) పాండ్య (బి) భువనేశ్వర్ 120; మార్‌క్రమ్ (సి) పాండ్య (బి) చాహల్ 9; డుమిని (బి) కుల్‌దీప్ 12; మిల్లర్ (సి) కోహ్లి (బి) కుల్‌దీప్ 7; మోరిస్ (బి) కుల్‌దీప్ 37; ఫెలుక్వాయో నాటౌట్ 27; రబాడ రనౌట్ 1; మోర్నీ మోర్కెల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (50 ఓవర్లలో 8 వికెట్లకు) **269; వికెట్ల పతనం:** 1-30, 2-83, 3-103, 4-122, 5-134, 6-208, 7-264, 8-268; **బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 10-1-71-1; బుమ్రా 10-0-56-1; హార్దిక్ పాండ్య 7-0-41-0; చాహల్ 10-0-45-2; కుల్‌దీప్ యాదవ్ 10-0-34-3; కేదార్ జాదవ్ 3-0-19-0

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్‌శర్మ (సి) డికాక్ (బి) మోర్కెల్ 20; శిఖర్ ధావన్ రనౌట్ 35; కోహ్లి (సి) రబాడ (బి) ఫెలుక్వాయో 112; రహానె (సి) తాహిర్ (బి) ఫెలుక్వాయో 79; పాండ్య నాటౌట్ 3; ధోని నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం:** (45.3 ఓవర్లలో 4 వికెట్లకు) 270; **వికెట్ల పతనం:** 1-33, 2-67, 3-256, 4-262; **బౌలింగ్:** మోర్నీ మోర్కెల్ 7-0-35-1; రబాడ 9.3-0-48-0; మోరిస్ 7-0-52-0; తాహిర్ 10-0-51-0; ఫెలుక్వాయో 8-0-42-2; డుమిని 2-0-16-0; మార్‌క్రమ్ 2-0-20-0

## శ్రీకాంత్‌కు షాక్



- క్వాలిఫయర్ చేతిలో ఓటమి
- క్వార్టర్స్‌లో సింధు, సైనా, కశ్యప్

**దిల్లీ:** ఇండియా ఓపెన్ సూపర్ 500 వరల్డ్ టూర్ బ్యాడ్మింటన్ టోర్నీలో అతిపెద్ద సంచలనం నమోదైంది. భారత స్టార్ ఆటగాడు, టైటిల్ ఫేవరెట్ కిదాంబి శ్రీకాంత్‌కు చుక్కెదురైంది. మలేసియాకు చెందిన క్వాలిఫయర్ చేతిలో శ్రీకాంత్ పరాజయం చవిచూశాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ శ్రీకాంత్ 19-21, 17-21తో ఇస్కందర్ జుల్కర్‌నైన్ చేతిలో ఓడాడు. పారుపల్లి కశ్యప్ 19-21, 21-19, 21-12తో శ్రేయాంష్‌పై, సాయిప్రణీత్ 21-10, 21-15తో హు యున్ (వియత్నాం)పై, సమీర్‌వర్మ 21-18, 19-21, 21-17తో టామి సుగియార్తో (ఇండోనేసియా)పై నెగ్గి క్వార్టర్స్ చేరుకున్నారు. భారత అగ్రశ్రేణి షట్లర్లు పి.వి.సింధు, సైనా నెహ్వాల్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో టాప్ సీడ్ సింధు 21-10, 21-14తో లిండా జెచిరి (బల్గేరియా)పై, నాలుగో సీడ్ సైనా 21-12, 21-11తో లిన్ హాజ్‌మార్క్ (డెన్మార్క్)పై విజయం సాధించారు. రుత్విక శివాని 19-21, 16-21తో బీట్రిజ్ (స్పెయిన్) చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో సుమీత్‌రెడ్డి- మను అత్రి 21-11, 21-15తో తుషార్- చంద్రభూషణ్‌పై; మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప 21-9, 21-2తో మేఘ- సంఘమిత్రపై, మేఘన- పూర్విష 21-12, 21-18తో రుతుపర్ణ- మిథులపై; మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి- ప్రణవ్ 21-10, 21-19తో యోగంద్రన్ (మలేసియా)- ప్రజక్తా సావంత్‌పై, సాత్విక్ సాయిరాజు- అశ్విని పొన్నప్ప 21-16, 15-21, 23-21తో టాన్ కియాన్- పీ జింగ్ (మలేసియా)పై గెలిచి క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు.

### క్రీడల బడ్జెట్ 258 కోట్లు పెరిగింది

**దిల్లీ:** కేంద్ర బడ్జెట్లో క్రీడలకు ఈసారి కేటాయింపులు పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే క్రీడా బడ్జెట్ రూ.258.2 కోట్లు పెరగడం విశేషం. నిరుడు బడ్జెట్ రూ.1938.16 కోట్లు. ఈసారి అది రూ.2196.36 కోట్లకు చేరింది. ఐతే క్రీడల బడ్జెట్ పెంచినప్పటికీ.. కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్)కు కేటాయించే నిధులు తగ్గిపోయాయి. గత ఏడాదితో పోలిస్తే రూ.66.17 కోట్ల కోతతో రూ.429.56 కోట్లు కోటాయించారు ఈసారి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఖేలో ఇండియా' పథకం కోసం రూ.520.09 కోట్లు ఇచ్చారు. నిరుడు దీని కోసం కేటాయించిన బడ్జెట్ రూ.350 కోట్లే. జాతీయ క్రీడా సమాఖ్యలకు కేటాయింపులు రూ.41.82 కోట్లు పెరిగి రూ.342 కోట్లకు చేరాయి. క్రీడాకారులకిచ్చే ప్రోత్సాహకాల కోసం బడ్జెట్‌ను కూడా రూ.18.13 కోట్ల నుంచి రూ.23 కోట్లకు పెంచారు.

## భళా బాసుమత్రె


- స్వర్ణం గెలిచిన అసోం అమ్మాయి
- మేరీకి పసిడి.. శ్యామ్‌కు రజతం


బాసుమత్రె


మేరీకోమ్

**దిల్లీ:** ఇండియా ఓపెన్ బాక్సింగ్ టోర్నీలో అసోం అమ్మాయి పివిలోవ్ బాసుమత్రె సత్తా చాటింది. గురువారం జరిగిన 64 కేజీల విభాగం ఫైనల్లో ఆమె 3-2తో సీసొందె (థాయ్‌లాండ్)ను ఓడించింది. 2015 సెర్బియాలో జరిగిన నేషన్స్ కప్‌లో స్వర్ణం గెలిచిన బాసుమత్రెది దయనీయమైన నేపథ్యం. 2012 కోక్రజర్‌లో జరిగిన అల్లర్లలో ఆమె కుటుంబం చెల్లాచెదరైంది. ఇలాంటి స్థితి నుంచి ఆమె ప్రపంచ స్థాయి బాక్సర్‌గా ఎదిగింది. మరోవైపు భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ సత్తా చాటింది. 48 కేజీల విభాగం ఫైనల్లో మేరీ 4-1తో ఫిలిపినో జోస్ (ఫిలిప్పిన్స్)ను ఓడించింది. బసుమత్రె (64 కేజీలు), లవ్‌లీనా (69 కేజీలు) కూడా పసిడి గెలుచుకున్నారు. మరో అసోం అమ్మాయి లవ్‌లీనా మన దేశానికే చెందిన పూజను ఓడించింది. స్టార్ బాక్సర్ సరితదేవి (60 కేజీలు) రజతానికే పరిమితమైంది. ఒలింపిక్స్ కాంస్య పతక విజేత మిరా పొట్కెనన్ (ఫిన్లాండ్) చేతిలో ఆమె ఓడిపోయింది. పురుషుల విభాగంలో సంజీత్ (91 కేజీలు) పసిడి గెలుచుకున్నాడు. తుది పోరులో అతను 3-2తో సంజర్ తుర్సునొవ్ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించాడు. తెలుగు తేజం కాకర శ్యామ్‌కుమార్ (49 కేజీలు), మనీష్ కౌశిక్ (60), సతీష్‌కుమార్ (91 కేజీల పైన), దినేశ్ దాగర్ (69 కేజీలు) ఫైనల్లో ఓడి రజతాలు సాధించారు. 49 కేజీల ఫైనల్లో అమిత్ చేతిలో శ్యామ్ పరాజయం పాలయ్యాడు.


శ్యామ్


ధనంజయ

## ధనంజయ అజేయ శతకం

**చిట్టగాంగ్:** ధనంజయ (104 బ్యాటింగ్; 127 బంతుల్లో 15×4) అజేయ శతకం సాధించడంతో బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో లంక భారీ స్కోరుకు పునాది వేసుకుంది. రెండో రోజు ఆట చివరికి తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు వికెట్ నష్టానికి 187 పరుగులు చేసింది. ధనంజయతో పాటు కుశాల్ మెండిస్ (83 బ్యాటింగ్; 152 బంతుల్లో 6×4, 1×6) క్రీజులో ఉన్నాడు. ఈ జోడీ అబేధ్యమైన రెండో వికెట్‌కు 187 పరుగులు జత చేసింది. కరుణరత్నె (0) డకౌట్ అయ్యాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 374/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా.. 513 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ సెంచరీ హీరో మొమినుల్ హక్ (176) తన స్కోరుకు ఒక పరుగే జత చేసి ఔటయ్యాడు. ఈ స్థితిలో మహ్మదుల్లా (83 నాటౌట్).. మిరాజ్ (20), సంజాముల్ (24)తో కలిసి స్కోరు 500 దాటించాడు. లంక బౌలర్లలో లక్మల్, హెరాత్ మూడేసి వికెట్లు తీశారు.

## ఛాంపియన్ కీర్తి

**భువనేశ్వర్:** జాతీయ పాఠశాలల చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి గంటా కీర్తి సత్తాచాటింది. అండర్-11 బాలికల విభాగంలో ఛాంపియన్‌గా నిలిచి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. 9 రౌండ్ల అనంతరం 7.5 పాయింట్లతో కీర్తి అగ్రస్థానంలో నిలిచింది. అండర్-15 బాలికల్లో నందిత (తెలంగాణ) కాంస్యం సాధించింది. అండర్-9 బాలురలో తనీష్ సాయి (ఆంధ్రప్రదేశ్) రజతం, అండర్-17 బాలికల్లో అభిరామి (ఆంధ్రప్రదేశ్) కాంస్య పతకాలు గెల్చుకున్నారు.

## మెరిసిన షీనా

**టెహ్రాన్:** ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్‌లో షీనా వర్కి సత్తా చాటింది. ట్రిపుల్‌జంప్‌లో ఆమె రజతం గెలుచుకుని భారత్‌కు తొలి పతకాన్ని అందించింది. గురువారం మొదటిరోజు ఆమె 13.37 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచింది. ఎక్తోవా (కజఖ్‌స్తాన్, 13.79 మీ) స్వర్ణం కైవసం చేసుకోగా, థావో బుయ్ (వియత్నాం, 13.22 మీ) కాంస్యం గెలిచింది. మూడురోజులు జరిగే ఈ ఈవెంట్లో భారత్ 13 మంది అథ్లెట్లతో బరిలో దిగింది.




Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

తాజా తాజా

## వివాహానికి విచ్చేసి..

పర్యాటక పర్వంలో చారిత్రకం, ఆధ్యాత్మికం, పర్యావరణం, ఆరోగ్యం.. ఇలా చాలా రకాలున్నాయి. కాలాల వారీగా కూడా టూరిజం కొనసాగుతుంటుంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పర్యాటక శాఖ సరికొత్త విహారానికి నాంది పలికింది. అదే 'బ్రైడల్ టూరిజం'.. అంటే వివాహ విహారం అన్నమాట. దేశీయ సంప్రదాయాలతో జరిగే పెళ్లిళ్లకు విదేశీయులను అతిథులుగా ఆహ్వానించాలని నిర్ణయించారు. ఆటపాటలతో



కోలాహలంగా జరిగే బెంగాలీల పెళ్లిసందడిలో పాలుపంచుకోవాల్సిందిగా కోరుతున్నారు. ఇప్పటికే విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో పశ్చిమబెంగాల్.. దేశంలో ఐదోస్థానాన్ని ఆక్రమించింది. దేవీ నవరాత్రుల సందర్భంగా కోల్‌కతా నగరంతో పాటు వంగసీమంతా శోభాయమానంగా వెలిగిపోతుంటుంది. పశ్చిమ బెంగాల్‌ను సందర్శించే విదేశీ పర్యాటకుల్లో సింహభాగం దసరా సీజన్‌లోనే వస్తుంటారు. తాజాగా 'బ్రైడల్ టూరిజం'తో వినూత్న విహారానికి శ్రీకారం చుట్టింది అక్కడి ప్రభుత్వం. 'మా రాష్ట్రంలో జరిగే వివాహాలకు.. విదేశాల నుంచి విచ్చేసి ఆనందింపజేయ ప్రార్థన' అంటూ.. ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తోంది. మూడు రోజుల పెళ్లితంతును దగ్గరుండి చూసే విధంగా ప్రణాళికలు రూపొందించింది. పనిలో పనిగా చుట్టుపక్కలున్న పర్యాటక ప్రాంతాలను తిప్పి చూపించేలా టూర్ ప్లాన్ చేస్తోంది.

దిక్సూచి

## చెవిలో నేస్తం


భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆడియో కంపాస్ (AudioCompass) యాప్‌ను నిర్వహిస్తోంది. ఆడియో ద్వారా వివరాలందించే ఈ యాప్‌ను ఇప్పుడు ఎక్కువ మంది ఫాలో అవుతున్నారు. ఆఫ్‌లైన్‌లోనూ దీన్ని వాడొచ్చు. ఆయా పర్యాటక ప్రదేశాల్లో మీకు గైడ్‌లా కూడా ఉపయోగపడుతుంది. భారత్‌లో పర్యటించే విదేశీయులు ఎక్కువగా ఉపయోగించే యాప్ ఇది.




## సోలోగా.. కులాసాగా..


ఉద్యోగంలో ఒత్తిడికి విరుగుడు విహారమే! కార్పొరేట్ ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ఇదే మార్గాన్ని ఎంచుకుంటున్నారు. వారాంతాల్లో చిన్న చిన్న ప్రయాణాలకు వెళ్లిపోతున్నారు. ఏడాదికి ఒకట్రెండుసార్లు పెద్దటూరుకే ప్లాన్ చేస్తున్నారు. అదీ ఒంటరిగా! సోలో ప్రయాణాలు కులాసాగా సాగాలంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

- ముందస్తుగా ప్లాన్ చేసుకోవాలి. వెళ్తున్న ప్రాంతం గురించి ఎంతో కొంత తెలుసుకోవాలి. అక్కడ బస చేయడానికి ఎలాంటి సదుపాయాలు ఉన్నాయో చూసుకోవాలి.



- కొత్త ప్రదేశంలో ఎవరినీ గుడ్డిగా నమ్మెయొద్దు. అలాగని అందరినీ అనుమానంగా చూడటం సరికాదు. నలుగురితో మాట్లాడండి. స్థానిక ప్రత్యేకతల గురించి తెలుసుకోండి. మీ వ్యక్తిగత వివరాలు వారికి పూర్తిగా చెప్పాల్సిన పని లేదు.
- వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోండి. డబ్బు ఒకే చోట కాకుండా.. రెండు మూడు చోట్ల దాచుకోండి.
- ఆత్మరక్షణకు అవసరమైన ముఖ్య వస్తువులు దగ్గర ఉంచుకోండి. పెప్పర్ స్ప్రే, పర్సనల్ సేఫ్టీ అలారమ్ మీ అందుబాటులో ఉండాలి. వ్యక్తిగత రక్షణ కోసం మొబైల్ అప్లికేషన్ల సహకారం తీసుకోండి.
- ఎక్కడికి వెళ్లినా.. కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉండండి. మీ క్షేమ సమాచారాలు వీలైనప్పుడల్లా వారికి తెలియజేయండి.





### అమర రహస్యం

అమర్‌నాథ్‌ని ముక్తి క్షేత్రంగా చెబుతారు. ఇక్కడి గుహాలయంలో గుంభనంగా కనిపించే శుద్ధ స్ఫటిక రూపం... మహాప్రళయ కాలంలో వెలిసిన లింగమని అభివర్ణిస్తారు. పరమేశ్వరుడు.. పార్వతికి సృష్టి రహస్యం ఇక్కడే చెప్పాడని క్షేత్ర పురాణం. ఈ రహస్యాన్ని ఎవరూ వినకూడదని నందీశ్వరుడిని పహల్గామ్‌లో, నెలవంకను చందన్‌వాడీలో, వాసుకిని శేష్‌నాగ్ దగ్గర, వినాయకుడిని మహాగణేశ పర్వతం వద్ద, పంచభూతాలను పంచతరణి సమీపంలో వదిలిపెట్టాడట. ఒక్క పార్వతిని మాత్రమే అమర్‌నాథ్‌లోని గుహాలయంలోకి తీసుకెళ్లి.. ఆనంద నాట్యం చేసి.. ఆ తర్వాత సృష్టి రహస్యాన్ని ఆమెకు వివరించాడని భక్తుల విశ్వాసం. ఈ రహస్యాన్ని గుహ సమీపంలో ఉన్న ఒక పావురాల జంట విందట. అమర రహస్యాన్ని విన్న ఆ పావురాలు మృత్యురాహిత్యాన్ని పొందాయని చెబుతారు. నేటికీ అమర్‌నాథ్ ఆలయంలో పావురాలు కనిపించడం విశేషం.

# భం భం బులారే

## మంచుకొండల్లో మహిమ లింగం

**అమర్‌నాథ్ యాత్ర..**
**ఇప్పుడెక్కడుంది.. జూన్‌లో కదా!**
**ఇక్కడెక్కడుంది.. కశ్మీర్ దాకా వెళ్లాలి!**
**అనుమతి ఎలా పొందాలి?**
**వైద్యపరీక్షలు మాటేమిటి?**
**మంచుకొండల్లో కొలువుదీరిన 'మహిమ లింగాన్ని' దర్శించడంలో భక్తులకున్న సందేహాలివి!**
**అమర్‌నాథ్ యాత్ర.. పవిత్రమైనది.**
**ఉద్రిక్తతల మధ్యనే ప్రశాంతత చేకూర్చేది.**
**వాతావరణం అనుకూలిస్తే.. ఆనందం.**
**వరణుడు అడ్డగిస్తే.. ఆందోళన.**
**ఇంకా చెప్పాలంటే.. 'భయ'భక్తుల మధ్య కొనసాగే యాత్ర ఇది!**
**ఇన్ని విశేషాలున్న అమర్‌నాథ్ యాత్ర జూన్ చివరి వారంలో మొదలవుతోంది.**
**మార్చి 1 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయి! యాత్రకు ముందస్తు ప్రణాళిక వివరాలు మీ కోసం..**

హిమాలయ పర్వత శ్రేణుల్లో ఓ అందమైన గుహ. సముద్ర మట్టానికి 12,756 అడుగుల ఎత్తులో ఉంటుంది. అదే అపర కైలాసంగా అభివర్ణించే అమర్‌నాథ్ క్షేత్రం. ఈ యాత్రంటే అందరికీ ఆసక్తే! యాత్రకు వెళ్లే వాళ్లూ, వెళ్లని వాళ్లూ.. అందరూ దీని గురించి ఆరాలు తీస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా.. అమరనాథుడి హిమలింగాన్ని దర్శించుకోవాలని పరితపిస్తారు. భోళాశంకరుడి దర్శనానికి దేశం నలుమూలల నుంచే కాకుండా.. విదేశాల నుంచి కూడా యాత్రికులు తరలివస్తారు. ఈ పవిత్రయాత్ర జూన్ 28 నుంచి ప్రారంభం అవుతుందని అమర్‌నాథ్ బోర్డు, జమ్ము కశ్మీర్ ప్రభుత్వం స్పష్టం చేయడంతో.. సందడి మొదలైంది. శ్రావణ పౌర్ణమి (ఆగస్టు 26)తో యాత్ర ముగుస్తుంది.

> ఒక్కోసారి భారీ వర్షాల కారణంగా.. యాత్ర ఒకట్రెండు రోజులు వాయిదా పడుతుంటుంది. అందుకు తగ్గట్టుగా సిద్ధం కావడం మంచిది.

### అండగా బండారాలు

బేస్ క్యాంప్‌లో అద్దెకు విడిది డేరాలు ఉంటాయి. అద్దె రోజుకు రూ.150 నుంచి రూ.200 వరకు ఉంటుంది. డిమాండ్‌ను బట్టి ఒక్కోసారి ధర పెరుగుతుంది. ఒక్కో డేరాలో నలుగురు నుంచి ఆరుగురు ఉండొచ్చు. డేరాల నిర్వాహకులే యాత్రికుల స్నానాల కోసం వేడినీళ్లు అందిస్తారు. స్థానిక దుకాణాల్లో.. చేతులకు, కాళ్లకు వేసుకునే తొడుగులు, స్వెట్టర్లు, కోట్లు, బూట్లు అందుబాటు ధరలోనే దొరుకుతాయి. యాత్రికులకు ఉచిత భోజనం, ఫలహారం అందించే కేంద్రాలు (బండారాలు) యాత్రికులను సాదరంగా స్వాగతిస్తాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన వారు.. ఆయా ప్రాంతాల రుచులను యాత్రికులకు అందుబాటులో ఉంచుతారు.



### పేర్ల నమోదు



యాత్ర నోటిఫికేషన్ ఈ నెలలోనే అమర్‌నాథ్ బోర్డు జారీ చేసింది. అధికారిక వెబ్‌సైట్‌లో www.shriamarnathjishrine.com దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. 4 పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్‌కార్డు జతపరచాలి. నిర్దేశించిన ఆస్పత్రిలో ఫిబ్రవరి 15 తరువాత వైద్య పరీక్షలు చేయించుకోవాలి. మార్చి 1 నుంచి ప్రకటనలో తెలిపిన బ్యాంకుల్లో (పంజాబ్ నేషనల్ బ్యాంక్, జమ్ము-కశ్మీర్ బ్యాంక్, ఎస్ బ్యాంక్) ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. రూ.50 రుసుం చెల్లించి.. యాత్రకు వెళ్లదలచుకున్న తేదీలు నమోదు చేయించి.. గుర్తింపు పత్రం తీసుకోవాలి. యాత్రకు వెళ్తున్న వారికి రూ.లక్ష ప్రమాద బీమా కల్పిస్తారు. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ మే 31.


> 13 ఏళ్లలోపు పిల్లలు, 75 ఏళ్లు పైబడిన వృద్ధులకు, ఆరు నెలలు నిండిన గర్భవతులను యాత్రకు అనుమతించరు.

### పోస్ట్‌పెయిడ్ తప్పనిసరి


జమ్ము కశ్మీర్‌లో ప్రీపెయిడ్ ఫోన్లు పనిచేయవు. పోస్ట్‌పెయిడ్ ఫోన్ దగ్గరుండాల్సిందే. అక్కడి మొబైల్ దుకాణాల్లో బీఎస్ఎన్ఎల్ పోస్ట్‌పెయిడ్ సిమ్‌లు అమ్ముతారు. వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం చూపించి సిమ్‌కార్డు కొనుక్కోవచ్చు.

### తనిఖీల తర్వాతే

శ్రీనగర్ నుంచి రెండు మార్గాల్లో అమర్‌నాథ్ యాత్ర సాగుతుంది. మొదటిది బాల్టాల్ బేస్ క్యాంప్ మీదుగా, రెండోది పహల్గామ్ మీదుగా. శ్రీనగర్ నుంచి బాల్టాల్ బేస్ క్యాంప్‌కు 95 కిలోమీటర్లు. ఈ దారి వెంబడి ఎత్తయిన పర్వతాలు, మంచుదుప్పటి కప్పుకున్న కొండలు, దట్టమైన అడవుల్లోని దేవదారు వృక్షాలు మనసును దోచుకుంటాయి. శ్రీనగర్ నుంచి బస్సులు, ట్యాక్సీల్లో బేస్ క్యాంపులకు వెళ్లొచ్చు. క్యాంప్‌లో భద్రతా సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు. యాత్ర పత్రాలు, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాలు సిబ్బందికి చూపించాలి. అన్నీ సరిగ్గా ఉంటేనే బేస్‌క్యాంప్‌లోకి ప్రవేశం లభిస్తుంది.



### యాత్ర తీరు



యాత్రకు అనుమతి వచ్చాక.. ప్రయాణానికి సన్నద్ధం అవ్వాలి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు ముందుగా దిల్లీకి చేరుకోవాలి. సమయం కలిసి రావాలంటే విమానంలో వెళ్లొచ్చు. దిల్లీ నుంచి శ్రీనగర్, జమ్ముకు విమానంలో చేరుకోవచ్చు. రైలుమార్గంలో అయితే జమ్ముకు వెళ్లాలి. మొదటిసారి యాత్రకు వెళ్లే వాళ్లు జమ్ము నుంచి శ్రీనగర్‌కు ట్యాక్సీలో ప్రయాణిస్తే కశ్మీర సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. ఎత్తయిన కొండలపై ప్రయాణం, లోయల్లో విహారం, సొరంగ మార్గాల్లో దూసుకుపోవడం.. భలేగా ఉంటుంది.

### వేకువ జామునే



బేస్‌క్యాంపు చేరుకున్న మరుసటి రోజు వేకువ జాము నుంచే అమర్‌నాథ్ యాత్ర మొదలవుతుంది. బాల్టాల్ బేస్‌క్యాంప్ నుంచి అమర్‌నాథ్‌కు సుమారు 16 కి.మీ. ఈ యాత్ర కఠినంగా ఉంటుంది. నడవలేనివారికి గుర్రాలు, డోలీలు అద్దెకు దొరుకుతాయి. గుర్రాల మీదుగా వెళ్లే వారు.. గుర్రం యజమాని గుర్తింపు పత్రాన్ని తమ దగ్గర ఉంచుకోవాలి. యాత్ర ప్రారంభంలో భద్రతా సిబ్బంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. ఆ సమయంలో గుర్రాలు ఒక దారిలో.. యాత్రికులు మరోదారిలో వెళ్తారు. తనిఖీ పూర్తయ్యాక మళ్లీ గుర్రం యజమానిని కనిపెట్టడంలో.. ఈ గుర్తింపు పత్రం సాయపడుతుంది. నడకదారిలో ఉచిత ఫలహారాలు లభిస్తాయి. యువకులు, ఉత్సాహవంతులు మధ్యాహ్నానికల్లా అమర్‌నాథ్ ఆలయానికి చేరుకుంటారు. బాల్టాల్ క్యాంప్ నుంచి హెలికాప్టర్‌లో కూడా అమర్‌నాథ్ చేరుకోవచ్చు. ధర రూ.రెండు వేల లోపు ఉంటుంది.

### ధవళకాంతులు



అమరనాథుడి గుహాలయానికి కిలోమీటర్ ముందుగానే సెల్‌ఫోన్లు, బూట్లు, బ్యాగులు, ఇతర సామగ్రిని అక్కడి గుడారాల్లో, దుకాణాల్లో భద్రపరుచుకోవాలి. మెట్ల మీదుగా కిలోమీటర్ వెళ్తే గుహాలయం వస్తుంది. వెండి కొండ వెలుగు రేడు దర్శనంతో భక్తుల అలసటంతా మాయమవుతుంది. ధవళకాంతుల్లో మెరిసిపోయే లింగానికి ప్రణమిల్లి.. రెండు నిమిషాలు అక్కడే గడిపి.. ఆ స్వామిని తలుచుకుంటూ వెనుదిరుగుతారు. సాయంత్రం ఆరుగంటల హారతి తర్వాత భక్తులను ఆలయంలోకి అనుమతించరు. దర్శనం కాగానే.. బేస్‌క్యాంప్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. వాతావరణం అనుకూలించకపోతే.. అక్కడే గుడారాల్లో ఉండి.. మర్నాడు బేస్ క్యాంప్‌కు బయల్దేరుతారు. అక్కడి నుంచి ట్యాక్సీలో శ్రీనగర్‌కు తర్వాత జమ్ము మీదుగా దిల్లీ చేరుకుంటే అమర్‌నాథ్ యాత్ర పూర్తయినట్టే!

– నిమ్మల ప్రకాశ్‌రెడ్డి

### పహల్గామ్ నుంచి

శ్రీనగర్ నుంచి పహల్గామ్ సుమారు 91 కిలోమీటర్లు ఉంటుంది. పహల్గామ్ బేస్‌క్యాంప్ నుంచి అమర్‌నాథ్‌కు సుమారు 45 కిలోమీటర్ల దూరం. కాలినడకన చేరుకోవాలి. గుర్రాలు, డోలీలు ఉంటాయి.

- పహల్గామ్ నుంచి చందన్‌వాడీ మీదుగా ముందుకెళ్లాలి. మూడున్నర అడుగుల దారిలో.. కొండవాలులో.. నడక కష్టంగానే ఉంటుంది. పట్టు కోసం చేతి కర్ర సాయం తీసుకోవాలి.
- చందన్‌వాడీ నుంచి పిస్సూటాప్, పంచతరణి మీదుగా 11 కిలోమీటర్లు ప్రయాణిస్తే శేష్‌నాగ్ వస్తుంది. ఇక్కడ ఐదు కొండలు నాగుపాము పడగల్లా కనిపిస్తాయి. ఈ పర్వతాల చెంత ఉన్న నీలిరంగు తటాకం అద్భుతంగా కనిపిస్తుంది. పరమేశ్వరుడి ఆభరణం అయిన వాసుకి ఈ సరస్సులో నిద్రిస్తుందని విశ్వసిస్తారు. శేష్‌నాగ్ నుంచి 18 కిలోమీటర్లు వెళ్తే అమర్‌నాథ్ గుహకు చేరుకోవచ్చు.
- పహల్గామ్, చందన్‌వాడీ నుంచి అమర్‌నాథ్‌కు హెలికాప్టర్‌లో వెళ్లే సదుపాయం కూడా ఉంది. ధర రూ.2,000 నుంచి రూ.3,000 వరకూ ఉంటుంది.



లోకల్‌టూర్

## చల్లపల్లి చూసొద్దాం

ఇప్పుడు రాజులు లేరు. రాజ్యాలు అంతకన్నా లేవు. సంస్థానాలూ లేవు. జమీందార్లూ లేరు. కానీ, ఆనాటి రాచరికపు ఠీవిని ఈనాటికీ కళ్లముందుంచే ఆనవాళ్లకు మాత్రం కొదువలేదు. కోటలు, బురుజులు, గడీలు ఊరూరా కనిపిస్తూనే ఉంటాయి. కొన్ని కోటలు బీటలు వారి చరిత్రను వెక్కిరిస్తుంటే.. ఇంకొన్ని భవనాలు అంతే అందంగా ఘన చరిత్రకు వారధిగా నిలుస్తున్నాయి. అలాంటి వాటిలో ఒకటి కృష్ణాజిల్లాలోని చల్లపల్లిరాజా వారి కోట. నాలుగు శతాబ్దాల చరిత్రకు దర్పణంగా ఉన్న చల్లపల్లి కోట వారాంతపు పర్యాటక విడిదిగా అలరిస్తోంది.

చల్లపల్లి రాజావారి కోట అంటే కృష్ణా-గుంటూరు జిల్లాలో తెలియని వారు ఉండరు. దేవరకోట సంస్థానానికి చల్లపల్లి రాజధానిగా ఉండేది. ఈ జమీ పరిధిలో సుమారు వందకుపైగా గ్రామాలు ఉండేవి. యార్లగడ్డ వంశీయులు చల్లపల్లిని పాలించేవారు. 190 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న దేవరకోట సంస్థానం.. 1949లో భారతదేశంలో విలీనమైంది.



### అక్కడంతా ప్రశాంతం..

చల్లపల్లిలో ప్రధాన ఆకర్షణ.. రాజావారి కోట. బురుజులు, భవంతులతో 20 ఎకరాలు విస్తరించి ఉంటుంది. అశోక వృక్షాలు, భారీ చెట్లతో, నిండైన పచ్చదనంతో ఆ ప్రాంతమంతా ప్రశాంతంగా ఉంటుంది. కోటలోని అపురూప శిల్ప సంపద అందరినీ ఆకట్టుకుంటుంది. కోట ప్రధాన ద్వారం ఆనాటి అద్భుత నిర్మాణశైలికి ప్రతీకగా నిలుస్తుంది. కోట ముఖద్వారం దగ్గర ఏర్పాటు చేసిన కంచుగంట ఆ రోజుల్లో చల్లపల్లివాసులకు గడియారంగా ఉపయోగపడేది. గంట గంటకూ.. ఆ కంచు గంట మోగించే వాళ్లు. దానిని బట్టి కోట చుట్టుపక్కల ప్రజలు సమయాన్ని తెలుసుకునేవారు. నేటికీ ఆ సంప్రదాయం కొనసాగుతుండటం విశేషం. కోటలోని ప్రధాన భవనంలో ఉన్న శిల్పాలు, పింగాణి సామగ్రి, గృహోపకరణ వస్తువులను చూసేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపుతుంటారు.

**ఇలా వెళ్లొచ్చు..**

విజయవాడ నుంచి చల్లపల్లి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. విజయవాడ నుంచి బస్సులు, ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.

### సమీపంలో..

చల్లపల్లికి సమీపంలో ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి.

- మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి క్షేత్రం (8 కిలోమీటర్లు)
- శాస్త్రీయ నృత్య కేంద్రమైన కూచిపూడి (16 కిలోమీటర్లు)
- పెదకళ్లేపల్లి శ్రీదుర్గానాగేశ్వరస్వామి ఆలయం (10 కిలోమీటర్లు)
- కృష్ణానది సముద్రంలో కలిసే హంసలదీవి (35 కిలోమీటర్లు)
- బౌద్ధ క్షేత్రం ఘంటసాల (8 కిలోమీటర్లు)



### నౌకా విహారం..

చల్లపల్లికి 25 కిలోమీటర్ల దూరంలో నాగాయలంక లాంచీల రేవు దగ్గరున్న శ్రీరామపాదక్షేత్రం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడి నుంచి పడవల్లో కృష్ణానదిపై విహరించవచ్చు. నాగాయలంక మండలం గుల్లలమోద సమీపంలో 110 అడుగుల ఎత్తులో లైట్‌హౌస్ ఉంది. దీనిని చూసేందుకు నాగాయలంక నుంచి ప్రత్యేక లాంచీల్లో పర్యాటకులు తరలివెళ్తుంటారు.

– హరిప్రసాద్, చల్లపల్లి

ఈనాడు సినిమా


శ్రుతిహాసన్

# ఆ తప్పు మా ఇద్దరిది!

'దర్శకుడు ఇచ్చిన పాత్రకి నేనెలా న్యాయం చేయగలనా? అని ఆలోచిస్తాను గానీ, నాకు నేనే నా పాత్రల్ని సృష్టించుకోలేను... ఆ శక్తి నాకు లేదు' అంటోంది శ్రుతిహాసన్. తను మాట్లాడుతూ "నా దగ్గరకి వచ్చిన ప్రతీ సినిమానీ ఇష్టపడే చేశా. కాకపోతే... ఆయా పాత్రలన్నీ నాకు నచ్చేశాయి అని చెప్పను. నేర్చుకునే క్రమంలో కొన్ని సినిమాలు చేయాల్సి వస్తుంది. అనుభవం కోసం ఇంకొన్ని ఒప్పుకోవాల్సివస్తుంది. నా పాత్ర ఇలా ఉంటే బాగుంటుంది అనుకుంటాను తప్ప, 'ఇలా ఎందుకు చేయరు' అని నిలదీయలేను. ఎందుకంటే నేను కేవలం నటిని మాత్రమే. నా పాత్రని ఎలా చూపించాలో దర్శకుడికి తెలిసుండాలి. దర్శకుడి విషయంలో నేనెప్పుడూ జోక్యం చేసుకోను. తెరపై నా పాత్ర సరిగా రాలేదంటే అందులో నా తప్పే కాదు, దర్శకుడిదీ ఉంటుంది. ఓ పాత్ర పండిందంటే ఆ ఘనత కూడా దర్శకుడికే ఇస్తా" అంటోంది.

# వేకువమ్మా రావే... చీకటమ్మా పోవే


మోహన్‌బాబు

కొత్త పాట గురూ!

చిత్రం: గాయత్రి
రచన: సుద్దాల అశోక్ తేజ
గానం: ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

పల్లవి:
పోనీ.. పోనీ..పోనీ.. కన్నీళ్లన్నీ పోనీ..
రానీ.. రానీ.. రానీ.. రానీ సంతోషం
కానీ.. కానీ.. కానీ.. కలే నిజం కానీ..
గుండెలోని గాయం మాయం అయిపోనీ..
ఇకపై క్షణక్షణమొక పండగ కానీ..
మసిలా మిగిలిన అమవాసలు పోనీ..
కరిమబ్బు పరుపుల్లో ముసుగేసి.. గురకెట్టీ
నిదురించే సూరీడా ఇక లేరా త్వరగా
వేకువమ్మా వేకువమ్మా రావే
చీకటమ్మా చీకటమ్మా పోవే

చరణం 1
కనపడగానే తానే వచ్చీ నన్నూ
పిడికిలి తోనీ కొట్టీ ఏడ్చేస్తుందో
ఇపుడిక నన్నూ వీడి పోయావంటే
మనకిక కచ్చీ అంటూ ఒట్టేస్తుందో
ఎగసిన హృదయమే ఎగిరిన పతంగీ
పరుగెడుతుందిరా తన వెనుక
నను నాన్నా అనె ఘడియా ఎపుడెపుడా అనుకుంటే
నిదురించే సూరీడా ఇక లేరా త్వరగ
॥వేకువమ్మా॥

చరణం 2
నిన్ను చూసి పొంగిపోయే రోజుందంటూ
ఒక చివరాశే శ్వాసై బతికానమ్మా
కడుపున ఆడబిడ్డే కలిగిందంటే
దయగల అమ్మే మళ్లీ పుట్టిందంటూ
తెలియని తండ్రికీ బతుకొక శాపమై
అలసిన నాన్నదీ కథ ఇదని
ఒడిలోన తలపెట్టి చెప్పాలి అనుకుంటే
నిదురించె సూరీడా ఇక లేరా త్వరగా
॥వేకువమ్మా॥


సుద్దాల అశోక్ తేజ

సుద్దాల అశోక్‌తేజ అప్పుడప్పుడూ సరదాగా ఓ మాట చెబుతుంటారు. 'సూదీ దారం ఇవ్వండి... ఒళ్లో ఉన్న పూలతోనే కాదు, ఆకాశంలో ఉన్న నక్షత్రాలనూ తెచ్చి మాల కట్టేస్తా' అని! అది అక్షర సత్యం! ఇక్కడ సూది అంటే సందర్భం... దారం అంటే రాగం. ఓ మంచి మాట చెప్పడానికి కాస్త చోటు దక్కితే చాలు, ఆయన కలం... కొత్తగా వచ్చిన మెట్రో రైలులా పరుగులు పెడుతుంది. భావాలు తిరుపతి గుళ్లో భక్తుల్లా వరుస కట్టేస్తుంటాయి. పాట ఏదైనా ఆయన 'మాట' బలంగా వినిపిస్తుంది. అందుకే ఆ కలం... జాతీయ పురస్కారం అందుకోగలిగింది. మోహన్‌బాబు కథానాయకుడిగా నటించిన 'గాయత్రి' లోనూ రెండు పాటల్ని రాశారాయన. ఓ తండ్రి కూతురి కోసం పాడుకున్న 'వేకువమ్మా వేకువమ్మా' గీతం ఆకట్టుకుంటోంది. ఈ నెల 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ ఈ పాట గురించి ఏం చెప్పారంటే... "తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే చిత్రం 'గాయత్రి'. ఓ తండ్రి తన కూతురి కోసం ఏళ్లుగా అన్వేషిస్తుంటాడు. ఎట్టకేలకు ఆమె చిరునామా తెలుస్తుంది. తెల్లారితే తన కూతురు కనిపిస్తుంది. ఈ ఆనందంలో ఉన్న కథానాయకుడి కోసం ఓ పాట కావాలని దర్శకుడు మదన్ నన్ను అడిగారు. ఆ సమయంలో ఓ తండ్రి తపన ఎలా ఉంటుందో ఒక్కసారిగా ఊహల్లోకి వెళ్లా. 'ఎన్నాళ్లో ఉదయం', 'ఇంకా తెలవారదేమి.. ఈ చీకటి వెళిపోదేమి', 'తెల్లారింది లెగండోయ్', 'శ్రీ సూర్యనారాయణా మేలుకో' ఇలాంటి చాలా పాటలు గుర్తుకొచ్చాయి. ఆ పంథాలోనే వెళ్తూ, నావైన కొత్త భావాలు చెప్పాలి అనిపించింది. ఏ తండ్రయినా తప్పిపోయిన తన కూతుర్ని ఇన్నేళ్ల తరవాత చూస్తున్నానంటే... అప్పటి వరకూ సాగిన అన్వేషణ ఫలిస్తోందంటే ఎంత సంతోషంగా ఉంటుంది? అప్పటి వరకూ అనుభవించిన బాధంతా ఎగిరిపోతుంది. కష్టాలన్నీ కరిగిపోతాయి. ఈ ఆలోచన రాగానే 'మహా ప్రస్థానం'లోని 'పోనీ పోనీ కష్టాల్ నష్టాల్ కోపాల్ తాపాల్' గుర్తొచ్చింది. దాన్ని అలానే మనసులో పెట్టుకొని కలం అందుకున్నా. 'పోనీ పోనీ పోనీ కన్నీళ్లన్నీ పోనీ' అంటూ రెండు నిమిషాల్లోనే పల్లవి పూర్తయిపోయింది. వెంటనే మదన్‌కి చూపించా. 'బాగుంది... ప్రొసీడ్' అన్నారు. నేను పల్లవి రాసిన తరవాత తమన్ దానికి ట్యూన్ చేశారు. ఆ తరవాత 'చరణం ఇలా కావాలి' అంటూ ట్యూన్ వినిపించారు. దానికి తగ్గట్టుగా చరణాలు రాశా. ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురుచూపుల్లో పడే ఏ మనసైనా సూర్యుడ్ని తీయగా తిట్టుకుంటుంది. 'ఇంకా బద్ధకం ఎందుకు త్వరగా నిద్రలే' అని. ఆ భావాన్ని 'కరిమబ్బు పరుపుల్లో ముసుగేసి గురకెట్టి నిదురించే సూరీడా ఇకలేరా త్వరగా' అంటూ రాశా. తన కూతురు తనని చూడగానే ఏం అనుకుంటుంది? ఎలా స్పందిస్తుంది? అనే విషయాన్ని ఓ తండ్రి కోణంలో ఆలోచించి తొలి చరణం పూర్తి చేశా. రెండో చరణంలో ఆడపిల్ల విశిష్టత చెప్పా. 'ఆడపిల్ల' అనగానే భారం అనుకుంటున్న రోజులు ఇవి. ఆ తారతమ్యాలు పోవాలి. ఆడపిల్ల పుట్టిందంటే మన అమ్మ మరో రూపంలో మన ఇంటికి వచ్చినట్టే అనుకోవాలి. అందుకే 'కడుపున ఆడబిడ్డే కలిగిందంటే దయగల అమ్మే మళ్లీ పుట్టిందంటూ' అని రాశా. పాటలో నాదంటూ సొంత గొంతుక వినిపించాలని తాపత్రయపడతాను. ఆ అవకాశం ఈ చరణంలో నాకు దక్కింది. ఇదే చిత్రంలో 'హనుమాన్' గీతం రాశా. అందులోనూ మంచి మాటలు చెప్పే అవకాశం దక్కింది. వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే కొన్ని మంచి వాక్యాలు ఉన్నాయి. ఈ రెండు పాటలకూ తగిన గుర్తింపు దక్కినందుకు సంతోషంగా ఉంది. దాసరి నారాయణరావు, మోహన్‌బాబు, రాఘవేంద్రరావు... వీళ్లంతా రచయితలకు స్వేచ్ఛ ఇచ్చేవాళ్లే. అందుకే వాళ్ల సినిమాల్లో పాటలు అంత బాగుంటాయి"

# ట్విట్టర్‌కు బిగ్‌బి సెలవు!


అమితాబ్ బచ్చన్

కొన్ని దశాబ్దాలుగా వెండితెరపై తనదైన నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న నటుడు అమితాబ్ బచ్చన్. అంతేకాదు ట్విట్టర్‌లో అత్యధిక మంది ఫాలోవర్స్ ఉన్న భారత ప్రముఖుల్లో ఆయన ఒకరు. సామాజిక మాధ్యమాల్లో చాలా చురుగ్గా ఉండే అమితాబ్.. తరచూ ఏదోక అంశంపై తనదైన శైలిలో ట్వీట్లు చేస్తూ అభిమానులకు దగ్గరగా ఉంటారు. అయితే గురువారం అమితాబ్ పెట్టిన ఓ సందేశం అభిమానులను షాక్‌కు గురిచేసింది. ట్విట్టర్‌ను వీడుతున్నానని చెబుతూ అమితాబ్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా 'హమ్' సినిమాలో బిగ్‌బి, విలన్‌ను కొడుతున్న ఓ ఫొటో పంచుకున్నారు. దానితో పాటు "నువ్వు నా ఫాలోవర్స్‌ను తగ్గిస్తావా.. నీకిది జోక్‌గా ఉంది" అని ట్విట్టర్‌ను ఉద్దేశించి ఓ కామెంట్ పెట్టారు. "ట్విట్టర్ నిన్ను వదిలించుకునే సమయం వచ్చింది. థాంక్యూ" అంటూ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు అమితాబ్. ఇప్పుడీ ట్వీట్ వైరల్ అవుతోంది. చాలా మంది అభిమానులు అమితాబ్ ట్విట్టర్‌లోకి తిరిగి రావాలంటూ సందేశాలు పెడుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న సెలబ్రిటీస్‌లో అత్యధికంగా అమితాబ్‌ను 3,99,01,349 మంది అనుసరిస్తుండగా షారుఖ్ ఖాన్ 3,29,39,375 మంది ఫాలోవర్స్‌తో రెండవ స్థానంలో ఉన్నాడు. అయితే నకిలీ ఖాతాలను తొలగించే ప్రక్రియలో భాగంగా ట్విట్టర్ అమితాబ్ బచ్చన్ ఫాలోవర్లను తగ్గించడంతోనే ఆగ్రహంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ట్విట్టర్ ఎలా స్పందిస్తుందో చూడాలి.

పంచ్ డైలాగ్

**ఏకత్వం అంటే మనుషులు కలవడం కాదు...**
**మాండలికాలు కలవడం!**
**చిత్రం: గౌతమిపుత్ర శాతకర్ణి**

– పంపినవారు:
పార్థు, బి.ఎన్.రెడ్డి నగర్

చిరునామా: సినిమా డెస్క్,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా- 501512
మెయిల్ ఐడీ:
cinema@eenadu.net

# నేలా నింగీ సముద్రం దిగ్బంధనం... ఇక తప్పించుకునేదెలా?

ఆస్కార్ బరి


'డంకర్క్'

**హాలీవుడ్‌లో అత్యుత్తమ దర్శకుడి నుంచి వచ్చిన అత్యుత్తమ చిత్రమంటూ ప్రశంసలందుకున్న చిత్రం 'డంకర్క్'. ఆ దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన తెరకెక్కించిన 'ఇన్‌సెప్షన్', 'ఇంటర్‌స్టెల్లార్', 'డార్క్‌నైట్' సిరీస్ చిత్రాలు చూస్తే ఆ విషయం బోధపడుతుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా 'డంకర్క్'ను తెరకెక్కించాడు నోలన్. గతేడాది విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు ఆస్కార్ బరిలోనూ సగర్వంగా నిలిచింది. ఈ ఏడాది అత్యధిక నామినేషన్లు అందుకున్న రెండో చిత్రం 'డంకర్క్'. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు సహా ఎనిమిది విభాగాల్లో నామినేషన్లు సాధించిందీ చిత్రం. దర్శకుడిగా నోలన్‌కు తొలి ఆస్కార్ నామినేషన్ అందించింది కూడా ఈ చిత్రమే. ఫియన్ వైట్ హెడ్, బ్యారీ కియొగన్, మార్క్ రిలన్స్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన 'డంకర్క్' ఆస్కార్‌లో సత్తా చాటడం పక్కా అనుకుంటున్న నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.**

క్రిస్టఫర్ నోలన్ చేతిలో పడితే ఓ మామూలు కథ కూడా అసాధారణ కథగా మారిపోతుంది. ఆశ్చర్యపరిచే స్క్రీన్‌ప్లేతో పాటు ఛాయాగ్రహణం, నేపథ్య సంగీతం, ఎడిటింగ్ లాంటి సాంకేతిక అంశాలను అద్భుతంగా మేళవించి తెరపై మేజిక్ చేస్తుంటారు నోలన్. 'డంకర్క్' విషయంలోనూ ఆయా అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. మూడు వేరు వేరు నేపథ్యాలలో సాగే కథనాన్ని ఒక్కచోట కలుపుతూ నోలన్ కథ చెప్పిన విధానం అబ్బురపరుస్తుంది. సంభాషణలు తక్కువగా ఉండే ఈ చిత్రాన్ని ఛాయాగ్రహణం, నేపథ్య సంగీతం మేళవించి ఉత్కంఠభరితమైన సస్పెన్స్‌తో విజువల్ వండర్‌గా మార్చేశాడు. అందుకే ఈ చిత్రానికి ఛాయా గ్రహణం, నేపథ్య సంగీతం, ఎడిటింగ్, సౌండ్ ఎడిటింగ్, సౌండ్ మిక్సింగ్ తదితర విభాగాల్లో ఆస్కార్ నామినేషన్లు దక్కాయి.

**కథేంటి:**

1940లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ సైన్యం, యూరప్ సంకీర్ణ సేనల మధ్య భీకర పోరు జరుగుతున్న రోజులవి. ఫ్రాన్స్‌లోని ఓడరేవు పట్టణం డంకర్క్‌లో యూరప్ సేనలకు చెందిన సుమారు నాలుగు లక్షల మంది సైనికులు సమావేశమవుతారు. ఈ విషయం తెలిసిన జర్మనీ వారిపై విరుచుకుపడుతుంది. నేల, సముద్రం, ఆకాశం ఇలా మూడు మార్గాల్లోనూ ముప్పేట దాడి మొదలెడుతుంది. బలమైన జర్మనీతో సంకీర్ణ సేనలు తలపడలేకపోతాయి. అక్కడి నుంచి తప్పించుకోవడమే వారికి శరణ్యంగా మారుతుంది. అందుకు వారు రచించిన వ్యూహమేంటి అన్నదాన్ని 'డంకర్క్'లో ఉత్కంఠభరితంగా ఆవిష్కరించారు నోలన్. ముఖ్యంగా నేల మీద వారం పాటు, సముద్రంలో ఒక రోజు, ఆకాశంలో ఒక గంట జరిగే యుద్ధాన్ని కథలో కలిపిన విధానం ఆకట్టుకుంటుంది.

**విశేషాలు:**

- డంకర్క్ సంఘటనలో ప్రాణాలతో బయటపడ్డ సైనికులలో 30 మందిని ఈ సినిమా ప్రివ్యూకు ఆహ్వానించారట. అప్పటి యుద్ధంలోని బాంబుల మోత కన్నా సినిమాలోని బాంబుల పేలుడే ఎక్కువ భయంకరంగా వినిపించిందని వారు చెప్పారట. ఆ వ్యాఖ్యలను సౌండ్ డిజైనింగ్‌కు వచ్చిన ప్రశంసగా భావిస్తానని నోలన్ చెప్పాడు.
- నాటి యుద్ధ వాతావరణాన్ని సాధ్యమైనంత వాస్తవికంగా చూపించాలని నోలన్ అనుకున్నాడు. దాని కోసం స్వయంగా ఇంగ్లండ్ నుంచి డంకర్క్ వరకు బోటులో ప్రయాణించడంతో పాటు, యుద్ధ విమానంలోనూ ప్రయాణించి ఆ అనుభవాలతో స్క్రిప్టు రాసుకున్నాడట.
- ఈ చిత్రంలోని సస్పెన్స్ రేకెత్తించే సన్నివేశాల్లో టిక్ టిక్ టిక్ ...అని నేపథ్యంలో వినిపిస్తుంటుంది. నోలన్ జేబు గడియారంలోని ముల్లు శబ్దాన్ని రికార్డు చేసి దాన్ని సృష్టించారట.
- ఈ చిత్రం కోసం నోలన్‌కు 20 మిలియన్ డాలర్ల పారితోషికంతో పాటు వసూళ్లలో 20 శాతం వాటా దక్కిందని సమాచారం. ఆ లెక్కన అత్యధిక పారితోషికం అందుకున్న దర్శకుడిగా నోలన్ నిలిచాడని అంటున్నారు.



# మరోసారి పోల్ డ్యాన్స్ సొగసులు


జాక్వెలైన్ ఫెర్నాండెజ్


కథానాయికలు అందంగా, ఫిట్‌గా ఉండటానికి రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. కొంతమంది భామలు యోగా సాధన చేస్తుంటారు. బాలీవుడ్ భామ జాక్వెలైన్ ఫెర్నాండెజ్ కూడా ఇవన్నీ చేస్తుంది. కానీ చాలా మంది కథానాయికల కంటే ఫిట్‌గా కనిపిస్తుంది. దానికి కారణం పోల్ డ్యాన్స్. ఈ ముద్దుగుమ్మకు ఈ డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. పోల్ పట్టుకొని శరీరాన్ని రబ్బరులా వంచుతూ జాక్వెలైన్ చేసే ఆ డ్యాన్స్‌కు సంబంధించిన వీడియోలు అభిమానుల్ని అలరిస్తున్నాయి. 'ఎ జెంటిల్‌మన్' చిత్రంతో వెండితెరపై తన పోల్ డ్యాన్స్ సొగసుల్ని చూపించిందీ భామ. ఇప్పుడు మరోసారి ఆ డ్యాన్స్ మెరుపుల్ని ప్రేక్షకులు చూడబోతున్నారు. సల్మాన్‌ఖాన్‌తో కలిసి జాక్వెలైన్ నటిస్తున్న చిత్రం 'రేస్ 3'. ఇందులో ఈ శ్రీలంక సుందరితో పోల్ డ్యాన్స్ చేయించాలని చిత్రబృందం భావిస్తోంది. "జాక్వెలైన్ కష్టపడే తత్వం ఉన్న అమ్మాయి. పోల్ డ్యాన్స్‌లో ఆమెకు మంచి పట్టుంది. అందుకే 'రేస్ 3'లో ఆ డ్యాన్స్ సోయగాల్ని చూడబోతున్నారు"అని చెప్పారు చిత్ర దర్శకుడు రెమో డిసౌజా. 'రేస్'లోని 'అల్లా దుహాయి హై..' అంటూ సాగే పాటను 'రేస్ 3'లో రీమిక్స్ చేయాలనుకుంటోంది చిత్రబృందం. మరి ఇదే పాటలో జాక్వెలైన్ పోల్ డ్యాన్స్‌తో సందడి చేస్తుందా..? లేదా వేరే పాటలోనా అనే విషయంపై స్పష్టత రాలేదు.

# ఊటీలో ప్రేమజంట


సమత, యువరాజ్

యువరాజ్, సమత జంటగా ఎస్‌కెఎమ్‌ఎల్ మోషన్ పిక్చర్స్ సంస్థ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. రావ్ దుర్గం దర్శకుడు. కాండ్రేగుల ఆదినారాయణ నిర్మాత. ఊటీలో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ప్రేమ, వినోదం మేళవించిన కథ ఇది. సోషియో ఫాంటసీ నేపథ్యంలో సాగుతుంది. నాగబాబు కీలక పాత్ర పోషించారు. ఊటీ షెడ్యూల్ పూర్తయ్యాక హైదరాబాద్‌లో చిత్రీకరణ కొనసాగిస్తాం. వేసవిలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"న్నారు. సంగీతం: నాని

# కథే హీరో!


హిమాన్షి

కొవెర కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'యూ'. కథే హీరో..అనేది ఉపశీర్షిక. హిమాన్షి కాట్రగడ్డ కథానాయిక. విజయలక్ష్మి కొండా నిర్మాత. హైదరాబాద్‌లో ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను దర్శకుడు సుకుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. కొవెర మాట్లాడుతూ.. "సుకుమార్ ఈ వేడుకకు రావడం ఆనందంగా ఉంది. గతంలో కొన్ని సినిమాలకు రచయితగా చేశాను. ఇప్పుడు మొదటి ప్రయత్నంగా 'యూ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా" అన్నారు. తనికెళ్ల భరణి, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: సత్యమహావీర్.

ఫ్యాషన్ ఫ్యాషన్

# టాప్‌గా నిలిపే టాపులు!

ఆధునికతకు చిరునామాగా నిలవాలనే మగువల కోసమే ఈ అజ్రఖ్ కలెక్షన్. విభిన్న డిజైన్లూ, ఆకట్టుకునే మోటిఫ్‌లతో అద్భుతంగా మలిచిన ఈ దుస్తులు నేటితరం అమ్మాయిలకు ప్రత్యేకం. కోరి ధరించి.. కళగా మెరవండి మరి.



పలాజోకు నప్పేలా డిజైన్ చేసిన కుర్తీ ఎండల వేళ ఎంతో సౌకర్యం.



అలల్లా తేలియాడేలా అందంగా మలచిన ఈ పొడవాటి కుర్తీ.. సొగసుకు చిరునామా.



పసుపు వర్ణంలో తీర్చిదిద్దిన పొడవాటి కాటన్ టాప్ అందం.. ఆధునికతల కలబోత.



బ్లాక్ ప్రింటూ... భిన్న డిజైన్‌తో ప్రత్యేకంగా రూపొందించిన టాప్.

మోడల్స్: లావణ్య బబ్బర్ అమిష్కా పవార్

ఫొటోలు: దండా శ్రీనివాసరావు




నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
✆ 040-23231147, సైఫాబాద్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, (హైదరాబాద్) , విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి.

## గూడెం నుంచి గణతంత్ర వేడుక్కి!



అది దిల్లీలోని ఎర్రకోట... ఆ రోజు గణతంత్ర దినోత్సం. కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీతోపాటు మరికొందరు అతిథులూ హాజరయ్యారు. వారిలో మహబూబాబాద్ జిల్లాకి చెందిన యాప భద్రమ్మకీ స్థానం దక్కింది. ఆదివాసీ తెగ.. అక్షరంముక్కరాదు.. ఇలాంటి నేపథ్యం నుంచి వచ్చిన ఆమెకు ప్రధాని నుంచి పిలువు ఎలా వచ్చిందో తెలుసుకోవాలంటే... చదవండి మరి!



ఆదివాసీ ప్రాంతాల్లోనే కాదు.. అక్కడ నివసించేవారి జీవితాల్లోనూ వెలుగు ఉండదు. ఉపాధికి బాటలు ఉండవు. అలాంటి ప్రాంతంలో పొదుపు.. ఆదాయం అనే పదాలను పరిచయం చేసింది భద్రమ్మ. ఆమె నివసించే గంగారం మండలం మడగూడలోని స్థానిక అధికారుల సాయంతో ఐకేపీ మహిళా సంఘాలను బలోపేతం చేసింది. వారిలో చైతన్యం తీసుకొస్తూనే పొదుపు చేసే పద్ధతులూ, రుణాల చెల్లింపు గురించి అవగాహనా కల్పించింది. ఇలా ఎన్నో కార్యక్రమాలను చేసి గణతంత్ర వేడుకకు ఆహ్వానం అందుకుంది భద్రమ్మ.

**సున్నం అమ్ముతారు...** ఆమె స్వస్థలమైన మడగూడలో వ్యవసాయం, కూలి పనులే జీవనాధారం. అలాగని పెద్ద మొత్తంలో ఆదాయమేమీ ఉండదు. అందుకే ఆ దగ్గరలో సున్నం నిక్షేపాలు ఉండటంతో ఆ పొడిని ముద్దలు చేసి అమ్ముతుంటారు ఆ గూడెం వాసులు. ఓసారి ఐటీడీఏ అధికారులు ఆ గూడేనికి వచ్చారు. సున్నం అమ్మకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలా వచ్చే ఆదాయంలోంచి రోజుకు రూపాయి చొప్పున నెలకు ముప్పై రూపాయలు దాచుకోమని సలహా ఇచ్చారు. అలా 2002లో పొదుపు సంఘం ఏర్పడగా అందులో పదిహేను మంది మహిళలు చేరారు. ఏడాది తరువాత మండలంలోని ఇరవై ఆరు సంఘాల మహిళల్ని పిలిచి సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో భద్రమ్మ ఉత్సాహం చూసి సభ్యులూ, అధికారులు ఆమెను సంఘం అధ్యక్షురాలిగా నియమించారు.

**సంఘాలు బలోపేతం:** మండల సమాఖ్య అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్నాక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించింది. వారంతా నెలనెలా రుణం చెల్లించేలా చైతన్యపరిచింది. సభ్యుల బకాయిలు ఉండకుండా వారికి ఇతర పొదుపు మార్గాలను అలవాటు చేసింది. సంఘాల ద్వారా ప్రయోజనం.. ఐటీడీఏ పథకాల వివరాలు గురించి చెప్పడమే కాదు.. అవి వారికి అందేలా కూడా జాగ్రత్తలు తీసుకుంది. పిల్లలు కూడా తమలా చదువుకు దూరం కాకూడదనుకున్న భద్రమ్మ ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దాంతో ఆ సమస్య పరిష్కారం కావడమే కాదు... చిన్నారులు చదువుకునేందుకు ఉపకార వేతనాలూ సక్రమంగా అందుతున్నాయి. అందుకు భద్రమ్మ కృషే కారణం. రైతులకు గిట్టుబాటు ధర రావాలని గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించింది. ఐటీడీఏ నుంచి రాయితీతో లభించే విత్తనాలను అర్హులకు అందించే ఏర్పాటు చేసింది. ఈ సేవలన్నీ చూసిన గ్రామస్తులు ఏకగ్రీవంగా భద్రమ్మను సర్పంచిగా ఎన్నుకున్నారు. ఇలా ఎన్నో కార్యక్రమాలను చేస్తూనే సంఘం సభ్యులు తీసుకున్న రుణాలు వందశాతం బకాయిలు లేకుండా చెల్లించేలా చేసినందుకు ఆమెకు గణతంత్ర వేడుకకు ఆహ్వానం అందింది. ఆ విషయం ఐటీడీఏ అధికారుల ద్వారా తెలిసినప్పుడు ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. ఎందుకంటే భద్రమ్మ ఇదంతా గుర్తింపు కోసమో, అవార్డులు తీసుకోవడానికో చేయలేదు. ఈ గుర్తింపునకు మాత్రం గూడెం ప్రజలు సంబరపడిపోయారు. చదువు రాని ఆమె దిల్లీకి వెళ్లడానికి సంకోచించినా... కుటుంబం, గూడెం ప్రజలు.. దగ్గరుండి పంపారు. గణతంత్ర వేడుకలో పొదుపు సంఘాల గురించి మాట్లాడి తనదైన ముద్ర వేసుకుంది భద్రమ్మ.

**- బొల్లం శేఖర్** ఈనాడు డిజిటల్, మహబూబాబాద్

## మౌస్ వాడుతున్నా.. చర్మం కమిలింది!

**?** నేనొక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. కంప్యూటర్‌పై ఎక్కువగా పనిచేస్తా. మౌస్‌ను ఎక్కువగా ఉపయోగించడం వల్ల అరచేయి అంచులో చిన్న కాయలా వచ్చి, చర్మం కమిలిపోయింది. ఇలా ఎందుకు అయ్యింది. అది పోవాలంటే ఏం చేయాలి. **- ఓ సోదరి**

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

**✔** ఇది చాలామందిలో కనిపించే సమస్య. దీన్ని మౌస్ డెర్మటైటిస్ అని అంటాం. దీర్ఘకాలికంగా వాడే వస్తువుల వల్ల ఇలా జరుగుతుంది. కుదిరినప్పుడల్లా ఆ చేతికి కాస్త విశ్రాంతి ఇవ్వగలిగితే మంచిది. మౌస్‌తో పని లేనప్పుడు దానిమీద నుంచి చేయి తీసేయాలి. పని చేయడానికి ముందు వైట్‌పెట్రోలియం జెల్లీ వంటివి రాసుకుంటే అలర్జీలూ, పలు సమస్యలు దూరంగా ఉంటాయి. అలానే అరికాళ్లల్లో చేతుల్లో చెమట కారే వారిలోనూ ఈ సమస్య తరచూ కనిపిస్తుంది. అంతేకాదు ఇన్‌ఫెక్షన్లూ బాధించే అవకాశం ఉంటుంది. అందుకే కొన్నాళ్లు గ్లవుజును వేసుకుని చూడండి. చాలామంది కేవలం మణికట్టు నుంచి చేతిని కదుపుతూ ఉంటారు. ఒత్తిడి వల్ల ఆ సమస్య ఇంకాస్త పెరగొచ్చు. దానికంటే భుజాల నుంచి చేతిని కదపడం అలవాటు చేసుకోవాలి. తీవ్రత పెరిగినప్పుడు చేయి నొప్పి ఎక్కువై, ఎర్రగా మారుతుంది. దీన్ని మందులతో కంటే విశ్రాంతితోనే తగ్గించుకోవచ్చు. చర్మం కమిలింది అంటున్నారు కాబట్టి దాన్ని నివారించేందుకు వైద్యుల సలహాతో రెటినాయిడ్ ఉన్న క్రీం కొన్నాళ్లు రాసుకుంటే సరిపోతుంది.

## ధ్యానం అంత పరధ్యానమా?




ఒత్తిడిని తగ్గించుకోవడానికి ధ్యానం సరైన మార్గం అని మనందరికీ తెలిసిందే. అయితే అది సజావుగా సాగాలంటే ఇలా ప్రయత్నించి చూడండి.

- చాలామంది బాగా ఒత్తిడిగా ఉన్నప్పుడో, లేదంటే ప్రశాంతంగా లేనప్పుడో వెంటనే ధ్యానం చేస్తుంటారు. దానివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. అందుకే ప్రశాంతంగా ఉన్నప్పుడు ధ్యానం కోసం సమయాన్ని కేటాయించుకుంటే మంచిది.
- ధ్యానం చేయడం ప్రారంభించిన కొత్తలో 'నేను తప్పు పద్ధతిలో చేస్తున్నానేమో?', 'వేరే పద్ధతి ఉంటుందేమో?' అని అనుకుంటాం. అలా కాకుండా చేస్తూ పోతే మనకే తప్పొప్పులు తెలుస్తూ ఉంటాయి. కాబట్టి మధ్యలో ఆపేయకుండా కొనసాగించడం మంచిది.
- మొదలుపెట్టిన ప్రారంభంలోనే ఎక్కువసేపు ధ్యానంలో కూర్చోడానికి ప్రయత్నించపోవడమే మేలు. చేయగలిగితే పర్వాలేదు కానీ, బలవంతంగా ఎక్కువసేపు కూర్చోకూడదు.
- కొంతమంది సీడీలూ, అంతర్జాలం సాయంతో ధ్యానం చేయడం మొదలుపెడతారు. కానీ కొన్ని రోజులయ్యాక ఆ అలవాటు మానుకోవాలి. స్వయంగా దృష్టి కేంద్రీకరించడం అలవాటు చేసుకోడానికి ప్రయత్నించాలి.

## బంగారం వెండి

01న ముగింపు-క్రితం

| తమిళనాడు (రూ. లలో) | | |
|---|---|---|
| ఆర్నమెంట్ (గ్రా) | 2,893 | 2,900 |
| వెండి (గ్రా) | 42.40 | 42.40 |



| | హైదరాబాద్ | | విజయవాడ | | ప్రొద్దుటూరు | | రాజమండ్రి | | విశాఖపట్నం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం(24క్యా) | 31,450 | 31,250 | 30,150 | 30,100 | 30,850 | 30,800 | 30,930 | 31,000 | 30,930 | 30,930 |
| ఆర్నమెంట్ | 29,300 | 29,360 | 28,900 | 28,850 | 28,550 | 28,550 | 28,930 | 29,000 | 28,770 | 28,770 |
| వెండి(కిలో) | 40,500 | 40,200 | 41,000 | 41,000 | 40,500 | 40,400 | 39,700 | 39,700 | 41,500 | 41,500 |

## అంగన్‌వాడీల దత్తతకు శ్రీకారం!





సామాజిక సేవలో భాగంగా పాఠశాలలనూ, అనాథాశ్రమాలనూ, గ్రామాలను దత్తత తీసుకోవడం మనకు తెలిసిందే. అయితే ఓ యువ ఐఏఎస్ అధికారిణి మాత్రం ఓ అంగన్‌వాడీని తన సొంత నిధులతో దత్తత తీసుకొని బాగు చేసే బాధ్యతలను మీద వేసుకుంది. తనెవరంటే జార్ఖండ్ రాష్ట్రంలో హజారీబాగ్ జిల్లా సాంఘిక సంక్షేమ విభాగ అదనపు బాధ్యతలు తీసుకున్న గరిమ. ఆమె 2015 యూపీఎస్సీ ఫలితాల్లో యాభై ఐదో ర్యాంకును సొంతం చేసుకుంది. 2016లో బాధ్యతలు తీసుకుంది మొదలు మహిళలకోసం ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీల దత్తత విషయంలో ఆమె చెసిన పని చిన్నది కావచ్చు... కానీ ఆలోచన మాత్రం పిల్లల బంగారు భవిష్యత్తుకు చక్కని బాటలు వేయడానికి ఉపయోగపడుతుంది. ప్రాథమిక దశలో చదువు మీద ఇష్టం... బడి మీద ప్రేమ ఏర్పడితే చిన్నారులు ఎప్పుడూ ఆ దిశగా అడుగులు వేయడానికి ఆసక్తి చూపుతారనేది గరిమ అభిప్రాయం. అందుకే స్థానికంగా ఉన్న అంగన్‌వాడీలకోసం ప్రత్యేకంగా భవనాలను తీసుకుని వాటికి చక్కగా రంగులు వేసి బొమ్మలూ, నీతి పద్యాలూ, అంకెలూ, వర్ణమాల రాయించింది. ఆటవస్తువులతోపాటు సకల సౌకర్యాలను కల్పించి కార్పొరేట్ ప్లే స్కూళ్లకు దీటుగా మార్చింది. దాంతో ఆ ప్రాంతంలో చిన్నారులు అంగన్‌వాడీలకు వెళ్లి అక్షరాలు దిద్దడానికి ఆసక్తి చూపుతున్నారు. దీనికోసం గరిమ నెలకు సొంతంగా యాభైవేల రూపాయలను ఖర్చుచేస్తోంది. త్వరలో మరో యాభై ప్రాంతాల్లో అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలని ఆ పనులూ మొదలుపెట్టిందామె. అంతేకాదు దేశంలోని పలు ప్రాంతాల్లో వ్యాపార, రాజకీయవేత్తలూ, విద్యావంతులూ, ఉన్నతోద్యోగులు అంగన్‌వాడీలను దత్తత తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయ పడుతోంది.

తొలి సవారీ

## ఆరువేల బైకే నాకిష్టం..



కాన్ఫెడరేట్ హెల్‌క్యాట్ ఎక్స్ 132 బైక్ ఖరీదు రూ. 60లక్షలు.. హర్లే డేవిడ్‌సన్ ఫ్యాట్‌బోయ్ ధర రూ. 18లక్షలు.. ఫెరారీ కారు రూ. మూడుకోట్లు. క్రికెటర్ ధోనీ గ్యారేజీలో ఉన్న కొన్ని వాహనాలవి. ఇవిగాక మరో తొమ్మిది బైక్‌లు, ఎనిమిది కార్లూ ఉన్నాయ్. ఇంత ఖరీదైనవి ఉన్నా అన్నింటిలో ఏది ఇష్టం అంటే తను ఠక్కున చెప్పేది యమహా ఆర్ ఎక్స్ 100. 2003లో రోహిత్ అనే ఫ్రెండ్ దగ్గర కేవలం ఆరువేల రూపాయలు పెట్టి కొనుకున్నాడు. తర్వాత మరో ఇరవైవేలు పెట్టి తన అభిరుచులకు అనుగుణంగా మార్చుకున్నాడు లెండి! ఇది కొన్నాకే తన దశ తిరిగి ఇండియా-ఏ జట్టులో చోటు దక్కిందట. అప్పట్నుంచే ఈ బైక్‌ల సెంటిమెంట్ మొదలైంది. స్కూళ్లో ఉండగానే బైక్‌లపై షికార్లు చేసినా సొంతంగా కొనుక్కొని తొలిసారి సవారీ చేసింది మాత్రం తనెంతో మనసుపడ్డ యమహా ఆర్ఎక్స్ 100.





# ఆటో షోకులు 2018



**ఇరవై దేశాలు.. 500 కంపెనీల ప్రాతినిధ్యం... వందలకొద్దీ కార్లు, బైక్‌ల ప్రదర్శన...**

**ఆసియాలోనే అతిపెద్దది, ప్రపంచంలోనే రెండోదైన షో...**

**పద్నాలుగో ఆటో ఎక్స్‌పో- 2018 సంగతులివి...**

**ప్రత్యక్షంగా చూడాలంటే.. ఓసారి దిల్లీ వెళ్లాల్సిందే.**

వారం రోజుల్లో ఆటోమొబైల్ ప్రియులకు అతిపెద్ద సంరంభం మొదలుకాబోతోంది. ఐదురోజు వేడుకలో దేశంలోని అన్ని ఆటోమొబైల్ కంపెనీలతోపాటు విదేశీ సంస్థలూ పాల్గొంటున్నాయి. తమ పరిశోధనాకేంద్రాల్లో ఏళ్లకొద్దీ శ్రమించి ఆవిష్కరించిన సరికొత్త మోడళ్లు ప్రదర్శించబోతున్నాయి. ఆకట్టుకునే మోడళ్లు, ఊరించే కాన్సెప్ట్ వాహనాలు, ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్లు.. ఇవన్నీ ఒకచోట కొలువైతే అభిమానులకు పండగే మరి.

**టాప్ కంపెనీలు:** దేశీయ దిగ్గజాలైన మారుతిసుజుకీ, టీవీఎస్, హ్యుందాయ్ ఇండియా, హోండా ఇండియా, టాటా మోటార్స్, టయోటా, మహీంద్రా, బజాజ్ ఆటో, రాయల్‌ఎన్‌ఫీల్డ్‌లతోపాటు కియా మోటార్స్, ఫోక్స్‌వ్యాగన్, ఆడీ, స్కోడా, నిస్సాన్, ట్రయంఫ్‌లు కార్లు, బైక్‌ల్ని ప్రదర్శనకు పెట్టబోతున్నాయి. అమెరికా, కెనడా, చైనా, తైవాన్, ఇటలీ కంపెనీలకు చెందిన మోడళ్లూ కనువిందు చేయనున్నాయి.



**తొలిసారి కనిపించేవి:** భారతీయులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న మారుతీ కొత్త స్విఫ్ట్ తొలిసారి కనిపించబోతోంది. బీఎండబ్ల్యూ ఎఫ్ 750జీఎస్, ఎఫ్ 850 జీఎస్, హీరో కొత్త 125సీసీ బైక్, టాటా ఎక్స్ 451, హెచ్5 ఎస్‌యూవీ, కావాసాకి నింజా 400, సుజుకీ ఇంట్రూడర్, ఎక్స్‌పల్స్ కాన్సెప్ట్, ఎంఫ్లక్స్ ఈ-స్పోర్ట్‌బైక్, హయాతే ఈపీ, వీ-స్ట్రామ్ 1000, సుజుకీ సీకేడీ మోటార్‌సైకిల్.. మొత్తం 11 కొత్త బైక్‌లు విడుదలవుతున్నాయి.

**కాన్సెప్ట్, ఎలక్ట్రిక్ అదరహో:** షోలో సరికొత్త కాన్సెప్ట్ కార్లు సైతం ముందుకు రానున్నాయి. మారుతి ఈ-సర్వైవర్, రెనో క్విడ్ కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్ హీరో కంపెనీ డ్యుయెట్-ఈ, టీవీఎస్ జూపిటర్ ఎలక్ట్రిక్‌లు సత్తా చాటబోతున్నాయి. హైబ్రిడ్, ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌లు కొలువుదీరనున్నాయి.

**షో జరిగే తేదీ:** ఫిబ్రవరి 9 నుంచి 14 వరకు

**వేదిక:** దిల్లీలో విశాలమైన ప్రగతి మైదాన్‌లో

**నిర్వాహకులు:** సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యూఫ్యాక్చరర్స్ (సియామ్), ఆటోమోటివ్ కంపోనెంట్ మ్యాన్యూఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అక్మా), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ).

మెకానిక్ గురూ

## బుల్‌బార్‌లపై నిషేధమేల?

చాలాకాలం నుంచి మారుతి వేగన్-ఆర్ వాడుతున్నాను. కొద్దిరోజుల కిందట ఎడమకాలికి ఫ్రాక్చర్ అయింది. ప్రస్తుతం క్లచ్ తొక్కుతున్నపుడు చాలా నొప్పిగా ఉంటోంది. దీన్ని అమ్మేసి ఆటోమేటిక్ కారు కొనాలనుకుంటున్నాను. నా వయసు అరవై. రోజుకి కనీసం ఇరవై కిలోమీటర్లైనా ప్రయాణిస్తుంటా. నాకు సరిపోయే కారు సూచించండి.

**- సీహెచ్ మాధవరావు, కాకినాడ**

ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కారులో తరచూ గేర్లు మార్చడం, క్లచ్ తొక్కే అవసరం ఉండదు. దీనికి వయసు, శక్తితో పెద్దగా పని లేదు. చూడాల్సిందల్లా మీ బడ్జెట్ ఎంత? కోరుకునే ఫీచర్లు ఏంటి? అని మాత్రమే. మారుతిసుజుకీ ఆల్టో కే10, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, హోండా బ్రియో, నిస్సాన్ మైక్రా.. మీ బడ్జెట్‌లో దొరికే.. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కార్లు. నచ్చింది ఎంచుకోండి.



**కారు ముందు బిగించుకునే బుల్‌బార్‌లను ప్రభుత్వం నిషేధించిందనే వార్త విన్నాను. నిజమేనా? ఎందుకిలా? దాంతో కలిగే నష్టమేంటి?**

**- ఎం.మురళీకృష్ణ,** కరీంనగర్

మీరు విన్నది నిజమే. బుల్‌బార్‌లను చట్టవిరుద్ధమైందిగా గుర్తించి ప్రభుత్వం నిషేధించింది. ఎందుకంటే..

1) బుల్‌బార్‌లు కారు ముందు, వెనకాల ఉండే 'క్రంపుల్ జోన్'లను పనితీరుపై ప్రభావం చూపిస్తాయి.

2) ప్రమాద సమయాల్లో ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోకుండా అడ్డుపడతాయి.

3) పాదచారులు, సైక్లిస్టులు, ద్విచక్రవాహనదారులు సమీపంలో ఉన్నపుడు వారికి తగిలే ప్రమాదం ఉంది.

4) పెద్దస్థాయి ప్రమాదాలు జరిగినపుడు బుల్‌బార్ మొత్తం కారు ఛాసిస్‌నే డ్యామేజ్ చేస్తాయి.

**హోండా యూనికార్న్ 2013 మోడల్ వాడుతున్నాను. రెండేళ్ల నుంచి ఇంజిన్ నుంచి ఆయిల్ కారుతోంది. మూడుసార్లు షోరూంలో సర్వీసింగ్‌కి ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. ఏం చేయమంటారు?**

**- రోహిత్, హైదరాబాద్**

మీ బైక్‌ని వెంటనే హోండా సర్వీస్ సెంటర్‌కి తీసుకెళ్లండి. అనుభవజ్ఞుడైన మెకానిక్‌కి చూపించండి. బండిలో ఆయిల్ సీళ్లు బిగించేటప్పుడు ఆయిల్ సీల్ సీటింగ్ ఏరియా చిరిగిపోవడమో, డ్యామేజీ అయిపోవడమో జరిగిందేమో! బహుశా దీనివల్లే ఈ సమస్య. ఇంజిన్ హౌసింగ్/కేసింగ్ మార్చమని సలహా ఇవ్వొచ్చు.

– సాయిభరత్ బొప్పరాజు, **www.motofix.in**

**పక్క గల్లీ ప్రయాణానికైనా... వందల కిలోమీటర్ల లాంగ్‌టూర్‌కైనా... కారులో ఎయిర్ కండిషనర్ ఉంటేగానీ ప్రయాణం సాగదు చాలామందికి... మరి భగభగలాడే ఎండలో.. సతమతం చేసే ఉక్కపోతతో ఆ సదుపాయం కోరుకోనిదెవరు? వచ్చేస్తోంది ఎండా కాలం... అందుకే ఓసారి ఏసీలపై ఓ లుక్కేద్దాం.. నిపుణుల సలహాలు వినేద్దాం.. ఏసీల సమర్థ వినియోగంపై కిటుకులు పట్టేద్దాం.**

# చల్లగా వెళ్లి... చల్లంగా రండి!

విపరీతమైన ఎండవేడిలో ఉన్నప్పుడు కారులోకి వెళ్లి ఏసీ ఆన్ చేస్తే ఒక్కసారిగా స్వర్గంలోకి వచ్చిపడ్డ అనుభూతి కలుగుతుంది. అందుకే బేసిక్ కారు నుంచి, ఖరీదైన వాహనాల దాకా ఇప్పుడు ఏసీ లేని కారు లేదు. కొన్నేళ్లు వెనక్కి వెళ్తే ఈ సదుపాయం లగ్జరీ కార్లకే పరిమితం అయ్యేది. ఇప్పుడేమో అందరికీ అవసరంగా మారిపోయింది.

### అది అపోహే..

ఏసీని ఎక్కువగా వాడితే మైలేజీ తగ్గిపోతుందనీ, పర్యావరణానికి హాని అని చాలామంది భావిస్తుంటారు. అందులో కొంతే నిజం ఉందంటారు నిపుణులు. సాధారణంగా కారు, ఇతర వాహనాల్లో కంప్రెస్సర్, కండెన్సర్, ఎక్స్‌పాండర్, ఎవాపోరేటర్.. ఇవన్నీ సరిగ్గా ఉన్నపుడే ఏసీ పని చేస్తుంది. క్యాబిన్ చల్లబడుతుంది. ఏసీలోని ముఖ్యమైన భాగం ఎయిర్ కంప్రెసర్ పని చేయాలంటే దానికి శక్తి అవసరం. ఇంజిన్ దీనికి కావాల్సిన శక్తినిస్తుంది. దీంతో కొంతమేర ఇంధనం ఖర్చు అవుతుంది. ఇది మైలేజీపై తప్పకుండా ప్రభావం చూపిస్తుంది. పాత రోజులతో పోలిస్తే ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి రావడం, ఇంజిన్ సామర్థ్యం పెరగడంతో గతంతో పోలిస్తే పదిహేను నుంచి ఇరవై శాతం వరకు మాత్రమే మైలేజీ తగ్గిపోతుంది అంటారు నిపుణులు. 'ఏసీల వాడకంతో పర్యావరణానికి హాని కలగడం అనేది ఒకప్పటి సంగతి' అనేది ఆటోమొబైల్ రంగంలో అపార అనుభవం ఉన్న విద్యా నంబిరాజన్ మాట.

### ఏం చేయాలి?

ప్రయాణికులకు, వాహనానికి ఆవశ్యకమైన ఈ పరికరం సమర్థంగా ఉపయోగించుకోవాలంటే.. నిర్వహణ సరిగ్గా ఉండాలంటే ఏం చేయాలంటే..

**పార్కింగ్:** ఏసీ ప్రారంభం నుంచే మంచి పనితీరు ఉండాలంటే మొదట్నుంచే కారుపై ఎండ పడకుండా ఏ చెట్టు కిందో, షెడ్‌లోనో నిలిపి ఉంచాలి. ఒకవేళ కారు సీట్లు లెదర్‌వి అయితే దాన్ని కవర్ చేసేలా ఏదైనా తువాలు కప్పి ఉంచడం మేలు.

**తలుపులు తెరవండి:** ఏసీ వేయగానే ఆ చల్లదనం వెంటనే అనుభవించాలంటే పార్కింగ్ చేసిన చోట కొంచెంసేపు కారు కిటికీ అద్దాలు తెరిచి పెట్టాలి. అలాగే కొంచెం దూరం డ్రైవ్ చేసుకుంటూ వెళ్తే కారులోని వేడిగాలి బయటికి వెళ్లిపోతుంది.

**మెల్లిమెల్లిగా:** కారులో ఏసీ ఆన్ చేసినపుడు ఒకేసారి హైలో పెట్టకుండా ముందు తక్కువ నుంచి ఎక్కువకి మార్చాలి. ఒకవేళ కారులో ఆటోమేటిక్ ఎయిర్‌కండీషనింగ్ సిస్టమ్ ఉంటే దాని కదే ఉష్ణోగ్రతల్ని సవరించుకుంటుంది.

**జాగ్రత్తలు:** గమ్యం చేరాక కారు ఇంజిన్‌ని ఆఫ్ చేశాకే ఏసీని పూర్తిస్థాయిలో నిలిపేయండి. అదేసమయంలో ఫ్యాన్‌ని కాసేపు అలాగే తిరగనీయండి. ఇది లోపలి వాతావరణాన్ని పొడిబారేలా చేస్తుంది.

**అధిక మోతాదు వద్దు:** బయట నలభై, నలభై అయిదు డిగ్రీల వేడి ఉంటే ఏసీ ఉంది కదాని లోపల పదిహేను, ఇరవైలు పెట్టి మరీ చల్లదనం కోరుకోవద్దు. ఇంత హెచ్చుతగ్గుల్ని శరీరం తట్టుకోలేదు.



**రక్షణగా:** కారుపై ఎంత ఎక్కువ ఎండ పడితే అంత ఎక్కువగా ఏసీ అవసరం. అద్దాల లోపలివైపు వెనక, పక్క అద్దాలకు నిబంధనలు అనుమతించిన విండ్‌స్క్రీన్ రిఫ్లెక్టర్లు వాడితే వేడి లోపలికి రాకుండా ఉంటుంది.

**ఎగుడు ప్రాంతాల్లో:** కొండప్రాంతాల్లో, ఎక్కువ ఎత్తున్న చోట్ల కారులో ప్రయాణిస్తుంటే సహజంగానే అది ఇంజిన్‌పై ఎక్కువ భారం పడుతుంది. అదే సమయంలో ఏసీ ఆన్‌లో ఉంటే మరింత మైలేజీ తగ్గిపోతుంది. ఆ సమయంలో ఏసీ ఆఫ్ చేయాలి.

**వేడివేడిగా:** ఏసీతో చల్లదనమే కాదు.. హీట్ మోడ్‌తో అవసరమైతే లోపల వేడిగా ఉండేలా చూసుకోవచ్చు. అయితే ఇలాంటపుడు ఫ్యాన్ నేరుగా మొహానికి తగలకుండా కాళ్లవైపు ఉండేలా చూసుకోవాలి.

### చెక్ చేయండిలా

వేసవి మొదలవుతోంది. ఏసీ వాడకం మొదలుపెట్టకముందే ఓసారి చెక్ చేయండిలా.



- ఎయిర్ వెంట్‌ల ఉష్ణోగ్రత పరిశీలించాలి. వీటితోనే చల్లదనం.
- ఏసీ గ్యాస్ మార్చాలి. ఇది తక్కువైతే కంప్రెసర్ ఫెయిల్యూర్ అయ్యే అవకాశం ఉంది.
- లీకేజీలున్నాయో చూడండి. ఉంటే ఏసీ సమర్థంగా పని చేయదు.
- కండెన్సర్ ఫిన్స్ శుభ్రపరచడం. వాల్వులు, థెర్మోస్టార్ట్స్ పనితీరు చెక్ చేయడం
- కంప్రెసర్ బెల్టులు తెగిపోతే ఏసీ పనిచేయదు.
- రిసీవర్ డ్రయ్యర్ పాడైతే చల్లదనం తక్కువవుతుంది.
- ఏసీలోని రిఫ్రిజిరెంట్‌ని పూర్తిస్థాయిలో శుభ్రపర్చకుండా రీఛార్జ్ చేయొద్దు. ఇలా చేస్తే అసలు ఏసీనే సరిగా పనిచేయదు.
- ఐదు నిమిషాలు డీఫ్రాస్ట్ మోడ్‌లో పెట్టాలి. సన్నని నీటి తుంపరలు, దుర్వాసన, తేమ ఏది ఉన్నా వెళ్లిపోతుంది.

### చల్లచల్లని బైక్

వాహనాల్లో ఏసీ అనగానే కారు, లగ్జరీ బస్సులే గుర్తొస్తాయి. కానీ ఏసీ సదుపాయం ఉన్న బైక్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉంది. స్విట్జర్లాండ్ కంపెనీ పెరావెస్ తయారు చేసిన ఈ బైక్ పేరు 'మోనోట్రేసర్'. వర్షం, ఎండ నుంచి రక్షణ కోసం క్యాబిన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కి అనుగుణంగా పరిమితంగానే తయారు చేశామంటోంది కంపెనీ. ధర మాత్రం కాస్త ఎక్కువే. మన రూపాయల్లో చెప్పాలంటే రూ. 40లక్షలు.



### వాడకాన్ని బట్టే మన్నిక



హీటింగ్, వెంటిలేటింగ్ మరియు ఎయిర్ కండీషనింగ్ చేసేదే ఏసీ. కారు క్యాబిన్‌లో పది నుంచి పద్నాలుగు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉందంటే ఆ ఏసీ సరిగా పని చేస్తుందని అర్థం. ఏసీల్లో ఇప్పుడు ఆర్-134ఏ అనే హైడ్రో ఫ్లోరోకార్బన్‌లు వాడటంతో ఓజోన్‌కి ఏం ప్రమాదం లేదు. ఇక మన వాడకం, నిర్వహణ బట్టే ఏ వస్తువైనా మన్నికగా ఉంటుంది. నెలకోసారి ఏసీ ఫిల్టర్లు శుభ్రం చేయడం, రెండేళ్లకోసారైనా ఏసీ సిస్టమ్ రీఛార్జ్ చేయడం.. ఇలా చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవాలి. ఏసీ కంప్రెషర్‌కి బీమా సౌకర్యం కూడా ఉంటుంది. ఆ సదుపాయం ఉపయోగించుకోవాలి.

*– విద్యానంబిరాజన్, పారమౌంట్ ఆటో బే సర్వీసెస్*

వాహన సురక్ష

## బీమా చేశామని ధీమా వద్దు




వాహనానికి, వాహనం నడిపేవారికి ఏదైనా ప్రమాదం జరిగితే పరిహారం పొందే ఉద్దేశంతో మనం బీమా పాలసీ తీసుకుంటాం. కానీ ఆ ప్రమాదం జరిగినపుడు ఎలా క్లెయిమ్ చేసుకోవాలో చాలామందికి తెలియదు. ఆ వివరాలు.

సాధారణంగా బీమా పాలసీ తీసుకునేటప్పుడు వాహన యజమాని కోరుకునే సౌకర్యాలు, పొందాలనుకునే పరిహారాన్ని బట్టి దానికి అనుగుణంగా ప్రీమియం చెల్లించి పాలసీ పొందుతాము. దానిని అనుసరించి ప్రమాదంలో గాయపడ్డా, మరణించినా, ఇతర ప్రజా రవాణా వాహనాల్లో ప్రయాణిస్తున్నా, వాహనానికి సంబంధం లేని వ్యక్తులైనా మోటారు వాహనాల యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో నష్టపరిహారం కోరవచ్చు. దానికి ముందు యజమాని తన వాహనానికి జరిగిన ప్రమాద నష్టాన్ని వివరిస్తూ, తగిన ఆధారాలతో బీమా కంపెనీ క్లెయిమ్ ఫారం పూరించి సమర్పిస్తే సరిపోతుంది. ఏ కారణం చేతనైనా బీమా కంపెనీ తిరస్కరిస్తే.. మీ వాదన సరిగా ఉందని భావిస్తే పరిహారం పొందేందుకు వినియోగదారుల ఫోరంలో నష్టపరిహారాన్ని కోరవచ్చు. వాహనంపై పనిచేసే కార్మికులు, వాహన ప్రమాదంలో వారికి జరిగిన నష్టాన్ని కమిషనర్ ఫర్ వర్క్‌మెన్ కాంపన్సేషన్ వారి వద్ద నుంచి నష్టపరిహారాన్ని కోరవచ్చు. పైన చెప్పినవన్నీ వాహన యజమాని తగినంత ప్రీమియం చెల్లించి వాహనాన్ని బీమా పాలసీ నిబంధనలకు లోబడి నడిపినప్పుడు మాత్రమే బీమా కంపెనీ నష్టపోయినవారికి చట్ట పరిధికి లోబడి పరిహారాన్ని చెల్లిస్తుంది. బీమా చేశాం కదా అనే ధీమాగా ఉంటే సరిపోదు. ప్రతి వాహనదారుకు బీమా నిబంధనలపై అవగాహన తప్పకుండా ఉండాలి.

– నరేశ్ భైరపనేని, అడ్వొకేట్

అలా బతికిపోయాం

## సీటుబెల్టుతో సేఫ్



ఆరోజు ఆఫీసుకెళ్తుండగా బావ నుంచి ఫోన్. ఈ వీకెండ్ వాళ్లింటికి రమ్మని. నేను బీపీవో కంపెనీలో పని చేస్తుండటంతో శని, ఆదివారాలు సెలవు. అక్కాబావల మాట కాదనలేక ఈసారి వాళ్లింటికి వెళ్లాలనుకున్నా. శుక్రవారం సాయంత్రం బాస్‌ని అడిగి ఓ గంట ముందే కారులో బయల్దేరా. నా ప్రయాణంతోపాటే చిన్నగా వర్షం మొదలైంది. సిటీ దాటుతుండగా కొంచెం వేగం పెంచా. అయితే ఓ చోట మలుపు ఉండటం గమనించలేదు. అదే వేగంతో డివైడర్‌ని ఢీకొట్టా. రెప్పమూసి తెరిచేలోగా కారు గాల్లో పల్టీకొట్టి మళ్లీ యథాస్థితిలో ఆగిపోయింది. కారు సైడ్ ప్యానెళ్లు తుక్కుతుక్కయ్యాయి. బ్యానెట్ బద్ధలైపోయి విండ్‌షీల్డ్ దాకా కుప్పలా అయింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా నాకు చిన్న గాయం కూడా కాలేదు. మెడ పట్టేయడం మినహా. అదీ నాలుగైదురోజుల్లో మళ్లీ సర్దుకుంది. ఆరోజు నేను బతికిపోవడానికి కారణం స్టీరింగ్ పట్టుకున్న ప్రతిసారీ వెంటనే సీటుబెల్టు పెట్టుకునే అలవాటే.

– రాకేశ్, సిద్దిపేట్